
'సామాన్యులకు వైద్యం ఏనాడూ ఖరీదుగా ఉండకూడదు. అందుకే అందరికీ ఆరోగ్యశ్రీ'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 33

గురువారం 25-4-2024

సాక్షి ఎలక్షన్ 2024

జాతీయం..
రాజకీయ కథాకళి
కేరళలో కూటముల కొట్లాటే - 10లో

తెలంగాణ 9లో
ఇందూరు నిర్ణేతలు వీరే
- పసుపు, చెరకు రైతులు.. గల్ఫ్ కుటుంబాలు.. బీడీ కార్మికులు..
- విలక్షణ తీర్పు ఇస్తున్న నిజామాబాద్ ఓటర్లు

ఆంధ్రప్రదేశ్ 11లో
వార్ వన్‌సైడే..
- జన ప్రభంజనం మధ్య జైత్రయాత్రలా సాగిన సీఎం జగన్ 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర
- వైఎస్సార్‌సీపీ విజయం లాంఛనమేనని విశ్లేషణలు

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



కులగణనను ఏ శక్తీ ఆపలేదు

కులగణనను ఏ శక్తీ ఆపలేదని రాహుల్ చెప్పారు. 'మా ప్రభుత్వం ఏర్పడగానే చేసే తొలి పని కులగణన జరిపించడమే' అన్నారు.
- వివరాలు 6లో



అనుమానం ఉందని...

ఈవీఎంల పనితీరుపై అనుమానం ఉందనే కారణంతో ఎన్నికల ప్రక్రియను నియంత్రించలేమని సుప్రీంకోర్టు పేర్కొంది.
- వివరాలు 6లో



ముగిసిన రెండో దశ ప్రచారం

సార్వత్రిక పోరులో రెండో దశ ప్రచారం ముగిసింది. 13 రాష్ట్రాల్లోని 89 స్థానాల్లో 26వ తేదీన పోలింగ్ జరగనుంది.
- వివరాలు 6లో



కాళేశ్వరంపై విచారణ షురూ

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంపై రిటైర్డ్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ న్యాయ విచారణ ప్రక్రియను ప్రారంభించారు.
- వివరాలు 14లో

మిర్యాలగూడలో జరిగిన రోడ్‌షోకు హాజరైన జనం. అభివాదం చేస్తున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్



ప్రభుత్వం మెడలు వంచుతాం

12 లోక్‌సభ సీట్లు ఇవ్వండి

హామీలన్నీ అమలు చేసేదాకా సర్కారును వెంటాడుతాం..: కేసీఆర్

- ఐదెకరాలకే రైతుబంధు అంటూ దగా... రైతు బీమా ఉంటుందో, లేదో...
- నీళ్లు ఇవ్వడం లేదు.. కరెంటు సరిగా రావడం లేదు..
- ఆడబిడ్డలకు తులం బంగారం ఏమైంది? పింఛన్ల పెంపు ఏది?
- నన్ను తిట్టినా సరే.. తెలంగాణ బిడ్డలకు అన్యాయం జరిగితే వదలను
- మిర్యాలగూడ, సూర్యాపేట రోడ్ షోలలో మాజీ సీఎం ప్రసంగం
- బస్సు యాత్ర షురూ... రైతులతో మాటామంతీ.. నేడు భువనగిరి రోడ్ షో

8లో

కాళేశ్వరంపై చర్చకు రా!

మేడిగడ్డ వద్దే మేధావులతో చర్చిద్దాం: కేసీఆర్‌కు సీఎం రేవంత్ సవాల్

- నీ మేధస్సు కరిగించి కడితే.. మేడిగడ్డ మేడిపండు ఎందుకైందో తేలుద్దాం
- ప్రతిపక్ష నేతగా దీనిపై అసెంబ్లీకి వచ్చి మాట్లాడలేదేం?
- మెదడు రంగరించింది కాళేశ్వరం కోసం కాదు.. దోపిడీ కోసం..
- భూకంపం వచ్చినా, భూమి బద్దలైనా ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తా..
- హరీశ్.. రాజీనామా జేబులో పెట్టుకో.. ఆ రోజే మాట్లాడుదాం..
- మోదీ, కేసీఆర్ ఇద్దరూ తోడుదొంగలు..
- దేవుడు, మతం పేరిట విద్వేషాలు... ఓట్ల కోసం చిల్లర రాజకీయాలు
- లోక్‌సభ ఎన్నికల్లో వారికి గుణపాఠం చెప్పాలని పిలుపు
- వరంగల్ జనజాతర సభ, సికింద్రాబాద్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడిన రేవంత్


మడికొండ జనజాతర సభలో కావ్యను గెలిపించాలని కోరుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, వరంగల్/ రాంగోపాల్‌పేట్: మాజీ సీఎం కేసీఆర్‌కు దమ్ముా, ధైర్యముంటే కాళేశ్వరంపై బహిరంగ చర్చకు రావాలని టీపీసీసీ చీఫ్, సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి సవాల్ చేశారు. ప్రతిపక్ష నేతగా అసెంబ్లీకి రాని కేసీఆర్.. గంటల కొద్దీ టీవీ స్టూడియోలో కూర్చుని కాళేశ్వరంపై మాట్లాడారని విమర్శించారు. బీఆర్‌ఎస్, బీజేపీ ఓట్ల రాజకీయాలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయని ఆరోపించారు. కేసీఆర్, మోదీ తోడు దొంగలని.. వారికి లోక్‌సభ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. చచ్చిన పాములా మారిన బీఆర్‌ఎస్‌కు ఈ ఎన్నికల్లో డిపాజిట్లు కూడా రావని పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం
మిగతా 8వ పేజీలో ▶

ఖమ్మం నుంచి 'రామసహాయం' కరీంనగర్‌లో 'వెలిచాల'

- హైదరాబాద్ బరిలో మహమ్మద్ వలీవుల్లా సమీర్
- ఎట్టకేలకు కాంగ్రెస్ తుది జాబితా ప్రకటన

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న

9లో


రామసహాయం రఘురాంరెడ్డి | వెలిచాల రాజేందర్‌రావు | మహమ్మద్ వలీవుల్లా సమీర్

హామీలు అమలు చేస్తే.. రాజీనామా చేస్తా: హరీశ్

8లో

ఒట్టేసి దేవుడితో రాజకీయాలా?

దేశం, ధర్మం అంటే బీజేపీని విమర్శిస్తారా



- సీఎం రేవంత్‌పై బండి సంజయ్ ధ్వజం
- బీజేపీలో చేరిన బీఆర్‌ఎస్ శ్రేణులు
- నేడు కరీంనగర్‌లో బండి నామినేషన్
- హాజరుకానున్న భూపేంద్రపటేల్, కిషన్‌రెడ్డి

9లో


కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, టి.జగ్గారెడ్డితో కలిసి మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

అన్నీ పచ్చి అబద్ధాలు

కేసీఆర్ మళ్లీ సీఎం అవుతాడనేది శతాబ్దంలోనే పెద్ద జోక్

- ఆయన ఆసుపత్రిలో చూపించుకుంటే మంచిది... ఎన్నికల తర్వాత వెళ్లేది ఎర్రగడ్డకే
- లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఒక్క సీటూ రాదు... 14 చోట్ల డిపాజిట్ పోతుంది
- 25 మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వస్తారు.. మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: బస్సుయాత్రలో, ఓ టీవీ చానల్ ఇంటర్వ్యూలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చెప్పిన మాటలన్నీ పచ్చి అబద్ధాలని సాగునీటి శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కేసీఆర్ చెబుతున్నట్లు 8 నుంచి 12 కాదు కదా ఒక్క సీటు కూడా రాదని దుయ్యబట్టారు. అదీగాక 14 సీట్లలో 3వ స్థానంలో ఉండటమే కాకుండా డిపాజిట్ పోతుందని, ఆ తర్వాత ఆ పార్టీ మనుగడే ప్రశ్నార్థకమవుతుందని చెప్పారు. బుధవారం రాత్రి ఓ హోటల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో
మిగతా 3వ పేజీలో ▶

యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి గ్రీన్‌సిగ్నల్..



తాజాగా పర్యావరణ అనుమతుల జారీకి నిపుణుల కమిటీ సిఫారసు

2017 జూలైలోనే పర్యావరణ అనుమతులు జారీ

- అనుమతులకు విరుద్ధమైన టెక్నాలజీతో విద్యుత్ కేంద్రం నిర్మాణం
- దీంతో మారిన టెక్నాలజీకి అనుగుణంగా మళ్లీ పర్యావరణ అనుమతులు పొందాలని 2022లో ఎన్జీటీ ఆదేశాలు
- ఏడాదిన్నర తర్వాత ఫలించిన సుదీర్ఘ ప్రయత్నాలు

సాక్షి, హైదరాబాద్: యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి 'తాజా పర్యావరణ అనుమతులు' జారీ చేయా లని సిఫారసు చేస్తూ కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నిపుణుల మదింపు కమిటీ నిర్ణయం తీసుకుంది. 50శాతం విదేశీ బొగ్గు, మరో 50శాతం స్వదేశీ బొగ్గుతో కలిపి(బ్లెండ్ చేసి) విద్యుదుత్పత్తి జరిపే టెక్నాలజీ ఆధారంగా యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మిస్తామని గతంలో జెన్‌కో ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనల ఆధారంగా 2017 జూలై 25న కేంద్రం ఈ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు జారీ చేసింది. అయితే అనుమతులకు విరుద్ధంగా పూర్తిగా స్వదేశీ బొగ్గు ఆధారంగా విద్యుదుత్పత్తి జరిపే టెక్నాలజీతో యాదాద్రి ప్లాంట్‌ను జెన్‌కో నిర్మిస్తోందని కొందరు చెన్నైలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేశారు. టెక్నాలజీ మారడంతో నీటి వినియోగం, బూడిద ఉత్పత్తి పెరుగుతుందని ఆరోపించారు. మారిన టెక్నాలజీకి అనుగుణంగా మళ్లీ పర్యా వరణ అనుమతులు పొందాల్సిందేనని 2022 సెప్టెంబర్‌లో ఎన్జీటీ తీర్పు ఇవ్వగా,
మిగతా 3వ పేజీలో ▶

ఇంటర్‌లో బాలికలే మెరికలు

ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో వారిదే పైచేయి

మొత్తంగా ఫస్టియర్‌లో 61.06% సెకండియర్‌లో 69.46% ఉత్తీర్ణత నమోదు

- ఫలితాల్లో మేడ్చల్, ములుగు ఫస్ట్, అట్టడుగున కరీంనగర్ జిల్లా
- నేటి నుంచి రీ వెరిఫికేషన్, కౌంటింగ్

- 7లో



ALPHORES
JUNIOR COLLEGES

SUCCESS always Stands Firm. It's proven A"GAIN"
with TOP MARKS in IPE 1st & 2nd YEAR RESULTS 2024



The Most Effectual Academician Dr.V.NARENDER REDDY garu, Chairman, with the ATTAINERS of the STATE TOP MARKS IPE 2nd YEAR 2024 RESULTS

MPC II YEAR

Marks	Name	H.T. No.	College
993	K. KARTHIK BABU	2435212426	KNR-KTPL CCode : 35231
993	T. SAHITHYA	2435200757	KNR-KTPL CCode : 35259
992	L. HARSHITHA REDDY	2435208183	KNR-MC CCode : 35230
992	B. NIHARIKA	2435207660	KNR-KTPL CCode : 35259
991	M. PALLAVI	2458269100	HYD-KRMGT CCode : 58396
991	D. SHIVANJALI	2435208332	KNR-KTPL CCode : 35259
991	P. VISHWANI	2435200663	KNR-KTPL CCode : 35259
991	KUNDARAPU MISRA	2435212092	KNR-KTPL CCode : 35259
991	L. ASHMITHA	2435201340	KNR-KTPL CCode : 35259
991	SANAVAR SHIFALI	2433201615	MNCL CCode : 33214
991	M. MAHVEEN	2431203567	NRML CCode : 31209
991	G. UMAKANTH	2435207436	KNR-RK CCode : 35260
990	K. SRUTHI	2435201331	KNR-BNR CCode : 35239
990	N. JOGESHWAR	2459263596	HYD-GTKS CCode : 59352
990	P. JAGADEESH	2438206463	HNK CCode : 38271
990	A. ANVITHA	2436200519	JGTL CCode : 36202
990	A. PRASANNA	2435207628	KNR-KTPL CCode : 35259
990	P. SATHWIKA	2435211514	KNR-KTPL CCode : 35259
990	P. VARSHINI	2435207256	KNR-MMT CCode : 35228
990	A. SAI SHASHANK	2435211714	KNR-KB CCode : 35260

BiPC II YEAR

Marks	Name	H.T. No.	College
990	CH. NIKHIL	2459261612	HYD-GTKS CCode : 59352
990	B. AMITHA	2435203127	KNR-MMT CCode : 35228
990	A. SRINIDHI	2435211744	KNR-MMT CCode : 35228
989	M. SADHANA	2431203640	NRML CCode : 31209
988	G. SNEHITHA	2435212023	KNR-MC CCode : 35230
988	ASNA MAHVISH	2435204154	KNR-MC CCode : 35230
988	A. SAHER	2435203159	KNR-MMT CCode : 35228
987	V. HASINI	2458268206	HYD-KRGT CCode : 58396
987	A. SAI NISHMA	2435211059	KNR-MMT CCode : 35228

MEC II YEAR

Marks	Name	H.T. No.	College
974	M. VINAMRATHA	2435202289	KNR-BNR CCode : 35239
974	G. MAHESH KUMAR	2435201260	KNR-BNR CCode : 35231

CEC II YEAR

Marks	Name	H.T. No.	College
978	NIMRA AZMI	2433201445	MNCL CCode : 33214
976	M. NASEER	2436200494	JGTL CCode : 36206
974	N. JANVI	2435209102	MNCL CCode : 35239

& Many More

MPC I YEAR

Marks	Name	H.T. No.	College
468	T. SHRUTHI	2435100037	KNR-BNR CCode : 35239
468	CH. SRIHITHA	2435112509	KNR-MC CCode : 35230
468	V. PRANAVI	2435112617	KNR-MC CCode : 35230
468	A. SHASHI PREETHAM	2435112514	KNR-APL CCode : 35262
468	K. VARSHITH	2435100061	KNR-RK CCode : 35260
468	K. RUTHWIK	2435112438	KNR-KTPL CCode : 35231
468	S. KARTHIKEYA	2435112393	KNR-KTPL CCode : 35231
468	K. SUJAL	2435100002	KNR-RK CCode : 35260
468	T. VARSHITHA	2435101806	KNR-KTPL CCode : 35259
468	M. SRIVARSHA	2435112475	KNR-KTPL CCode : 35259
468	P. GAYATHRI PRIYAMRUTHA	2435103234	KNR-KTPL CCode : 35259
468	E. PRASANNA	2435100072	KNR-KTPL CCode : 35259
468	M. RUTHWIKA	2435112624	KNR-KTPL CCode : 35259
468	G. LAXMIPRASANNA	2435113896	KNR-MC CCode : 35230
468	K. ABHILASH	2433100611	MNCL CCode : 33214
468	M. YASHWANTH	2435103485	KNR-APL CCode : 35262



The Inspirational Dr.V.NARENDER REDDY garu, Chairman, with the ACHIEVERS of SPLENDOROUS ACCOMPLISHMENTS WITH THE STATE TOP MARKS in IPE I Year -2024 Results

Congratulations ! Victorious ALPHORESIANS

MPC I YEAR 467 — 64 ALPHORESIANS

BiPC I YEAR

Marks	Name	H.T. No.	College
438	B. NEELIMA	2435100173	KNR-KTPL CCode : 35259
437	MD. ABDUL RAFAY AHMED	2435100005	HNK CCode : 38271
437	N. JASHWANTH SAI	2438111236	HNK CCode : 38271
437	K. AKSHAYA	2435102026	KNR-KTPL CCode : 35259
437	G. RISHITHA	2435102245	KNR-KTPL CCode : 35259
437	N. MALIHA	2435108763	KNR-MC CCode : 31230
437	M. PREETHI	2431102435	NRML CCode : 31209
437	S. KAVALPREETH KOUR	2431102194	NRML CCode : 31209
437	HARSHITHA	2436100516	JGTL CCode : 36202

MEC I YEAR

Marks	Name	H.T. No.	College
494	T. AKHIL	2435104717	KNR-APL CCode : 35262
493	M. SAHASRA REDDY	2435103525	KNR-BNR CCode : 35239
493	V. AKSHAY VARDHAN	2435103312	KNR-APL CCode : 35262
490	M. SRIVALLIKA PATEL	2433100079	MNCL CCode : 33214
490	V. RISHITHA	2433102959	MNCL CCode : 33214

CEC I YEAR

Marks	Name	H.T. No.	College
492	S. SRUSTITHA	2435105072	KNR-BNR CCode : 35239
491	B. GREESHMA	2435105088	KNR-BNR CCode : 35239
490	K. SHIVACHARAN	2436100660	JGTL CCode : 36202

THANKS TO PARENTS & STAFF

& Many More

KARIMNAGAR | HANAMKONDA | MANCHERIAL | JAGTIAL | NIRMAL | HYDERABAD

✆ 91335 88857 ✆ 91333 12830 ✆ 91602 64443 ✆ 91602 74447 ✆ 91602 94446 ✆ 92468 34441

బీజేపీని అడ్డుకునే దమ్ము బీఆర్ఎస్‌కే

దమ్ము లేని కాంగ్రెస్‌కు ఓట్లేయొద్దు

- బీజేపీ మేలు కోసమే పోటీలో కాంగ్రెస్ దమ్మీ అభ్యర్థులు
- శ్రీరాముడు కూడా దొంగలను గెలిపించమని చెప్పడు
- బీఆర్ఎస్‌కు 10 ఎంపీ సీట్లొస్తే మళ్లీ కేసీఆరే శాసిస్తారు
- అసెంబ్లీ ఎన్నికల ముందు రేవంత్ మోసం పార్ట్ -1 చూపిస్తే ఇప్పుడు మోసం పార్ట్ -2 చూపిస్తున్నారు
- కేసీఆర్ లేడు.. రాష్ట్రం ఆగమైందని ప్రజల్లో చర్చ జరుగుతోంది.
- మాజీ మంత్రి కేటీఆర్



బీఆర్ఎస్ సభకు హాజరైన కార్యకర్తలు



సభలో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో వివేకానంద, లక్ష్మారెడ్డి, మల్లారెడ్డి

సాక్షి, మేడ్చల్ జిల్లా: బీజేపీని అడ్డుకునే దమ్ము ఒక్క బీఆర్ఎస్‌కే ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు(కేటీఆర్) తేల్చి చెప్పారు. గత 2014, 2019లో జరిగిన ఎన్నికల్లో కూడా బీజేపీని అడ్డుకున్నది బీఆర్ఎస్ మాత్రమేనని గుర్తు చేశారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్ కార్యక్రమం సందర్భంగా బుధవారం తూముకుంట మున్సిపాలిటీ పరిధిలోని మైసమ్మగుడి వద్ద జరిగిన ఎన్నికల సభలో ఆయన మాట్లాడారు. బీజేపీని ఓడించే దమ్ము లేని కాంగ్రెస్‌కు ఓటు వేసి వృథా చేయొద్దని పిలుపునిచ్చారు. బీజేపీని ఓడించే దమ్ము లేకనే రాహుల్ గాంధీ కేరళ నుంచి పోటీ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని కొందరు ప్రచారం చేస్తున్నారని, నిజంగా ఆ రెండు పార్టీలు ఒక్కటైతే కేసీఆర్ కూతురును జైల్లో పెట్టేవారా అని ప్రశ్నించారు. మరోసారి కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మొత్తం పథకాలను సీఎం రేవంత్ రెడ్డి బంద్ చేస్తారని, తాము ఏమీ చేయకపోయినా సరే ఓట్లు వేశారంటూ అన్ని పథకాలను ఆపేస్తారన్నారు

బీజేపీకి ఓట్లు అడిగేందుకు సిగ్గు ఉందా?..: గత పదేళ్లలో హైదరాబాద్‌కు, తెలంగాణకు బీజేపీ ఏం చేయలేదని, ఉప్పల్, అంబర్‌పేట్‌లో పదేళ్లలో రెండు ఫ్లై ఓవర్లు కూడా కట్టలేకపోయిందని కేటీఆర్ విమర్శించారు. తమ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 36 ఫ్లైఓవర్లు కడితే రెండు కూడా కట్టడం చేతకాని బీజేపీకి ఓట్లు అడిగేందుకు సిగ్గు ఉందా అని ప్రశ్నించారు. మోదీ ప్రధాని అయినప్పుడు రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర, ఇప్పుడు రూ.1100 పెరిగిందన్నారు. పప్పు, ఉప్పు, చింతపండు, బస్సు, రైలు అన్ని ధరలు పెంచిన మోదీని ప్రజలందరూ ప్రియమైన ప్రధాని కాదు పిరమైన ప్రధాని అని అంటున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. బీజేపీ నేతలను ఏం చేశారని అడిగితే చాలు జై శ్రీరామ్ అని అంటారని, శ్రీరామునితో తమకు ఎలాంటి పంచాయితీ లేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. శ్రీరాముడు కూడా లంగలు, దొంగలను గెలిపించమని చెప్పడన్నారు.

వలస పక్షులకు ఓటు వేస్తే దొరకరు...

మల్కాజిగిరిలో వలస పక్షులకు ఓట్లు వేస్తే గెలిచిన తర్వాత కనబడరని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని ప్రజలను కోరారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి మోసం పార్ట్ -1 సినిమా చూపించగా, పార్లమెంట్ ఎన్నికల్లో మోసం పార్ట్ -2 సినిమా చూపిస్తున్నాడని దుయ్యబట్టారు.

కేసీఆర్ లేడు.. రాష్ట్రం ఆగమైంది..

కేసీఆర్ లేడు రాష్ట్రం ఆగమైందని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చర్చ జరుగుతోందని కేటీఆర్ చెప్పారు. ప్రజలు ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 10 స్థానాలిస్తే మళ్లీ రాష్ట్రంలో కేసీఆరే రాజకీయాలను శాసించే పరిస్థితి వస్తుందన్నారు. మోదీకి తాము గెలువమని అర్థమైంది కనుకనే ముస్లింలపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఎన్డీఏ కూటమికి 200 సీట్లు దాటవని, ఇండియా కూటమికి కూడా 150 సీట్లు రావని అంచనా వేశారు. అందుకే బీఆర్ఎస్‌కు ఎక్కువ సీట్లు ఇస్తే వాళ్లే మనల్ని బతిమిలాడే పరిస్థితి వస్తుందన్నారు.

బడే భాయ్ మోదీ.. చోటా భాయ్ రేవంత్ మోసం చేస్తున్నారు

బడే భాయ్ మోదీకి మేలు చేసేందుకు చోటే భాయ్ రేవంత్ రెడ్డి మల్కాజ్‌గిరిలో కాంగ్రెస్ నుంచి డమ్మీ అభ్యర్థిని పోటీలో పెట్టారని బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో కూడా చాలా చోట్ల కాంగ్రెస్ పార్టీ డమ్మీ అభ్యర్థులను పెట్టిందన్నారు. ''రాహుల్ గాంధీ ఏమో లిక్కర్ స్కాం లేదంటాడు. కేజ్రీవాల్ అరెస్ట్ అన్యాయమని అంటాడు. కానీ రేవంత్ రెడ్డి మాత్రం కవితమ్మ అరెస్ట్ కరెక్టే అంటాడు. రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీ కోసం పనిచేస్తున్నాడా..లేక మోదీ కోసం పనిచేస్తున్నాడా''అని కేటీఆర్ ప్రశ్నించారు. మోదీ, రేవంత్ కలిసి ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు.

30న రాష్ట్రానికి మోదీ..

- జహీరాబాద్, మెదక్ లోక్‌సభ స్థానాల పరిధిలో ప్రచారం
- ఆందోల్ పరిధిలోని సుల్తాన్‌పూర్‌లో బహిరంగ సభ పాల్గొననున్న ప్రధాని
- వచ్చే నెల 3, 4 తేదీల్లో మరో నాలుగు సభల్లో పాల్గొనే అవకాశం
- చివరిగా హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణలో ప్రధాని మోదీ వరుసగా పర్యటించనున్నారు. ఈ నెల 30వ తేదీ నుంచి మే 11 వరకు నాలుగైదు సభల్లో మోదీ పాల్గొననున్నట్టు బీజేపీ నేతలు వెల్లడించారు. అయితే తుది షెడ్యూల్ ఖరారు కావాల్సి ఉందని తెలిపారు. ఈ నెల 30న బీజేపీ జహీరాబాద్ అభ్యర్థి బీబీ పాటిల్, మెదక్ అభ్యర్థి రఘునందన్‌రావులకు మద్దతుగా మోదీ ప్రచారం చేయనున్నారు. ఈ రెండింటినీ కవర్ చేసేలా ఆందోల్ అసెంబ్లీ సెగ్మెంట్‌లోని సుల్తాన్‌పూర్‌లో 30న మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగ సభ నిర్వహించనున్నారు. అదేరోజున సాయంత్రం శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో ఐటీ ప్రొఫెషనల్స్‌తో మోదీ ప్రత్యేకంగా సమావేశమయ్యే అవకాశాలు ఉన్నట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

మే 3, 4 తేదీల్లో..

ప్రధాని మోదీ మే 3వ తేదీన వరంగల్ లోక్‌సభ పరిధిలో ఒక సభలో.. భువనగిరి, నల్లగొండ లోక్‌సభ స్థానాల్లోని మరోచోట నిర్వహించే సభలో పాల్గొంటారని బీజేపీ వర్గాలు తెలిపాయి. 4వ తేదీన మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానం పరిధిలోని నారాయణపేటలో.. చేవెళ్ల లోక్‌సభ పరిధిలోని వికారాబాద్‌లో నిర్వహించే సభల్లో పాల్గొనే అవకాశం ఉందని వెల్లడించాయి. ఈ సందర్భంగా వికారాబాద్ అనంతగిరిలోని అనంత పద్మనాభస్వామి ఆలయాన్ని ప్రధాని సందర్శించవచ్చని తెలిపాయి. ఇక చివరిగా గ్రేటర్ హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల పరిధిలోని నాలుగైదు ఎంపీ స్థానాలను కవర్ చేసేలా.. మే 11వ తేదీలోగా పరేడ్‌గ్రౌండ్స్‌లో లేదా నగర శివార్లలో మోదీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ ఉంటుందని సమాచారం. అయితే ఆయా తేదీల్లో ప్రధాని పర్యటన ఇంకా పూర్తిగా ఖరారు కావాల్సి ఉందని పార్టీ నేతలు చెప్తున్నారు.

నేడు సిద్దిపేట సభకు అమిత్ షా..

బీజేపీ గురువారం మధ్యాహ్నం 12 గంటలకు సిద్దిపేటలో నిర్వహించనున్న బహిరంగసభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా పాల్గొననున్నారు. మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతు గా ఆయన ప్రచారం చేస్తారు. గురువారం నామినేషన్ల దాఖలుకు చివరిరోజు కావడంతో పలువురు బీజే పీ అభ్యర్థులు మరో సెట్ నామినేషన్లు దాఖలు చేయ నున్నారు. కరీంనగర్‌లో ఎంపీ అభ్యర్థి బండి సంజ య్, నాగర్‌కర్నూల్‌లో ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌ల నామినేషన్ కార్యక్రమాల్లో గుజరాత్ సీఎం భూపేందర్ పటేల్, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పాల్గొననున్నారు. నిజామాబాద్‌లో ఎంపీ అభ్యర్థి ధర్మపురి అ ర్వింద్ నామినేషన్ ర్యాలీలో ఉత్తరాఖండ్ సీఎం పు ష్కర్ సింగ్ ధామి , ఓబీసీ మోర్చా జాతీయాధ్యక్షుడు కె.లక్ష్మణ్ పాల్గొంటారు. వరంగల్‌లో ఎంపీ అభ్యర్థి ఆరూరి రమేశ్ నామినేషన్ కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి పాల్గొంటారు. పెద్దపల్లిలో ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ నామినేషన్ ర్యాలీలో బీజేపీఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పాల్గొంటారు.

యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి గ్రీన్‌సిగ్నల్

▶ మొదటి పేజీ తరువాయి

జెన్‌కోకు ఎదురుదెబ్బ తగిలింది. దీంతో యాదాద్రి ప్లాంట్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. మళ్లీ పర్యావరణ అనుమతులు పొందేందుకు జెన్‌కో విశ్వ ప్రయత్నాలు చేసింది. ఈ నెల 8న సమావేశమైన కేంద్ర పర్యావరణశాఖ నిపుణుల మదింపు కమిటీ ఎట్టకేలకు ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు జారీ చేయాలని సిఫారసు చేసింది.

కృష్ణానదిని కలుషితం చేయమని హామీ

కృష్ణానదిలో కలిసే తుంగపాడు వాగు యాదాద్రి ప్లాంట్ మధ్య నుంచి వెళుతుందని, దీని ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు ఉండరాదని, వాగులో కనీస ప్రవాహం ఉండేలా చర్యలు తీసుకోవాలని నిపుణుల కమిటీ జెన్‌కోకు సూచించింది. వాగు పరిరక్షణకు ఇప్పటికే చర్యలు తీసుకున్నామని, వాగుకు ఇరువైపులా 100 మీటర్ల వరకు అటవీశాఖ ఆధ్వర్యంలో గ్రీన్‌బెల్ట్ అభివృద్ధి చేసినట్టు రాష్ట్ర ప్రభుత్వం బదులిచ్చింది. తుంగపాడు వాగులో కనీస ప్రవాహం ఉండేలా ఎగువన ఉన్న పెద్దచెరువుల నుంచి నీటిని విడుదల చేస్తామని గతంలో నీటిపారుదల శాఖ సైతం హామీ ఇచ్చింది. తుంగపాడు వాగు, కృష్ణానది కలుషితం కాకుండా యాదాద్రి విద్యుత్ ప్లాంట్‌ను జీరో లిక్విడ్ డిశ్చార్జి సిస్టమ్ ఆధారంగా డిజైన్ చేశామని, ఇందుకు యాష్ వాటర్ రికవరీ సిస్టమ్ ఏర్పాటు చేసినట్టు జెన్‌కో సైతం ఈ నెల 12న లేఖ ద్వారా హామీ ఇచ్చింది. పారిశ్రామిక వ్యర్థ జలాల శుద్ధికి ఆర్వో ఆధారిత ప్లాంట్‌తో పాటు సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్టు తెలిపింది. ఇలా శుద్ధి చేసిన జలాలను బూడిద, చెట్ల పెంపకం, కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ అవసరాలకు వినియోగిస్తామని జెన్‌కో తెలిసింది. తుంగపాడు వాగులో ఎలాంటి వ్యర్థాలు వదలని స్పష్టం చేసింది.

నిపుణుల కమిటీ షరతుల్లో కొన్ని....

- విద్యుత్ కేంద్రం ప్రహరీ లోపలిభాగంలో స్థానిక అటవీ జాతుల మొక్కలను మూడు వరుసల్లో నాటే కార్యక్రమాన్ని జూన్ 2024లోగా పూర్తి చేయాలి. తుంగపాడు వాగుకు రెండువైపులా 100 మీటర్ల వరకు వచ్చే రెండేళ్లలోగా చెట్ల పెంపకం పూర్తి చేయాలి. విద్యుత్ ప్లాంట్ ప్రహరీ చుట్టూ 2 కి.మీల వరకు దట్టంగా చెట్లు పెంచాలి. స్థానికంగా ఉన్న పాఠశాలల చుట్టూ 10 కి.మీల వరకు చెట్లు పెంచాలి.
- భూ నిర్వాసితులకు 2025 మార్చిలోగా పరిహార పంపిణీ పూర్తి చేయాలి. ప్రాజెక్టుతో నిర్వాసితులైన కుటుంబాలు, ప్రభావితమైన కుటుంబాల్లోని వ్యక్తులకు ఇచ్చిన హామీ మేరకు శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పించాలి.
- బూడిద కోసం భవిష్యత్‌లో అదనపు భూమి కేటాయింపు ఉండదు. సిమెంట్, ఇటుకల తయారీకి 100శాతం బూడిదను వినియోగించుకోవాలి. రవాణాలో బూడిద పరిసర ప్రాంతాల్లో పడి కలుషితం చేయకుండా క్లోజ్డ్ బల్కర్స్‌లోనే తరలించాలి.
- పర్యావరణ నిర్వహణ ప్రణాళిక (ఈఎంపీ)లో హామీ ఇచ్చిన మేరకు గడువులోగా రూ.5681.44 కోట్ల మూలధనం, రూ.430 కోట్ల రికరింగ్ నిధులతో పర్యావరణ ప్రణాళిక అమలు చేయాలి.
- ప్రాజెక్టుకు చుట్టూ 5 కి.మీల పరిధిలో నివసించే జనాభాకు కనీసం రెండేళ్లకోసారి ఎపిడెమియోలాజికల్(అంటురోగాలు) స్టడీ నిర్వహించాలి. స్టడీలో తేలిన అంశాల ఆధారంగా వారి ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి.

యూనిట్ల నిర్మాణ గడువూ పొడిగింపు

తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ(జెన్‌కో) ఆధ్వర్యంలో 4000(5X800) మెగావాట్ల సామర్థ్యంతో నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం- వీరప్పగూడెం గ్రామాల్లో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని ఐదు యూనిట్ల నిర్మాణం విషయంలో గడువు పొడిగించినట్టు జెన్‌కో కేంద్ర పర్యావరణ శాఖకు తెలిపింది..

యూనిట్	గడువు
యూనిట్- 1	15.10.2024
యూనిట్-2	15.10.2024
యూనిట్ -3	31.03.2025
యూనిట్-4	31.12.2024
యూనిట్-5	28.02.2025

నేతన్న విషాదాంతం!

- వెదిరలో ఆకలి చావు
- గుర్తుపట్టలేని స్థితిలో మృతి
- పోలీసుల విచారణలో సిరిసిల్ల వాసిగా నిర్ధారణ



ఈగ రాజు మృతదేహం

సిరిసిల్లటౌన్: కొందరి దీన పరిస్థితి చూస్తే.. పగవారికి కూడా అటువంటి కష్టాలు రాకూడదని అనిపిస్తుంది. ఇదే తరహాలో సిరిసిల్ల నేత కార్మికుడి విషయంలో జరిగిన ఘటన మానవతావాదులను కలచివేసింది. పోలీసుల కథనం ప్రకారం.. సిరిసిల్ల పట్టణం నెహ్రూనగర్‌కు చెందిన ఈగ రాజు (45) రోకడ (ఎక్కడ పని ఉంటే అక్కడ సాంచాలు నడిపే పని) నేత కార్మికుడు. అయితే చాలా రోజులుగా సిరిసిల్లలో పనుల్లేక ఖాళీగా ఉంటున్నాడు. నాలుగు రోజుల క్రితం పనిని వెతుక్కుంటూ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. ఎటు వెళ్లాడో తెలియని స్థితిలో కుటుంబ సభ్యులు దిక్కుతోచకుండా ఉంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం కరీంనగర్ జిల్లా వెదిర గ్రామం నుంచి ఫోన్ వచ్చింది. తమ గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తి వడదెబ్బతో చనిపోయాడని, ఆధార్‌కార్డులో సిరిసిల్ల వాసిగా అడ్రస్ ఉందని తెలిపారు. వెంటనే భార్య రేఖతో పాటు బంధువులు వెదిరకు వెళ్లారు. రాజు వేసుకున్న దుస్తుల ఆనవాళ్లను బట్టి అతనే అనిపించినా.. ఎండకు, ఆకలికి తాళలేక బక్కచిక్కి.. మొఖం రంగు మారిన క్రమంలో భార్య రేఖ తన భర్తను గుర్తు పట్టలేకపోయింది. చనిపోయింది తన భర్తకాదని, పని దొరికాక ఇంటికి వస్తాడన్న నమ్మకంతో సిరిసిల్లకు తిరిగి వచ్చింది.

ఎస్సై సురేందర్ విచారణతో..

వెదిర గ్రామ కార్యదర్శి గౌరి రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామడుగు ఎస్సై సురేందర్.. ఈగ రాజు మృతి కేసును దర్యాప్తు చేశారు. బుధవారం సిరిసిల్లలో రాజు ఇంటికి వచ్చి నేరుగా విచారణ చేపట్టారు. ఇంట్లో ఉన్న ఫొటోలు, మృతుడిపై ఉన్న దుస్తులను బట్టి ఆ శవం ఈగ రాజుదిగా నిర్ధారించారు. కరీంనగర్‌లో పోస్టుమార్టం జరిపించి బుధవారం రాత్రి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్లు ఎస్సై సురేందర్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులే కారణమా?

ఈగ రాజు మృతికి ఆర్థిక ఇబ్బందులే కారణమని స్థానికులు తెలిపారు. కొంత కాలంగా రాజుకు పని లేకుండా ఖాళీగా ఉంటున్నాడని, కుటుంబ భారం మొత్తం భార్య రేఖ మోస్తోందని చెప్పారు. కొద్ది నెలల క్రితమే కూతురుకు వివాహం జరిగిందని, రాజుకు అనారోగ్యం.. తదితర కారణాలతో కుటుంబానికి అప్పులయ్యాయని తెలిపారు. ఈ క్రమంలోనే రాజు పని వెతుక్కుంటూ ఇంట్లోంచి వెళ్లిపోయాడని, చేతిలో డబ్బులేక మండుటెండల్లో సరైన ఆహారం లభించక, ఎండల ధాటికి మృతిచెందినట్లు స్థానికులు భావిస్తున్నారు.

బీఆర్ఎస్‌కు 2 సీట్లు వస్తే రాజీనామా చేస్తా

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



రోడ్‌షోలో మాట్లాడుకుంటున్న ఉత్తమ్, కోమటిరెడ్డి. చిత్రంలో రఘువీర్‌రెడ్డి

నల్లగొండ: లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు రెండు సీట్లు వస్తే తన మంత్రి పదవికి రాజీనామా చేస్తానని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సవాల్ చేశారు. ఎన్నికల తరువాత ఆ పార్టీ ఉండదన్నారు. బుధవారం నల్లగొండ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా నల్లగొండ వీటీకాలనీలోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో నామినేషన్ పత్రాలతో పూజలు నిర్వహించారు. అనంతరం భారీ ర్యాలీగా గడియారం సెంటర్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగసభలో కోమటిరెడ్డి మాట్లాడారు. సాగర్, శ్రీశైలంలను ఎండబెట్టిన ద్రోహి కేసీఆర్ అని, అలాంటిది ఏ మొహం పెట్టుకొని మిర్యాలగూడకు వస్తున్నారన్నారు. తాను తెలంగాణ కోసం మంత్రి పదవి త్యాగం చేస్తే కేసీఆర్ మాత్రం దొంగదీక్ష చేశాడంటూ దుయ్యబట్టారు.

రేవంత్ వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నా: ఉత్తమ్

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. కోమటిరెడ్డికి ముఖ్యమంత్రి అయ్యే అర్హతలున్నాయంటూ ఇటీవల భువనగిరిలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలతో తాను ఏకీభవిస్తున్నట్టు చెప్పారు. బీజేపీ పదేళ్లలో రాష్ట్రానికి చేసిందేమీ లేదని చెప్పారు. రైతులను మోసం చేసిందంటూ ధ్వజమెత్తారు. అందుకే ఆ పార్టీకి ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. మంత్రిగా మాటిస్తున్నా. ఎస్ఎల్‌బీసీని, బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, ఎన్నికల తర్వాత కొత్త రేషన్‌కార్డులు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బాలునాయక్, బత్తుల లక్ష్మారెడ్డి, జైవీర్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి, మాజీ మంత్రులు కుందూరు జానారెడ్డి, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నీ పచ్చిఅబద్ధాలు

▶ మొదటి పేజీ తరువాయి

ఉత్తమ్.. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి, ఎమ్మెల్యేలు బాలూనాయక్, బత్తుల లక్ష్మారెడ్డి, రఘువీర్‌రెడ్డి తదితరులతో కలిసి మాట్లాడారు. పదేళ్లు సీఎంగా పని చేసిన వ్యక్తి అబద్ధాలు చెపితే నిజాలు చెప్పాల్సిన బాధ్యత మంత్రులుగా తమపై ఉందన్నారు. తెలంగాణలో విద్యుత్ సామర్థ్యాన్ని 7వేల నుంచి 12వేల మెగావాట్లకు పెంచామని కేసీఆర్ చెప్పడం పచ్చిఅబద్ధమని, ఒక్క భద్రాద్రి విద్యుత్ ప్రాజెక్టును మాత్రమే పూర్తి చేశాడని చెప్పారు. కేసీఆర్ సీఎంగా ఉండగానే మేడిగడ్డ పిల్లర్లు కుంగిపోతే నీళ్లు కిందకు వదిలి తమపై నెపం నెడుతున్నారన్నారు. ఇప్పటికే 104 మంది ఉన్న ఎమ్మెల్యేలు 39కి పడిపోయారని, అందులో 25 మంది కాంగ్రెస్‌లోకి వస్తారని, కేసీఆర్ మళ్లీ సీఎం అవుతాడన్న విషయం ఈ శతాబ్దపు పెద్ద జోక్ అని ఎద్దేవా చేశారు.

బీఆర్ఎస్ హయాంలో ఏపీకి ఎక్కువ నీరు

నాగార్జునసాగర్ నుంచి బీఆర్ఎస్ హయాంలో ఏపీ ప్రభుత్వం ప్రతి యేటా ఎక్కువ నీటిని తీసుకుందని, ఉమ్మడి ఏపీ కంటే కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక తెలంగాణకు నష్టం ఎక్కువ జరిగిందని ఉత్తమ్ చెప్పారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి ఏపీకి నీటి విడుదల సామర్థ్యం తెలంగాణ రాకముందు 4.1 టీఎంసీలు ఉంటే ఇప్పుడు 9.6 టీఎంసీలకు చేరిందని చెప్పారు. ఇది కేసీఆర్ గొప్పతనమని ఆయన ఎద్దేవా చేశారు. తమ పదవీకాలం పూర్తయ్యేలోపు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 13,50,494 ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తామని చెప్పారు. కాళేశ్వరం విషయంలో ఎన్‌డీఎస్ఏ ఏది చెపితే అదే చేస్తామని, మొత్తం పనికిరాదన్నా, కొద్దిగే పనికిరాదన్నా వారు చెప్పినట్టు చేస్తామన్నారు. కేసీఆర్‌తో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కాదు కదా... 25 మంది వార్డు స్థాయి కార్యకర్తలుకూడా టచ్‌లో ఉండరని పేర్కొన్నారు.

8 కాదు... సున్నా సీట్లే: కోమటిరెడ్డి

కేసీఆర్‌కు ఇంకా మెదడు పనిచేస్తోందేమోనని, జ్ఞానం ఉందేమోనని అనుకున్నానని, 4 గంటల ఇంటర్వ్యూ తర్వాత అది తప్పని తేలిందని రోడ్లు, భవనాల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఎంత పనిలేనోడైతే 4 గంటల ఇంటర్వ్యూ ఇస్తాడో అర్థం చేసుకోవాలని ఎద్దేవా చేశారు. మిడ్‌మానేరు ప్రాజెక్టు నిర్మాణానికి తనకు సంబంధం లేదన్నారు. తాను యూత్ కాంగ్రెస్ నుంచే ఎలాంటి వ్యాపారంలో లేనని స్పష్టంచేశారు. తన సోదరుడు రాజగోపాల్‌రెడ్డికి చెందిన సుశీ కంపెనీ ఆ ప్రాజెక్టు నుంచి 85 శాతం పనులు మిగిలి ఉన్నప్పుడే తప్పుకుందని వివరించారు. ముత్తయ్యనాయుడు అనే బి నామీ కంపెనీ పేరుతో తీసుకుని హరీశ్‌రావు మనుషులు ఆ ప్రాజెక్టును కట్టారని, అందులోనూ రూ.400 కోట్లు దోచుకున్నారని ఆరోపించారు.

బతుకమ్మ పూల చాటున...

కవిత బతుకమ్మ పూల చాటున బాటిళ్లు పెట్టి అమ్మినట్లు తమకు ఇప్పుడే తెలిసిందని, తెలంగాణ పరువు తీసిన కూతురు గు రించి కేసీఆర్ గొప్పగా చెబుతున్నారని కోమటిరెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్‌కు డి పాజిట్లు పోయి దుకాణం బంద్ కావడానికి 20 రోజులే ఉందని, ఇప్పుడైనా సిగ్గు తె చ్చుకోవాలన్నారు. పొలం బాట లాంటి నాటకాలు బంద్ చేసి డాక్టర్‌కు చూపించుకోవడం మంచిదని, డిపాజిట్లు పోయిన తర్వాత కేసీఆర్ ఎర్రగడ్డకు వెళ్తాడని ఎద్దేవాచేశారు. అధిక వడ్డీలకు కేసీఆర్ తెచ్చిన అప్పులను తమ ప్రభుత్వం కట్టకపోయి ఉంటే ఈ సమయానికే రైతు రుణమాఫీ పూర్తి చేసేవారమని, ఇప్పుడైనా పంద్రా గస్టు లోపు ఇస్తామని కోమటిరెడ్డి స్పష్టంచేశారు.

జబ్బులు తగ్గిస్తామని తప్పుడు ప్రకటనలు

డీసీఏ సోదాల్లో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: గుండె సంబంధ జబ్బులు, రుతచక్రం రావడంలో సమస్యలను తొలగించే మందులు అంటూ తప్పుడు ప్రకటనలు జారీ చేస్తూ ప్రజలను మోసగిస్తున్న మెడికల్ దుకాణాలపై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇలాంటి మందుల దుకాణాలపై మంగళ, బుధవారాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఇందులో అబిడ్స్, ఎంజే మార్కెట్‌లోని ఓ మెడికల్ దుకాణంలో గుండె సంబంధ జబ్బులు నయం చేసే మందులు అంటూ కొన్ని తప్పుడు మందులు విక్రయించడంతోపాటు ప్రకటనలు ఏర్పాటు చేసినట్లు అధికారులు గుర్తించారు.

సాక్షి
గురువారం, 25 ఏప్రిల్ 2024

మానవతకు 200 రోజుల మచ్చ

ఒకటీ, రెండూ కాదు... ఆరు నెలలు దాటింది. మంగళవారంతో ఏకంగా రెండు వందల రోజులు గడిచిపోయాయి. అయినా, పాలెస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు ఆగడం లేదు. సంక్షోభానికి పరిష్కారమూ కనిపించడం లేదు. సామూహిక సమాధులు, కూలిన ఆస్పత్రులు, శిథిలాల కుప్పగా మారిన భవనాలు, ప్రాణాలు పోయిన వేలాది జనం, ప్రాథమిక వసతులు పూర్తి విధ్వంసంతో పాలెస్తీనా బావురుమంటోంది. తీవ్రవాద హమాస్ బృందం తమపై ఆకస్మికంగా దాడి చేసి, 250 మందిని బందీలుగా చేసుకొని, 1200 మంది ప్రాణాలు తీసినందుకు బదులుగా గత అక్టోబర్ 7న సైనిక చర్యకు దిగిన ఇజ్రాయెల్ వైమానిక దాడులు కొనసాగిస్తూనే ఉంది. గాజాలోని 23 లక్షల జనాభాలో దాదాపు 85 శాతం మంది ఇళ్ళు వదిలి పారిపోయారు. హమాస్ ఏరివేతకని చెబుతూ మొదలుపెట్టిన ఈ పాశవిక, ప్రతీకార దాడిలో ఇప్పటికి 14 వేల పైచిలుకు పసిపిల్లలతో సహా 34 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారని లెక్క. నిజానికి, ఆ సంఖ్య ఇంకా ఎక్కువేనని సహాయక సంస్థల అంచనా.

గాజా భూఖండపు ఉత్తర ప్రాంతంపై ఇటీవల ఎన్నడూ లేనంతగా శతఘ్నుల వర్షం కురిపిస్తూ, అక్కడ నుంచి జనాల్ని ఖాళీ చేయమంటున్న ఇజ్రాయెల్ దక్షిణ ప్రాంత ప్రధాన నగరమైన రాఫాపై దాడికి సర్వసన్నద్ధమవుతుండడం తాజా విషాద పరిణామం. పశ్చిమాసియాలోని ఈ సంక్షోభం అంతకంతకూ పెద్దదవుతూ వచ్చింది. ఇరాన్ సైతం ఇటీవల ఇజ్రాయెల్‌తో ఢీ అనడం పర్యవసానాలపై ప్రపంచం భయపడాల్సిన పరిస్థితి తెచ్చింది. పాలెస్తీనా శరణార్థులకు ఉద్దేశించిన ఐరాస సహాయ సంస్థ (యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ) ఉన్నా దానికిప్పుడు నిధులు లేని దుఃస్థితి. ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన దాడికి ఆ సంస్థ సిబ్బంది కొందరు సహకరించారని ఇజ్రాయెల్ ఆరోపించింది. దాంతో ఆ సంస్థకు సహాయం అందిస్తున్న 16 దాతృత్వ దేశాలు నిధులు నిలిపివేశాయి. పర్యవసానంగా 45 కోట్ల డాలర్ల మేర నిధుల లోటు ఏర్పడి, వేలాది పాలెస్తీనియన్లు ఈ యుద్ధకాలంలో ఆకలిదప్పులతో అలమటిస్తున్నారు. అయితే ఇజ్రాయెల్‌వి నిరాధార ఆరోపణలని స్వతంత్ర పరిశీలనలో ఈ వారమే తేలింది. అమెరికా సహా ఇతర దేశాలు మానవతా అవసరంగా గుర్తించి, నైతిక బాధ్యతతో యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏకు ఆర్థిక సాయం పునరుద్ధరించాలని అరబ్ లీగ్ తాజాగా డిమాండ్ చేస్తున్నది అందుకే.


ఇజ్రాయెల్ భీకర దాడుల అనంతరం గాజాలోని ప్రధాన ఆస్పత్రుల వద్ద 300కు పైగా మృతదేహాలతో బయటపడ్డ సామూహిక భారీ సమాధుల దృశ్యాలు సహజంగానే అంతర్జాతీయ ప్రపంచాన్ని కుదిపివేస్తున్నాయి. ఇజ్రాయెలీ సైనికుల దాడుల్లో అంతర్జాతీయ మానవ హక్కుల ఉల్లంఘన యథేచ్ఛగా సాగిందడానికి సమాధుల్లో కట్టేసిన చేతులతో, వివస్త్రంగా కనిపిస్తున్న శవాలే ప్రత్యక్ష సాక్ష్యం. అనుమానాలకు తావిస్తున్న ఈ సమాధులపై పారదర్శకంగా, స్వతంత్ర దర్యాప్తు జరపాలని ఐరాస ఇప్పటికే డిమాండ్ చేసింది. యూరోపియన్ యూనియన్ సైతం బుధవారం అదే అభిప్రాయం వ్యక్తం చేయడం గమనార్హం. ఆగని ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో బాధిత పక్షం వైపు అంతర్జాతీయంగానూ క్రమంగా మొగ్గు కనబడుతోంది. పాలెస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తించడమే ప్రస్తుత సమస్యకు సత్వర పరిష్కారమని భావిస్తున్నవారి సంఖ్యా పెరుగుతోంది. గాజా సమస్య అంతకంతకూ మానవతా సంక్షోభంగా పరిణమిస్తుండడంతో తాజాగా జమైకా ప్రభుత్వం పాలెస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తిస్తున్నట్టు ప్రకటించడం విశేషం. పరస్పర గౌరవం, శాంతియుత సహజీవనమనే ఐరాస నియమావళి పట్ల నిబద్ధతే ఈ నిర్ణయానికి ప్రేరణ అని జమైకా పేర్కొంది.

ప్రతి 10 నిమిషాలకూ ఓ పసివాడు చనిపోవడమో, గాయపడడమో జరుగుతున్న పాలెస్తీనాలో, ఇప్పటికి కనీసం 75 వేల టన్నుల పేలుడు పదార్థాల తాకిడికి గురై 62 శాతం ఇళ్ళు ధ్వంసమైన భూభాగంలో, ఆహార కరవుతో 11 లక్షల మంది అన్నమో రామచంద్రా అని అలమటిస్తూ రోజూ పదుల సంఖ్యలో ప్రాణాలు విడుస్తున్న ప్రాంతంలో... సత్వరమే సంక్షోభాన్ని పరిష్కరించి, శాంతి స్థాపన జరపకపోతే చరిత్ర మనల్ని క్షమించదు. ఒకప్పటి కీలకపాత్రధారి ఐరాస ప్రస్తుతం మాటలే తప్ప చేతలు లేక చేష్టలుడిగి చూస్తోంది. కాల్పుల విరమణకై ఈ ఆరునెలల్లో ఐరాస 4సార్లు తీర్మానాలు చేసినా, అవన్నీ అగ్రరాజ్యాలు మోకాలడ్డడంతో వీగిపోవడం దురదృష్టం. ఐరాసలో అండగా నిలవడమే కాక, ఇజ్రాయెల్‌కు ఆయుధాలిస్తున్న అమెరికా ఆ దేశానికి ఇటీవలే 2600 కోట్ల డాలర్ల సాయం మంజూరు చేసి, శరణార్థులకేమో మొండిచేయి చూపడం పెద్దన్న ద్వంద్వనీతికి దర్పణం. గాజా పోరులో అమెరికా అధ్యక్షుడి విధానాలపై స్వదేశంలోనే నిరసనలు పెరిగాయి. పాలెస్తీనాకు అనుకూలంగా అమెరికాలోని అనేక విశ్వవిద్యాలయాల్లో వేలాది విద్యార్థులు వీధికెక్కడం విశేషం.

పశ్చిమాసియాలో సమస్య పరిష్కారానికి అమెరికా, దాని భాగస్వాములు పాత కథ వదిలి, మళ్ళీ మథనం చేయాలి. భద్రత పరంగా ఇజ్రాయెల్‌కు ఉన్న ఆందోళనల్ని పోగొడుతూనే, పాలెస్తీనా ప్రజల ప్రత్యేక రాజ్య ఆకాంక్షను నెరవేర్చాల్సిన అవసరం ఉంది. ఈ ప్రయత్నాలు సఫలమయ్యేలా అటు ఇరాన్‌నూ భాగస్వామిని చేసి, శాశ్వత పరిష్కారానికై పాశ్చాత్య ప్రపంచం కృషి చేయాలి. ఇరాన్ సైతం పశ్చిమాసియాలో తన ప్రభావాన్ని విస్తరించుకోవడం కోసం లెబనాన్, గాజా, సిరియా, యెమన్‌లలో పరోక్ష శక్తులకు ఆయుధాలు సమకూర్చి, అండగా నిలిచే పని మానుకోవాలి. ఇలా పాముల్ని పాలుపోసి పెంచడం ఉగ్రిక్తతల్ని పెంచే పాపమని గుర్తించాలి. ఈ ప్రాంతంలో 90 లక్షల మంది మన ప్రవాసులున్నందు భారత్ సైతం ఇజ్రాయెల్, అరబ్ దేశాలతో సత్సంబంధాల రీత్యా కీలక భాగస్వాముల్ని ఒక దగ్గరకు చేర్చి, పరిష్కారానికి యత్నించాలి. వాణిజ్యంలో, ఇంధన సరఫరాలో కీలకమైన పశ్చిమాసియాలో శాంతి నెలకొంటేనే... ప్రపంచం సుభిక్షంగా ఉంటుంది.

ఏపీ ఉద్యోగులతో ఒక మాట!

అభిప్రాయం



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

దేశంలోనే అన్ని రంగాల్ని మొట్టమొదటగా ప్రైవేటీకరించడం మొదలుపెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. అన్నిటికంటే ప్రమాదకరమైంది – స్కూళ్ళు, జూనియర్ కాలేజీల విద్యా ప్రైవేటీకరణ. దీంతో పేదలకు చదువు దూరమైంది. ఆంగ్లం అందకుండా పోయింది. దీనికి విరుగుడుగా జగన్ నేతృత్వంలో విద్యా, వైద్య రంగాల్లో ప్రైవేటీకరణ వ్యతిరేక మోడల్ ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైంది. దేశంలోని మొత్తం స్కూలు విద్యను ఎల్‌కేజీ నుండి 12వ తరగతి వరకు ప్రైవేట్ రంగం నుండి ప్రభుత్వ రంగంలోకి మార్చకుండా విద్యా సమానత్వాన్ని తేవడం సాధ్యమా? అందుకే గ్రామాలలో పని చేసే ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు అట్టడుగు గ్రామీణ శ్రమజీవుల జీవితాలను మార్చడానికి ప్రభుత్వం ఏమి చేస్తున్నదో అర్థం చేసుకోవడం ముఖ్యం.

రాబోయే ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉద్యోగులు ఎక్కువ ఎటు ఓటు వేశారనేది ముందుగానే పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించినప్పుడు తెలుస్తుంది. ముఖ్యంగా అత్యధిక సంఖ్యలో ఉన్న టీచర్లు – స్కూలు, కాలేజీ, యూనివర్సిటీలలో పనిచేసేవారు ఎటువైపు ఉన్నారు? ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసే డాక్టర్లు, నర్సులు, సహాయక సిబ్బంది ఎటు ఓటు వేస్తారనేది కూడా ముఖ్యం. వీరితోపాటు గణనీయ సంఖ్యలో ప్రభుత్వ పోలీసు రంగం ఉద్యోగులు కూడా ఎటు ఓటు వేస్తారనేది చాలా ముఖ్యం. ఇక రెవెన్యూ, మున్సిపాలిటీ, సఫాయి శాఖతో పాటు ప్రభుత్వ రంగంలో ఉన్న పర్మనెంటు ఉద్యోగులు ఎటు ఓటు వేస్తారు, ఎవరు గెలవాలనుకుంటారు అనేది చాలా ముఖ్యమైంది. ఇంతకీ ఈ ఉద్యోగుల ఓటు గురించి ఎన్నడూలేని విధంగా ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోనే ఎందుకు చర్చించాలి? దానికొక ముఖ్య కారణమున్నది.

జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చంద్రబాబులాగే ఒక రీజినల్ పార్టీ నడిపే ప్రభుత్వం. దేశంలోనే అన్ని రంగాల్ని మొట్టమొదటగా ప్రైవేటీకరించడం మొదలుపెట్టిన ముఖ్యమంత్రి, చంద్రబాబునాయుడు. అన్నిటికంటే ప్రమాదకరమైంది–స్కూళ్ళు, జూనియర్ కాలేజీల విద్యా ప్రైవేటీకరణ. దాన్ని ఆయన విపరీతంగా ప్రైవేటీకరించి అక్కడినుండి పార్టీ ఫండ్‌ను జమ చేశాడు. ఈ క్రమంలోనే పెద్ద ఎత్తున అన్ని రంగాల్లో ఎంట్రెన్సులు, కోచింగ్ సెంటర్లు ప్రారంభమయ్యాయి. ఈ దశలోనే పుట్టగొడుగుల్లా స్కూళ్ళు, జూనియర్ కాలేజీలు, గైడ్ రైటింగ్ కంపెనీలు, అడ్వర్టైజ్ ర్యాంకులు మొదలయ్యాయి. వైద్య రంగంలో కూడా ప్రభుత్వ రంగాన్ని మండలాల వరకు అభివృద్ధి చెయ్యకుండా ప్రైవేట్ హాస్పిటల్స్, ఒక్కొక్క డాక్టరు తన సొంత హాస్పిటల్ కట్టి నడపడం మొదలయ్యాయి. గత ఐదేళ్ళ జగన్ పాలనలో ప్రభుత్వ విద్యా రంగంలో ఇంగ్లిష్ మీడియం పెట్టి, స్కూళ్ళ అభివృద్ధి ప్రారంభించాక స్కూలు విద్యలో ప్రైవేట్ రంగం విద్య బాగా పడిపోయింది. స్కూలు టీచర్లు, ప్రభుత్వ ఉద్యోగులు ఈ ప్రైవేట్ విద్యా వ్యవస్థ వ్యతిరేక అభివృద్ధిని ఎలా చూడాలి? రాష్ట్రంలో మండలం, గ్రామ స్థాయిలో చిన్న, చిన్న ప్రభుత్వ హాస్పిటల్స్ పెరిగి, వాటిని టెలీ మెడిసిన్‌తో ముడేసిన వైద్యం... వైద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకమైందా, కాదా? గ్రామ సెక్రటేరియట్‌ల నిర్మాణం, చిన్న జీతాలతోనైనా 2,50,000 మంది వలంటీర్లను ప్రభుత్వ రంగంలో నియమిస్తే ప్రభుత్వ రంగం విస్తరించినట్టా, ప్రైవేట్ రంగం విస్తరించినట్టా?

నిజంగానే బడ్జెట్ డబ్బులో ఎక్కువ భాగం గ్రామీణ ప్రాంత బీద, దిగువ మధ్యతరగతి రైతాంగానికి, కూలీలకు బదిలీ చేయబడ్డది కనుక ఉద్యోగుల జీతభత్యాల పెరుగుదల ఆగిందనుకుందాం. అయినా ప్రభుత్వ రంగ ఎదుగుదల, ప్రైవేట్ రంగ ఎదుగుదల కోణం నుండి చూసినప్పుడు ప్రభుత్వం 30 వేల ఎకరాల్లో అమరావతి కట్టడం కోసం కాంట్రాక్టర్లకు ఆ డబ్బు ఇస్తే ఏ రంగం పెరిగేది? అందుకు బదులు గ్రామీణ అభివృద్ధి ముఖ్యంగా విద్యా, వైద్య రంగాల అభివృద్ధి జాతీయ వాదంలో కీలకమైంది. ఈ స్థితిలో ప్రభుత్వ రంగ ఉద్యోగులు, ముఖ్యంగా టీచర్లు ఏ ముఖ్యమంత్రిని కోరుకోవాలి? ప్రభుత్వ రంగాన్ని గణనీయంగా పెంచిన జగన్‌నా, ప్రైవేట్ రంగ అనుకూల బాబునా? మరీ ముఖ్యంగా మోదీల కూటమినా? పవన్ కల్యాణ్‌కి సినిమా రంగం తప్ప ఏ రంగం గురించి తెలియదు. ఆయన మోదీ, బాబు ఏది చెబితే అది చేస్తాడు.



ఉద్యోగస్తులు నిరంతరం ప్రజా జీవన విధానం, వారి ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా తమ జీతాల పెంపు, అనుకూల ట్రాన్స్‌ఫర్, రిటైర్మెంట్ ఏజ్ పెంపు గురించి ఆలోచిస్తే క్రమంగా ప్రభుత్వ రంగాన్ని మూసేసి ప్రైవేట్ రంగ ఎదుగుదలకు ఓటెయ్యడమే. భవిష్యత్ తరాల బతుకుదెరువు గురించి, రాష్ట్ర, దేశ భవిష్యత్ గురించి మాకెందుకు అనుకుంటే ప్రైవేటీకరణను ప్రభుత్వ రంగ ఉద్యోగులే కోరుకోవడం కాదా? ఉద్యోగుల్లో, ముఖ్యంగా టీచర్లు కమ్యూనిస్టు పార్టీలతో ఉండి ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తుంటారు. అదే టీచర్లు ఇప్పుడు ఏపీలో ప్రైవేట్ విద్యారంగాన్ని ప్రభుత్వ రంగంలోకి మారిస్తే, ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెడితే, నాడు–నేడు పథకం ద్వారా స్కూళ్ల రూపురేఖలను మారిస్తే ఈ ప్రక్రియకు మద్దతు ఇవ్వాలి కదా! కమ్యూనిస్టు పార్టీలు ఈ నూతన ప్రభుత్వ రంగ అభివృద్ధిని వ్యతిరేకిస్తూ జగన్‌ను ఓడించాలని చూస్తున్నాయి. ఇది విద్యా, వైద్య రంగంలో పెరుగుతున్న ప్రభుత్వ ఆస్తులను వ్యతిరేకించడం కాదా?

కమ్యూనిస్టులు ఏపీలో ఒకవేళ అధికారంలోకి వస్తే ప్రభుత్వ రంగంలో ఇంగ్లిష్ మీడియంను తీసేసి, ఆ బడులను మూసేసి, విద్యా దోపిడీదారులకు అప్పజెబుతారా? భారతదేశంలో అతి పెద్ద ప్రైవేట్ సెక్టార్, విద్యా రంగం. ప్రైవేట్ రంగంలో ఇంగ్లిష్ విద్య పేరుతో చంద్రబాబు మిత్రబృందం వేల కోట్లు దోచుకుంటుంటే జగన్ ప్రభుత్వం ఆ దోపిడీకి అడ్డుకట్ట వేసే విద్యా విధానాన్ని ప్రవేశపెట్టింది.

కమ్యూనిస్టులు సైతం ప్రభుత్వ రంగ అభివృద్ధిని వ్యతిరేకిస్తూ, మాతృ భాష ప్రాంతీయ వాదానికి తలొగ్గి మళ్ళీ ప్రైవేట్ విద్యా వైద్యానికి ఊడిగం చేస్తే ప్రజలు వీరినెలా నమ్ముతారు? విద్యా, వైద్య రంగాల్లో ప్రైవేటీకరణ వ్యతిరేక మోడల్ ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైంది. దాన్ని చంపెయ్యడానికి కమ్యూనిస్టులు నడుం కడితే ప్రజలు ఏమైపోవాలి?

ఆరెస్సెస్/బీజేపీ నేతృత్వంలో నడిచే కేంద్ర ప్రభుత్వం కేంద్ర స్థాయి పరీక్షలు, సెంట్రల్ యూనివర్సిటీల ఎంట్రన్స్ ఎగ్జామినేషన్లను హిందీ, ఇంగ్లిష్ భాషల్లో మాత్రమే రాయనిస్తున్నది. అంటే క్రమంగా హిందీని దేశపు ఉత్పత్తి కులాల పిల్లల మీద రుద్ది, ధనవంతులకు మాత్రమే ప్రైవేట్ ఇంగ్లిష్ అంతర్జాతీయ జ్ఞాన సంపదను అందుబాటులో ఉంచ చూస్తున్నది. ఈ విద్యా విధానాన్ని ఎలా ఎదుర్కోవాలి? దేశంలోని మొత్తం స్కూలు విద్యను ఎల్‌కేజీ నుండి 12వ తరగతి వరకు ప్రైవేట్ రంగం నుండి ప్రభుత్వ రంగంలోకి మార్చకుండా విద్యా సమానత్వాన్ని సాధించగలమా? దేశంలో విద్యా వ్యవస్థని, కనీసం స్కూలు విద్యా వ్యవస్థనైనా ప్రభుత్వ రంగంలోకి మార్చడానికి ప్రభుత్వ టీచర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, మానవ సమానత్వం కోసం పనిచేసేవాళ్ళు సపోర్టు చెయ్యకపోతే ఎలా?

అంతేకాక ప్రభుత్వ ఉద్యోగులు బీద ప్రజల సంక్షేమం కోసం బడ్జెట్ డబ్బును ఖర్చు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ తమ కుటుంబాల గురించే ఆలోచిస్తే ప్రభుత్వ రంగం కూలిపోక ఏమౌతుంది? ఈ సమస్య చాలా కీలకంగా ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల ముందు ఉన్నది. దేశంలోనే అన్ని రంగాల్ని పెద్ద ఎత్తున ప్రైవేట్ రంగంలోకి నెట్టిన వ్యక్తి చంద్రబాబు నాయుడు. ప్రభుత్వ ఉద్యోగులు, ముఖ్యంగా టీచర్లు ప్రభుత్వ రంగ వ్యతిరేకికే ఓటు వేస్తే జరిగేదేంటి?

గ్రామాలలో పని చేసే ప్రభుత్వ ఉద్యోగులు, ముఖ్యంగా టీచర్లు అట్టడుగు గ్రామీణ శ్రమ జీవుల జీవితాలను మార్చడానికి ప్రభుత్వం ఏమి చేస్తుందో చూసి ఆ ప్రభుత్వాన్ని కొనసాగించాలా వద్దా అని నిర్ణయించుకోవాలి. ఉత్పత్తి రంగంలో పనిచేసే ప్రజల జీవితాలను మెరుగుపర్చే ప్రభుత్వం ఉన్నప్పుడు తమ జీతభత్యాల పెంపుదలతో కొంత రాజీపడాల్సి వస్తే కూడా పడాలి. అది ఒక ఉద్యోగి రాష్ట్రానికి, దేశానికి చేసే మేలు. రాజకీయ నాయకులు దోచుకుంటున్నప్పుడు వారిపై పోరాటం తప్పు కాదు. ఉద్యోగులు హక్కులను, ఆత్మగౌరవాన్ని ఎప్పుడు కూడా తాకట్టు పెట్టకూడదు. అయితే, తమ హక్కుల పోరాటం, ఉత్పత్తి రంగంలో పనిచేసే మానవాళిని ఆకలితో మాడ్చటానికో, బీద పిల్లలు ధనవంతుల పిల్లలతో పోటీపడి ఎదిగే జీవితాన్ని అడ్డుకోవడానికో చెయ్యడం మహానేరం. ఈ మాట 38 సంవత్సరాలు ప్రభుత్వ రంగంలో పనిచేసిన వ్యక్తిగా చెబుతున్నాను. ప్రతి ఉద్యోగి, ఓటరు, పౌరుడు దిక్కు లేని వారికి దిక్కుగా నిలబడాలి. అందుకే 2024 ఎన్నికల్లో వాళ్ళ ఓటు వాళ్ళ జీవిత లక్ష్యాన్ని సూచిస్తుంది.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సంపాదించుకోవద్దా?



లెఫ్ట్ పార్టీల కంటే లెఫ్ట్ పార్టీలా ధ్వనిస్తోంది కాంగ్రెస్. వారసత్వ పన్ను అనేది దారుణమైన ఆలోచన. పైగా సంపాదించే మనుషులు చెడ్డవాళ్లన్న భావన కలిగిస్తున్నారు. కష్టపడి సంపాదించడంలో ఏ చెడూ లేదు. ఇది ఎలాంటి సందేశం ఇస్తున్నదో కాంగ్రెస్ సరిచూసుకోవాలి.

– నిధి రాజ్‌దాన్, కాలమిస్ట్

మంచి ఆలోచనే!



ఎనభై కోట్ల మంది జనాలు రేషన్ మీద బతకాల్సిన పరిస్థితి ఉన్న దేశంలో వారసత్వ పన్ను అనేది చెడ్డ ఆలోచనేమీ కాదు. ఒకవేళ వాళ్ల డబ్బులు దొంగిలిస్తారని ధనికులకు బీజేపీ చెబుతుంటే, ఇండియా కూటమి పేదల దగ్గరికి వెళ్లి దానికి వ్యతిరేకంగా చెప్పాలి.

– అలీశాన్ జాఫ్రీ, జర్నలిస్ట్

మీ వైఖరేమిటి?



వారసత్వ పన్ను లాంటిదేదీ తెచ్చే ఆలోచన కాంగ్రెస్‌కు లేదు. నిజానికి, రాజీవ్ గాంధీ ఎస్టేట్ డ్యూటీని రద్దుచేశారు. చెప్పాలంటే, ఫైనాన్స్ మీద పార్లమెంటరీ కమిటీ చైర్మన్‌గా ఉన్న బీజేపీ ఎంపీ జయంత్ సిన్హా అమెరికా మాదిరి 55 శాతం వారసత్వ పన్ను కోసం గట్టిగా వాదించారు. దీనిమీద ప్రధాని వైఖరేమిటో చెప్పాలి.

– జైరామ్ రమేశ్, కాంగ్రెస్ ఎంపీ


సురక్షితమా?



క్యాన్సర్ కలిగించే క్రిమిసంహారిణి ఎథిలీన్ ఆక్సైడ్ కారణంగా, ఎండీహెచ్, ఎవరెస్ట్ మసాలా వారి నాలుగు ఉత్పత్తులను సింగపూర్, హాంగ్‌కాంగ్ నిషేధించాయి. గత కొన్ని వారాల్లోనే మనకు బోర్న్‌వీటా వివాదం, నెస్లే సెరెలాక్ వివాదం, పతంజలి వివాదం, ప్రొటీన్ పౌడర్ స్కామ్ జరిగాయి. మనం ఆహార సంక్షోభంలో ఉన్నామనేది స్పష్టం.

– రేవంత్ హిమత్‌సింగ్కా, ఫుడ్ యాక్టివిస్ట్

ఉండకూడని విషం



గర్వం అనేది శక్తిమంతమైన విషం: మంచితనంతో నిండిన పూర్తి జీవితాన్ని కూడా ఒక్క చుక్క పాడు చేయగలదు. ఒక మనిషి పర్వత మంతటి మంచి పనులు చేసివుండొచ్చు, కానీ వాటిని మనం ప్రశంసల కోసమే చేసివుంటే, మనల్ని మనం ధర్మశీలురమని చెప్పుకోలేం.

– పోప్ ఫ్రాన్సిస్, మత గురువు

ఇన్ బాక్స్

ఎన్‌కౌంటర్ల పేరిట ఊచకోత?

2024 ఎన్నికలను మావోయిస్టు రహిత భారత్‌లో జరుపుతామని ప్రకటించి విఫలమైన కేంద్రంలోని భాజపా పాలకులు ఎన్నికలలో ఓట్ల సాధనే ధ్యేయంగా నక్సల్స్ అణచివేత క్యాంపెయిన్ పేరుతో ఆదివాసీలను హత్య చేస్తున్నారు. ఇటీవల కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాట్లాడుతూ జనవరి నుండి ఏప్రిల్ 14వ తేదీ వరకు మన దేశ భద్రతా బలగాలు జరిపిన దాడులలో 79 మంది మావోయిస్టులు చనిపోయారనీ మళ్ళీ భాజపాకు అధికారం ఇస్తే రానున్న రెండేళ్లలో నక్సలైట్లను దేశంలో పూర్తిగా నిర్మూలిస్తామనీ తెలిపారు. దండకారణ్య ప్రాంతంలో భద్రత బలగాల చేతిలో చనిపోతున్న మావోయిస్టులలో నూటికి తొంబై మంది ఆదివాసీలే వుంటున్నారు. అంతే కాదు, చనిపోయిన మావోయిస్టులంతా ఈ దేశ వాసులు. వీరంతా తమ అస్తిత్వ సమస్యల పరిష్కారానికి నక్సలిజంను మార్గంగా ఎంచుకున్నవారే. దేశంలో ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఆకలి, పేదరికం, నిరుద్యోగం వంటివి దేశాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. ఇండియాలో నాణ్యమైన ఆహారం దొరకక ఏడాదికి 17 లక్షల మంది చనిపోతున్నారని అధ్యయనాల్లో తేలింది.


దేశంలో సమస్యలు ఏవీ లేనట్లు నక్సలిజమే పెద్ద సమస్య అన్నట్లుగా మానవ హక్కుల ఉల్లంఘనకు కేంద్ర పాలకులు పాల్పడుతున్నారు. ఛత్తీస్‌గఢ్–తెలంగాణ–మహారాష్ట్ర–మధ్యప్రదేశ్–జార్ఖండ్ రాష్ట్రాల సరిహద్దు అటవీ ప్రాంతాల్లో ఆపరేషన్ కగార్, సూర్య శక్తి, అంతిమ దశ పేరుతో షెడ్యూల్ ఐదు ఏజెన్సీ ప్రాంతాల్లో కూంబింగ్ చేస్తూ ఎన్‌కౌంటర్ల పేరిట ఆదివాసీల ఊచకోతకు పాల్పడుతున్నారు. ఆదివాసీల నివాస ప్రదేశాలలో, పని ప్రదేశాలలో ఎయిర్ బాంబింగ్ వైమానిక దాడులు చేస్తున్నారు. ఈ ఐదు రాష్ట్రాల ఆదివాసీ ప్రజలు ఏనాడు కూడ మాకు మావోయిస్టులతో ఇబ్బందిగా వుందని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఫిర్యాదు చేయలేదు. వారు తమ గ్రామాలలో బహుళజాతి సామ్రాజ్యవాద కంపెనీలు చేస్తున్న అక్రమ మైనింగ్‌పై ఫిర్యాదు చేశారు. వారికి చెందాల్సిన రాజ్యాంగ హక్కులు అమలు చేయాలని మాత్రమే అడిగారు. మరి కేంద్ర రాష్ట్ర పాలకులు అనాదిగా ఆదివాసీలు లేవనెత్తుతున్న సమస్యలు పరిష్కరించకుండా ఎన్‌కౌంటర్ల పేరుతో వారినే చంపడం, అడవి తల్లి ఒడిని రక్తసిక్తం చేయడం ఎవరి మెప్పుకోసం?

నేడు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఆదివాసీల బ్రతుకులు ఛిద్రం అవుతున్న సందర్భంలో పొట్ట చేత పట్టుకొని సొంత నేలను విడిచి ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. దేశ వ్యాప్త సార్వత్రిక ఎన్నికల వేళ ప్రజల దృష్టిని మరల్చడం కోసం 'ఆపరేషన్ కగార్' దాడులు పాలకులు జరిపించారనడం అతిశయోక్తి కాబోదు. నక్సలైట్ల ఆచరణతో మాకు ఏకీభావం లేనప్పటికీ వారు లేవనెత్తుతున్న ప్రజల సమస్యలను మాత్రం చర్చించ దగినవని భావిస్తున్నాం. విద్యార్థులుగా మేము పాలకుల ముందు ప్రతిపాదిస్తున్న అంశాలు: మధ్య భారతంలో యుద్ధం నిలిపివేసి శాంతి నెలకొల్పాలి. ఐదవ షెడ్యూల్ అటవీ ప్రాంతాలలో పోలీసు క్యాంపులు ఎత్తివేసి సైన్యాన్ని వెనక్కి పిలవాలి. మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలి. ఆదివాసీల హక్కులను రక్షించి వారి సమస్యలను పరిష్కరించాలి. ఆదివాసులకు జల్, జంగల్, జమీన్‌లపై అధికారం ఇవ్వాలి.

– ప్రశాంత్ పగిళ్ళ, స్టూడెంట్స్ ఫర్ పీస్ అండ్ లిబర్టీ కన్వీనర్, ఓయూ

వలస జీవుల పిల్లల మాటేమిటి?

అభిప్రాయం



డా॥ టి. సంపత్ కుమార్

తెలంగాణ రాష్ట్రం నుండి సుమారుగా పదిహేను లక్షల మంది గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్నారు. వీరంతా గల్ఫ్ దేశాల లేబర్ మార్కెట్ అవసరాలకు సరిపడే వయస్సులో (18–45 సంవత్సరాలు) ఉన్నవారు. అంటే పెళ్లిచేసుకొని కొన్ని వారాలైనా కాని వారి నుంచి పిల్లా పాపలు కలిగిన కుటుంబ బాధ్యతలు నిండుగా ఉన్న వారి వరకూ ఇందులో ఉంటారు. ఈ వలస పోయినవారిలో పాఠశాలల్లో చదువుకొనే పిల్లలున్న తండ్రులు వేలల్లోనే ఉంటారు. తండ్రులు సంవత్సరాల కొద్దీ ఇంటిపట్టున లేకపోవడంతో ఇక్కడ ఉన్న కుటుంబాలపై ఆ ప్రభావం పలు రకాలుగా ఉంటోంది.

మన తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల పాఠశాలల్లో జరిగే పేరెంట్స్ మీటింగ్స్‌లో పాల్గొనడానికి తల్లిదండ్రులు ఉత్సాహం చూపరు. ప్రత్యేకంగా జరిపే ఈ సమావేశాలు తక్కువ హాజరు లేదా ఎవరూ రాని పరిస్థితులు కూడా ఎదురై పాఠశాల యజమాన్యం కాని, పాఠశాల నిర్వహణ కమిటీలు కాని దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటాయి. తల్లిదండ్రులు ఇద్దరూ కలిసి మీటింగులకు హాజరు కావడం, పిల్లల చదువుల గురించి ఉపాధ్యాయులతో చర్చించడమనేది అరుదైన విషయం. ఎక్కువ మటుకు తండ్రులే నామమాత్రానికి వచ్చి వెళ్లిపోతారు. పిల్లల చదువుల గురించి పూర్తి లాభాల్ని పొందడానికి సంసిద్ధతతో రారు. తల్లుల పాత్ర తక్కువే ఉంటుంది. అంతా తండ్రులకే తెలుసన్న ధోరణిలో గ్రామీణ తెలంగాణలో జీవితాలు సాగుతాయి. అన్ని కారణాలు ఏకమై పిల్లల చదువులు నిరాసక్తంగా సాగడానికి దారితీస్తున్నాయి.

ఇలాంటి నేపథ్యంలో మగవారు (కుటుంబ పెద్దలు) గల్ఫ్ దేశాలకు వెళ్ళిన కార్మిక కుటుంబాల్లో పిల్లల చదువులు బాగా దెబ్బ తింటాయి. వలస కార్మికుల భార్యలు మీటింగులకు వెళ్లరు. జీవన భారంతో వారు వెళ్లలేని పరిస్థితుల్లో ఉంటారు. కుటుంబం నుండి ఎలాంటి పర్యవేక్షణ లేకపోవడంతో పిల్లలు ఎలా చదువుతున్నారు, పాఠశాలలకు సక్రమంగా వెళుతున్నారా, ఏమైనా దురలవాట్లకు షికారవుతున్నారా అన్న విషయాలు కూడా తెలియని అంధకారంలో పడిపోతారు. తల్లులు ఎక్కువ చదువుకోక పోవడంతో ఇంటివద్ద పిల్లల చదువుల పెరుగుదలకు తోడ్పడని వాతావరణం ఉంటుంది. అందువల్ల పిల్లల చదువులు కుంటుపడతాయి. ఒకవేళ తల్లులు మందలించినా, పిల్లలు పితృస్వామ్య సంస్కృతికి అలవాటుపడ్డారు కావున తల్లుల మాటల్ని ఖాతరు చెయ్యరు. మగమనిషి లేకపోవడంతో ఇంటి, వ్యవసాయ, పశుపక్ష్యాదుల భారాలు భార్యపై పడడంతో కార్మికుల భార్యలు ఇరకాటంలో పడి బతుకు బండిని లాక్కెళుతుంటారు. దీని ఆసరాతో పిల్లల్లో క్రమశిక్షణ లోపించి చదువుల పట్ల ఆసక్తి తగ్గిపోతుంది. బట్టల్లో, ప్రవర్తనల్లో, హోమ్ వర్క్‌లో గణనీయమైన మార్పు కనబడి టీచర్లకి సవాళ్ళుగా నిలుస్తారు.



తండ్రులు చదువుల్లేక నానా కష్టాలు పడి అప్పులు చేసి గమ్యం తెలియని పనులకు కార్మికులుగా వెళ్ళే విషయాలు తెలిసినా, పిల్లల్లో పట్టుదల కనబడదు. బాగా చదువుకొని తండ్రిని మించిన కొలువులు సంపాదించాలన్న సంకల్పాలు అసలే కనబడవు. ''బాగా చదువుకోరా... చదువుకోకుంటే ఎలా బతుకుతావురా?'' అని ఒక టీచర్ ఓ విద్యార్థిని మందలిస్తే, పిల్లాడు వెంటనే ''మా నాన మాదిరిగా దేశం బోతా...'' అని ఠక్కున సమాధానమిచ్చాడని ఓ టీచర్ బాధతో అన్నారు. ఇలాంటి ప్రవర్తనలను నిర్మూలించి, చదువుల పట్ల ఆసక్తులను పెంచే మార్గాలను వెతకాలి. అప్పుడే ఒక తరం ముందుకు వెళుతుంది. కుటుంబాలు ఆర్థికంగా ఎదుగుతాయి.

గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ఒక ప్రత్యేక బోర్డ్‌ను ఏర్పాటు చేస్తామన్న నిర్ణయాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి కొన్ని రోజుల క్రితం ప్రకటించడం ఊరట కలిగిస్తోంది. ఆలస్యంగానైనా ఎన్నికల ముందు ఈ నిర్ణయాన్ని ప్రకటించి ఆశలకు చిగురు తొడిగారు. ఏళ్లనుండి పేరుకొన్న సమస్యలకు సమాధానమన్న ఆశాభావాన్ని కలిగిస్తోంది ఈ ప్రకటన. ప్రతిపాదించిన అధ్యయనంలో జెండర్ విషయాలను లోతుగా పరిశీలించి కార్మికులు గల్ఫ్ దేశాలకు వెళ్లిపోయాక ఇంటి బాధ్యతలను నిర్వహించే మహిళలకు వ్యక్తిత్వ వికాసంతో పాటు ఉపయుక్తమైన శిక్షణ కార్యక్రమాల ద్వారా ఇంటి పనులనూ, పిల్లల చదువులనూ సమర్థవంతంగా నిర్వహించేటట్టుగా చూడాలి. వారి ఇంటి నుండి వెళ్ళిన కార్మికుల సంపాదన–కష్టాలకు అర్థం చేకూరి ఒక తరం ముందుకు ఎదిగేట్టుగా చూడాలి. అప్పుడే వలస కార్మికుల కష్టార్జితానికి వన్నె వస్తుంది.

వ్యాసకర్త ఢిల్లీలోని కెనడియన్ హై కమీషన్ మాజీ సీనియర్ సలహాదారు

పూజ–ఆచార వ్యవహారాలు

ఆచార పద్ధతులు, ధ్యానము, 'నేను ఎవరిని?' అని తెలుసుకొనుటకు ప్రయత్నించటం, దివ్యనామ సంకీర్తనం, ఏ విధంగా ఆత్మాన్వేషణకు తోడ్పడతాయో... అదే విధంగా ఆచార వ్యవహారాలు, పూజ కూడా తోడ్పడతాయి. మానవులకు సుఖశాంతులను అనుగ్రహించుటలో పూజలు, హోమాలు, ఉపవాసాలు, అన్నదానం వంటివి చాలా ముఖ్యమైనవి.

నిరాకారుడైన దేవుని ఒక విగ్రహంగా లేక సాలిగ్రామంగా లేక శివలింగంగా పూజించడం సంప్రదాయం. నిరాకారాన్ని పూజించడం చాలా కఠినం. అది మందబుద్ధిగలవారికి ఉపద్రవం తెచ్చిపెడుతుంది. కనుక భగవంతుని నిరాకారునిగా కాకుండా, సాకారునిగా పూజించడం సులభం. ఈ విధానంలో భక్తుడు తన మనస్సును దేవునిపై లగ్నము చేసుకోవచ్చు. ఆధ్యాత్మిక విషయాలన్నీ చిత్తాన్ని పరమాత్మునిలో ఐక్యం చేయాలని తెలుపుతున్నాయి.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

జీవితంలో సుఖ, సంతోషాలు పొందటానికి తనకు తానుగా నియమ నిబంధనలను విధించుకోవడం ప్రతి వ్యక్తికీ ఎంతైనా అవసరం. నియమ నిబంధనలు ఉన్నప్పుడే ఏ విషయానికైనా సంపూర్ణత్వం సిద్ధిస్తుంది. మానవ శరీరం ఒక దేవాలయం. మనస్సు సహజంగానే చంచలమైంది. శరీరం, మనస్సులను ఉన్నతమైన జీవిత సూత్రాలకు లోబడి ఉండేట్లు చేయాలి. ఆ విధంగా చేసినప్పుడు అవి క్రమంగా, నెమ్మదిగా నిర్మలమవుతాయి.

నిర్మలత్వాన్ని పొందటానికి ఆధ్యాత్మిక పరమైన ఆచరణలు ఉన్నాయి. అటువంటివాటిలో నామసంకీర్తన, పూజ, హోమం, శాస్త్ర పఠనం, ప్రాణాయామం, యోగాసనాలు వంటివి కొన్ని. ఏ వ్యక్తి స్వభావానికి ఏది సరిపోతుందో, దానిని అనుసరించి హృదయపూర్వకంగా సాధనచేయడం ప్రారంభించాలి. ఇటువంటి సాధనను పట్టుదలతో కొనసాగిస్తే మనస్సు, శరీరం క్రమంగా శుద్ధమవుతాయి. అందువల్ల ఆత్మానుభవాన్ని పొందడానికి మార్గం ఏర్పడుతుంది.

ఆధ్యాత్మిక జీవనంలో 'సత్సంగం' కూడా ముఖ్యమైనదే. దివ్యనామ సంకీర్తన, దేవుని అనంత మహిమలను కీర్తించుట, ఆధ్యాత్మిక సంబంధమైన విషయాలను గూర్చి సుదీర్ఘ సంభాషణలు వంటివి సత్సంగంలోని కొన్ని ముఖ్య లక్షణాలు. ఇటు, అటు తిరుగాడెడి మనస్సును భగవంతునివైపు మళ్ళించడానికి సత్సంగం దోహదపడుతుంది. చాలా మంది శాస్త్రాలు చదివి అర్థం చేసుకొనే శక్తిలేనివారు ఉన్నారు. లేదా వ్యక్తిగతంగా ఆధ్యాత్మిక విషయాలందు ఆసక్తి చూపించలేకపోతున్నారు. అటువంటివారు తమ మనస్సును భగవంతునిపై లగ్నం చేసుకోవడానికి సత్సంగం ఒక ప్రభావశాలియైన మార్గం.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** బ.పాడ్యమి ఉ.5.39 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** విశాఖ రా.1.24 వరకు, తదుపరి అనూరాధ, **వర్జ్యం:** ఉ.5.53 నుండి 7.33 వరకు, తదుపరి తె.5.35 నుండి 7.15 వరకు,
దుర్ముహూర్తం: ఉ.9.52 నుండి 10.40 వరకు, తదుపరి ప.2.56 నుండి 3.44 వరకు, **అమృత ఘడియలు:** ప.3.55 నుండి 5.36 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.42, **సూర్యాస్తమయం:** 6.13.



శ్రీకాకుళం జిల్లా అక్కవరం వద్ద నిర్వహించిన మేమంతా సిద్ధం సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం

జగన్ మార్కుతో సమాజం 'సిద్ధం'

58 నెలలుగా విప్లవాత్మక మార్పులు తెస్తూ చేస్తున్న యుద్ధమే ఈ "సిద్ధం": అక్కవరం సభలో ఏపీ సీఎం జగన్

సాక్షి, శ్రీకాకుళం: "ఇంటింటి అభివృద్ధిని కాపాడుకునేందుకు సిక్కోలు సింహాలు ఇవాళ ఇక్కడకు కదలివచ్చాయి. ఈ విప్లవ గడ్డపై ఆ పెత్తందార్ల ముఠాపై ఎగురవేస్తున్న తిరుగుబాటు బావుటా కనిపిస్తోంది. రాయలసీమ నుంచి ఉత్తరాంధ్ర వరకు అడుగడుగునా జన సముద్రమే. వైఎస్సార్ జిల్లా నుంచి శ్రీకాకుళం వరకు దారి పొడవునా జన సునామీని చూస్తుంటే 25 ఎంపీలకు 25 ఎంపీలు, 175 అసెంబ్లీ స్థానాలకు 175 అసెంబ్లీ స్థానాలు మొత్తంగా డబుల్ సెంచరీ కొట్టేందుకు మీరంతా సిద్ధమేనా?" అని ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. 22 రోజుల పాటు సాగిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర ముగింపు సందర్భంగా బుధవారం శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం అక్కవరం వద్ద నిర్వహించిన భారీ బహిరంగ సభలో సీఎం జగన్ ప్రసంగించారు. ఆ వివరాలివీ..



బలమైన పునాదులతో..

ఇంటింటి భవిష్యత్తు, పథకాల కొనసాగింపును నిర్ణయించే ఎన్నికలు మరో 18 రోజుల్లో జరగనున్నాయి. ఇవి కేవలం ఎమ్మెల్యేలు, ఎంపీలను ఎన్నుకునేవి మాత్రమే కాదు. ఈ 58 నెలల కాలంలో బలమైన పునాదులతో పేదల కోసం తెచ్చిన పలు సంస్కరణలు, పథకాలు కొనసాగాలా? వద్దా? అనేది నిర్ణయించే ఎన్నికలు. జగన్‌కు ఓటు వేస్తేనే పథకాలన్నీ కొనసాగుతాయి. చంద్రబాబుకు ఓటేయమంటే పథకాలన్నింటికీ ముగింపే. మళ్లీ మోసపోవటమే. జగన్‌ను ఓడించాలని వాళ్లు.. పేదలను గెలిపించాలని మనం తలపడుతున్న ఈ యుద్ధంలో మరో చారిత్రక విజయాన్ని సొంతం చేసుకునేందుకు మీరంతా సిద్ధమేనా? మంచి చేసిన చరిత్రగానీ, పేదల ఆశీస్సులుగానీ లేని ఆ మూడు పార్టీల కూటమి, వారి మోసాలకు చెంప ఛెళ్లుమనేలా సమాధానం చెప్పేందుకు మీరంతా సిద్ధమేనా?

మీ గుండె చప్పుడే "సిద్ధం"

పొత్తుల జిత్తులు, జత కట్టిన జండాలకు బదులిస్తూ జగన్ వెనుక ఎన్ని కోట్ల మంది పేదలున్నారో చూపిస్తే అదే.. సిద్ధం! సామాన్యులు, పేదల గుండె చప్పుడే ఈ సిద్ధం. ఇడుపులపాయలో మొదలై ఇచ్ఛాపురం వరకు సాగిన ఈ బస్సు యాత్ర మన పార్టీ జైత్రయాత్రకు సంకేతం. ఇది మూడు నాలుగు నెలల క్రితం మొదలు పెట్టింది కాదు. ఓ 25 సభలతో వచ్చింది కాదు. మనందరి ప్రభుత్వం 58 నెలలుగా విప్లవాత్మక మార్పులు తెస్తూ చేస్తున్న యుద్ధమే ఈ సిద్ధం.

ఆ చైతన్యం పేరే..

ఇక్కడ నిర్వహిస్తున్న సభ పేరు మాత్రమే కాకుండా మరో ఐదేళ్లు ఈ మార్పులన్నీ కొనసాగాలని ఇంటింటికీ వెళ్లి వారు మరో వంద మందికి వివరించాల్సిన అవసరాన్ని చెప్పే అవసరమే ఈ సిద్ధం! మీకు మంచి జరిగి ఉంటే.. మీ ఇంటికి మంచి జరిగి ఉంటే మీ బిడ్డకు మీరే సైనికులుగా నిలవాలని ప్రజలను కోరే ధైర్యమే సిద్ధం! ఎన్నికలు కాగానే మేనిఫెస్టోను చెత్తబుటలో పారేసే చంద్రబాబు సంస్కృతిని సమాధి కట్టి 99 శాతం వాగ్దానాలను నెరవేర్చి ఇంటింటికీ మళ్లీ ఆ మేనిఫెస్టోను పంపి ఎన్నికల వాగ్దానాలపై చేసిన చైతన్యం పేరే సిద్ధం! పేదలు, అక్కచెల్లెమ్మలను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా సాధికారత దిశగా చెయ్యి పట్టుకుని నడిపించే ఘటమే ఈ సిద్ధం! ఇంతగా సిద్ధమైన సమాజంతో, మీ జగన్ పార్టీతో యుద్ధానికి బాబు మరో మూడు పార్టీలతో పొత్తు పెట్టుకోవాల్సి వస్తోంది. పరోక్షంగా కూడా పొత్తులు వెతుక్కోవాల్సి వస్తోంది. కుట్రలకు దిగజారాల్సి వస్తోంది. నాలుగు మంచి పనులు చేశానని చెప్పలేని చంద్రబాబు రోజూ నన్ను తిట్టడం, తిట్టించడం, వారి ఛానళ్లు, పత్రికల్లో అదో ఘనకార్యమన్నట్లుగా చూపిస్తున్నారు. ఇది గొప్ప రాజకీయం అవుతుందా?

ఏనాడైనా ఆత్మవిమర్శ చేసుకున్నారా?

మన ప్రభుత్వం వల్ల పేదల కుటుంబాల్లో, వారి చదువుల్లో, అక్కచెల్లెమ్మల సాధికారతలో, అవ్వాతాతలకు అందిన మనశ్శాంతిలో, రైతన్నలకు అందిన ఆత్మస్థైర్యంలో, సామాజిక వర్గాలకు దక్కిన ఆత్మగౌరవంలో ఎంత మార్పు తీసుకురాగలిగామో టీడీపీ, చంద్రబాబు, ఆయనకు దరువు వేసే ఎల్లో మీడియా ఏనాడైనా కనీసం ఆత్మవిమర్శ చేసుకోవడం చూశారా? ఇలాంటి వారికి పరిపాలన ఇవ్వడం అంటే అర్థమేమిటి? ప్రభుత్వం అనేది ఎవరి కోసం? అందమైన వాగ్దానాలతో అధికారం లాక్కుని ఐదేళ్లు వంచించటానికి, లూటీ చేసి దోచుకోవడం, దోచుకున్నది పంచుకోవడం, దాచుకోవడం కోసమే వారికి అధికారం కావాలని అడుగుతున్నారు.

వ్యత్యాసాన్ని తుడిచి వేస్తూ..

పిల్లలెవరకూ తమ కులం, మతం, ఆర్థిక పరిస్థితుల వల్ల మంచి చదువులు చదువుకోలేకపోయామని బాధపడేందుకు వీల్లేని సమ సమాజాన్ని మీ బిడ్డ నిర్మిస్తున్నాడు. ధనికులు, పేదలకు వేర్వేరు చదువులు అనే వ్యత్యాసాన్ని మీ బిడ్డ తుడిచి వేస్తున్నాడు. ఒక రైతు, ఒక కూలీ, చిరు వ్యాపారి, పేద కుటుంబం, నిరుపేద సామాజిక వర్గం.. ఇలా ప్రతి ఒక్కరూ ఈ ప్రభుత్వం నా కుటుంబానికి మంచి చేసిందని, ఆ మంచిని కొనసాగిస్తుందనే నమ్మకాన్ని ఇవ్వగలిగే పరిపాలనను 58 నెలలుగా అందిస్తున్నాడు.

బాబు రోల్డ్ గోల్డ్ దుకాణం..

మీ బిడ్డ కరోనా కష్టంలో కూడా సాకులు వెతుక్కోలేదు. ఏ ఒక్క పథకాన్నీ, బటన్లు నొక్కటాన్ని ఆపలేదు. పేదవారి కష్టం తన కష్టం కంటే ఎక్కువని భావించాడు. మీ జగన్ స్వచ్ఛమైన మనసుతో, మంచి చేశాననే ఆత్మవిశ్వాసం, ఆత్మ సంతృప్తితో మీ ముందు సవినయంగా తలెత్తుకుని నిలబడ్డాడు. 2014 ఎన్నికల్లో కూడా చేయలేని ఏ వాగ్దానాలనూ మేనిఫెస్టోలో మీ బిడ్డ చెప్పలేదు. రాష్ట్ర ప్రజలు, నమ్ముకున్న వారిని ఎన్నటికీ మోసం చేయడు. బాబు మాదిరిగా రోల్డ్ గోల్డ్ దుకాణం తెరవడు. దాన్ని బంగారం అని నమ్మించే యత్నం చేయడు. చంద్రబాబు నిర్వహించే వాగ్దానాల వేలంలో మీ బిడ్డ పాల్గొనడు. 14 ఏళ్ల అధికారంలో ఉండీ ఏ ఒక్క మంచి పని చేయని చంద్రబాబుతో మీ బిడ్డ పోటీ పడడు. మీ జగన్ మార్కు ఇవాళ ప్రతి పేద ఇంట్లోనూ కనిపిస్తుంది. ప్రతి అక్కచెల్లెమ్మ చిరునవ్వులో, అవ్వాతాతల ఆనందంలో కనిపిస్తుంది. మీ జగన్ మార్కు ప్రతి గ్రామంలోనూ కనిపిస్తుంది. జగన్‌కు పేదలపై ఉన్నంత ప్రేమ ఈ దేశ రాజకీయ చరిత్రలో మరే నాయకుడికీ లేదు, ఉండదు. ఇది నిజం. ఇది మాత్రమే నిజం.

సమాజాన్ని సిద్ధం చేశామిలా..

"సమాజంలో ప్రతి రంగాన్ని మీ బిడ్డ ప్రభుత్వం అధికారం దక్కిన మొదటి రోజు నుంచే ఎలా సిద్ధం చేసిందో మీరే గమనించాలని కోరుతున్నా. రాష్ట్రంలో ఎప్పుడూ చూడని మార్పులతో గ్రామస్థాయిలో వ్యవసాయ రంగం సిద్ధం! విద్యారంగంలో విప్లవాత్మక మార్పులతో మన గవర్నమెంట్ బడి సిద్ధం! గ్రామస్థాయి నుంచి వైద్య ఆరోగ్య రంగంలో అనేక విప్లవాలతో గవర్నమెంట్ ఆస్పత్రి సిద్ధం! పట్టణాలు, గ్రామాల్లో ఇంటింటికీ సేవలందిస్తున్న వలంటీర్ల వ్యవస్థ సిద్ధం! ఏకంగా 1.35 లక్షల మంది శాశ్వత ఉద్యోగాలతో మన చెల్లెమ్మలు, తమ్ముళ్లు దాదాపు 600 రకాల సేవలందిస్తూ మన గ్రామాల్లో సచివాలయాల్లో సిద్ధం! 58 నెలల్లో గ్రామ స్వరాజ్యం సిద్ధం! పట్టణాల్లో సైతం ఇంటింటికీ పౌరసేవలు సిద్ధం! దేశ చరిత్రలో తొలిసారిగా ఎక్కడా లంచాలు, వివక్ష లేకుండా ఏకంగా రూ.2.70 లక్షల కోట్లు ఇంటింటికీ డోర్ డెలివరీ చేసిన వ్యవస్థ సిద్ధం! టంచన్‌గా ఒకటో తేదీనే ఇంటికే వచ్చి రూ.3,000 పెన్షన్ ఇచ్చే వలంటీర్ల వ్యవస్థ సిద్ధం! ఇదీ మీ బిడ్డ ప్రభుత్వం సమాజాన్ని సిద్ధం చేసిన తీరు"

– టెక్కలి సభలో సీఎం జగన్

నావల్ల కానిది బాబు జేజమ్మ కూడా చేయలేదు..

జగన్ చేయలేని ఏ స్కీమ్‌నూ చంద్రబాబు కాదు కదా.. ఆయన జేజమ్మ కూడా చేయలేదు! మోసాలు, అబద్ధాలతో ఏ స్థాయికైనా దిగజారి పొత్తులు పెట్టుకునే ఆయనతో మీ బిడ్డ పోటీ పడలేడు. నిజాలు, నిజాయితీకి ప్రజలు విలువ ఇస్తారన్న నమ్మకం నాకుంది. బాబు మాదిరిగా నేను మోసపూరిత వాగ్దానాలు చేయను. మోసాన్ని మోసంతోనే జయించాలన్న రాజనీతిని మీ బిడ్డ పాటించడు. మోసాన్ని నిజాయితీతోనే జయించవచ్చని నిరూపించటానికి మీ బిడ్డ సిద్ధం. మరి మీరంతా కూడా సిద్ధమేనా?

మోసాలా.. విశ్వసనీయతా?

మీకు ఎలాంటి నాయకుడు కావాలని అందరినీ అడుగుతున్నా. బాబు లాంటి మోసగాడు కావాలా? జగన్ లాంటి నిజాయితీపరుడు కావాలా? మేనిఫెస్టోలో చెప్పేవన్నీ ఎగ్గొట్టే నాయకుడు అబద్ధాలు, వెన్నుపోట్లు నైజంగా కలిగిన నాయకుడు కావాలా? లేక నోటి నుంచి ఒక మాట వస్తే, మేనిఫెస్టోలో చేరిస్తే తు.చ. తప్పకుండా పాటించే జగన్ లాంటి నాయకుడు కావాలా? సొంత బలం లేక పొత్తుల డ్రామాలాడే నాయకుడు కావాలా? లేక చేసిన మంచిని చూపిస్తూ సింహంలా సింగిల్‌గా వచ్చే నాయకుడు కావాలా? మోసాలు చేసే చంద్రబాబు కావాలా? విశ్వసనీయతతో నిలబడే జగన్ కావాలా? తమ నాయకుడి గురించి కాలర్ ఎగరేసి గర్వంగా ఇంటింటికీ చెప్పుకోగలిగిన మీ బిడ్డ కావాలా? చెప్పిన మాటలు గాలికి వదిలేసే బాబు కావాలా?

వ్యవస్థలు బాగుండాలంటే..

మోసాలు, అబద్ధాలతో పోరాడుతూ రాష్ట్రం, పేదల భవిష్యత్తును కాపాడుకునే ఈ యుద్ధానికి మీరంతా సిద్ధమేనా? సిద్ధమైతే వారి చీకటి యుద్ధాన్ని, ఆ ఎల్లో మీడియా అసత్యాల యుద్ధాన్ని ఎదుర్కొనేందుకు సెల్‌ఫోన్లలో టార్చిలైట్లను వెలిగించండి. వలంటీర్లు మళ్లీ మన ఇంటికే రావాలన్నా, పేదలకు పథకాలన్నీ కొనసాగాలన్నా, లంచాలు, వివక్ష లేని పాలనతో ముందుకు పోవాలన్నా, మన వ్యవస్థలన్నీ బాగుండాలన్నా ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాల్లోనూ గొప్ప మెజార్టీతో గెలిపించాలి.

మన అభ్యర్థులను ఆశీర్వదించండి

ఎంపీ అభ్యర్థి తిలక్, టెక్కలి నుంచి శ్రీను, ఆముదాలవలస నుంచి తమ్మినేని సీతారామ్, పలాస నుంచి డాక్టర్ అప్పలనాయుడు, పాతపట్నం నుంచి శాంతమ్మ, ఇచ్ఛాపురం నుంచి విజయమ్మ, నర్సీపట్నం నుంచి ధర్మాన కృష్ణదాస్, శ్రీకాకుళం నుంచి ధర్మాన ప్రసాదరావును ఆశీర్వదించి గెలిపించాలని కోరుతున్నా.

జస్టిస్ రామలింగేశ్వర్‌రావుకు ఫుల్‌కోర్టు నివాళి

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు దివంగత న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావుకు ఫుల్ కోర్టు బుధవారం ఘనంగా నివాళులర్పించింది. ఆయన సేవలను స్మరించుకుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే నేతృత్వంలో సాయంత్రం ఫుల్ కోర్టు భేటీ అయి 2 నిమిషాలు మౌనం పాటించింది. వృత్తిపై నిబద్ధత, అంకితభావంతో పాటు న్యాయ సూత్రాలను పాటిస్తూ న్యాయవాదిగా, న్యాయమూర్తిగా ఆయన సేవలందించారని వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ, 'ప్రజా ప్రయోజనం, సామాజిక న్యాయానికి సంబంధించిన కేసుల వాదనలో ఆయన దిట్ట. రామలింగేశ్వర్‌రావు వాదించిన సమతా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు గిరిజనుల జీవితాలను కాపాడటమే కాకుండా, పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడింది. ఐక్యరాజ్య సమితి నిర్వహించిన పర్యావరణ కార్యక్రమాల్లోనూ సమతా కేసు ప్రస్తావన రావడం దాని గొప్పతనాన్ని చెబుతోంది. జస్టిస్ రామలింగేశ్వర్‌రావు ఇచ్చిన 13,000కు పైగా తీర్పుల్లో 100 కంటే ఎక్కువ న్యాయ పత్రికలలో ప్రచురితమయ్యాయి' అని వివరించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి, ఏఎస్‌జీ నరసింహాశర్మ, డీఎస్‌జీ గాడి ప్రవీణ్‌కుమార్, పీపీ నాగేశ్వర్‌రావు, ఏఏజీలు ఇమ్రాన్‌ఖాన్, తేరా రజనీకాంత్‌రెడ్డితో పాటు ఇతర కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి, ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎ.రామలింగేశ్వర్‌రావు కూతురిని చూసేందుకు జర్మనీ వెళ్లి గుండెపోటుతో అక్కడే ఈ నెల 5న మృతి చెందిన విషయం తెలిసిందే.

ఎంబీటీ పోటీ లేదు

- ప్రకటించిన పార్టీ అధ్యక్షుడు మాజీదుల్లాఖాన్(ఫర్హత్‌ఖాన్)
- అలాగని మజ్లిస్ పార్టీకి సపోర్టు చేయడం లేదని స్పష్టీకరణ



చార్మినార్: హైదరాబాద్ పార్లమెంట్ స్థానంలో నెలకొన్న కొన్ని ప్రత్యేక రాజకీయ పరిస్థితుల కారణంగా ఈసారి తమ పార్టీ పోటీ చేయడం లేదని ఎంబీటీ అధ్యక్షుడు మాజీదుల్లాఖాన్(ఫర్హత్‌ఖాన్) స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం చంచల్‌గూడలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ నుంచి విరమించుకోవడానికి ఆర్థిక ఇబ్బందులే కారణమన్నారు. తాము పోటీ నుంచి విరమించుకుంటే మజ్లిస్ పార్టీకి అనుకూలంగా ఉన్నామనే సంకేతాలు కూడా సరైనవి కావన్నారు. రాబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో అన్ని డివిజన్ల నుంచి ఎంబీటీ పోటీ చేస్తుందని చెప్పారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఆయా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ వంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామన్నారు.

బీజేపీ గెలవొద్దనే...

బీజేపీని ఓడించడానికే తాము ఈ ఖుర్బానీ ఇస్తున్నామని మాజీదుల్లాఖాన్ వెల్లడించారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజక వర్గం నుంచి ఇప్పటికే బీజేపీ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతోందని.. బీజేపీని తన తండ్రి అమానుల్లాఖాన్ తీవ్రంగా వ్యతిరేకించేవారని..అందుకే బీజేపీ గెలవొద్దనే కారణంతో తాము పోటీ నుంచి విరమించుకుంటున్నట్లు ఆయన స్పష్టం చేశారు. తాము ఎన్నికల బరిలో ఉంటే ముస్లిం ఓట్లు చీలిపోయి తద్వారా బీజేపీకి లాభం చేకూరుతుందన్న వాదనలను కూడా ఆయన కొట్టిపారేశారు. హైదరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి ఇప్పటికే బీజేపీ, మజ్లిస్ పార్టీలు ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నాయని..భారీ ఎత్తున డబ్బు ఖర్చు చేస్తున్న ఆయా పార్టీలకు ధీటుగా తాము ఖర్చు చేయలేమని చెప్పుకొచ్చారు.

ప్రశ్నించే గొంతుకనవుతా

బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్



ఆమనగల్లు: లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదిస్తే పార్లమెంటులో అణగారిన వర్గాల తరఫున ప్రశ్నిస్తానని నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందని ఆయన ఆరోపించారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొన్నారు. జాతీయ రహదారిపై రాజీవ్ చౌరస్తా వద్ద నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ.. అమలుకాని హామీలిచ్చి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. వాటిని పూర్తిచేయడంలో కాలయాపన చేస్తోందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌లకు తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యమని, కారు గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఏపీలో బీజేపీకీ బాబే లీడర్

దేశమంతా మోదీ కా పరివారే.. ఏపీలో మాత్రం చంద్రబాబుకు అప్పగించిన పురందేశ్వరి

- సొంత పార్టీ నేతలను కాదని బాబు అద్దె నాయకులకు పార్టీలో సీట్లు
- కూటమి కట్టినా బీజేపీ సీట్లూ టీడీపీ నేతలకే
- బద్వేలు నుంచి అనపర్తి దాకా ఇదే పరిస్థితి
- టీడీపీ నుంచి బీజేపీలో చేరిన వారి కోసమే ఈ పొత్తులా అంటున్న కమల నాయకులు

ప్రలోభాల 'కూటమి'

- ఓటమి భయంతో అడ్డదారులు తొక్కుతున్న కూటమి అభ్యర్థులు
- ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ భారీ తాయిలాలతో ఓటర్లకు గాలం
- ఓవైపు మద్యం.. ఇంకోవైపు మనీ.. మరోవైపు గిఫ్ట్ బాక్సులు పంపిణీ
- పచ్చనేతల కనుసన్నల్లో భారీగా కర్ణాటక మద్యం డంప్‌లు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

వేటగాళ్ల ఉచ్చుకు రైతు బలి

- పొలం వద్దకు వెళ్లి వస్తుండగా తగిలిన విద్యుత్ తీగ
- అక్కడికక్కడే మృతి చెందిన అన్నదాత
- ప్రాణాలతో బయటపడ్డ మరోరైతు



కృష్ణ(ఫైల్)

మంథని: వన్యప్రాణుల కోసం వేటగాళ్లు అమర్చిన ఉచ్చు కారణంగా పెద్దపల్లి జిల్లా మంథని మండలం బిట్టుపల్లి గ్రామానికి చెందిన జెట్టి కృష్ణ (35) దుర్మరణం పాలయ్యాడు. మరో రైతు త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డాడు. మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బిట్టుపల్లి గ్రామానికి చెందిన కృష్ణ, మరోరైతు తోట మల్లయ్యతో కలసి మంగళవారం సాయంత్రం గ్రామ శివారులోని తమ పొలం వద్దకు వెళ్లారు. పంటలకు అడవి జంతువుల బెడద ఉండడంతో కాసేపు టపాసులు కాల్చి.. అవి పారిపోయేలా చేశారు. ఆ తర్వాత కృష్ణ, మల్లయ్య తిరిగి వస్తున్న క్రమంలో వన్యప్రాణుల కోసం వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగ కాలుకు తగిలి కరెంట్‌షాక్‌తో కృష్ణ అక్కడికక్కడే చనిపోయాడు. కొద్దిగా వెనకాల ఉన్న మల్లయ్య అక్కడే ఆగడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. కృష్ణకు భార్య రాధ, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బంధువుల ఇంట ఆగిన పెళ్లి

బిట్టుపల్లిలో కృష్ణ సమీప బంధువు ఇంట బుధవారం వివాహం జరగాల్సి ఉంది. కాగా, ఆయన మృతితో ఆ వేడుక ఆగిపోయింది. మంగళవారం సాయంత్రం వరకూ పెళ్లికి సంబంధించిన కార్యక్రమాల్లో కృష్ణతోపాటు కుటుంబసభ్యులు, బంధువులు ఆనందంగా పాల్గొన్నారు. తెల్లవారితే పెళ్లి జరగాల్సి ఉంది. అయితే, పొలం వద్దకు వెళ్లిన కృష్ణ విగతజీవిగా ఇంటికి రావడంతో వివాహం ఆగిపోయింది. అన్నిఏర్పాట్లు చేసుకొని సంబురాల్లో ఉన్న కుటుంబ సభ్యులు ఈ ఘటనతో విషాదంలో మునిగారు.

సింగరేణి ఆస్పత్రిలో క్యాథ్‌ల్యాబ్

- గోదావరిఖని ఏరియా ఆస్పత్రిలో రూ.15 కోట్లతో కార్డియాలజీ విభాగం
- సంస్థ సీఎండీ బలరాం వెల్లడి

గోదావరిఖని: గుండె సంబంధిత వ్యాధుల నిర్ధారణ కోసం సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో తొలిసారి గోదావరిఖని ఏరియా ఆస్పత్రిలో కార్డియాక్ క్యాథ్ ల్యాబ్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం వెల్లడించారు. పెద్దపల్లి జిల్లా రామగుండం ఏరియా గోదావరిఖనిలోని సింగరేణి ఏరియా ఆస్పత్రిని ఆయన బుధవారం సందర్శించారు. తొలుత పోస్ట్ ఆపరేటివ్ వార్డ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రూ.15 కోట్ల వ్యయంతో ఆధునిక కార్డియాలజీ విభాగం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా కార్డియాక్ క్యాథ్‌ల్యాబ్ ఏర్పాటుకు అవసరమైన వసతులు పరిశీలిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లోనే క్యాథ్‌ల్యాబ్‌లు ఉన్నాయని, అలాంటి ల్యాబ్ ఈ ప్రాంతంలో అందుబాటులోకి వస్తే.. గుండె సంబంధిత అత్యవసర పరీక్షలు, చికిత్స ఇక్కడే చేయవచ్చని తెలిపారు. సింగరేణి ఉద్యోగులకు అత్యుత్తమ వైద్య సదుపాయాలు కల్పించేందుకు ఖర్చుకు వెనుకాడకుండా అత్యాధునిక సాంకేతికతతో కూడిన ఈ ల్యాబ్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. హైదరాబాద్‌కు ధీటుగా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించేందుకు సింగరేణి ఏరియా ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తామని ఆయన చెప్పారు. ఆర్జీ-1, 2 జీఎంలు శ్రీనివాస్, సూర్యనారాయణ, డీవైసీఎంవో కిరణ్‌రాజ్‌కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పింఛన్‌దారులకు జరిగిన అన్యాయం చెప్తాం

- టీపీసీసీ వికలాంగ విభాగం చైర్మన్ ముత్తినేని వీరయ్య
- విజయసంకల్ప యాత్రను ప్రారంభించిన ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పింఛన్ తీసుకుంటున్న వికలాంగులు, వితంతువులు, వృద్ధులు, ఒంటరి మహిళలు, గీత, చేనేత కార్మికులకు పదేళ్ల బీజేపీ, బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అన్యాయాన్ని తెలంగాణ ప్రజలకు వివరిస్తామని టీపీసీసీ వికలాంగ విభాగం చైర్మన్ ముత్తినేని వీరయ్య వర్మ వెల్లడించారు. తాము ఇప్పుడు ఏం చేశామో కూడా వారికి చెప్తామన్నారు. టీపీసీసీ వికలాంగ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన విజయ సంకల్ప యాత్ర-2ను బుధవారం గాంధీభవన్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ పింఛన్‌దారులకు కాంగ్రెస్ హయాంలోనే న్యాయం జరుగుతుందని, త్వరలోనే పింఛన్ పెంపు హామీ అమల్లోకి వస్తుందని చెప్పారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి పింఛన్‌దారులు కృషి చేయాలని కోరారు. మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ వికలాంగ విభాగం చేపట్టిన విజయ సంకల్ప యాత్ర విజయవంతానికి రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ నేతలు, కార్యకర్తలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పెరిక కుల కార్పొరేషన్ సాధన సమితి నేతలు కోట మల్లికార్జున్‌రావు, దొంగరి వెంకటేశ్వర్లు, వికలాంగ విభాగం నేతలు దేశగాని సతీశ్‌గౌడ్, రజని తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ సౌత్‌జోన్ డీసీపీ సాయిచైతన్య బదిలీ

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ సౌత్‌జోన్ డీసీపీ పి.సాయి చైతన్యపై కేంద్ర ఎన్నికల సంఘం బదిలీ వేటు వేసింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సాయిచైతన్యను ఎన్నికల విధుల నుంచి తొలగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు. డీసీపీని బుధవారం 3 గంటల్లోపే తన కింద ర్యాంకు అధికారికి చార్జి అప్పగించాలని.. వెంటనే డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు సాయిచైతన్యకు ఎన్నికల విధులకు సంబంధించి ఏ డ్యూటీలు వేయొద్దని ఆదేశాల్లో స్పష్టంచేశారు. కాగా, డీసీపీ సాయిచైతన్య ఎంఐఎంకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ బీజేపీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసిన కేంద్ర ఎన్నికల సంఘం ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు తెలిసింది.

ఎమ్మెస్పీ ఇవ్వకుండా కేంద్రం దగా


తెలంగాణ రైతు రక్షణ సమితి

సాక్షి, హైదరాబాద్: రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర నిర్ణయించకుండా కేంద్ర ప్రభుత్వం దగా చేస్తోందని తెలంగాణ రైతు రక్షణ సమితి ఆరోపించింది. రైతుల పెట్టుబడిపై యాభై శాతం అదనంగా ఆదాయం సమకూరేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్వామినాథన్ కమిషన్ సూచించడాన్ని సమితి అధ్యక్షుడు పాకల శ్రీహరి రావు బుధవారం ఒక ప్రకటనలో గుర్తుచేశారు. స్వామినాథన్ సూచించిన మేరకు ఎమ్మెస్పీ ధరలు 2018-19 నుంచి నిర్ణయిస్తున్నామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సైతం చెబుతున్నా.. నిజాయితీగా ఎమ్మెస్పీ నిర్ణయించకుండా రైతులు ఎప్పటికీ కోలుకోలేని దెబ్బతినేలా చేస్తున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ధరల కంటే మరీ తక్కువగా కేంద్రం ఎమ్మెస్పీని నిర్ణయిస్తోందని ఆయన ఆరోపించారు. రైతులను ఆదుకునేలా ధరల నిర్ణయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్‌కు ఆర్‌పీఐ మద్దతు

సాక్షి, హైదరాబాద్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతివ్వనున్నట్టు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ ప్రతినిధులు జన్ను సాంబయ్య, వి.స్వర్ణలత, ఉయ్యాల శోభన్, నక్క భిక్షపతి తదితరులు బుధవారం గాంధీభవన్‌కు వచ్చి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి మద్దతు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ నియోజకవర్గాల్లో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నేత బొజ్జా తారకంతో కాంగ్రెస్ శ్రేణులు కలిసి పనిచేయాలని కోరారు. తమకు మద్దతు తెలిపినందుకు ఆర్‌పీఐ నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వారసత్వ పన్ను.. నచ్చేస్తోంది



- కాంగ్రెస్ నేత శామ్ పిట్రోడా వివాదాస్పద వ్యాఖ్యలు
- తన ఉద్దేశాన్ని తప్పుగా అర్థం చేసుకున్నారని వివరణ

న్యూఢిల్లీ: తమ ప్రభుత్వం వస్తే దేశ సంపదను పునఃపంపిణీ చేస్తామంటూ కాంగ్రెస్ ఇచ్చిన హామీకి మద్దతుగా ఆ పార్టీ నాయకుడు, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ చైర్మన్, సోనియా గాంధీ కుటుంబానికి సన్నిహితుడు అయిన శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ఆయన ఈ నెల 23న ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. అమెరికాలో వారసత్వ పన్ను అమల్లో ఉందని, అలాంటి విధానం మన దేశంలోనూ అమల్లోకి తీసుకొస్తే బాగుంటుందని పరోక్షంగా సూచించారు. ''అమెరికాలో వారసత్వ పన్ను చట్టాన్ని అమలు చేస్తున్నారు. ఉదాహరణకు ఎవరికైనా 100 మిలియన్ల డాలర్ల ఆస్తి ఉండి మరణిస్తే, ఆ ఆస్తిలో కేవలం 45 శాతమే అతడి వారసులకు చెందుతుంది. మిగిలిన 55 శాతం ఆస్తిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది. ఇది నిజంగా ఆసక్తికరమైన చట్టం. ఆస్తులు సంపాదిస్తే సమాజంలో ఇతర ప్రజల కోసం సింహభాగం వదులుకోవాలని ఈ చట్టం చెబుతోంది. సంపాదించిన వ్యక్తికే మొత్తం ఆస్తి చెందదు. దాదాపు సగభాగమే అతడిది అవుతుంది. ఈ చట్టం నాకు నచ్చేస్తోంది'' అని శామ్ పిట్రోడా పేర్కొన్నారు. వాస్తవానికి అమెరికా అంతటా వారసత్వ పన్ను చట్టం అమల్లో లేదు. కొన్ని రాష్ట్రాల్లోనే అమలవుతోంది. తన వ్యాఖ్యలపై దుమారం రేగడంతో శామ్ పిట్రోడా బుధవారం వివరణ ఇచ్చారు. తన ఉద్దేశాన్ని కొందరు తప్పుగా అర్థం చేసుకోవడం దురదృష్టకరమని అన్నారు. 'గోడీ మీడియా' వక్రభాష్యం చెబుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ మేనిఫెస్టోపై ప్రధాని మోదీ చెబుతున్న అబద్ధాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి తన వ్యాఖ్యలకు వక్రీకరించారని ఆరోపించారు. అమెరికా వారసత్వ పన్ను గురించి ఒక ఉదాహరణగా మాత్రమే చెప్పానని వివరించారు.

మాకు ఆ ఉద్దేశం లేదు: జైరామ్

తాజా వివాదంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ స్పందించారు. దేశంలో వారసత్వ పన్ను విధించే ఉద్దేశం కాంగ్రెస్‌కు లేదని బుధవారం తేల్చిచెప్పారు. నిజానికి ఇలాంటి పన్నును ప్రవేశపెట్టాలన్న ఆలోచన ఉన్నట్లు బీజేపీ ప్రభుత్వమే గతంలో వెల్లడించిందని గుర్తుచేశారు. 1985లో ఎస్టేట్ పన్నును అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ రద్దు చేశారని జైరామ్ రమేశ్ తెలిపారు.

చచ్చినా వదలరట!

కాంగ్రెస్ వస్తే వారసత్వ పన్ను • జనం ఆస్తులపై 'పంజా'

మోదీ సంచలన ఆరోపణలు

- ఆస్తుల బదిలీపై పన్ను వేస్తారట
- యువరాజు సలహాదారే చెప్పారు
- బతికున్నా, మరణించినా మోతే
- రిజర్వేషన్లను కాపాడేది మేమే
- ఛత్తీస్, ఎంపీ ర్యాలీల్లో ప్రధాని



అంబికాపూర్/సాగర్: కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వారసత్వ పన్నుతో ప్రజల నడ్డి విరవడం తథ్యమని ప్రధాని నరేంద్ర మోదీ సంచలన ఆరోపణలు చేశారు. బతికున్నంత కాలం ప్రజలను పన్నులతో పీడించడమే గాక మరణించిన తర్వాత కూడా వదలకుండా లూటీ చేసే కుట్రలకు పదును పెడుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ నేత సామ్ పిట్రోడా తాజాగా సంపద పంపిణీ గురించి మాట్లాడుతూ అమెరికాలో అమల్లో ఉన్న వారసత్వ పన్ను గురించి చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శమన్నారు. ''మరణించిన వారి ఆస్తులపైనా కాంగ్రెస్ పంజా (హస్తం గుర్తునుద్దేశించి) విసరనుంది. వారసత్వంగా పిల్లలకు దక్కకుండా లాగేసుకోనుంది. 'జిందగీ కే సాథ్ భీ... జిందగీ కే బాద్ భీ... (బతికున్నప్పుడు కూడా, చనిపోయాక కూడా)'. ఇదే కాంగ్రెస్ నయా దోపిడీ మంత్రం!'' అని ఎల్ఐసీ పాపులర్ స్లోగన్ అన్వయిస్తూ ప్రధాని దుయ్యబట్టారు. ''సమాజంలో సంపద పునఃపంపిణీ అనే ముసుగులో ప్రజల స్థిర చరాస్తులను జీవితాంతమూ, మరణించిన తర్వాతా అడ్డంగా లూటీ చేయడమే కాంగ్రెస్ విధానం. ఆ క్రమంలో చివరికి వారసత్వ ఆస్తులను కూడా వదలిపెట్టడం లేదు. కాంగ్రెస్ తాలూకు ఈ రహస్య అజెండాను, పిట్రోడా వ్యాఖ్యలు బయటపెట్టాయి. మన సామాజిక, కుటుంబ విలువలకు కాంగ్రెస్ పూర్తిగా దూరమైపోయింది. అందుకే ప్రజల జీవితాంతం పొదుపు చేసి తమ వారసులకు అందజేయాలనుకునే సొమ్మును కూడా చట్టబద్ధంగా లాగేసుకోవాలని కుట్ర చేస్తోంది. ఆ పార్టీ చేస్తున్న ఇలాంటి ప్రమాదకర ఆలోచనలన్నీ ఎన్నికల వేళ ఒక్కొక్కటిగా బయటికొస్తున్నాయి'' అని బుధవారం ఛత్తీస్‌గఢ్‌లోని అంబికాపూర్ ఎన్నికల ర్యాలీలో మోదీ తూర్పారబట్టారు. మధ్యప్రదేశ్‌లోని సాగర్, హర్దా ఎన్నికల ప్రచార సభల్లో ఆయన ప్రసంగించారు. ఆయన ఏం మాట్లాడారంటే...

చట్టబద్ధంగా దోచేస్తారు

''మీ (ప్రజల) ఆస్తులను, మీ పిల్లల హక్కులను కాజేయడానికి కాంగ్రెస్ పథకం వేసింది. జనం ఆస్తులను, పిల్లల కోసం జీవితాంతం కష్టపడి పొదుపు చేసుకున్న మొత్తాలను చట్టబద్ధంగా దోచేయజూస్తోంది. మధ్యతరగతి ప్రజలపై, ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకొనేవారిపై మరింత పన్ను విధించాలని కాంగ్రెస్ యువరాజు (రాహుల్) సలహాదారు (పిట్రోడా) అంటున్నారు. గతంలో యువరాజు తండ్రికి కూడా ఆయనే సలహాదారు. కాంగ్రెస్ అధికారంలోకొస్తే తల్లిదండ్రుల నుంచి సంతానానికి వారసత్వంగా వచ్చే ఆస్తులపై కచ్చితంగా పన్ను విధిస్తుంది. అప్పుడిక తల్లిదండ్రుల ఆస్తులు పిల్లలకు బదిలీ కావాలంటే పన్ను కట్టాల్సిందే. బతికున్నంత కాలమూ మీనుంచి వీలైనంతగా పన్నులు పిండుతారు. మరణించాక వారసత్వ పన్ను విధిస్తారు!

ఓబీసీలకు కాంగ్రెసే అతి పెద్ద శత్రువు

''మతపరమైన రిజర్వేషన్ల నుంచి వెనక్కి తగ్గే ఉద్దేశం కాంగ్రెస్‌కు లేదు. అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను తగ్గించి, స్వీయ రాజకీయ లబ్ధి కోసం మరో వర్గానికి వర్తింపజేస్తుంది. ఇందులో సందేహం లేదు. కర్ణాటకలో గతంలో కాంగ్రెస్ హయాంలో రాజ్యాంగానికి, అంబేడ్కర్ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా మతాధారంగా రిజర్వేషన్లు అమలు చేశారు. అక్కడ బీజేపీ అధికారంలోకి అవి రద్దయ్యాయి. కొన్ని నెలల క్రితం కర్ణాటకలో మళ్లీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పెద్ద పాపం చేసింది. ముస్లింల్లోని అన్ని వర్గాలను ఓబీసీ కేటగిరీలో చేర్చి దొడ్డిదారిన రిజర్వేషన్లు ఇచ్చేసింది. దీనివల్ల ఓబీసీ కేటగిరీలోని ఇతర కులాలకు అన్యాయం జరుగుతోంది. కాంగ్రెస్ ఆడుతున్న ఈ ప్రమాదకరమైన ఆటతో భవిష్యత్తు తరాలు నాశనమవుతాయి. దేశమంతటా కర్ణాటక మోడల్ అమలు చేయడానికి కుట్ర పన్నింది''

రాజ్యాంగమంటే కాంగ్రెస్‌కు లెక్కలేదు

''ఎన్నికల్లో నెగ్గడానికి ఓటు బ్యాంకు రాజకీయాలనే నమ్ముకున్న కాంగ్రెస్ పార్టీ మతాధారితంగా రిజర్వేషన్లు అమలు చేయాలని భావిస్తోంది. దేశంలో కాంగ్రెస్ నేతృత్వంలో బలహీన ప్రభుత్వం అధికారంలోకి రావాలని కొన్ని శక్తులు కోరుకుంటున్నాయి. బలమైన ప్రభుత్వముండి దేశం స్వావలంబన సాధిస్తే తమ దుకాణం మూతపడుతుందని ఆ శక్తులు భయపడుతున్నాయి. కాంగ్రెస్‌ది ముమ్మాటికీ ముస్లిం లీగ్ ఆలోచనా ధోరణే. ఆ పార్టీ మేనిఫెస్టో ముస్లింలీగ్ సిద్ధాంతాలకు నకలు. మతాధారంగా రిజర్వేషన్లు ఉండొద్దని రాజ్యాంగాన్ని రూపొందించేటప్పుడు అంబేడ్కర్ భావించారు. దళితులకు, గిరిజనులకే రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించారు. కానీ రాజ్యాంగాన్ని, అంబేడ్కర్ ఆశయాలను కాంగ్రెస్ లెక్కచేయడం లేదు. కొన్నేళ్ల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మతాధారంగా రిజర్వేషన్ల అమలుకు కాంగ్రెస్ ప్రయత్నించింది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లలో కోత విధించి, మతం ఆధారంగా ఓ వర్గానికి 15 శాతం రిజర్వేషన్లు ఇస్తామని గట్టిగా వాదించింది. 2009, 2014 మేనిఫెస్టోల్లో ఇదే అంశాన్ని చేర్చింది''

'ఇండియా' వస్తే ఏడాదికో ప్రధాని

కేంద్రంలో విపక్ష ఇండియా కూటమి ప్రభుత్వం కొలువుతీరితే ప్రతి ఏడాదికో ప్రధాని మారతారని మోదీ ఎద్దేవా చేశారు. నాయకత్వ సమస్యను పరిష్కరించుకోవడానికి ఇండియా కూటమి ఈ ఫార్ములాను అమలు చేస్తుందన్నారు. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన ఇండియాలో ఏడాదికో ప్రధాని మారితే ప్రపంచం దృష్టిలో మనం నవ్వులపాలవడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పాలన వస్తే ప్రజలకు ఒకటి కంటే ఎక్కువ కార్లు, మోటార్ సైకిళ్లు, ఇళ్లుంటే ప్రభుత్వపరమవుతాయన్నారు.



ఎన్నికల వి-చిత్రం

పశ్చిమబెంగాల్‌లోని కృష్ణనగర్ లోక్‌సభ స్థానానికి పోటీ చేస్తున్న టీఎంసీ అభ్యర్థి మహువా మొయిత్రా.. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓ చిన్నారిని ఎత్తుకుని ఇలా ముద్దు చేశారు

'ఎక్స్-రే'పై మాట మార్చిన రాహుల్

న్యూఢిల్లీ: కేంద్రంలో తమ ప్రభుత్వం వస్తే ప్రజల స్థిర చరాస్తులపై ఆర్థిక, సంస్థాగత సర్వే(ఎక్స్-రే) నిర్వహిస్తామంటూ ఈ నెల 7న తాను చేసిన ప్రకటన వివాదాస్పదంగా మారడంతోపాటు తీవ్ర విమర్శలు వస్తుండడంతో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వెనక్కి తగ్గారు. బుధవారం ఢిల్లీలో సామాజిక న్యాయ సదస్సులో మాట్లాడుతూ మాట మార్చేశారు. ఈ సర్వే ప్రజల ఆస్తులను గుర్తించడానికి కాదని పేర్కొన్నారు. ప్రజలకు ఏ మేరకు అన్యాయం జరిగింది అనేది తెలుసుకోవడమే సర్వే ఉద్దేశమని స్పష్టం చేశారు. సర్వే విషయంలో తన ప్రకటనను ప్రధాని నరేంద్ర మోదీ వక్రీకరిస్తున్నారని, తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఆర్థిక, సంస్థాగత సర్వే చేసి తదనుగుణంగా చర్యలు తీసుకుంటామని తాను ఏనాడూ చెప్పలేదని పేర్కొన్నారు. సర్వేపై తాను మాట్లాడగానే ప్రధాని మోదీ తీవ్రంగా స్పందిస్తున్నారంటే సంపద పంపిణీలో ప్రజలకు జరిగిన అన్యాయాన్ని అర్థం చేసుకోవచ్చని తెలిపారు. అన్యాయానికి గురైన వర్గాలకు న్యాయం చేకూర్చాలన్నదే తన ఉద్దేశమని వివరించారు. ఆర్థిక, సంస్థాగత సర్వే చేపట్టడం దేశాన్ని కూల్చేసే కుట్ర ఎలా అవుతుందో చెప్పాలని నిలదీశారు. సర్వే జరిగితేనే అసలు సమస్య ఎక్కడ ఉందో తెలుస్తుందని అభిప్రాయపడ్డారు. దేశభక్తులం అని చెప్పుకుంటున్న కొందరు ప్రబుద్ధులు సర్వే అనగానే వణికిపోతున్నారని ఎద్దేవా చేశారు. దేశ జనాభాలో 90 శాతం మందికి అన్యాయం జరిగిన మాట నిజమేనని, వారికి న్యాయం జరగాల్సిందేనని తేల్చిచెప్పారు. దేశంలో ప్రజల మధ్య సంపద పంపిణీ ఏ రీతిలో జరిగిందో నిర్ధారించడానికి తమ ప్రభుత్వ హయాంలో ఎక్స్-రే నిర్వహిస్తామని రాహుల్ గాంధీ చేసిన ప్రకటనపై ప్రధాని మోదీ విరుచుకుపడుతున్న సంగతి తెలిసిందే.

ముగిసిన రెండో దశ ప్రచారం

89 స్థానాలకు 26న పోలింగ్

న్యూఢిల్లీ: సార్వత్రిక పోరులో రెండో దశకు ప్రచారం ముగిసింది. రెండో దశలో 13 రాష్ట్రాల్లోని 89 స్థానాల్లో ఏప్రిల్ 26వ తేదీన పోలింగ్ జరగనుంది. ఈ స్థానాల్లో గెలుపే ధ్యేయంగా సొంత పార్టీ హామీలను కురిపిస్తూ, ప్రత్యర్థి పార్టీపై విమర్శలు గుప్పిస్తూ అన్ని పార్టీలు ప్రచారపర్వాన్ని రక్తికట్టించాయి. ఇప్పటికే తొలి దశలో 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 102 స్థానాలకు ఈనెల 19న జరిగిన ఓటింగ్‌లో 65.5 శాతం పోలింగ్ నమోదైన విషయం విదితమే. ఈసారి రెండో దశలో కేరళలో ఉన్న మొత్తం 20 స్థానాలకూ ఒకేదఫాలో పోలింగ్ నిర్వహిస్తున్నారు.

కన్నౌజ్ బరిలో తేజ్ ప్రతాప్ కాదు..అఖిలేశ్!

లక్నో: సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) మనసు మార్చుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని కన్నౌజ్ లోక్‌సభ నియోజకవర్గంలో ముందు ప్రకటించిన విధంగా తేజ్ ప్రతాప్ యాదవ్‌కు బదులుగా పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ పోటీ చేయనున్నారు. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు అఖిలేశ్ నామినేషన్ వేస్తారని ఎస్పీ బుధవారం సాయంత్రం 'ఎక్స్'లో తెలిపింది. కార్యకర్తల కోరిక మేరకే కన్నౌజ్ నుంచి పోటీ చేస్తున్నట్లు మీడియాకు అఖిలేశ్ తెలిపారు. కన్నౌజ్ నుంచి తేజ్ ప్రతాప్ యాదవ్ పోటీ చేస్తారని సోమవారం ఎస్పీ ప్రకటించిన సంగతి తెలిసిందే.

జేఈఈ మెయిన్ ఫలితాలు.. 56 మందికి 100% స్కోరు

వీరిలో తెలంగాణకు చెందిన 15 మంది, ఏపీ విద్యార్థులు ఏడుగురు

న్యూఢిల్లీ: జేఈఈ మెయిన్ ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షా ఫలితాలు వెల్లడయ్యాయి. మొత్తం 56 మంది అభ్యర్థులు ఏకంగా నూటికి నూరు మార్కులు సాధించినట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) బుధవారం తెలిపింది. వందకు వంద మార్కులు స్కోర్ చేసిన వీరిలో తెలంగాణ విద్యార్థులు అత్యధికంగా 15 మంది ఉండటం విశేషం. ఆ తర్వాతి స్థానంలో ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలకు చెందిన ఏడుగురు చొప్పున, ఢిల్లీ విద్యార్థులు ఆరుగురు ఉన్నారు. జేఈఈ మొదటి ఎడిషన్ పరీక్ష జనవరి–ఫిబ్రవరిలో, రెండో విడత ఏప్రిల్‌లో జరిగింది. ఈ రెండు పరీక్షల్లో ఫలితాలను బట్టి జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు. దేశంలోని ప్రఖ్యాత 23 ఐఐటీల్లో ప్రవేశాలకు ఈ పరీక్షే ప్రధానం.

కులగణనను ఏ శక్తీ ఆపలేదు

- దేశభక్తులమని చెప్పుకునే వాళ్లకు కులగణన ఎక్స్-రే అంటే భయం
- రూ.16 లక్షల కోట్లు మిత్రులకు పంచారు
- మేం కోట్లాది పేదలను లక్షాధికారులను చేస్తాం
- మోదీ, బీజేపీపై రాహుల్ విమర్శలు



సాక్షి, న్యూఢిల్లీ: కులగణనను ఏ శక్తీ ఆపలేదని ప్రకటిస్తూ ప్రధాని మోదీ, బీజేపీపై రాహుల్ గాంధీ మరోమారు విమర్శల వాగ్బాణాలు ఎక్కుపెట్టారు. బుధవారం ఢిల్లీలో జరిగిన సామాజిక న్యాయ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. ''నాకు కులం పట్టింపు లేదు. కానీ న్యాయం విషయానికొచ్చేసరికి దేశంలో అన్యాయమైపోయిన 90 శాతం జనాభాకు న్యాయం దక్కేలా చూడటమే నా జీవిత లక్ష్యం. మా ప్రభుత్వం ఏర్పడగానే మేం చేసే మొట్టమొదటి పని కులగణన జరిపించడమే. మోదీ అస్తవ్యస్తపాలనలో దాపురించిన ఆదాయ అసమానతల గురించే కాంగ్రెస్ మేనిఫెస్టో చెబుతోంది. మోదీ అత్యంత మిత్రులైన బడా పారిశ్రామికవేత్తలకు బదిలీచేసిన రూ.16 లక్షల కోట్ల మొత్తంలో కాంగ్రెస్ కొంతైనా ఈ 90 శాతం పేదలకు అందేలా చేస్తుంది. లెక్కలు కట్టాం. ఇదే న్యాయం అని భావించాం. అందుకే ఈ అంశాలను మేనిఫెస్టోలో చేర్చాం'' అని రాహుల్ అన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

రామమందిరం, పార్లమెంట్‌లో మా వ్యక్తులెక్కడ?

'' సమస్య నుంచి కొంతకాలమే దృష్టి మరల్చగలరు. ఓబీసీలు మిమ్మల్ని నిలదీసే సమయం వచ్చింది. రామమందిరం పూర్తయింది అక్కడ మా(దళితులు, గిరిజనులు) వాళ్లు ఒక్కరైనా ఉన్నారా? పార్లమెంట్ నూతన భవనం ప్రారంభించారు. మా వాళ్లు ఒక్కరైనా ఉన్నారా?. ఒక్కరినైనా ఆహ్వానించారా? గిరిజన మహిళా రాష్ట్రపతి ముర్ము, మాజీ రాష్ట్రపతి కోవింద్‌లను ఎందుకు రానివ్వలేదు?''

ఆర్థిక, వ్యవస్థాగత సర్వేలూ కలిపి..

'' మేం అధికారంలోకి వస్తే కులగణనతోపాటే ఆర్థిక సర్వే చేస్తాం. ప్రభుత్వ, ప్రైవేట్‌రంగాలుసహా అన్ని రంగాల్లో అణగారిన వర్గాల ప్రాతినిధ్యం ఎంత ఉందనేది తెలిపే ఇన్‌స్టిట్యూషనల్ సర్వేనూ చేస్తాం. కులగణనను ఏ శక్తీ ఆపలేదు. ఎంత గట్టిగా నిలువరిస్తే అంతే బలంగా ప్రతిఘటిస్తాం''

నాన్‌సీరియస్ నేతనా?

''పూర్తిగా రాజకీయాలకు అంకితంకాని నేత అని రాహుల్‌పై బీజేపీ చేసిన విమర్శలకు రాహుల్ దీటుగా బదులిచ్చారు. '' గ్రామీణ ఉపాధి హామీ పథకం, భూసేకరణ బిల్లు, ఉత్తరప్రదేశ్‌లో భట్టా, పార్సౌల్ గ్రామాల వద్ద భూసేకరణ ఉద్యమం, నియాంగిరీ హిల్స్ వివాదం ఇలా ఎన్నో సమస్యల పరిష్కారానికి కృషిచేశా. ఉద్యమాలను ముందుండి నడిపించా. ఇవన్నీ మీడియాకు నాన్‌సీరియస్ అంశాలేకదా. సీరియస్ అంశాలుగా అమితాబ్ బచ్చన్, ఐశ్వర్యారాయ్, విరాట్ కోహ్లీల గురించి మీడియా చూపిస్తుంది. 90 శాతం జనాభా గురించి పట్టించుకునే వ్యక్తిని నాన్‌సీరియస్ నేత అని అంటారా?''

ఓబీసీ, దళితులు, గిరిజనుల ప్రాతినిధ్యమెక్కడ?

'' మీడియారంగంలో ఓబీసీ, దళితులు, గిరిజనుల చేతుల్లో ఉన్న ఒక్క మీడియా సంస్థనైనా చూపించండి. ఒక్కరు కూడా లేరు. మీ ప్రాతినిధ్యం మీడియాలో లేదు. న్యాయవ్యవస్థలోనూ దాదాపు అంతే. 650 మంది హైకోర్టు జడ్జీల్లో 90 శాతం జనాభాకు ప్రాతినిధ్యం వహించేది కేవలం 100 మందే. దేశంలోని 200 అగ్రశ్రేణి సంస్థల్లోనూ దళితులు, గిరిజనులు, ఓబీసీలు లేరు''

దేశాన్ని విడగొడుతున్నానట!

''అన్యాయం జరిగితే ఏ మేరకు అన్యాయం జరిగిందో తెల్సుకుంటాం. ఒక వ్యక్తికి అంతర్గత గాయమైతే ఎక్స్-రే తీయడంలో తప్పులేదుగా. అలాగే కులగణన ఎక్స్-రే అవసరమని నేను అనగానే జాతీయ మీడియా, నరేంద్ర మోదీ ఏకమైపోయి నేనేదో దేశప్రజలను విభజిస్తున్నట్లు విష ప్రచారం మొదలెట్టారు. అన్ని కులాల ప్రాతినిధ్యం ఎలా ఉందో తెలియాలంటే ఎక్స్-రే అవసరమని దేశభక్తులంతా భావిస్తారు. దేశాన్ని సూపర్‌పవర్‌గా మార్చాలనే ఈ దేశభక్తుడు(మోదీ) మాత్రం ఈ ఎక్స్-రే పేరు వింటేనే భయపడుతున్నారు''

కులాలే లేనప్పుడే మీరెలా ఓబీసీ అయ్యారు?

'' గత పదేళ్లు తాను ఓబీసీ వ్యక్తినని మోదీ ఘంటాపథంగా చెప్పారు. తీరా నేను కులగణన ప్రస్తావన తీసుకురాగానే దేశంలో కులాలే లేవని మాట మార్చారు. మరి అలాంటపుడు మీరు ఓబీసీ ఎలా అయ్యారు? మళ్లీ ఆయనే దేశంలో రెండే కులాలున్నాయని సెలవిచ్చారు. పేద, ధనిక కులాలు అని. పేదల జాబితాను పరికిస్తే దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలే కనిపిస్తాయి. ఈ 90 శాతం జనాభాకు న్యాయం చేయడమే నా జీవిత లక్ష్యం''

అనుమానం ఉందని ఎన్నికలపై ఆదేశాలివ్వలేం

న్యూఢిల్లీ: ఈవీఎంల పనితీరుపై అనుమానం ఉందనో, వాటిని నియంత్రణలోకి తీసుకుని ఫలితాలను తలకిందులు చేయొచ్చనే ఆరోపణలతోనో ఎన్నికల ప్రక్రియను నియంత్రించలేమని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఈవీఎంలో 'మార్పులు' చేసే ఆస్కారం ఉందని, అందుకే బ్యాలెట్ పేపర్ విధానమే ఉత్తమం అని వాదించే వారి ఆలోచనను మార్చలేమని కోర్టు వ్యాఖ్యానించింది. ఈవీఎంలో నమోదయ్యే ఓట్లను వీవీప్యాట్ స్లిప్పులతో సరిపోల్చాలంటూ దాఖలైన పలు పిటిషన్లను జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపంకర్ దత్తాల సుప్రీంకోర్టు ధర్మాసనం బుధవారం విచారించింది. పిటిషన్‌దారులు లేవనెత్తిన ప్రశ్నలపై తమ అనుమానాలను నివృత్తిచేసుకునేందుకు జడ్జీలు మధ్యాహ్నం కేంద్ర ఎన్నికల సంఘం అధికారి నితేశ్ వ్యాస్‌ను కోర్టుకు రప్పించి ఐదు ప్రశ్నలు సంధించారు. మైక్రోకంట్రోలర్లను ఎక్కడ బిగిస్తారు? వాటి ప్రోగ్రామ్‌ను మళ్లీ మార్చొచ్చా? అంటూ ప్రశ్నలు అడిగారు. బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్, కంట్రోల్ యూనిట్లలో మైక్రోకంట్రోలర్లను బిగిస్తామని, వాటి ప్రోగ్రామ్‌ను సరిచేసేందుకు ఎవరైనా ఓపెన్ చేస్తే పనిచేయకుండా పోతాయని వ్యాస్ వివరణఇచ్చారు. ఈ వివరణతో అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ తరఫు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ విభేదించారు. ఎన్నికల గుర్తులను అప్‌లోడ్ చేసేటపుడు తప్పుడు ప్రోగామ్‌ను అప్‌లోడ్ చేసే ఆస్కారముందని వాదించారు. దీనిపై జడ్జీ దత్తా కల్పించుకుని.. 'మీ ఆలోచనలను మేం మార్చలేం. ఈసీ వంటి రాజ్యాంగబద్ధ సంస్థను నియంత్రించలేం'' అని వ్యాఖ్యానించారు. ఈవీఎంల సోర్స్ కోడ్‌ను బహిర్గతంచేయాలని మరో పిటిషనర్ తరఫు న్యాయవాది సంతోశ్ వాదించగా కుదరదని జడ్జీ తిరస్కరించారు.

ప్రసంగిస్తూనే సొమ్మసిల్లిన గడ్కరీ

యావత్మాల్(మహారాష్ట్ర): మహారాష్ట్రలోని యావత్మాల్ నియోజకవర్గంలో ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రసంగిస్తూనే వేదికపై కుప్పకూలారు. అకస్మాత్తుగా సొమ్మసిల్లి పడిపోయిన ఆయన్ను పార్టీ కార్యకర్తలు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. 'ఎండ వేడిమికి తాళలేక పుసాద్ సభలో అనారోగ్యానికి గురయ్యాను. ప్రస్తుతం పూర్తిగా కోలుకున్నాను. వరుడ్‌లో జరిగే ర్యాలీలో పాల్గొనేందుకు వెళ్తున్నాను. మీ ప్రేమాభిమానాలకు ధన్యవాదాలు' అంటూ కొద్దిసేపటి తర్వాత ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు. నాగ్‌పూర్ లోక్‌సభ స్థానం నుంచి గడ్కరీ పోటీ చేస్తున్నారు. మొదటి విడతలో అక్కడ పోలింగ్ పూర్తయింది. రెండో విడతలో భాగంగా ఈనెల 26న యావత్మాల్‌లో పోలింగ్ జరగనుంది.



పడిపోతున్న గడ్కరీని పట్టుకుంటున్న నేతలు

ఎలక్షన్ బీట్

'రీడ్ ద లెటర్ బిట్వీన్'

ఇదేదో పజిల్‌లా ఉందే అనుకుంటున్నారా? నిజమే.. చిన్నపాటి పజిలే. కాకపోతే పార్టీలు ప్రచారం కోసం ఉపయోగిస్తున్న కీబోర్డు ట్రెండ్. మొబైల్ ఫోన్ లేదా కంప్యూటర్ కీబోర్డును మీదున్న అక్షరాలతో ఈ ట్రెండ్‌ను వైరల్ చేస్తున్నాయి బీజేపీ, ఆమ్ ఆద్మీ పార్టీలు. అదెలా అంటే..

నేను..

''వికసిత్ భారత్ కోసం ఎవరు ఓటు వేయనున్నారో తెలుసుకోవాలనుకుంటున్నారా? అయితే కీబోర్డులోని యూ అండ్ ఓ మధ్య ఉన్న లెటర్‌ను బిగ్గరగా చదవండి'' అని భారతీయ జనతా పార్టీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేసింది. ఆ రెండు లెటర్స్ మధ్యనున్న అక్షరం 'ఐ'. ఆ మెసేజ్ చదివిన ప్రతి ఒక్కరూ 'ఐ' అంటారు. సో... వారంతా తాము బీజేపీకి ఓటు వేస్తున్నట్టు ప్రతిజ్ఞ చేసినట్టేనని బీజేపీ భావిస్తోంది.

మేము..

ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కూడా బీజేపీని టార్గెట్ చేస్తూ ఈ ట్రెండ్‌నే అనుసరిస్తోంది. ''నియంత నరేంద్ర మోదీ నుంచి భారత రాజ్యాంగాన్ని కాపాడేది ఎవరు? కీబోర్డులో క్యూ, ఆర్ మధ్య ఉన్న లెటర్స్‌ను చదవండి'' అని ఎక్స్‌లో పోస్టు చేసింది. ఇక్కడ క్యూ, ఆర్ మధ్య ఉన్నది డబ్ల్యూ, ఈ.. రెండక్షరాలను కలిపితే 'మేము' అనే అర్థం వస్తుంది. మేమంతా కలిసి బీజేపీని ఓడిస్తామని సందేశాన్నిచ్చేలా ఆప్ వైరల్ చేస్తోంది.

పోలీసులు సైతం..

ఈ రెండు పార్టీలిలా ఉంటే.. సురక్షితమైన డ్రైవింగ్ గురించి అవగాహన కల్పించేందుకు ఢిల్లీ పోలీసులు కూడా ఈ వైరల్ ట్రెండ్‌ను ఫాలో అవుతున్నారు. ''డ్రైవింగ్ చేస్తూ మీరు కీ బోర్డును చూస్తే.. క్యూ అండ్ ఆర్ మధ్యలో లెటర్స్ (డబ్ల్యూ, ఈ) చలాన్‌తో మిమ్మల్ని కలుస్తాయి'' అని ఎక్స్‌లో పోస్టు చేశారు. అంటే మీరు కీబోర్డు చూస్తే వి (మేము) చలాన్ వేస్తామని అర్థమన్నమాట.

- సాక్షి, నేషనల్ డెస్క్

కనీసం నా అంత్యక్రియలకు రండి

- పార్టీ అభ్యర్థికి ఓటేయకున్నా పర్లేదు
- కాంగ్రెస్ చీఫ్ ఖర్గే భావోద్వేగ ప్రసంగం

కలబురిగి: కర్ణాటకలో సొంత జిల్లా కలబురిగిలో పార్టీ అభ్యర్థి కోసం ప్రచారంచేస్తూ కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే భావోద్వేగానికి లోనయ్యారు. దశాబ్దాల ప్రజాజీవితంలో మీకేమైనా మంచి చేశానని భావిస్తే నా అంతిమసంస్కారానికైనా రావాలని కోరారు. కలబురిగి స్థానంలో బీజేపీ సిట్టింగ్ ఎంపీ ఉమేశ్ జాధవ్‌కు పోటీగా కాంగ్రెస్ ఖర్గే అల్లుడు రాధాకృష్ణ దొడ్డమణిని బరిలో నిలిపింది. బుధవారం అఫ్జల్‌పూర్‌లో ఎన్నికల ర్యాలీలో 81 ఏళ్ల ఖర్గే మాట్లాడారు. '' ఈసారి పార్టీ అభ్యర్థికి ఓటేయకపోతే సొంత జిల్లాలో నాకిక స్థానం లేదనే భావిస్తా. నేనిక మీ హృదయాలను గెల్చుకోలేను. ఇన్నేళ్ల నా రాజకీయ జీవితంలో మీకు నేను ఏదైనా మంచి చేశానని భావిస్తే.. మీరు మాకు(కాంగ్రెస్ అభ్యర్థికి) ఓటేసినా వేయకపోయినా కనీసం నా అంత్యక్రియలకు రండి. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా తుదిశ్వాస దాకా పోరాడతా. రాజకీయాల కోసమే పుట్టా. ఎన్నికల్లో పోటీచేసినా చేయపోయినా రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చివరి క్షణం పోరాడతా. రాజకీయాల నుంచి నిష్క్రమించను. రాజకీయ పదవుల నుంచి రిటైర్మెంట్ ఉంటుందిగానీ ఆ నాయకుడు నమ్మిన విలువలు, సిద్ధాంతాల నుంచి రిటైర్మెంట్ తీసుకోడు. బీజేపీ, ఆర్‌ఎస్ సిద్ధాంతాలను తప్పు అని నిరూపించడానికే రాజకీయనేతనయ్యా. వాళ్ల ముందు తలవంచేదే లేదు'' అని అన్నారు.

మా అభ్యర్థికి ఓటేయొద్దు

బాంసవాడా-దుంగాపూర్ స్థానంలో కాంగ్రెస్ వింత ప్రచారం

బాంసవాడా: ఎన్నికల్లో సొంత అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పార్టీ ప్రచారాన్ని హోరెత్తించడం చూస్తుంటాం. అయితే తమ పార్టీ అభ్యర్థికి పొరపాటున కూడా ఓటేయకండి అని స్వయంగా పార్టీనే ప్రచారం చేసి మరీ చెప్పిన అరుదైన ఘటనకు రాజస్థాన్ వేదికైంది. అక్కడి బాంసవాడా–దుంగాపూర్ లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ తరఫున అర్వింద్ దామోర్ బరిలో దిగారు. తీరా నామినేషన్ల ఉపసంహరణకు ఒక్కరోజు ముందు భారత్ ఆదివాసీ పార్టీ(బీఏపీ)తో కాంగ్రెస్ పొత్తు పెట్టుకుంది. బీఏపీ అభ్యర్థి రాజ్‌కుమార్ రోత్‌కు మద్దతు పలుకుతున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది. నామినేషన్‌ను ఉపసంహరించుకోవాలని సొంత అభ్యర్థి అర్వింద్‌ను కాంగ్రెస్ ఆదేశించింది. అయితే 'నాకు స్థానిక నేతల మద్దతు ఉంది. ప్రజలు నన్నే ఆదరిస్తారు. బీఏపీతో పొత్తుపై స్థానిక కాంగ్రెస్ శ్రేణులు గుర్రుగా ఉన్నాయి. కాబట్టి నేను పోటీచేయడమే ఉత్తమం' అని అర్వింద్ వాదించారు. నామినేషన్‌ను ఉపసంహరించుకోలేదు. దీంతో బీజేపీ అభ్యర్థి మహేంద్రజీత్ సింగ్ మాలవీయ, బీఏపీ అభ్యర్థి రాజ్‌కుమార్, కాంగ్రెస్ అభ్యర్థి అర్వింద్‌లతో త్రిముఖ పోరు అనివార్యమైంది. పొత్తు ఒప్పందంలో భాగంగా రాజ్‌కుమార్‌ను ఎలాగైనా గెలిపించాల్సిన బాధ్యత కాంగ్రెస్‌పై పడింది. దీంతో సొంత అభ్యర్థి అర్వింద్‌కు ఓటేయకండి అంటూ తెగ ప్రచారం చేసింది. దీంతో ఓటర్లలో కాస్తంత గందరగోళం నెలకొంది. దీంతో ఓట్లు చీలి బీజేపీ అభ్యర్థికి బాగా కలిసొస్తుందని అంతా భావిస్తున్నారు. పార్టీ ఆదేశాలను సొంత నేత బేఖాతరుచేయడం కాంగ్రెస్‌కు ఇబ్బందిగా పరిణమించింది. ఎస్టీ రిజర్వ్‌డ్ సీటు అయిన బాంసవాడా–దుంగాపూర్ స్థానానికి శుక్రవారం పోలింగ్ జరగనుంది.

మావల్ ఎంపీ.. ఎస్ఎస్‌సీ పాస్

శ్రీరంగ్ బర్నే.. మహారాష్ట్రలోని మావల్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి రెండు సార్లు ఎంపీగా గెలుపొందారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ఐదు సార్లు అవార్డు అందుకున్నారు. ఈసారి తన ఎన్నికల అఫిడవిట్‌లో కొత్త అర్హతను సగర్వంగా ప్రకటించారు. అదేంటంటే.. తన విద్యార్హతలో ఎస్ఎస్‌సీ అని రాయడం. 1997లో రాజకీయాల్లోకి వచ్చిన శ్రీరంగ్ స్థానిక సంస్థల్లో పనిచేసి.. 2014, 2019 ఎన్నికల్లో లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1980లో ఎస్ఎస్‌సీ ఫెయిలైన శ్రీరంగ్ చదువుకు దూరమయ్యారు. ఆ తరువాత రాజకీయాల్లో ఎన్ని విజయాలు సాధించినా విద్యార్హత కాలమ్ ఖాళీగా వదిలేయడం అతడిని వెంటాడింది. క్రియాశీల రాజకీయాల్లో తీరిక లేని పనులతో ఉన్న శ్రీరంగ్‌కు కోవిడ్ కాలంలోని వరుస లాక్‌డౌన్ల సమయం కలిసొచ్చింది. ఆ సమయాన్ని సద్వినియోగం చేసుకుని 2022లో ఎస్ఎస్‌సీ పరీక్షకు హాజరయ్యారు. 60 ఏళ్ల శ్రీరంగ్ 58 ఏళ్ల వయసులో పదో తరగతి ఉత్తీర్ణత సాధించారు. ఇప్పుడు సగర్వంగా 'ఎస్ఎస్‌సీ పాస్' అని అఫిడవిట్‌లో పొందుపరిచారు.

క్లుప్తంగా...

జూన్ 3న లాసెట్-2024 పరీక్ష

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ఐదేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చని లాసెట్-2024 కన్వీనర్ విజయలక్ష్మి తెలిపారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు వయోపరిమితితో సంబంధం లేకుండా ఐదేళ్ల లాసెట్-2024లో అర్హత సాధించి ఎల్ఎల్‌బీలో ప్రవేశం పొందవచ్చని వెల్లడించారు. గురువారంతో ముగియనున్న లాసెట్-2024కు ఆసక్తి గల ఇంటర్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రూ.500 ఆ పైన అపరాధ రుసుముతో మరి కొన్ని రోజులు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. లాసెట్-2024, ఎల్ఎల్ఎం సెట్ ప్రవేశ పరీక్షలను జూన్ 3న రెండు తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఇంటర్ ఫలితాల్లో ఎస్సార్ విద్యార్థుల ప్రతిభ

విద్యారణ్యపురి: ఇంటర్ ఫలితాల్లో ఎస్సార్ విద్యాసంస్థల విద్యార్థులు విజయభేరి మోగించినట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి తెలిపారు. ఫస్టియర్ ఎంపీసీలో 13 మంది విద్యార్థులు 470కి 468 మార్కులు సాధించారని తెలిపారు. అలాగే 467 సాధించిన వారు 49 మందికిపైగా ఉన్నట్లు చెప్పారు. బీపీసీలో 440కి 438 మార్కులు సాధించినవారు ముగ్గురు ఉన్నారని, ఎంఈసీలో గట్ల శ్రావ్య 500కి 495 మార్కులు సాధించిందని పేర్కొన్నారు. సీఈసీలో తన్నీరు స్పందన 500కు 493 మార్కులు సాధించగా, మరో ఇద్దరు 492 మార్కులు సాధించినట్లు వివరించారు. సెకండియర్ ఎంపీసీలో సలీం నందితా వెయ్యికి 993 మార్కులు, సాయిమణిదీప్‌రెడ్డి 992 మార్కులు సాధించారని పేర్కొన్నారు. బీపీసీలో వెయ్యికి వలిదాస్ తేజస్విని 992 మార్కులు, మరో ఇద్దరు 990 మార్కులు సాధించారని తెలిపారు.

నారాయణ ఆల్‌టైమ్ రికార్డ్..

తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో తమ విద్యార్థులు సత్తా చాటారని నారాయణ విద్యా సంస్థల ఎండీ పి.సింధూర నారా యణ, శరణి నారాయణ తెలిపారు. ఫస్టియర్ ఎంపీసీలో 469 మార్కులతో ఒకరు స్టేట్ ఫస్ట్ సాధించగా సీనియర్ ఎంపీసీలో 993 మార్కులను ముగ్గురు విద్యార్థులు సాధించారన్నారు. జూనియర్ బైపీసీలో స్టేట్ టాప్ మార్కులు 438ని ఏకంగా ఆరుగురు సాధించారని వివరించారు. సీనియర్ బైపీసీలో స్టేట్ టాప్ మార్క్ 994 మార్కులను తమ విద్యార్థులు కైవసం చేసుకున్నారని, బోర్డ్ చరిత్రలోనే అత్యధికంగా 470కి 469 మార్కులతో పులిగిళ్ల జాహ్నవి చరిత్ర సృష్టించిందని చెప్పారు. సీనియర్ ఎంపీసీలో ముగ్గురు విద్యార్థులు వెయ్యికి 993 మార్కులు సాధించారు. జూనియర్ బైపీసీలో ఆరుగురు విద్యార్థులు 440కి 438 సాధించారు. సీనియర్ ఇంటర్ బైపీసీలో రాష్ట్రంలోనే అత్యుత్తమ మార్కులు 994 సాధించారని వెల్లడించారు.

శ్రీచైతన్య టాప్..

తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో శ్రీచైతన్య అద్భుత ఫలితాలను సాధించిందని శ్రీ చైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ శ్రీమతి సుష్మశ్రీ వెల్లడించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 470కి స్టేట్ ఫస్ట్ మార్క్ 468తో 26 మంది, 467 ఆపైన 422 మంది విద్యార్థులు సాధించారని చెప్పారు. జూనియర్ ఇంటర్ బైపీసీలో 440కి స్టేట్ ఫస్ట్ మార్క్ 438తో 19 మంది, 437 ఆపైన 162 మంది తమ విద్యార్థులు సాధించారని తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో వెయ్యికి 993తో 5 మంది, సీనియర్ ఇంటర్ బైపీసీలో స్టేట్ ఫస్ట్ మార్క్ 994తోపాటు, 990 మార్కులు ఆపైన 83 మంది, 900 మార్కులకుపైగా 16,431 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు.

30 వరకు వీఐటీఈఈఈ ఎంట్రన్స్

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ కోర్సులో అడ్మిషన్ కోసం వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (వీఐటీఈఈఈ) దేశవ్యాప్తంగా 125 నగరాలతో పాటు దుబాయ్, మస్కట్, ఖతర్, కువైట్, సింగపూర్, కౌలాలంపూర్‌లో ఎంట్రన్స్ పరీక్షలను ప్రారంభించింది. వీఐటీ వెల్లూర్, వీఐటీ చెన్నై, వీఐటీ ఏపీ, వీఐటీ భోపాల్‌లో ఇంజనీరింగ్ అడ్మిషన్ కోసం ఈనెల 19 నుంచి 30వ తేదీ వరకు వీటిని నిర్వహించనుంది. మే 3వ తేదీన ఫలితాలను విడుదల చేస్తామని, www.vit. ac.in వెబ్‌సైట్‌లో ఫలితాలు అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. లక్ష లోపు ర్యాంకు వచ్చిన విద్యార్థులు వీఐటీ కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అర్హులని తెలిపింది. 1 నుంచి 10 లోపు ర్యాంకు వచ్చిన విద్యార్థులకు 100 శాతం ఫీజు రాయితీ ఉంటుందని వెల్లడించింది.

'కారుణ్య' ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్

సాక్షి, హైదరాబాద్: కారుణ్య డీమ్డ్ యూనివర్సిటీ పరికరాలు, సర్క్యూట్స్, సిస్టమ్స్‌పై 7వ ఐఈఈఈ అంతర్జాతీయ సదస్సు నిర్వహించింది. ఐఈఈఈ ఈడీఎస్ సొసైటీ సహకారంతో దీన్ని నిర్వహించింది. ఈ సదస్సులో 1,098 పేపర్స్‌ను సబ్మిట్ చేశారు. అందులో 130 పేపర్లు ఆమోదం పొందగా, 64 ప్రజెంటేషన్ కోసం రిజిస్టర్ అయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధకులు, డెవలపర్లు, విద్యార్థులను ఒక వేదికపైకి తీసుకొచ్చే ఉద్దేశంతో ఈ సదస్సును నిర్వహించారు. ఇందులో పాల్గొనే వారికి ఎలక్ట్రానిక్ పరికరాలు, సిస్టమ్స్‌పై అవగాహన, టెక్నాలజీలో వస్తున్న కొత్త మార్పులపై వారి ఆలోచనలను పంచుకునేందుకు అవకాశముంటుంది.

ఫలితాల్లో సర్కార్ కాలేజీల సత్తా

సెకండియర్‌లో ప్రైవేటుకు మించి గురుకులాలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీల్లో ఉత్తీర్ణత
టాపర్ల జాబితాలో ప్రభుత్వ కాలేజీల విద్యార్థులకూ చోటు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ ఫలితాల్లో ప్రైవేటు కాలేజీలకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వ కాలేజీలు సత్తా చాటాయి. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఉత్తీర్ణత శాతం తగ్గినా అత్యధిక మార్కులు కైవసం చేసుకున్నారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ గురుకులాలు, కేజీబీవీలు ప్రైవేటు కాలేజీలను మించి ఫలితాలు సాధించాయి. ప్రభుత్వ జూనియర్ కాలేజీల నుంచి 77,022 మంది పరీక్ష రాస్తే 37,842 (49.13%) పాసయ్యారు. గురుకులాలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీల నుంచి 80,331 మంది విద్యార్థులు ఇంటర్ సెకండియర్ పరీక్షలు రాయగా 59,530 (74.11%) మంది పాసయ్యారు. ప్రైవేటు కాలేజీల నుంచి 3,44,724 మంది పరీక్షలు రాస్తే వారిలో 2,23,911 (65.24%) మందే పాసవడం గమనార్హం. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోని విద్యార్థుల్లో కొందరు రాష్ట్రంలోనే అత్యధిక మార్కులు సాధించారు.



ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం సర్కార్ కాలేజీల్లో అత్యధిక మార్కులు సాధించిన వారు

	పేరు	గ్రూపు	ప్రాంతం	జిల్లా	మార్కులు	మార్కుల శాతం
ఫస్టియర్	పుల్లా సాత్విక్	బైపీసీ	ధర్మసాగర్	హనుమకొండ	437	99.32
	బైజా సాబా	బైపీసీ	నారాయణ్‌ఖేడ్	సంగారెడ్డి	437	99.32
	గొల్ల రుషిక	ఎంపీసీ	ధర్మసాగర్	హనుమకొండ	466	99.15
	కనమోని తేజ	ఎంపీసీ	వంగూరు	నాగర్‌కర్నూల్	466	99.15
	పిట్టల స్నేహిత	ఎంపీసీ	అచ్చంపేట	నాగర్‌కర్నూల్	466	99.15
	మామిళ్ళపల్లి వర్ష	ఎంపీసీ	మధిర	ఖమ్మం	466	99.15
	మంఖాల లహరి	ఎంపీసీ	మహేశ్వరం	రంగారెడ్డి	466	99.15
	మంగనెల్లి మిత్రశ్రీ	ఎంపీసీ	బోధన్	నిజామాబాద్	466	99.15
	గున్నల పూజిత	బైపీసీ	తిర్యాణి	ఆసిఫాబాద్	436	99.09
	నాజ్ మెహ్రూన్	బైపీసీ	వర్ధేపల్లి	హనుమకొండ	436	99.09
సెకండియర్	సయ్యద్ ఆస్పియా హష్మి	బైపీసీ	తాండూరు	వికారాబాద్	990	99.00
	పట్టమట్ట నిష్కా	బైపీసీ	రాజేంద్రనగర్	రంగారెడ్డి	987	98.70
	కె శ్రావణి	ఎంపీసీ	మలక్‌పేట్	హైదరాబాద్	986	98.60
	అదీబా నాజ్	ఎంపీసీ	భైంసా	నిర్మల్	985	98.5
	రాధారపు శ్రీనిధి	బైపీసీ	కమాన్‌పూర్	పెద్దపల్లి	985	98.5
	మయారా శ్రీనవ్య	ఎంపీసీ	సత్తుపల్లి	ఖమ్మం	985	98.5
	సైమా జామా	ఎంపీసీ	ఫలక్‌నుమా	హైదరాబాద్	984	98.4
	వూట్ల సాయిఅమూల్య	ఎంపీసీ	పెద్దపల్లి	పెద్దపల్లి	984	98.4
	సైదా ఫాతిమా హుస్సేన్	బైపీసీ	మెదక్	మెదక్	984	98.4
	అదీబా ఫాతిమా	బైపీసీ	ఫలక్‌నుమా	హైదరాబాద్	983	98.3

ఇంటర్‌లో బాలికలే మెరికలు

ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో వారిదే పైచేయి..
మొత్తంగా ఫస్టియర్‌లో 61.06%, సెకండియర్‌లో 69.46% ఉత్తీర్ణత నమోదు
ఫలితాల్లో మేడ్చల్, ములుగు ఫస్ట్, అట్టడుగున కరీంనగర్ జిల్లా
నేటి నుంచి రీ వెరిఫికేషన్, కౌంటింగ్

		జనరల్	ఒకేషనల్	మొత్తం
ఇంటర్ ఫస్టియర్ ఫలితాలు ఇలా..	పరీక్ష రాసిన విద్యార్థులు	4,30,413	48,310	4,78,723
	ఏ గ్రేడ్ ఉత్తీర్ణులు (75% మార్కులపైగా)	1,70,212	15,813	1,86,025
	బీ గ్రేడ్ ఉత్తీర్ణులు (60%-75% మధ్య)	60,713	8,272	68,985
	సీ గ్రేడ్ ఉత్తీర్ణులు (50%-60% మధ్య)	23,650	318	23,968
	డీ గ్రేడ్ ఉత్తీర్ణులు (35%-50% మధ్య)	8,254	29	8,283
	మొత్తం ఉత్తీర్ణులు	2,62,929	24,432	2,87,261
	ఉత్తీర్ణత శాతం	61.06	50.57	60.01
	బాలికల ఉత్తీర్ణత శాతం	68.59	66.17	68.35
	బాలుర ఉత్తీర్ణత శాతం	53.36	35.21	51.50
ద్వితీయ సంవత్సరం ఫలితాలు ఇలా..	పరీక్ష రాసిన విద్యార్థులు	4,55,673	46607	5,02,280
	ఏ గ్రేడ్ ఉత్తీర్ణులు (75% మార్కులకుపైగా)	1,77,019	17265	1,94,311
	బీ గ్రేడ్ ఉత్తీర్ణులు (60%-75% మధ్య)	68,403	9,600	78,003
	సీ గ్రేడ్ ఉత్తీర్ణులు (50%-60% మధ్య)	25,494	406	25,900
	డీ గ్రేడ్ ఉత్తీర్ణులు (35%-50% మధ్య)	8,004	16	8,020
	మొత్తం ఉత్తీర్ణులు	2,93,596	28,836	3,32,432
	ఉత్తీర్ణత శాతం	69.46	27.18	69.46
	బాలికల ఉత్తీర్ణత శాతం	75.71	31.99	71.53
	బాలుర ఉత్తీర్ణత శాతం	62.92	47.72	56.10

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ ఫలితాల్లో బాలురకన్నా బాలికలే ప్రతిభ కనబరిచారు. మొదటి, ద్వితీయ సంవత్సరంలోనూ వారే ఎక్కువ సత్తా చాటారు. ఫస్టియర్‌లో బాలురు 53.36 శాతం మంది పాసవగా బాలికలు 68.59 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్‌లో బాలురు 62.92 శాతం మంది పాసయితే బాలికలు 75.71 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తంగా ఇంటర్ మొదటి సంవత్సరంలో 61.06 శాతం మంది, ద్వితీయ సంవత్సరంలో 69.46 శాతం మంది పాసయ్యారు. ఉత్తీర్ణుల్లో ఎక్కువ మంది 75% పైనే మార్కులు సాధించారు. ఎక్కువ మంది ఎంపీసీ గ్రూపును ఎంచుకోవడంతో అందులోనే అత్యధిక ఉత్తీర్ణత శాతం నమోదైంది. రాష్ట్రంలో ఇంటర్ పరీక్షలు ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు జరిగాయి. ఈ పరీక్షలకు 2 సంవత్సరాలకు కలిపి 9,81,003 మంది హాజరయ్యారు. పరీక్ష ఫలితాలను విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం బుధవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు.

టాప్, లాస్ట్ జిల్లాలు ఇవే..

గతేడాదితో పోలిస్తే ఫస్టియర్‌లో ఉత్తీర్ణత శాతం తగ్గింది. సెకండియర్‌లో పెరిగింది. 2023లో ఫస్టియర్‌లో 62.85% ఉత్తీర్ణత నమోదవగా ఈసారి 61.05% ఉత్తీర్ణత నమోదైంది. సెకండియర్‌లో గతేడాది 67.27 శాతం మంది పాసైతే ఈసారి 69.46 శాతం మంది పాసయ్యారు. ఈసారి ఫస్టియర్‌లో మేడ్చల్ 71.58%, రంగారెడ్డి 71.7% తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. సెకండియర్‌లో ములుగు (82.95%), మేడ్చల్ (79.31%) జిల్లాలు మొదటి, రెండు స్థానాలు సాధించాయి. అత్యంత తక్కువగా కరీంనగర్ జిల్లాలో ఫస్టియర్‌లో 34.8 శాతం, సెకండియర్ 44.29 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

విద్యార్థులూ.. అధైర్య పడొద్దు

పరీక్షల్లో ఫెయిలైన లేదా తక్కువ మార్కులొచ్చిన విద్యార్థులు అధైర్యపడొద్దు. ఫలితాలపై మానసిక ఆందోళనకు గురయ్యే వారి కోసం టెలి మానస్ ఏర్పాటు చేశాం. 14416 నంబర్‌కు కాల్ చేసి కౌన్సెలింగ్ తీసుకోవచ్చు. ఫలితాలపై ఫిర్యాదులు, సందేహాలకు 040-24655027 నంబర్‌కు కాల్ చేసి నివృత్తి చేసుకోవచ్చు.

– బుర్రా వెంకటేశం, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి

ఎంపీసీ విద్యార్థులే ఎక్కువ

ఇంటర్ పరీక్షలు రాసిన వారిలో ఎక్కువ మంది ఎంపీసీ విద్యార్థులే ఉన్నారు. వారి ఉత్తీర్ణత శాతమూ అదే స్థాయిలో ఉంది. తర్వాత స్థానంలో బైపీసీ విద్యార్థులుంటే సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీ విద్యార్థుల సంఖ్య, ఉత్తీర్ణత తక్కువగా ఉంది.

ఏడుగురు ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్య

సాక్షి, నెట్‌వర్క్: ఏడుగురు ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. బుధవారం ఇంటర్మీడియెట్ పరీక్షల ఫలితాలు వెల్లడైన నేపథ్యంలో ఫెయిలైన ఆరుగురు విద్యార్థులు మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడగా, ఫెయిలవుతాననే భయంతో ఇంకొక విద్యార్థిని బలవన్మరణం పొందింది. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం కొల్లూర్‌కు చెందిన సాయితేజ గౌడ్ (17), హైదరాబాద్ అత్తాపూర్‌కు చెందిన హరిణి, మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం అచ్చులాపూర్ గ్రామానికి చెందిన మైదం సాత్విక్, మంచిర్యాల జిల్లా దొరగారిపల్లెకు చెందిన గట్టిక తేజశ్విని, ఖమ్మం జిల్లా ముదిగొండకు చెందిన వాగదాని వైశాలి, మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామానికి చెందిన చిప్పా భార్గవి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం పతూరు గ్రామానికి చెందిన ఒకేషనల్ ఫస్టియర్ విద్యార్థిని శ్రీజ ఫెయిలైతే అందరి ముందు అవమానం ఎదుర్కోవాల్సి వస్తుందనే భయంతో మంగళవారం రాత్రి పురుగుల మందు సేవించింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. అయితే, పరీక్ష ఫలితాల్లో ఆమె పాసైనట్లు వెల్లడైంది. ఆయా విద్యార్థుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

ఫలితాల్లో కేజీబీవీల ప్రతిభ

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ ఫలితాల్లో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీ బీవీ) విద్యార్థులు మంచి మార్కులు సాధించినట్లు సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ మల్లయ్య భట్టు తెలిపారు. ఫస్టియర్‌లో 71.17 శాతం, సెకండియర్‌లో 83.91 శాతం ఉత్తీర్ణత నమోదు చేసినట్లు తెలిపారు. ఫస్టియర్‌లో 283 కాలేజీల నుంచి 12,231 మంది పరీక్ష రాస్తే 8,705 మంది పాసయ్యారని, సెకండియర్‌లో 10,385 మంది పరీక్ష రాస్తే 8,714 మంది పాసయ్యారని వెల్లడించారు. ఫస్టియర్‌లో 20, సెకండియర్‌లో 11 కేజీబీవీలు 100 శాతం ఉత్తీర్ణత నమోదు చేశాయన్నారు.

జనరల్ గురుకులాలే టాప్

- ఫస్టియర్‌లో 86.84 శాతం, సెకండ్ ఇయర్‌లో 92.53 శాతం ఉత్తీర్ణత
- ఆ తర్వాత స్థానాల్లో ఎస్సీ, మైనార్టీ, బీసీ గురుకులాలు
- ఆదర్శ పాఠశాలల్లో అత్యంత తక్కువగా ఉత్తీర్ణత శాతం నమోదు
- కేజీబీవీలు, గిరిజన గురుకుల కాలేజీల్లో సాదాసీదాగానే ఉత్తీర్ణత

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో గురుకుల సొసైటీలు మెరుగైన ఫలితాలు సాధించగా... ఇందులో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉన్న జనరల్ గురుకుల సొసైటీలోని తెలంగాణ స్టేట్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలు (టీఎస్ఆర్‌జేసీ) అత్యుత్తమ ఫలితాలతో అగ్రభాగాన నిలిచాయి. జనరల్ గురుకుల సొసైటీలో పరిమిత సంఖ్యలోనే కాలేజీలున్నప్పటికీ మొదటి సంవత్సరంలో 86.84 శాతం, రెండో సంవత్సరంలో 92.53 శాతం విద్యార్థులు పాసయ్యారు. సంక్షేమ శాఖల పరిధిలోని నాలుగు గురుకుల సొసైటీలతోపాటు, విద్యా శాఖ పరిధిలోని జనరల్ గురుకుల సొసైటీ, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, తెలంగాణ మోడల్ స్కూల్ సొసైటీల పరిధిలోని కాలేజీల్లో ఫస్టియర్‌లో 81,317 మంది పరీక్షలకు హాజరు కాగా... 54,848 మంది పాసయ్యారు. అదేవిధంగా సెకండియర్‌లో 73,241 మంది పరీక్షలకు హాజరు కాగా... 56,287 మంది పాసై 76.85శాతం ఉత్తీర్ణత సాధించారు.

జనరల్ ఫస్ట్... మోడల్ లాస్ట్

రాష్ట్రవ్యాప్తంగా ఐదు గురుకుల సొసైటీలు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్ పరిధిలోని కాలేజీల్లో ఇంటర్ ఫలితాల్లో జనరల్ గురుకుల కాలేజీలు ప్రథమ స్థానంలో నిలిచాయి. సెకండియర్ ఫలితాలతో పోలిస్తే... మైనార్టీ గురుకుల కాలేజీలు రెండో స్థానంలో, ఎస్సీ గురుకులాలు మూడో స్థానంలో, బీసీ గురుకులాలు నాలుగో స్థానంలో నిలిచాయి. కేజీబీవీల్లో అరకొరగానే ఫలితాలు రాగా... మోడల్ స్కూల్ సొసైటీ పరిధిలోని కాలేజీల్లో అత్యంత తక్కువగా ఉత్తీర్ణత శాతం నమోదైంది. రాష్ట్ర సగటు కంటే తక్కువగా ఉత్తీర్ణత శాతం నమోదు కావడం గమనార్హం. గతేడాదితో పోలిస్తే గురుకుల సొసైటీల్లో ఉత్తీర్ణత కాస్త తగ్గినట్లు అధికారులు చెబుతున్నారు.

గురుకుల సొసైటీ కాలేజీల వారీగా ఇంటర్ ఫలితాలు..

కాలేజీ	మొదటి సంవత్సరం.. హాజరు	ఉత్తీర్ణత	శాతం	రెండో సంవత్సరం హాజరు	ఉత్తీర్ణత	శాతం
టీఎస్ఆర్‌జేసీ	2546	2211	86.84	2544	2354	92.53
టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ	16015	12148	75.85	14802	12320	83.23
టీఎంఆర్‌జేసీ	9806	7143	72.84	8436	7057	83.65
ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌జేసీ	13761	9819	71.35	8541	7078	82.87
టీటీడబ్ల్యూఆర్‌జేసీ	8289	5783	69.76	7810	6367	81.52
కేజీబీవీ	13010	8741	67.18	11281	8734	77.42
మోడల్ స్కూల్స్	17890	9003	50.32	19827	12377	62.42
మొత్తం	81317	54848	67.44	73241	56287	76.85

కూలీ, రైతు బిడ్డలకు సరస్వతీ కటాక్షం



వలకొండ చర్విత



మార్త పావని



సుకుమార్



వింధ్య

భిక్కనూరు/కమలాపూర్/కొందుర్గు/నందిగామ/సాక్షి, నిడమనూరు/దుబ్బాక: ఇంటర్ ఫలితాల్లో మట్టిలో మాణిక్యాలు మెరిశాయి. ఇద్దరు రైతు బిడ్డలు, ఓ కూలీ కుమార్తె టాప్ మార్కులు సాధించారు. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం అంతంపల్లి గ్రామానికి చెందిన రైతు బిడ్డ వలకొండ చర్విత ఓ ప్రైవేటు కాలేజీలో ఫస్టియర్ ఎంపీసీలో 470కి 468 టాప్ మార్కులు సాధించింది. అలాగే మహబూబాబాద్‌కు చెందిన చిన్నకారు రైతు నాగరాజు కుమార్తె పల్లె బోయిన ప్రణతి ఫస్టియర్ ఎంపీసీలో 470కి 468 టాప్ మార్కులు తెచ్చుకుంది. హనుమకొండ జిల్లా దామెర మండలం తక్కళ్లపాడులో రోజు వారీ కూలీ చేసుకొని జీవనం సాగిస్తున్న మార్త సుధాకర్-లావణ్య దంపతుల కుమార్తె పావని కమలాపూర్‌లోని కేజీబీవీలో ఇంటర్ ఎంపీసీ ఫస్టియర్‌లో 470కి 467 మార్కులు సాధించి టాపర్లలో ఒకరిగా నిలిచింది. సివిల్స్‌కి ఎంపికై కలెక్టర్ కావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చర్విత తెలపగా ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ సీటు సాధించి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావడమే లక్ష్యమని ప్రణతి చెప్పింది. సొంతంగా ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీ స్థాపించాలని ఉందని పావని 'సాక్షి'కి తెలిపింది.



ప్రణతికి స్వీట్లు తినిపిస్తున్న తల్లిదండ్రులు

మరికొందరు ఆణిముత్యాలు

- సిద్దిపేట జిల్లా దుబ్బాక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒకేషనల్ కోర్సు విద్యార్థి డి.సుకుమార్ ఈటీ విభాగంలో 994 మార్కులు సాధించాడు.
- రంగారెడ్డి జిల్లా కొందుర్గు కస్తూర్బా బాలికల పాఠశాలలో ఇంటర్ సెకండియర్ (ఎంపీహెచ్‌డబ్ల్యూ) ఒకేషనల్ కోర్స్ చదివిన వింధ్య 983 మార్కులు సాధించింది.
- నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు కాలేజీలో చదువుతున్న బైరి శ్రీనిధి ఫస్టియర్ ఎంపీసీలో ఏకంగా 470కి 468 మార్కులు తెచ్చుకుంది. ఇంజనీర్ కావలన్నదే తన లక్ష్యమని శ్రీనిధి చెప్పింది.
- రంగారెడ్డి జిల్లా నందిగామ మండల పరిధిలోని అంతిరెడ్డిగూడకు చెందిన మెక్కొండ శ్రీనివాస్, శ్రీలత దంపతుల కూతురు మనోజ్ఞ ఓ ప్రైవేటు కాలేజీలో చదువుతూ ఫస్టియర్ బైపీసీలో 440కి 438 మార్కులతో టాప్ మార్కులు తెచ్చుకుంది.
- నల్లగొండ జిల్లా నిడమనూరు ఆదర్శ పాఠశాల విద్యార్థులు జిల్లెపల్లి ప్రమోద్ ఎంపీసీ ఫస్టియర్‌లో 470కి 465 మార్కులు, కొక్కు విఘ్నేష్ 470కి 459 మార్కులు తెచ్చుకున్నారు.
- నల్లగొండ జిల్లాలో పనిచేస్తున్న ప్రైవేటు ఉద్యోగి చింతకింది గణేశ్-పద్మల కుమారుడు చింతకింది నాచికేత్ మీనన్ ఎంపీసీలో 470కి 466 మార్కులు సాధించాడు.

ఇంటర్‌లో రాష్ట్ర స్థాయి టాపర్లు వీరే...

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో పలువురు విద్యార్థులు టాపర్లుగా నిలిచారు. ఫస్టియర్, సెకండియర్ ఫలితాల్లో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన విద్యార్థుల వివరాలు ఇలా ఉన్నాయి.

	పేరు	జిల్లా	మార్కులు
ఫస్టియర్	పులిగల్ల జాహ్నవి	హనుమకొండ	469 (ఎంపీసీ)
	ఎం. అంకిత (ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌జేసీ)	హైదరాబాద్	469 (ఎంపీసీ)
	అల్లూరి శివశంకర్	మహబూబ్‌నగర్	469 (ఎంపీసీ)
	పెద్దోళ్ల సాత్విక్	మేడ్చల్	468 (ఎంపీసీ)
	కొంరెడ్డి రేవంత్	మేడ్చల్	468 (ఎంపీసీ)
సెకండియర్	దువ్వూరి తస్లియల్	సంగారెడ్డి	994 (బైపీసీ)
	వనపల్లి చరిష్మా శివసాయి	మేడ్చల్	994 (బైపీసీ)
	ఎ అమూల్య	మహబూబ్‌నగర్	993 (ఎంపీసీ)
	శీలం నందిత	ఖమ్మం	993 (ఎంపీసీ)
	వి అక్షిత	మేడ్చల్	993 (ఎంపీసీ)

మే 24 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల టైం టేబుల్‌ను ఇంటర్ బోర్డ్ బుధవారం విడుదల చేసింది. మే 24 నుంచి జూన్ 1 వరకూ పరీక్షలు ఉంటాయని, ప్రాక్టికల్స్ జూన్ 3 నుంచి 7వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్టు తెలిపింది. ఫస్టియర్ విద్యార్థులకు ఇంగ్లిష్ ప్రాక్టికల్స్ జూన్ 10 ఉంటాయని పేర్కొంది. ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ 11వ తేదీ, ఎథిక్స్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష జూన్ 12న నిర్వహిస్తున్నట్టు వివరించింది. ఫస్టియర్ థియరీ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, సెకండియర్ సాయంత్రం 2.30 నుంచి 5.30 గంటల వరకూ ఉంటాయని వెల్లడించింది. ఫస్టియర్, సెకండియర్ పరీక్షలు ఒకే రోజు నిర్వహిస్తారు. కాగా, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 25 నుంచి మే 2 వరకు పరీక్ష ఫీజు చెల్లించాలని బోర్డు ప్రకటించింది. మార్కుల జాబితాను బుధవారం సాయంత్రం నుంచే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచిన బోర్డు.. మార్కులపై సందేహాలుంటే 10 రోజుల్లోగా తమకు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం పేపర్‌కు రూ. 600 చెల్లించి గురువారం నుంచి మే 2 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది.

తేదీ	ఫస్టియర్
24.5.24	ద్వితీయ భాష
25.5.24	ఇంగ్లిష్
27.5.24	మేథ్స్, బాటనీ, పొలిటికల్ సైన్స్
28.5.24	మేథ్స్ పేపర్-2, జువాలజీ, హిస్టరీ
29.5.24	ఫిజిక్స్, ఎకనామిక్స్
30.5.24	కెమిస్ట్రీ, కామర్స్
31.5.24	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, మేథ్స్‌బ్రిడ్జి కోర్సు (బైపీసీ వారికి)
1.6.24	మోడ్రన్ లాంగ్వేజ్, జాగ్రఫీ

30న పదో తరగతి ఫలితాలు

విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం

సాక్షి, హైదరాబాద్: పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలను ఈ నెల 30న విడుదల చేయనున్నట్లు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు ఈ ఫలితాలను వెల్లడిస్తామన్నారు. ఈ మేరకు బుధవారం ఇంటర్‌బోర్డులో తనను కలసిన విలేకరులతో మాట్లాడిన ఆయన పదో తరగతి ఫలితాలపై స్పష్టమైన ప్రకటన చేశారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలను మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు 2,676 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది 5,08,385 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరయ్యారు. ఫలితాల విడుదలకు ఎస్సెస్సీబోర్డు తగిన ఏర్పాట్లు చేస్తోంది.

27, 28 తేదీల్లో 'సాక్షి' ఈఏపీసెట్, నీట్ మాక్‌టెస్టులు

సాక్షి ఎడ్యుకేషన్: సాక్షి మీడియా ఆధ్వర్యంలో ఈనెల 27, 28 తేదీల్లో నీట్, ఈఏపీసెట్ పరీక్షలకు మాక్‌టెస్టులు నిర్వహించనున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉజ్వల భవిష్యత్‌ను అందించే ఇంజనీరింగ్, మెడికల్ కోర్సుల్లో చేర్పించాలని కోరుకుంటున్నారు. అందుకు ఖర్చులకు వెనుకాడకుండా పిల్లలను కోచింగ్‌లో చేర్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్.. అలాగే తెలుగు రాష్ట్రాల్లో ఇంజనీరింగ్, అగ్రికల్చర్ తదితర కోర్సుల్లో అడ్మిషన్ కల్పించే ఎంసెట్‌కు లక్షల మంది విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. ఈ క్రమంలో విద్యార్థులకు చేయూతనిచ్చేలా నిపుణుల ఆధ్వర్యంలో సాక్షి మాక్‌టెస్టులు నిర్వహించనుంది. ఈ పరీక్షలను సాక్షి మీడియా, ఇక్ఫాయ్ యూనివర్సిటీ నిర్వహిస్తున్నాయి. పరీక్షకు కొద్ది రోజుల ముందు వాస్తవ పరీక్షలాంటి వాతావరణంలో జరిగే సాక్షి మాక్ టెస్టులు రాయడం ద్వారా విద్యార్థులు తమ ప్రిపరేషన్ స్థాయిని అంచనా వేసుకుని, ప్రిపరేషన్‌ను మరింత మెరుగుపరచుకోవచ్చు.

పరీక్షలు ఎప్పుడంటే..

రిజిస్టర్ చేసుకున్న ఫోన్ నెంబర్‌కు హాల్‌టికెట్ నంబర్ వస్తుంది. ఏప్రిల్ 27న నీట్, ఏప్రిల్ 28న ఈఏపీసెట్ అగ్రికల్చర్, ఇంజనీరింగ్ పరీక్షలుంటాయి. ఈ ఆన్‌లైన్ టెస్ట్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. ఈ సమయంలో ఎప్పుడైనా పరీక్ష రాసుకోవచ్చు. పరీక్ష సమయం 3:00 గంటలు. ఈ పరీక్షలను మీ హాల్‌టికెట్ నంబర్ (యూజర్ నేమ్), ఫోన్ నెంబర్ (పాస్‌వర్డ్)తో ఆ సమయంలో ఎప్పుడైనా లాగిన్ అయి రాసుకోవచ్చు. అలాగే పరీక్ష ముగిసిన వెంటనే మీ స్కోర్‌ను కూడా చూసుకోవచ్చు. మాక్ పరీక్షలను https://sakshimocktest. myrank. co. in వెబ్‌సైట్‌లో నిర్వహిస్తారు. ఈ పరీక్షలకు టెక్నాలజీ పాట్నర్‌గా మై ర్యాంక్ వ్యవహరిస్తోంది. టెస్ట్‌కి సంబంధించిన 'కీ'ని ఏప్రిల్ 30న ఇదే వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. పూర్తి వివరాలకు 95055 14424, 96660 13544, 96665 72244 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు.

క్లుప్తంగా...

బీజేపీని తిడుతూ దేవుళ్లపై రేవంత్ ప్రమాణమా?

● బీజేపీ నేత డా.కె.లక్ష్మణ్ సూటి ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: దేవుడి పేరు చెప్పి బీజేపీ ఓట్లడుగుతోందని ఓ వైపు ప్రచారం చేస్తూనే.. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామంటూ అదే దేవుడి మీద సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాణం చేస్తున్నారని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ విమర్శించారు. బుధవారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ దేవుడి పేరు చెప్పి రాజకీయం ఎవరు చేస్తున్నారో ప్రజలు ఆలోచించాలని కోరారు. రేవంత్‌రెడ్డి తానూ హిందువు నేనని, దేవుడంటే తనకు నమ్మకం ఉందంటూ దేవుళ్ళ మీద ప్రమాణం చేస్తూ రాజకీయాలు చేస్తున్నారని లక్ష్మణ్ నిందించారు. తెలంగాణలో బీఆర్ఎస్ పని ఖతమైందని, ఆ పార్టీని ఓఎల్ఎక్స్‌లో సేల్ అని పెట్టినా ఎవరూ కొనుగోలు చేయరని లక్ష్మణ్ ఎద్దేవా చేశారు.

కేసీఆర్ మాట్లాడే ఫోన్ తెచ్చింది రాజీవ్‌గాంధీనే

● టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: జైల్లో ఉన్న కూతురితో మాజీ సీఎం కేసీఆర్ మాట్లాడుతున్న ఫోన్‌ను కాంగ్రెస్ పార్టీనే తీసుకొచ్చిందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టెలీకమ్యూనికేషన్లను దేశానికి అందించిందని రాజీవ్ అని చెప్పారు. రాజీవ్‌గాంధీ దేశంలో ఐటీ విప్లవానికి నాంది పలికారని తెలిపారు. ఇప్పుడు పాలిస్తున్న మోదీ తెచ్చిందేమీ లేదని, తన తండ్రి రాజీవ్ ఆశయాల కోసం రాహుల్ గాంధీ ముందుకెళ్తున్నారని వ్యాఖ్యా నించారు. గాంధీ కుటుంబం గురించి మాట్లా డే బీఆర్ఎస్, బీజేపీ నేతలు చరిత్ర తెలుసుకుని మాట్లాడాలని జగ్గారెడ్డి హితవు పలికారు.

కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకుంది: డీకే అరుణ



పాలమూరు: సీఎం హోదాలో ఉండి కూడా రేవంత్‌రెడ్డి జిల్లాకు ఆరుసార్లు వచ్చారంటే కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకుందని మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలో డీకే అరుణ మాట్లాడుతూ...సీఎం రేవంత్‌రెడ్డి తన జిల్లాకు ఏం చేశారో చెప్పాకుండా బీజేపీ అభ్యర్థి అయిన తనపై అడ్డగోలుగా మాట్లాడటం సరికాదన్నారు. అధికారంలోకి వచ్చి 120 రోజులు అవుతుందని డిసెంబర్ 9న హామీలన్నింటినీ అమలు చేస్తానని చెప్పి ఇప్పటివరకు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. మతాల పేరిట విద్వేషాలు రెచ్చగొట్టడం, కుంభకోణాలు చేసింది కాంగ్రెస్ పార్టీయేనన్నారు.

కడియం, వెంకటరావులను అనర్హులుగా ప్రకటించాలి

● హైకోర్టులో బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద పిటిషన్



సాక్షి, హైదరాబాద్: స్టేషన్‌ఘన్‌పూర్, భద్రాచలం ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, తెల్లం వెంకటరావులను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'శ్రీహరి, వెంకటరా వులు 2023 నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. కడియం శ్రీహరి ఆయన కూతురు కావ్య, వెంకటరావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఒక పార్టీలో గెలిచి రాజీనామా చేయకుండా మరో పార్టీలో చేరిన వీరిని అనర్హులుగా ప్రకటించాలి. రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్ ప్రకారం వీరిద్దరూ ఎమ్మెల్యే లుగా కొనసాగేందుకు అనర్హులు. శ్రీహరి, వెంకటరావును అనర్హులుగా ప్రకటించాలని వినతి పత్రం ఇచ్చేందుకు స్పీకర్, అసెంబ్లీ కార్య దర్శిని కలిసేందుకు ప్రయత్నించినా అనుమతి వ్వడం లేదు. ఈ నెల 10న రిజిస్టర్ పోస్టు, అధికారిక ఈ మెయిల్ ద్వారా వినతి పత్రాన్ని పంపించాం. స్పీకర్ మా వినతిని తిరస్కరిస్తున్నారు. ఈ మెయిల్ ద్వారా పంపిన వినతి పత్రాలను పరిశీలించి 3 నెలల్లోగా నిర్ణయం తీసుకునేలా స్పీకర్ ఆదేశించాలి' అని ఆయన పిటిషన్‌లో కోరారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికల కమిటీ ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీతో భావసారూప్యత, సిద్ధాంతం పట్ల నమ్మకం ఉన్న నేతలను పార్టీలో చేర్చుకోవాలని ఏఐసీసీ నిర్ణయించింది. ఇందుకోసం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు టి.జగ్గారెడ్డి, బి.మహేశ్‌కుమార్ గౌడ్, కిసాన్ కాంగ్రెస్ వైస్‌చైర్మన్ ఎం.కోదండరెడ్డి సభ్యులుగా ఓ కమిటీని ఏఐసీసీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 25, 26 తేదీల్లో రెండు రోజుల పాటు కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు ఉంటాయని బుధవారం ఓ ప్రకటనలో గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

ప్రభుత్వం మెడలు వంచుతాం

బీఆర్ఎస్‌కు 12 లోక్‌సభ సీట్లు ఇవ్వండి

హామీలన్నీ అమలు చేసేదాకా సర్కారును వెంటాడుతాం..: కేసీఆర్



బుధవారం సూర్యాపేటలో నిర్వహించిన రోడ్‌షోకు హాజరైన ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న కేసీఆర్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రాష్ట్ర ప్రజలకు మంచి జరగాలన్నా.. ప్రభుత్వం హామీలను అమలు చేయాలన్నా.. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 10 నుంచి 12 సీట్లు ఇవ్వాలని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు ప్రజలకు పిలుపునిచ్చారు. బోగస్ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. హామీలన్నీ ఎగబెట్టిందని మండిపడ్డారు. ఇప్పుడు మళ్లీ లోక్‌సభ ఎన్నికల కోసం ప్రజలకు ముందుకు వచ్చి ఒట్లు వేస్తూ మోసం చేయాలని చూస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ వచ్చాక రైతు బంధులో దగా చేస్తోందని.. రైతుబీమా ఉంటుందో లేదో తెలియని పరిస్థితి తెచ్చారని మండిపడ్డారు. కరెంటు సరిగా రావడం లేదని, నీళ్లు అందడం లేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే.. భూమి, ఆకాశం ఒక్కటయ్యేలా ప్రజల తరఫున కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తామని ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేసీఆర్ బస్సుయాత్ర బుధవారం నల్లగొండ జిల్లా నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా బుధవారం మిర్యాలగూడ, సూర్యాపేటలలో నిర్వహించిన రోడ్‌షోలలో కేసీఆర్ ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''1956 నుంచి ఈనాటి వరకు కాంగ్రెస్ పార్టీనే తెలంగాణకు శత్రువు. అప్పుడు తెలంగాణను ఆంధ్రప్రదేశ్‌లో కలిపి 58 ఏళ్లు గోస పెట్టింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో 420 హామీలిచ్చి, బోగస్ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చింది. ఇచ్చిన హామీలన్నీ ఎగబెట్టింది. మళ్లీ లోక్‌సభ ఎన్నికల కోసం ప్రజల ముందుకు వచ్చి ఒట్లు వేస్తూ మోసం చేయాలని చూస్తోంది. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచుతాం. హామీలు అమలు చేయించగలుగుతాం. ఆ బాధ్యత నాదే. ప్రజలిచ్చే బలంతోనే పోరాటం చేయగలుతాం. అప్పుడే రైతులకు న్యాయం జరుగుతుంది. కరెంటు సరిగ్గా వస్తుంది. హామీలు నెరవేర్చకపోవడంతో ప్రజలకు, కాంగ్రెస్‌కు మధ్య పంచాయితీ వచ్చింది. ఆ పంచాయితీకి ప్రజల తరఫున పెద్ద మనిషిగా నేనుంటా.

పంటలు ఎండటం ఇదే మొదటిసారి

బీఆర్ఎస్ తొమ్మిళ్ల పాలనలో 18 పంటలకు ఏ మాత్రం ఇబ్బంది లేకుండా సాగర్ ఆయకట్టు నీళ్లు ఇచ్చి బంగారు పంటలు పండించాం. ఇప్పుడు నాగార్జున సాగర్‌లో నీళ్లున్నా, ఇచ్చే అవకాశమున్నా.. కాంగ్రెస్ దద్దమ్మలకు దమ్ములేక, ప్రాజెక్టును తీసుకుపోయి కృష్ణాబోర్డు చేతిలో పెట్టారు. మొత్తం పంటలన్నీ ఎండబెట్టారు. తెలంగాణ వచ్చాక పంటలు ఎండిపోవడం ఇదే మొదటిసారి. కేసీఆర్ ఉన్నన్ని రోజులు రెప్పపాటు కూడా పోని కరెంట్.. దిగిపోగానే మాయమైపోయిందా? కేసీఆర్ తొమ్మిదేళ్ల ఇచ్చిన కరెంటును నడిపించలేని అసమర్థులు ఈరోజు ఏలుతున్నారు. ఎందుకు చేతనవడం లేదు? ప్రజలను ఎందుకు బాధ పెడుతున్నారు? మిషన్ భగీరథ ఎందుకు నడపలేకపోతున్నారు? ప్రజలకు నీళ్లెందుకు ఇవ్వలేకపోతున్నారు?

రైతులకు అన్యాయం

జీవితాన్ని పణంగా పెట్టి, ఆమరణ దీక్ష చేసి రాష్ట్రాన్ని సాధించుకున్నాం. ఒక్కో మెట్టు కట్టుకొంటూ రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేసుకున్నామో ప్రజలకు తెలుసు. అలాంటి రాష్ట్రంలో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. మేం రైతులను ఆదుకోవాలన్న ఉద్దేశంతో దేశంలోనే మొదటిసారిగా ఏటా 15, 16 వేల కోట్ల రూపాయల రైతు బంధు ఇచ్చాం. ఇప్పుడు రైతుబంధు ఐదు ఎకరాలకేనంటూ ఎగబెడుతున్నారు. ఎందుకిలా? రైతులకు ఇవ్వడానికి మీకేం బాధ. అదేమైనా మీ అబ్బ సొత్తా..? రైతులందరికీ రైతుబంధు ఇవ్వాలి. బీఆర్ఎస్ రెండు దఫాలుగా రూ.35 వేల కోట్ల రుణమాఫీ చేసి, రైతులను ఆదుకుంది. ఈరోజున్న సీఎం కొన్ని నెలల కింద పరుగెత్తుకొని వచ్చి డిసెంబరు 9 నాడు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. ఎందుకు చేయలేదు? ఎందుకింత మోసం చేశారు? నన్ను

కేసీఆర్ భయపడతడా?

''నాలుగు నెలల కాంగ్రెస్ పాలనలో 225 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. గురుకులాల్లో తిండి సరిగా పెట్టడం లేదు. 135 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై.. నలుగురు ఐదుగురు చనిపోయారు. దానిపై ప్రశ్నిస్తే తెలంగాణలో కేసీఆర్ ఆనవాళ్లే లేకుండా చేస్తామని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. జైల్లో వేస్తామంటున్నారు. కేసీఆర్ భయపడతాడా? అలా భయపడితే తెలంగాణ వచ్చేదా? పేగులు తీసి మెడలేసుకుంటం, గుడ్లు తీసి గోలీలాడుతం, పండబెట్టి తొక్కుతం అంటూ సీఎం మాట్లాడుతున్నారు. కేసీఆర్ చెడ్డీ ఊడదీకుతామంటున్నారు. నా చెడ్డీతో ఏం చేసుకుంటారు? ఒక మాజీ సీఎంను టార్గెట్ చేసే విధానం ఇదేనా? 15 ఏళ్ల పోరాటం చేసి తెలంగాణ తెచ్చిన వ్యక్తిని పట్టుకొని ఇలా మాట్లాడుతారా? ప్రజలు ఆలోచించాలి''

తిట్టినా ఫర్వాలేదు. తెలంగాణ బిడ్డలకు అన్యాయం జరిగితే నా ప్రాణం పోయినా వదిలిపెట్టబోను. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతా.

ధాన్యం ఎందుకు కొనడం లేదు?

తన బస్సుయాత్ర వచ్చే దారిలో ఆర్జాలబావి వద్ద రైతులు ఆపి గోడు వెళ్లబోసుకున్నారు. ధాన్యం తెచ్చి 25 రోజులు అవుతున్నా కొనడం లేదని వాపోయారు. ప్రభుత్వం ఎందుకు కొనడం లేదు? ఈ పరిస్థితి ఎందుకు వస్తోంది? రైతులు బిచ్చగాళ్లలా కనిపిస్తున్నారా? ఒకసారి ప్రధాని మోదీ వడ్లు కొనబోమని మొండికేస్తే ఢిల్లీలో ధర్నా చేసినం. మోదీ మెడలు వంచి, మద్దతు ధరతో తెలంగాణ ధాన్యం కొనేలా చేశాం.

ఏపీ నీళ్లు తరలించుకుంటే నోరు మెదపరేం..

నీళ్లు, నిధుల కోసం, కరెంటు కోసం, ప్రజల కోసం ఉద్యమించి రాష్ట్రాన్ని సాధించుకున్నాం. ఆనాటి నుంచి ఈనాటి వరకు తెలంగాణ బతుకే నీళ్లపై పోరాటం. కేసీఆర్ పక్కకు జరిగిన నాలుగైదు నెలలకే నీళ్లు ఎలా మాయమైపోయాయి? నాలుగైదు నెలల కింద ధీమాతో ఉన్న రైతులు.. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వాకం కారణంగా ఇవాళ మళ్లీ బాధలో పడ్డారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నల్లగొండ జిల్లాలోనే ఉన్నా దద్దమ్మలాగా.. నాగార్జునసాగర్ డ్యామ్‌పై అధికారాన్ని కేంద్రానికి అప్పజెప్పారు. నీళ్లివ్వడం చేతనైతలేదా? సాగర్ టెయిల్ పాండ్ నుంచి 5 టీఎంసీల నీళ్లను ఏపీ వాళ్లు తీసుకెళ్లారు. అయినా మంత్రి ఉత్తమ్ నోరు మెదపకుండా ఎక్కడ పడుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఒకటో రెండో పిల్లర్లు కుంగిపోతే 60–70 టీఎంసీల నీళ్లను వదిలేసి రాకుండా చేశారు.

తులం బంగారం ఏమైంది?

మా హయాంలో రూ.200 పెన్షన్‌ను రూ.2 వేలు చేసుకున్నాం. దళిత బిడ్డలను లక్షాధికారులను చేసేందుకు దళితబంధు అమలు చేశాం. పేదబిడ్డలకు పెళ్లి చేయాలని రూ.లక్ష ఇచ్చేలా కల్యాణలక్ష్మి పెట్టాం. కాంగ్రెస్ వాళ్లు అదనంగా తులం బంగారం ఇస్తామన్నారు. ఇంతవరకు ఇవ్వలేదు, ఇవ్వరు కూడా. మహాలక్ష్మి పేరుతో ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పి ఎందుకు ఇవ్వడం లేదు? పెన్షన్లను రూ.4వేలకు పెంచుతామన్న హామీ ఏమైంది? నిరుద్యోగులకు రూ.4 వేల భృతి ఏమైంది?''అని కేసీఆర్ నిలదీశారు.

కేసీఆర్ కాన్వాయ్‌లో వాహనాలు ఢీ

మిర్యాలగూడ టౌన్: కేసీఆర్ బస్సుయాత్రలో భాగంగా మిర్యాలగూడలో రోడ్ షోకు వెళ్తుండగా.. వేములపల్లి మండలం బుగ్గబావిగూడెం వద్ద కాన్వాయ్‌లో స్వల్ప ప్రమాదం జరిగింది. ఒకదాని వెనుక మరొకటిగా వరుసగా 10 వాహనాలు ఢీకొన్నాయి. ఆ వాహనాల ముందు భాగం స్వల్పంగా దెబ్బతిన్నది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

తెలంగాణ తల్లికి పూలమాల వేసి..

● లోక్‌సభ ఎన్నికల ప్రచార బస్సు యాత్ర ప్రారంభించిన కేసీఆర్

సాక్షి, హైదరాబాద్/ సాక్షి ప్రతినిధి, నల్లగొండ: లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్ర బుధవారం మధ్యాహ్నం మొదలైంది. ఒంటి గంట సమయంలో పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌కు కేసీఆర్ చేరుకున్నారు. పార్టీ మహిళా కార్యకర్తలు మంగళ హారతులతో ఆయనకు స్వాగతం పలికారు. తర్వాత కేసీఆర్ తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నమస్కరించారు. అనంతరం ప్రత్యేక బస్సులో, కాన్వాయ్‌తో బయలుదేరారు. ఇన్నాళ్లూ తెలంగాణ భవన్ దక్షిణ గేటు నుంచి రాకపోకలు సాగించిన కేసీఆర్.. ఇప్పుడు కొత్తగా ఏర్పాటు చేసిన ఈశాన్య ద్వారం నుంచి బస్సు యాత్రకు బయలుదేరారు. మార్గమధ్యలో ఆయా ప్రాంతాల్లో వేచి ఉన్న పార్టీ శ్రేణులకు అభివాదం చేస్తూ ముందుకుసాగారు. నల్లగొండ పట్టణ శివారులోని అన్నెపర్తి వద్ద ఆగి రైతులతో మాట్లాడారు. తర్వాత ఆర్జాలబావి వద్ద కూడా రైతులతో మాట్లాడి.. వారి బాధలను తెలుసుకున్నారు. మాడ్గులపల్లిలోని ఓ హోటల్ వద్ద కాసేపు ఆగారు. తర్వాత మిర్యాలగూడ, సూర్యాపేట రోడ్ షోలలో ప్రసంగించారు. రాత్రి సూర్యాపేటలోని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో బస చేశారు.

నేడు భువనగిరిలో రోడ్ షో

బస్సుయాత్రలో భాగంగా రెండో రోజు గురువారం సాయంత్రం వరకు కేసీఆర్ సూర్యాపేటలోనే ఉండనున్నారు. నల్లగొండ, భువనగిరి లోక్‌సభ సెగ్మెంట్ల నేతలతో ప్రచార సరళిని సమీక్షించనున్నారు. సాయంత్రం భువనగిరిలో నిర్వహించే రోడ్ షోలో ప్రసంగిస్తారు. మొత్తంగా మే 10వ తేదీ వరకు 17 రోజుల పాటు 12 లోక్‌సభ నియోజకవర్గాల మీదుగా కేసీఆర్ బస్సు యాత్ర సాగనుంది.

రైతులతో కేసీఆర్ మాటా మంతీ





నల్లగొండ రూరల్: కేసీఆర్ బస్సుయాత్రలో భాగంగా నల్లగొండ మండలం అన్నెపర్తి, ఆర్జాలబావి గ్రామాల వద్ద రైతులతో మాట్లాడారు.

అన్నెపర్తి వద్ద..

రైతు వెంకన్న: రైతుల పరిస్థితి ఆగమాగం ఉంది సార్..

కేసీఆర్: ఎందుకు.. ఏమైంది?

రైతు: మీరు దిగిపోయారు. వానలు లేవు. వడ్లకు బోనస్ లేదు, రుణమాఫీ చెయ్యలేదు.

కేసీఆర్: ఇటు రాంఁడి.. బాగున్నారా.. (మాజీ సర్పంచ్ అరవింద్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆండాలు, గట్టయ్యలను పిలిచారు) మాజీ ప్రజాప్రతినిధులు: బాగున్నాం సార్. ఐకేపీ సెంటర్‌లో బాధలు చూడాలి సార్.

కేసీఆర్: ఎలాంటి సమస్య ఉన్నా పోరాడుదాం. ఏదైనా ఉంటే భూపాల్‌రెడ్డి (నల్లగొండ మాజీ ఎమ్మెల్యే), కృష్ణారెడ్డి (బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి)కి చెప్పండి. దాన్ని తీర్చేందుకు ప్రయత్నం చేస్తాం.

ఆర్జాలబావి వద్ద..

రైతు గుండగోని పాపయ్య: సార్, మీ పాలనే బాగుండే. 20 రోజులైంది ధాన్యం తూకం కాలేదు. బోనస్ లేదు. రుణమాఫీలేదు. చెరువుల్లో నీళ్లు లేవు.. సక్రమంగా కరెంటు లేదు. రైతు బంధు రాలే. మళ్లీ మీరే రావాలి సార్.

కేసీఆర్: ధాన్యం కొంటలేరా?

రైతు: కొంటలేరు సార్. ఎండకు చస్తున్నాం.

కేసీఆర్: అందరూ రెడీగా ఉండండి.. పోరాటం చేద్దాం.. ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చరో చూద్దాం.

హామీలు అమలు చేస్తే.. రాజీనామా చేస్తా..



చేయకపోతే నువ్వు సీఎం పదవికి రాజీనామా చేస్తావా..

- ఆగస్ట్ 15 నాటికి రూ.39 వేల కోట్ల రుణమాఫీ చేయాలి
- రేపు ఉదయం 11 గంటలకు గన్‌పార్క్ అమరుల స్తూపం వద్ద ప్రమాణం చేద్దాం
- సంగారెడ్డి, ఖమ్మంలో సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి/ఖమ్మం: 'వందరోజుల్లో రుణమాఫీ చేస్తానని చెప్పి.. మళ్లీ వచ్చే ఆగస్టు 15 తేదీలోగా చేస్తానని రేవంత్‌రెడ్డి నయా నాటకం మొదలుపెట్టిండు. మిస్టర్ రేవంత్‌రెడ్డి ఆగస్టు 15వ తారీఖులోపు రూ.2 లక్షల రుణమాఫీ చేయకపోతే ముఖ్యమంత్రి పదవికి రాజీనామాకు సిద్ధమా? నువ్వు పార్టీ రద్దు చేసుకుంటవా అని రేవంత్‌రెడ్డి నన్ను అంటున్నడు. ఖమ్మం నుంచి మళ్లీ చెబుతున్నా. నేను సవాల్‌ను స్వీకరిస్తున్నా. ఇచ్చిన మాట ప్రకారం వడ్డీతో సహా రూ.39వేల కోట్లు రుణమాఫీ, ఆరు గ్యారంటీలు అమలు చేయకపోతే రాజీనామాకు సిద్ధమా? ఈనెల 26న ఉదయం 10గంటలకు అసెంబ్లీ ఎదురుగా అమరవీరుల స్తూపం వద్దకు వస్తా, నువ్వు రా. అక్కడ బాండ్ పేపర్‌పై రాసి ప్రమాణం చేయి. నువ్వు అమలు చేస్తే.. నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ప్రమాణం చేస్తా. మళ్లీ పోటీ కూడా చేయను. అమలు చేయకపోతే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడానికి సిద్ధమా'అని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రశ్నించారు. బుధవారం సంగారెడ్డిలో జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, ఖమ్మంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు నామినేషన్ దాఖలు చేశారు. ఈ రెండు కార్యక్రమాలకు హాజరైన అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి తీరును విమర్శించారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ గ్రాఫ్ పడిపోయిందని, కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న రేవంత్‌రెడ్డిది పూటకోసారి మాట మార్చడం ఆయన నైజం అన్నారు. రేవంత్ తొండి రాజకీయం చేస్తున్నారన్నారు. ఆరు గ్యారంటీలు, 13 హామీలను వంద రోజుల్లో అమలు చేస్తామని మీ తల్లిగా మాట ఇస్తున్నానని సోనియా సంతకాలతో బాండు పేపర్లు రాయించి పంపిణీ చేశారని. రాహుల్, ప్రియాంక గాంధీలతో ప్రకటన చేయించారని గుర్తు చేశారు. 120 రోజులు గడుస్తున్నా, హామీలు అమలు చేయకుండా ఇప్పుడు దేవుళ్లపై ప్రమాణం చేస్తున్నారన్నారు. ప్రజలు నమ్మేలా లేక దేవుడిని వాడుకుంటున్నారని ఎద్దేవా చేశారు. గ్యారంటీల అమలుకు శాసనసభ తొలి సమావేశాల్లోనే చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి, మడమ తిప్పారని, రూ.2లక్షల రుణమాఫీకి విధివిధానాలనే ఖరారు చేయలేదని, మరోమారు గడువు పెడుతున్న రైతులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం కింద ఒక్కో మహిళకు నెలకు రూ.2,500 చొప్పున ఇస్తామన్న సాయం 4 నెలలుగా ఇవ్వకుండా ఒక్కో మహిళకు రూ.పది వేల బాకీ పడ్డారని, కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం, రైతుభరోసా సాయం ఎకరానికి రూ.15 వేలు, వరికి క్వింటాల్‌కు రూ.500 బోనస్, పెంచిన పింఛన్లు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, నిరుద్యోగభృతి నెలకు రూ.4 వేలు ఎప్పుడు ఇస్తారని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీకి సీపీఎం, సీపీఐ ఎందుకు ఊడిగం చేస్తున్నాయని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఆయా పార్టీల నేతలు విజ్ఞతతో ఆలోచించాలన్నారు.

కాళేశ్వరంపై చర్చకు రా!

▶ మొదటి పేజీ తరువాయి

హనుమకొండ జిల్లా మడికొండలో నిర్వహించిన కాంగ్రెస్ జన జాతర బహిరంగ సభలో, అంతకు ముందు సికింద్రాబాద్‌లోని ప్యాట్నీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో రేవంత్ ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''కేసీఆర్ ప్రతిపక్ష నేతగా అసెంబ్లీకి రాలేదు. అడిగేటోళ్లు, చూపించేటోళ్లు నీవోళ్లే.. గంటల కొద్దీ టీవీ స్టుడియోలో కూర్చుని మాట్లాడావ్. మేధస్సు కరిగించి కాళేశ్వరం కట్టినమంటున్నవ్ కదా.. మరి మేడిగడ్డ మేడిపండు ఎందుకైంది. సూటిగా సవాల్ విసురుతున్నా.. మేడిగడ్డ వద్దే మేధావులతో చర్చిద్దాం.. కేసీఆర్.. దమ్ముంటే చర్చకు రావాలి. గత పదేళ్లలో దోపిడీ కోసం మెదడు రంగరించారు కనుకనే కాళేశ్వరం కూలిపోయింది. లక్ష కోట్లు ఖర్చు పెట్టిన ప్రాజెక్టు ఏడాదన్నా లేకపాయే.. ఇంకా ఏం మాట్లాడుతున్నారు. ఇంతకంటే దివాళాకోరు తీరు ఎక్కడా ఉండదు. కాంగ్రెస్ హయాంలో దశాబ్దాల కింద కట్టిన నాగార్జునసాగర్, ఎస్సారెస్పీ, దేవాదుల, శ్రీశైలం, భీమా, నెట్టెంపాడు.. ఇలా ఎన్నో ప్రాజెక్టులు చెక్కు చెదరకుండా ఉన్నాయి.

ఆ ఇద్దరూ తోడు దొంగలు

ప్రధాని మోదీ, కేసీఆర్ తోడు దొంగలు. ఒక నాణేనికి బొమ్మ బొరుసులాంటి వాళ్లు. వారి చీకటి ఒప్పందాలు, ముసుగు రాజకీయాలతో దేశాన్ని మోదీ, రాష్ట్రాన్ని కేసీఆర్ భ్రష్టు పట్టించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌కు బుద్ధి చెప్పిన ప్రజలు.. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి, మోదీకి గుణపాఠం చెప్పాలి. వారి కుట్రలను భగ్నం చేయాలి. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న ప్రధాని మోదీ.. పదేళ్లలో ఇచ్చింది 7 లక్షల ఉద్యోగాలు. ఏమైనా పొంతన ఉందా? మోదీ ప్రజల సంక్షేమాన్ని



హనుమకొండ జిల్లా మడికొండలో జరిగిన బహిరంగ సభకు హాజరైన జనం. ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

విస్మరించి అదానీ, అంబానీలకు దోచిపెట్టారు. బీజేపీ నల్ల చట్టాలతో అంబానీ, అదానీలకు వ్యవసాయ రంగాన్ని కట్టబెట్టే కుట్ర చేసింది. ఢిల్లీ సరిహద్దుల్లో హరియాణా, పంజాబ్ రైతులు చేసిన ఉద్యమంతో ప్రధాని మోదీ దిగివచ్చి క్షమాణలు చెప్పిన విషయాన్ని మర్చిపోగలమా? బీజేపీ ప్రజా సంక్షేమాన్ని వదిలేసి మత రాజకీయాలకు పాల్పడుతోంది. దేవుడు గుడిలో ఉండాలి.. భక్తి గుండెలో ఉండాలి. అంతే తప్ప రాజకీయం చేయొద్దు.

ఓరుగల్లులో విజయం ప్రజాపాలనకు నాంది

అసెంబ్లీ ఎన్నికలకు ముందు నేను చేపట్టిన పాదయాత్ర సందర్భంగా.. తెలంగాణను పట్టిపీడిస్తున్న కేసీఆర్ పాలన నుంచి విముక్తి కోరాను. ఆ పిలుపు మేరకు ఇక్కడి 12 అసెంబ్లీ స్థానాల్లో 10 మంది ఎమ్మెల్యేలను గెలిపించి ఓరుగల్లు ప్రజలు ప్రజాపాలనకు పునాదులు వేశారు. ఎర్రబెల్లి దయాకర్‌రావు వంటి చీడపురుగును ఓడించిన యశస్విని, ఝాన్సీరెడ్డి ప్రజల మదిలో నిలిచారు. ఓరుగల్లు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు... ఐటీ విస్తరణతో పాటు హైదరాబాద్- వరంగల్- రామగుండం ఇండస్ట్రియల్ కారిడార్‌తో యువతకు ఉపాధి కల్పిస్తాం. వానాకాలం వస్తే నీళ్ల నిలిచిపోయి, మురికి కంపు కొట్టే గోసను రూపుమాపుతాం. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మిస్తాం. హైదరాబాద్ మాదిరి ఔటర్ రింగురోడ్డు నిర్మించి.. విమానాలు సరాసరిగా దించగలిగేలా మహర్దశ కల్పిస్తాం'' అని సీఎం రేవంత్ చెప్పారు. వరంగల్ సభలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రోహిత్ చౌదరి, మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, సీతక్క, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, మామిడాల యశస్వినిరెడ్డి, వరంగల్ అభ్యర్థి కడియం కావ్య తదితరులు పాల్గొన్నారు.

హరీశ్.. రాజీనామా పత్రం జేబులో పెట్టుకో..

''బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఒక మాట అన్నడు.. రైతు రుణమాఫీ చేసి చూపిస్తే రాజీనామా చేస్తానని అన్నడు. నేను ఈ వేదిక మీది నుంచి మాట ఇస్తున్నా.. రామప్ప శివుని సాక్షిగా, సమ్మక్క-సారలమ్మ సాక్షిగా, వేయి స్తంభాల గుడి సాక్షిగా చెప్తున్నా.. సూర్యుడు పడమరన ఉదయించినా, భూమి ఆకాశం తిరగబడ్డా, తుపాను వచ్చినా, భూకంపం వచ్చినా, భూమి బద్దలైనా సరే.. పంద్రాగస్టు లోపల తెలంగాణ రైతాంగానికి రెండు లక్షల రుణమాఫీ చేసి తీరుతా.. హరీశ్‌రావు.. సిద్దిపేట ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని అన్నావు కదా.. రాజీనామా పత్రం జేబులో పెట్టుకో.. పంద్రాగస్టు నాడు నీతో మాట్లాడుతా.. మాటమీద ఉండాలె.. మీ మామలా దళితుడిని సీఎం చేస్తా, లేకుంటే తలకాయ నరుక్కుంటానని తలకాయ లేని మాటలు మాట్లాడుదామని అనుకుంటున్నవేమో! ఆనాడు వంద రూపాయల పెట్రోల్ తెచ్చుకున్నవ్.. పది పైసల అగ్గిపెట్టె దొరకలే.. ఇప్పుడట్లనే అనుకుంటున్నవేమో.. రుణమాఫీ చేసి పంద్రాగస్టు నాడు నీ ఆఖరి శాసనసభ సభ్యత్వం సంగతి తేలుస్తా''అని పేర్కొన్నారు.

మహంకాళి ఆలయంలో పూజలు.. భారీ ర్యాలీ

బుధవారం ఉదయం సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద నుంచి ప్యాట్నీ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ కార్నర్ మీటింగ్ నిర్వహించిన అనంతరం సీఎం రేవంత్ మరో కార్యక్రమానికి వెళ్లిపోగా.. దానం నాగేందర్ ఇతర నేతలతో కలసి నామినేషన్ వేసేందుకు జీహెచ్ఎంసీ కార్యాలయానికి వెళ్లారు. సీఎం పర్యటన, ర్యాలీ, కార్నర్ మీటింగ్ సందర్భంగా సుమారు 3 గంటల పాటు సికింద్రాబాద్ ప్రాంతంలో ట్రాఫిక్ నిలిచిపోయి.. వాహనదారులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు.

కాంగ్రెస్ హయాంలోనే హైదరాబాద్ అభివృద్ధి

''గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనే హైదరాబాద్ నగరం అభివృద్ధి జరిగింది. 2004, 2009లో వైఎస్సార్ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనే కృష్ణా, గోదావరి జలాలతో హైదరాబాద్ దాహార్తిని తీర్చింది. ఔటర్ రింగ్‌రోడ్డు, ఎయిర్‌పోర్టు, మెట్రో రైలు, ఐటీ కంపెనీలు, ఫార్మా కంపెనీలను తీసుకువచ్చింది. సికింద్రాబాద్‌లో దానం నాగేందర్‌ను ఎంపీ గెలిపిస్తే కేంద్రంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తారు. ఓటేసే బాధ్యత మీదైతే కీలక స్థానం కల్పించే బాధ్యత నాది. హైదరాబాద్‌లో మత సామరస్యాన్ని కాపాడింది కాంగ్రెస్ పార్టీయే. కానీ మోదీ దేవుళ్ల పేరు చెప్తూ, దేవుళ్లను రోడ్డు మీదకు తెస్తూ ఓట్లు వేయించుకోవాలని చూస్తున్నారు. సికింద్రాబాద్ నుంచి ప్రాతినిధ్యం వహించిన దత్తాత్రేయ, కిషన్‌రెడ్డిలు కేంద్ర మంత్రులుగా ఉన్నా.. ఈ ప్రాంతానికి చేసిందేమీ లేదు. 2021లో నగరాన్ని వరదలు ముంచెత్తితే.. కిషన్‌రెడ్డి హోం శాఖ సహాయ మంత్రిగా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ తన పరిధిలో ఉన్నా ఒక్క రూపాయి కూడా తీసుకుని రాలేకపోయారు. ప్రధాని మోదీ హైదరాబాద్‌కు వచ్చే పెట్టుబడులను గుజరాత్‌కు తరలించుకుపోతుంటే కూడా కిషన్‌రెడ్డి ఏమి చేయలేకపోయారు...'' అని రేవంత్ విమర్శించారు. సికింద్రాబాద్‌లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పద్మారావుగౌడ్ మంచోడేనని.. కానీ వాళ్ల గురువు కేసీఆర్‌ను నమ్ముకుంటే మాత్రం మునిగినట్లేనని వ్యాఖ్యానించారు.

Affidavit

మాధవీలత ఆస్తులు రూ. 221.40 కోట్లు



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి కొంపల్లి మాధవీలత తన కుటుంబానికి రూ.221.40 కోట్ల ఆస్తులు ఉన్నట్టు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. రూ.27.03 కోట్ల అప్పులున్నాయని, చేతిలో రూ.40 వేల నగదు, తన పేరు మీద ఒక క్రిమినల్ కేసు పెండింగ్‌లో ఉందన్నారు. తన కుటుంబానికి వాహనం మాత్రం లేదని తెలిపారు.

'నామా' ఆస్తులు రూ.155.90 కోట్లు



ఖమ్మం మయూరి సెంటర్: ఖమ్మం బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు తన ఆస్తులు రూ.155,90,58,791 గా చూపించారు. ఇందులో తన పేరిట చరాస్తులు రూ. 56,97,40,399, స్థిరాస్తులు రూ.14,71,14, 800 ఉన్నాయని, తన సతీమణి చిన్నమ్మ పేరిట చరాస్తులు రూ.15,05,26, 849, స్థిరాస్తులు 63,20,12,943 ఉన్నాయని వెల్లడించారు.

ఏ వాహనం లేని వెంకట్రాంరెడ్డి



జోగిపేట (అందోల్): తన పేరు మీద ఏ వాహనం లేదని, ఒక క్రిమినల్ కేసు పెండింగ్‌లో ఉందని మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి తన అఫిడవిట్‌లో తెలిపారు. స్థిరాస్తుల విలువ రూ. 37,85,00,000గా, ఇందులో ఆయన సతీమణి ప్రణీతరెడ్డి పేర రూ.15,68,00,000 ఉన్నట్టు పేర్కొన్నారు. తన దగ్గర లక్షా 16 వేల నగదు, 100 గ్రాముల బంగారం ఉందన్నారు.

అరూరి కుటుంబ ఆస్తులు రూ.28 కోట్లు



సాక్షి, వరంగల్: వరంగల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ తన కుటుంబ ఆస్తుల విలువ రూ.28,74,54,041 అఫిడవిట్‌లో చూపించారు. రఘునాథపల్లి మండలం వెల్ది గ్రామంలో, ధర్మసాగర్ మండలం రాంపూర్‌లో, అమ్మవారిపేటలో 16.18 ఎకరాల వ్యవసాయ భూమి, వరంగల్, హనుమకొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లో 1,324 గజాల విస్తీర్ణం కలిగిన ఐదు ఓపెన్ ప్లాట్లతో పాటు 12 ఎకరాలకు పైగా వ్యవసాయేతర భూమి ఉందని పేర్కొన్నారు. శ్రీదత్తా ఇంజనీరింగ్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో వివిధ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్టుగా తెలిపారు.

దానం ఆస్తులు రూ.31.63 కోట్లు



సికింద్రాబాద్: సికింద్రాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ తన కుటుంబానికి రూ.31.63 కోట్ల ఆస్తులు, రూ.6.40 కోట్ల అప్పులు ఉన్నట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తన చేతిలో రూ.4.50 లక్షలు, భార్య చేతిలో రూ.4.10 లక్షలు, కుమార్తె చేతిలో రూ.6,27 లక్షల నగదు ఉందన్నారు. ఏ వాహనం లేదని చెప్పారు.

జీవన్‌రెడ్డిపై 11 కేసులు

ఖలీల్‌వాడి: 2017 నుంచి ఇప్పటివరకు తనపై 11 పోలీసు కేసులు నమోదయ్యాయని నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇందులో ఎక్కువగా ధర్నాల సందర్భంగా ట్రాఫిక్ ఇబ్బందుల కింద నమోదైన కేసులే ఎక్కువగా ఉన్నాయి. జీవన్‌రెడ్డి పేరిట 31.11 ఎకరాల వ్యవసాయ భూమి వివిధ ప్రాంతాల్లో ఉండగా, భార్య అహల్యదేవి పేరు మీద 3.28 ఎకరాల భూమి ఉంది. జీవన్‌రెడ్డికి వివిధ బ్యాంకుల్లో రూ. 56.94 లక్షల అప్పు ఉంది.

నేటితో నామినేషన్ల ఘట్టం సమాప్తం

26న నామినేషన్ల పరిశీలన..
29 వరకు ఉపసంహరణ గడువు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు సాధారణ ఎన్నికలతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక నామినేషన్ల దాఖలు గడువు గురువారంతో ముగియనుంది. ఈనెల 26న నామినేషన్ల పరిశీలన నిర్వహించనున్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు 29తో ముగియనుంది. మే 13న పోలింగ్ నిర్వహించనున్నారు. తెలంగాణ సహా దేశంలోని 543 లోక్‌సభ స్థానాల్లో పోలైన ఓట్లను జూన్ 4న లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: వ్యవసాయపరంగా అభివృద్ధిపథంలో దూసుకెళుతూ...రైతు ఉద్యమాల కేంద్రంగా ఉన్న ఇందూరులో గత కొన్నేళ్లుగా ఎన్నికల్లో ప్రజలు విలక్షణ తీర్పు ఇస్తూ వస్తున్నారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో తీర్పును ప్రభావితం చేసే అంశాలు ప్రధాన పార్టీలకు గుబులు పుట్టిస్తున్నాయి. బీజేపీ నుంచి నిజామాబాద్ సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అర్వింద్, కాంగ్రెస్ నుంచి సీనియర్ నేత తాటిపర్తి జీవన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ తరపున మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ బరిలో ఉన్నారు. త్రిముఖ పోటీగా భావిస్తున్నప్పటికీ రెండు జాతీయ పార్టీల మధ్యే హోరాహోరీ పోరు ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 1952 నుంచి 2019 వరకు నిజామాబాద్ లోక్‌సభ స్థానానికి 17 సార్లు ఎన్నికలు జరగగా 11 సార్లు కాంగ్రెస్, 3 సార్లు టీడీపీ, ఒకసారి స్వతంత్ర, ఒకసారి బీఆర్‌ఎస్, ఒకసారి బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారు. ఇక నిజామాబాద్ నుంచి ఇప్పటివరకు ఎవరినీ కేంద్ర మంత్రి పదవి వరించలేదు.

ఇందూరు నిర్ణేతలు వీరే



పసుపు, చెరకు రైతులు | గల్ఫ్ కుటుంబాలు | బీడీ కార్మికులు

విలక్షణ తీర్పు ఇస్తున్న నిజామాబాద్ ఓటర్లు

ప్రధాన పోటీ బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్యే...

గల్ఫ్ సంక్షేమ బోర్డు

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో గల్ఫ్ వలస కార్మిక కుటుంబాల ఓట్లు 22% ఉన్నట్టు అంచనా. దీంతో ఆయా కార్మికుల కుటుంబాల ఓట్ల కోసం రెండు జాతీయ పార్టీలు గట్టి ప్రయత్నాలు చేస్తున్నాయి. గల్ఫ్ సంక్షేమ బోర్డు డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. కాగా గల్ఫ్ కార్మిక సంఘాలు 60 ఉన్నాయి. ఈ సంఘాల జేఏసీకి జీవన్‌రెడ్డి గౌరవాధ్యక్షుడిగా ఉన్నారు. దీంతో తనను తమ ప్రతినిధిగా పార్లమెంట్‌కు పంపాలని జీవన్‌రెడ్డి కోరుతున్నారు. గల్ఫ్ బోర్డు ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడంతో పాటు తగిన కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్టు చెబుతున్నారు. గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన కార్మికులకు గౌరవం దక్కుతోందంటే బీజేపీ, మోదీ మాత్రమే కారణమని అర్వింద్ పేర్కొంటున్నారు.

- ఉత్తర, దక్షిణ భారతానికి మధ్యలో హబ్ మాదిరిగా ఉన్న నిజామాబాద్ ప్రాంతంలో కంటెయినర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో డ్రైపోర్ట్ ఏర్పాటు చేయాలని చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు కోరుతున్నారు. డ్రైపోర్ట్ ఏర్పాటయితే ఇక్కడి నుంచే నేరుగా వ్యవసాయ ఉత్పత్తులను ప్రాసెస్ చేసి ఎగుమతులు చేయవచ్చని అంటున్నారు.
- జక్రాన్‌పల్లి వద్ద విమానాశ్రయం ఏర్పాటు చేయాలనే డిమాండ్, బీడీ కార్మికుల అంశం సైతం ఈ ఎన్నికల్లో ప్రభావం చూపనుంది.

నిజామాబాద్ స్కాన్

నిజాం షుగర్స్ కీలక అంశం

నిజాం షుగర్ ఫ్యాక్టరీలను అర్వింద్ తెరిపించలేకపోయారని జీవన్‌రెడ్డి విమర్శలు చేస్తున్నారు. తాము మాత్రం 2025లో నిజాం షుగర్స్‌ను తెరిపిస్తామని జీవన్‌రెడ్డి గట్టిగా చెబుతున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రక్రియ ప్రారంభించిందన్నారు. అయితే ఎంపీ అర్వింద్ సైతం ఈసారి నిజాం షుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని చెబుతున్నారు. చెరకుతో పాటు వరి, మొక్కజొన్నల నుంచి ఇథనాల్ ఉత్పత్తి సైతం చేసే యూనిట్లు ఏర్పాటు చేస్తామంటున్నారు.

పసుపు బోర్డు

పసుపు బోర్డు మంజూరు చేస్తున్నట్టు గత శాసనసభ ఎన్నికల ముందు ప్రధాని మోదీ ప్రకటన చేశారు. దీనికి సంబంధించి ఇప్పటికే కేంద్రం గెజిట్ విడుదల చేసిందని, పసుపు ధర సైతం రూ. 20 వేలకు తీసుకొచ్చినట్టు అర్వింద్ చెబుతున్నారు. ఈ ప్రాంతానికి పసుపు శుద్ధి కర్మాగారాలు, ప్రాసెసింగ్, ప్యాకింగ్ యూనిట్లు వస్తాయని ఆయన అంటున్నారు. రీసెర్చ్ సెంటర్‌తో రైతులకు కొత్త వంగడాలు, మరిన్ని సబ్సిడీలు అందుతాయని పేర్కొంటున్నారు. అయితే పసుపు బోర్డు కాగితాలకే పరిమితమైందని కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి విమర్శలు సంధిస్తున్నారు. మొత్తానికి పసుపు బోర్డు గెజిట్ విడుదలైనా, ఈ ఎన్నికల్లోనూ ఈ అంశంపై రెండు జాతీయ పార్టీల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది.

కులాల వారీగా చూస్తే...

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో మున్నూరు కాపు, ముస్లిం, పద్మశాలి ఓట్లు గణనీయంగా ఉన్నాయి. తర్వాత ముదిరాజ్, రెడ్డి, యాదవ్, గౌడ్‌ల ఓట్లు చెప్పుకోదగిన స్థాయిలో ఉన్నాయి. దీంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు కులసంఘాలతో ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో మహిళల ఓట్లే ఎక్కువగా ఉన్నాయి. మొత్తం ఓట్లు 16,89,957 ఉండగా, పురుషుల ఓట్లు 7,99,458, మహిళల ఓట్లు 8,90,411 ఉన్నాయి.

185 నామినేషన్లలో 178 పసుపు రైతులవే..

2019 ఎన్నికల్లో నిజామాబాద్ లోక్‌సభ స్థానానికి ఏకంగా 185 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో పసుపు బోర్డు డిమాండ్‌తో రైతులు దాఖలు చేసిన నామినేషన్లే 178 ఉండడం గమనార్హం. ఈ అంశం దేశవ్యాప్తంగా సంచలనం కలిగించింది. దీంతో ఇక్కడ పోలింగ్ నిర్వహణకు బెంగళూరు నుంచి ప్రత్యేకంగా ఈవీఎంలు తీసుకొచ్చి ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

పోటీలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులు


అర్వింద్ బీజేపీ


జీవన్‌రెడ్డి కాంగ్రెస్


బాజిరెడ్డి గోవర్ధన్ బీఆర్‌ఎస్

అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓట్ల వివరాలు ఇలా...

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఆర్మూర్	98,116	1,12,612	6	2,10,734
బోధన్	1,05,609	1,15,701	4	2,21,314
నిజామాబాద్ అర్బన్	1,44,645	1,54,961	41	2,99,647
నిజామాబాద్ రూరల్	1,18,607	1,35,523	6	2,54,136
బాల్కొండ	1,03,995	1,21,263	2	2,25,260
జగిత్యాల	1,12,554	1,22,198	25	2,34,777
కోరుట్ల	1,15,932	1,28,153	4	2,44,089
మొత్తం	7,99,458	8,90,411	88	16,89,957

2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆయా అభ్యర్థులకు వచ్చిన ఓట్లు..

బీజేపీ - ధర్మపురి అర్వింద్
4,80,584 (45 శాతం)

టీఆర్‌ఎస్ - కల్వకుంట్ల కవిత
4,09,709 (39 శాతం)

కాంగ్రెస్ - మధుయాష్కీ
69,240 (7 శాతం)

ఎట్టకేలకు ఆ మూడూ..

కరీంనగర్, ఖమ్మం, హైదరాబాద్ అభ్యర్థుల ఖరారు

- నామినేషన్ల గడువు ముగిసే ముందు రోజు అభ్యర్థుల ఎంపిక పూర్తి చేసిన కాంగ్రెస్
- వెలమ, రెడ్డి, మైనార్టీలకు కేటాయించిన అధిష్టానం
- వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో నామినేషన్ల దాఖలు గడువు ముగుస్తున్న వేళ కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేసింది. ఇప్పటివరకు ప్రకటించకుండా మిగిలిపోయిన మూడు స్థానాలు ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్ పార్లమెంటు అభ్యర్థులను ప్రకటించేసింది. ఈ మేరకు బుధవారం రాత్రి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ జాబితాను విడుదల చేశారు. కరీంనగర్ నుంచి వెలిచాల రాజేందర్ రావు, హైదరాబాద్ నుంచి డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ వలీవుల్లా సమీర్, ఖమ్మం నుంచి రామసహాయం రఘురాం రెడ్డికి అవకాశం ఇచ్చారు. రఘురాంరెడ్డి తండ్రి సురేందర్‌రెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు. ఆయన డోర్నకల్ నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, వరంగల్ లోక్‌సభ నుంచి నాలుగుసార్లు ఎంపీగా పనిచేశారు. రఘురాంరెడ్డి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సినీ హీరో దగ్గుబాటి వెంకటేష్‌లకు వియ్యంకుడు. కాగా నామినేషన్ల దాఖలుకు గురువారం చివరి రోజు.



అగ్రవర్ణాలకు 8 స్థానాలు: రాష్ట్రంలోని మొత్తం 17 స్థానాలకూ అభ్యర్థుల ఎంపిక పూర్తి కాగా, ఇందులో 8 టికెట్లను కాంగ్రెస్ అగ్రవర్ణాలకు కేటాయించింది. ఆదిలాబాద్, మహబూబాబాద్ ఎస్టీ రిజర్వుడు స్థానాల్లో ఒకటి ఆదివాసీ, మరోటి లంబాడా సామాజిక వర్గాలకు కేటాయించగా, ఎస్సీ రిజర్వుడు స్థానాలైన పెద్దపల్లి, నాగర్‌కర్నూల్‌లను మాలలకు, వరంగల్‌ను మాదిగలకు కేటాయించింది. మెదక్, సికింద్రాబాద్, జహీరాబా ద్ స్థానాలను బీసీలకు కేటాయించగా, హైదరాబాద్ సీటును మైనార్టీకి, కరీంనగర్ స్థానాన్ని వెలమ సామాజిక వర్గానికి, నిజామాబాద్, నల్లగొండ, భువనగిరి, ఖమ్మం, మహబూబ్‌నగర్, చేవెళ్ల, మల్కాజ్‌గిరి స్థానాల్లో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతలకు టికెట్ కేటాయించడం గమనార్హం.

అది బీసీకే..: మూడు లోక్‌సభ స్థానాలతోపాటు త్వరలో ఎన్నికలు జరగనున్న నల్లగొండ–ఖమ్మం–వరంగల్ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానానికీ కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించింది. బీసీ వర్గానికి చెందిన తీన్మార్ మల్లన్న పేరును ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఖరారుచేశారు. కరీంనగర్ లోక్‌సభ రేసులో ఆయన పేరు వినిపించినా.. అక్కడ ఓసీ వర్గానికి టికెట్ కేటాయించారు. దీంతో బీసీ వర్గానికి చెందిన మల్లన్నకు పట్టభద్రుల ఎమ్మెల్సీ టికెట్ కేటాయించడం గమనార్హం.


మే 13న సెలవు

ఉల్లంఘించే సంస్థలపై కఠినచర్యలు: సీఈఓ వికాస్‌రాజ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలతోపాటు కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి మే 13న జరగనున్న పోలింగ్‌లో ఓటేసేందుకు అర్హత కలిగిన ఉద్యోగులందరికీ సంబంధిత పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య సంస్థలు చెల్లింపులతో కూడిన సెలవును మంజూరు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. సెలవు మంజూరు చేయని సంస్థలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. రోజువారీ వేతన ఉద్యోగులు/ క్యాజువల్ వర్కర్లు కూడా సెలవుకు అర్హులని స్పష్టం చేసింది. ఈ మేరకు ఉద్యోగులందరికీ సెలవు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలింగ్, కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు కానున్న కార్యాలయాల ఉద్యోగులకు ఈ నెల 12తోపాటు ఓట్లను లెక్కించే జూన్ 4న సైతం సెలవు జారీ చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించామన్నారు.

కేరళ ఎన్నికల ప్రచారానికి డిప్యూటీ సీఎం భట్టి



కేరళ ఎన్నికల ప్రచారంలో అభివాదం చేస్తున్న భట్టి విక్రమార్క తదితరులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం కేరళ ఎన్నికల ప్రచారానికి వెళ్లారు. ఢిల్లీ నుంచి కేరళ వెళ్లిన ఆయన పాల్‌ఘాట్ జిల్లాలోని అలత్తూరు పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి రమ్య హరిదాస్ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పాల్‌ఘాట్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తంగప్పన్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున భట్టికి స్వాగతం పలికారు.

కంటోన్మెంట్‌లో 'సర్వే' నామినేషన్

మల్కాజ్‌గిరి ఎంపీ స్థానానికి కూడా నేడు నామినేషన్ వేయనున్నట్టు వెల్లడి



కంటోన్మెంట్: కేంద్ర మాజీమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత సర్వే సత్యనారాయణ కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి బుధవారం కాంగ్రెస్ రెబెల్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. గురువారం మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానానికి సైతం నామినేషన్ వేయనున్నట్టు ఆయన ప్రకటించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో సర్వే సత్యనారాయణ కంటోన్మెంట్ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల నాటికి సర్వేని కాదని కంటోన్మెంట్ కాంగ్రెస్ టికెట్ గద్దర్ కూతురు వెన్నెలకు ఇచ్చారు. తాజాగా జరుగుతున్న ఉప ఎన్నికలోనూ కాంగ్రెస్ టికెట్ శ్రీగణేశ్‌కు ఇవ్వడంతో ఆయన మనస్తాపం చెంది కాంగ్రెస్ రెబెల్‌గా బరిలో దిగుతున్నారు.

ఒట్టేసి దేవుడితో రాజకీయాలా?



పార్టీలో చేరుతున్నవారికి కండువాలు కప్పుతున్న బండి సంజయ్

- దేశం, ధర్మం అంటే బీజేపీని విమర్శిస్తారా
- సీఎం రేవంత్‌పై సంజయ్ ధ్వజం
- బీజేపీలో చేరిన బీఆర్‌ఎస్ శ్రేణులు
- నేడు బండి సంజయ్ నామినేషన్

కరీంనగర్ టౌన్, చొప్పదండి: సీఎం రేవంత్‌రెడ్డి దేవుడి పేరిట రాజకీయాలు చేస్తున్నారని బీజేపీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. కరీంనగర్ జిల్లా చొప్పదండిలో బుధవారం పలువురు యువకులు బీజేపీలో చేరగా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ రేవంత్ ఎక్కడికెళ్లినా దేవుడి మీద ఒట్టేస్తున్నారని, అదే దేవుళ్లపై బీజేపీ నేతలు మాట్లాడితే మాత్రం విమర్శలు గుప్పిస్తున్నారని ధ్వజమెత్తారు. దేశం, ధర్మం గురించి బీజేపీ మాట్లాడితే అది రాజకీయం ఎలా అవుతుందని ప్రశ్నించారు.

బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలోకి చేరికలు

వేములవాడ రూరల్ ఎంపీపీ బండ మల్లేశం యాదవ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు గోపు బాలరాజు ఆధ్వర్యంలో వందలాది మంది బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. చొప్పదండికి చెందిన బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీరాం ముదిరాజ్ సహా వందలాది మంది, మానకొండూర్ మండలం కొండపల్కలకు చెందిన వంద మందికిపైగా బీజేపీలో చేరారు.

బండి నామినేషన్‌కు భూపేంద్రపటేల్

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ గురువారం ఉదయం 11.30 గంటలకు కరీంనగర్ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయనున్నారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర రజనీకాంత్ భాయ్ పటేల్, కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి సమక్షంలో నామినేషన్లు సమర్పించనున్నారు. ఈ సందర్భంగా కరీంనగర్‌లో భారీ ర్యాలీ నిర్వహించేందుకు బీజేపీ శ్రేణులు సిద్ధమయ్యాయి.

గుజరాత్ సీఎం షెడ్యూల్ ఇదీ

గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ ఉదయం 7 గంటలకు గుజరాత్ నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు వస్తారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో 10 గంటలకు కరీంనగర్ చేరుకుంటారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో కలిసి ఓపెన్‌టాప్ జీప్‌లో ర్యాలీలో పాల్గొంటారు. టవర్‌సర్కిల్ వద్ద కార్యకర్తలు, ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. నామినేషన్ కార్యక్రమం అనంతరం నాగర్‌కర్నూలు వెళ్తారు. అక్కడ బీజేపీ అభ్యర్థి నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొని తిరిగి గుజరాత్‌కు వెళ్తారు.

ఒవైసీ లాపతా.. జబ్‌సే ఆయీ మాధవీ లతా..

కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ వ్యాఖ్య

భారీ ర్యాలీతో నామినేషన్ వేసిన బీజేపీ అభ్యర్థి మాధవీలత



చార్మినార్ వద్ద ప్రసంగిస్తున్న కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్. చిత్రంలో మాధవీలత తదితరులు

చార్మినార్ (హైదరాబాద్): ఒవైసీ లాపతా.. జబ్‌సే ఆయీ మాధవీ లతా.. (మాధవీ లత వచ్చినప్పటి నుంచి ఒవైసీ కనిపించడం లేదు) అని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ వ్యాఖ్యానించారు. మాధవీ లత హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అనగానే సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పత్తా లేకుండా పోయారని ఎద్దేవా చేశారు. బుధవారం మాధవీ లత చార్మినార్ భాగ్యలక్ష్మీ దేవాలయాన్ని సందర్శించి తన నామినేషన్ పత్రాలను అమ్మవారి పాదాల చెంత పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బీజేపీ నేతలతో కలిసి చార్మినార్ నుంచి ర్యాలీగా బయలుదేరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు. ఆమెతో పాటు పూజా కార్యక్రమంలో పాల్గొన్న అనురాగ్ ఠాకూర్ ప్రచార రథంపై నుంచి మాట్లాడుతూ.. 40 ఏళ్లుగా హైదరాబాద్‌లో అధికారం చెలాయిస్తున్న మజ్లిస్ పార్టీ పాతబస్తీ అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. అసదుద్దీన్ ఒవైసీ, రాహుల్‌గాంధీలు ఔరంగజేబు యూనివర్సిటీలో చదివారని.. వారిద్దరి ఆలోచనలు ఒకేతీరుగా ఉంటాయన్నారు. మజ్లిస్‌తో కాంగ్రెస్ లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకున్నందునే ఇప్పటివరకు హైదరాబాద్ అభ్యర్థిని ఇంకా ప్రకటించ లేదని దుయ్యబట్టారు. పాతబస్తీలో మత రాజకీయాలు చేస్తూ రాజకీయ పబ్బం గడుపుతున్న మజ్లిస్‌కు ఈసారి ఓటమి తప్పదన్నారు. చార్మినార్ నుంచి బయలుదేరిన ప్రచార ర్యాలీ మదీనా, అఫ్జల్‌గంజ్, బేగంబజార్, మోజంజాహీ మార్కెట్, నాంపల్లి ద్వారా లక్డీకాపూల్ వరకు సాగింది.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- కవిత నిర్దోషి అయితే బెయిల్ ఎందుకు రాలేదు?
- కేంద్రమంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు కోసం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అమలుకు వీలుకాని హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో విఫలమైందని కేంద్ర సమాచార శాఖ మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్ ధ్వజమెత్తారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, బీజేపీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి మాధవీలతకు వస్తున్న ప్రజాదరణ చూస్తుంటే ఆమె గెలుపు పక్కా అని తేలిపోయిందని, ఒవైసీ ఓటమి ఖాయమని జోస్యం చెప్పారు. అక్బరుద్దీన్ ఒవైసీ, అసదుద్దీన్ ఒవైసీలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా.. రాహుల్, సోనియా గాంధీ మాట్లాడరేమిటని మంత్రి ప్రశ్నించారు. దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని చూసే పార్టీలతో కాంగ్రెస్ జత కట్టిందని ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ 40 సీట్లలో గెలవడానికి కూడా తిప్పలు పడుతోందని కేంద్ర మంత్రి ఠాకూర్ అన్నారు. వయనాడ్‌లో పోటీ చేస్తున్న రాహుల్ గాంధీ ఓడిపోతున్నారని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ హయాంలో మహిళా బిల్లు ఎందుకు పెట్టలేదని, బీఆర్ అంబేడ్కర్‌కు భారత రత్న ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు.

కవితకు బెయిల్ ఎందుకు రాలేదు?

బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నిర్దోషి అయితే బెయిల్ ఎందుకు రాలేదని మంత్రి ప్రశ్నించారు. కవిత ఇక్కడ దోచుకుంది చాలక ఢిల్లీ వెళ్లి దోచుకోవాలని చూశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లిక్కర్ కుంభకోణం కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సహా అంతా జైలులో ఊచలు లెక్క పెడుతున్నారని ఎద్దేవా చేశారు.

అనిత ముహూర్తం.. దానం నామినేషన్

భార్య ఎదురురాగా నామినేషన్‌కు కదిలిన నాగేందర్

బంజారాహిల్స్: సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా దానం నాగేందర్ బుధవారం నామినేషన్ వేశారు. సరిగ్గా ఉదయం 8 గంటలకు ఆయన భార్య అనిత పెట్టిన ముహూర్తం ప్రకారం నామినేషన్ పత్రాలతో బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–3లోని తన ఇంటి నుంచి బయలుదేరారు. భార్య అనిత హారతి ఇచ్చి ఎదురురాగా కూతుళ్లు, అల్లుడు ఆయనకు ఎదురెళ్లి వీడ్కోలు పలికారు. ప్రతి ఎన్నికలోనూ భార్య అనిత పెట్టిన ముహూర్తానికే నాగేందర్ నామినేషన్ వేయడం ఆనవాయితీగా వస్తుంది. నామినేషన్ పత్రాలు ఏ సమయంలో భర్తీ చేయాలి, నామినేషన్ వేయడానికి ఇంటి నుంచి ఏ ముహూర్తంలో బయలుదేరాలి, రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు ఏ సమయంలో అందజేయాలి ఇవన్నీ సిద్ధాంతులు, జ్యోతిష్యులను సంప్రదించిన అనంతరం ఆమె నిర్ణయిస్తారు. ఆమె చెప్పిన ముహూర్తం వేళకే నాగేందర్ నామినేషన్ వేయడం ఆనవాయితీ. ముందుగా ఆమె హారతి ఇచ్చి ఎదురెళ్లగా ఆ తరువాత మహంకాళి ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించి అటు నుంచి నామినేషన్ కేంద్రానికి తరలివెళ్లారు.



నామినేషన్‌కు వెళ్లే క్రమంలో కుటుంబ సభ్యులతో దానం



కేరళలో కూటముల కొట్లాట

ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ హోరాహోరీ

కొన్ని స్థానాల్లో బీజేపీ టఫ్ ఫైట్

రాజకీయ కథాకళి

కేరళ రాజకీయాల్లో ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ కూటములదే హవా. బీజేపీకి కేడర్ ఉన్నా ప్రజాదరణ అంతంతే. దక్షిణాదిలో బీజేపీ ఇంతవరకు ఒక్క లోక్‌సభ స్థానం కూడా గెలవని ఏకైక రాష్ట్రం కేరళే. అయినా 2019 లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఇక్కడ 13 శాతం ఓట్లు సాధించింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం 11.3 శాతానికే పరిమితమైంది. ఈసారి రాష్ట్రంలో ఎలాగైనా పాగా వేయడమే లక్ష్యంగా కాషాయదళం కష్టపడుతోంది. క్రిస్టియన్, ముస్లిం ఓటర్లకూ చేరువయ్యేందుకు ప్రయత్నిస్తోంది. ఫలితంగా పలు స్థానాల్లో పోటీ ఇప్పటికే త్రిముఖంగా మారింది. ఇక జాతీయ స్థాయిలో ఇండియా కూటమి భాగస్వాములైన కాంగ్రెస్, వామపక్షాలు కేరళలో మాత్రం పరస్పరం తలపడుతున్నాయి. రాష్ట్రంలోని మొత్తం 20 లోక్‌సభ స్థానాలకూ శుక్రవారం రెండో విడతలో ఒకేసారి పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో హోరాహోరీ పోరు జరుగుతున్న స్థానాలపై ఫోకస్...

- సాక్షి, నేషనల్ డెస్క్

రెండో విడతలో... నారీ శక్తి 8 శాతమే!

- కోటీశ్వరుల్లో 'టాప్' లేపిన కర్నాటక
- ఆరుగురికి చిల్లిగవ్వ కూడా లేదట!

లోక్‌సభ ఎన్నికల రెండో విడత పోలింగ్ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. 26న దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలోని 88 స్థానాల్లో పోలింగ్ జరగనుంది (మధ్యప్రదేశ్‌లోని బేతుల్‌లో బీఎస్పీ అభ్యర్థి అశోక్ భలావి మరణంతో అక్కడ పోలింగ్ వాయిదా పడింది). రెండో దశలో 1,210 మంది పోటీలో ఉన్నారు. వీరి ఎన్నికల అఫిడవిట్లను అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) విశ్లేషించగా పలు ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి...



- రెండో విడత బరిలో నిలిచిన అభ్యర్థుల్లో మహిళలు కేవలం 8 శాతమే ఉన్నారు!
- పట్టభద్రులు, ఆపై చదువులు చదివిన వారు 43 శాతం.
- 21 శాతం మందిపై క్రిమినల్ కేసులున్నాయి. వారిలో 167 మంది తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ జాబితాలో కాంగ్రెస్ (35), తర్వాత బీజేపీ (31), సీపీఎం (14) టాప్‌లో ఉన్నాయి.
- 390 మంది కోటీశ్వరులున్నారు. వీరిలో 105 మంది ఇండిపెండెంట్లు. తర్వాతి స్థానాల్లో బీజేపీ (64), కాంగ్రెస్ (62), బీఎస్పీ (24) నిలిచాయి. ఇద్దరికి 500 కోట్ల పైగా ఆస్తి ఉంది!
- టాప్-10 సంపన్న అభ్యర్థుల్లో కర్నాటక టాప్‌లో ఉంది. మండ్య కాంగ్రెస్ అభ్యర్థి వెంకటరమణే గౌడ రూ.623 కోట్లతో 'టాప్' లేపారు. బెంగళూరు రూరల్ కాంగ్రెస్ అభ్యర్థి డీకే సురేశ్ రూ.593 కోట్ల ఆస్తులతో రెండో స్థానంలో నిలిచారు. హేమమాలినికి రూ.279 కోట్ల ఆస్తులున్నాయి. మధ్యప్రదేశ్‌లో హోషంగాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి సంజయ్ శర్మ (రూ.233 కోట్లు), మండ్యలో జేడీ(ఎస్) చీఫ్ కుమారస్వామి (రూ.217 కోట్లు), యూపీలో అమ్రోహా బీజేపీ అభ్యర్థి కన్వర్ సింగ్ తన్వర్ (రూ.215 కోట్లు) టాప్-10లో నిలిచారు.
- రెండో విడత అభ్యర్థుల సగటు ఆస్తుల విలువ రూ.5.2 కోట్లు. ఆరుగురు తమకు చిల్లిగవ్వ కూడా లేదని ప్రకటించడం విశేషం!
- అభ్యర్థుల్లో ఎక్కువ మంది 40-50 ఏళ్ల మధ్య వారే. సగటు వయసు 49 ఏళ్లు. 70-80 ఏళ్ల మధ్య వయస్కులు 49 మంది ఉండగా ఇద్దరు 80 ఏళ్లు పైబడ్డారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

త్రిసూర్


సునీల్ కుమార్


సురేశ్ గోపి


కె.మురళీధరన్

రాజకీయ నేతగా మారిన ప్రముఖ నటు డు సురేశ్ గోపి ఇక్కడ బీజేపీ అభ్యర్థిగా నిలి చారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లోనూ ఆయన ఇక్కణ్నుంచే పోటీ చేసి మూడో స్థానంలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి టీఎన్ ప్రతాపన్ విజయం సాధించారు. అయితే అప్పట్లో ఎన్నికల ప్రచారం మొదలయ్యాక ఆలస్యంగా గోపీ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. ఈసారి కాంగ్రెస్ నుంచి వడకర ఎంపీ కె.మురళీధరన్ పోటీ చేస్తున్నారు. ఆయన మాజీ సీఎం కె.కరుణాకరన్ కుమారుడు. నాలుగు పర్యా యా లు ఎంపీగా, రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన మురళీధరన్‌కు విన్నింగ్ మాస్టర్‌గా పేరుంది. సీపీఐ నుంచి మాజీ మంత్రి వి.ఎస్.సునీల్ కుమార్ పోటీలో ఉన్నారు. 35 శాతమున్న క్రిస్టియన్ ఓటర్లు నిర్ణాయకం కానున్నారు. 16 శాతమున్న ముస్లిం ఓట్లూ కీలకమే. ప్రధాని మోదీ ఇప్పటికే త్రిసూర్‌లో రోడ్డు షో జరిపారు. కరువన్నూర్ కో ఆపరేటివ్ బ్యాంక్ స్కాం అధికార ఎల్‌డీఎఫ్‌కు ఇక్కడ ప్రతికూలంగా మారనుందని అంచనా.

వయనాడ్



కె.సురేంద్రన్

ఇది 2009 లోక్‌సభ ఎన్నికల ముందు ఏర్పాటైన నియోజకవర్గం. అప్పటినుంచి ఇక్కడ కాంగ్రెస్ హవాయే నడుస్తోంది. 2009, 2014 ఎన్నికల్లో ఆ పార్టీ తరఫున ఎం.ఐ.షానవాజ్ గెలిచారు. 2019లో అమేథీలో బీజేపీ అభ్యర్థి స్మృతీ ఇరానీ నుంచి గట్టి పోటీ ఖాయమని తేలడంతో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ వ్యూహాత్మకంగా వయనాడ్ నుంచీ బరిలో దిగారు. అమేథీలో ఓడినా ఇక్కడ ఆయన ఏకంగా 4.31 లక్షల పై చిలుకు ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించారు. ఎన్డీఏ అభ్యర్థి, బీడీజే (ఎస్) నేత తుషార్ వెల్లప్పల్లికి 78,000 ఓట్లు పోలయ్యాయి. ఈసారి మాత్రం రాహుల్‌కు ఇక్కడ వార్ వన్ సైడ్ అన్నట్టుగా లేదు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.సురేంద్రన్, సీపీఐ అభ్యర్థి అన్నీ రాజా ఆయనకు గట్టి పోటీ ఇస్తున్నారు. దాంతో ఇక్కడ ముక్కోణపు పోరు నెలకొంది. అన్నీ రాజా సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా భార్య. ఇక సురేంద్రన్ ఉత్తర కేరళలో గట్టి పట్టున్న నాయకుడు. 2019 ఎన్నికల్లో పతనంతిట్టలో పోటీ చేసి మూడో స్థానంలో నిలిచారు. 2019 ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్‌కు 64.9 శాతం ఓటర్లు రాగా, సీపీఎంకు కేవలం 25.24 శాతం ఓట్లే లభించాయి. ఎన్నికల ముందే ఇక్కడ కాంగ్రెస్‌కు షాక్ తగిలింది. కాంగ్రెస్ డీసీసీ జనరల్ సెక్రటరీ పీఎం సుధాకరన్ రాజీనామా చేసి బీజేపీలో చేరారు. పార్టీ ముమ్మర ప్రచారంతో హోరెత్తిస్తోంది. ప్రధాని మోదీ కూడా ఇక్కడ రోడ్ షోలు నిర్వహించారు. అమేథీ మాదిరిగానే వయనాడ్ నుంచి కూడా రాహుల్ పారిపోవడం ఖాయమంటూ ఎద్దేవా చేశారు.


రాహుల్ గాంధీ


అన్నీ రాజా

పథనంతిట్ట


థామస్ ఇజాక్


ఆంటో ఆంటోనీ


అనిల్ ఆంటోనీ

ఇక్కడ కూడా త్రిముఖ పోటీ వాతావరణమే నెలకొంది. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ సీఎం ఏకే ఆంటోనీ కుమారుడైన అనిల్ ఆంటోనీని బీజేపీ బరిలో నిలిపింది. సిట్టింగ్ ఎంపీ ఆంటో ఆంటోనీకి కాంగ్రెస్ మరోసారి అవకాశమిచ్చింది. సీపీఎం తరఫున మాజీ మంత్రి థామస్ ఇజాక్ పోటీలో ఉన్నారు. తన కుమారుడు ఓడాలని కోరుకుంటున్నానని, ఆంటో ఆంటోనీదే విజయమని ఏకే ఆంటోనీ ప్రకటించడం విశేషం! శబరిమల ఆలయం ఈ నియోజకవర్గ పరిధిలోనే ఉంది. ప్రధాన అభ్యర్థులు ముగ్గురూ కేథలిక్స్ క్రైస్తవులే కావడం విశేషం! 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆంటో ఆంటోనీ 37.11 శాతం ఓట్లతో సీపీఎం అభ్యర్థి వీణా జార్జ్‌పై 44 వేల ఓట్ల మెజారిటీతో గెలిచారు. బీజేపీ అభ్యర్థి కె.సురేంద్రన్ 29 శాతం ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. అయితే 2009 ఎన్నికల్లో బీజేపీకి 7 శాతం ఓట్లు రాగా 2014లో 16 శాతానికి, 2019లో 29 శాతానికి పెరిగాయి.

పాలక్కాడ్


శ్రీకందన్


విజయ రాఘవన్


సి.కృష్ణకుమార్

బీజేపీ ఆశలు, ఆకాంక్షలకు పాలక్కాడ్ నియోజకవర్గం కీలకం కానుంది. కేరళలో బీజేపీకి స్పష్టమైన ఆధిక్యం ఉన్న ఏకైక మున్సిపాలిటీ ఇది. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున వీకే శ్రీకందన్ ఇక్కడ గెలిచారు. ఈసారి కూడా పార్టీ తరఫున ఆయనే బరిలో ఉన్నారు. సీపీఎం అభ్యర్థి విజయ రాఘవన్‌కు గట్టి పోటీనిస్తున్నారు. ఇక బీజేపీ నుంచి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.కృష్ణకుమార్ వరుసగా రెండోసారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. 2019 ఎన్నికల్లో కృష్ణ కుమార్ 21.44 శాతం ఓట్లతో మూడో స్థానంతో సరిపెట్టుకున్నారు. అయితే గత మూడు సార్వత్రిక ఎన్నికల నుంచి ఇక్కడ బీజేపీ ఓటు శాతం పెరుగుతూ వస్తోంది.

అట్టింగల్


అదూర్ ప్రకాశ్


వి.జోయ్


వి.మురళీధరన్

ఇక్కడ కూడా ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్, బీజేపీ మధ్య ముక్కోణపు పోటీ నెలకొంది. సిట్టింగ్ ఎంపీ అదూర్ ప్రకాశ్‌ను కాంగ్రెస్ మరోసారి పోటీలో నిలిపింది. బీజేపీ తరఫున కేంద్ర సహాయ మంత్రి వి.మురళీధరన్ పోటీ చేస్తున్నారు. సీపీఎం నుంచి వి.జోయ్ బరిలో ఉన్నారు. 2019 ఎన్నికల్లో అదూర్ 2,80,995 ఓట్లతో (38.34 శాతం) గెలిచారు. సీపీఎం అభ్యర్థి అనిరుద్ధ్ సంపత్‌కు 34.5 శాతం, బీజేపీ అభ్యర్థి శోభా సురేంద్రన్‌కు 24.97 శాతం ఓట్లు లభించాయి. అట్టింగల్‌లో కూడా బీజేపీ ఓటు బ్యాంక్ క్రమంగా పెరుగుతూ వస్తోంది.

- కేరళలో తిరువనంతపురం లోక్‌సభ స్థానంలో కూడా హోరాహోరీ పోరు సాగుతోంది. కాంగ్రెస్ నుంచి హాట్రిక్ వీరుడు శశిథరూర్ పోటీలో ఉండగా కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌ను బీజేపీ బరిలో దింపింది. ఎల్‌డీఎఫ్ సంకీర్ణం తరఫున పి.రవీంద్రన్ (సీపీఐ) తలపడుతున్నారు.


కాసర్‌గోడ్


ఎం.వి.బాలకృష్ణన్


ఎంఎల్ అశ్విని


రాజ్‌మోహన్

సిట్టింగ్ ఎంపీ రాజ్‌మోహన్ ఉన్నితాన్ మరోసారి కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థి సతీశ్ చంద్రన్‌పై ఆయన 1.4 లక్షల మెజారిటీతో గెలిచారు. బీజేపీ ఈ విడత ఎంఎల్ అశ్వినికి అవకాశమిచ్చింది. గెలుపుపై ఆమె ధీమా వ్యక్తం చేస్తున్నా పోటీ ప్రధానంగా కాంగ్రెస్, సీపీఎం మధ్యే ఉండనుంది. కొద్ది రోజులుగా సీపీఎం అభ్యర్థి ఎం.వి.బాలకృష్ణన్ పట్ల స్పష్టమైన మొగ్గ కన్పిస్తోందని పరిశీలకులు చెబుతున్నారు. బీజేపీకి ప్రజా మద్దతు పెరుగుతోందని, మోదీ సర్కారుకు ఈసారి రాష్ట్ర ప్రజలు ఓటేస్తారని అశ్విని అంటున్నారు.



వాజ్‌పేయి మేజిక్

మూడోసారి ఐదేళ్ల పాలన

ఎన్డీఏ సంకీర్ణం సూపర్‌హిట్

గతం

ప్రాంతీయ పార్టీల దన్ను లేనిదే సంపూర్ణ ఆధిక్యం అసాధ్యమని గుర్తించిన బీజేపీ 13వ లోక్‌సభ ఎన్నికల్లో వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. 20కి పైగా పార్టీలను నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్డీఏ) గూటి కిందకు తెచ్చి మెజారిటీ సాధించింది. సొంత బలం పెరగకున్నా భాగస్వాముల సాయంతో మళ్లీ అధికారంలోకి వచ్చి దేశాన్ని ఐదేళ్లూ విజయవంతంగా పాలించింది. కాంగ్రెస్ మాత్రం అంతర్గత సంక్షోభంతో బాగా దెబ్బ తిన్నది..

- సాక్షి, నేషనల్ డెస్క్

1998 ఎన్నికల తర్వాత బీజేపీ ఏర్పాటు చేసిన నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్డీఏ) జాతీయ రాజకీయాల్లో పార్టీ గ్రాఫ్ బలపడేందుకు దోహదపడింది. దీనికి వాజ్‌పేయి తొలి చైర్మన్ కాగా జార్జ్ ఫెర్నాండెజ్ కన్వీనర్. బీజేపీతో పాటు జేడీ (యూ), శివసేన, టీడీపీ, జేడీ(ఎస్) కూటమిలో ముఖ్య పార్టీలుగా ఉన్నాయి. 1999 లోక్‌సభ ఎన్నికలు సెప్టెంబర్ 5 నుంచి అక్టోబర్ 3 దాకా ఐదు దశల్లో జరిగాయి. కార్గిల్ యుద్ధం, పోఖ్రాన్ అణు పరీక్షలు బీజేపీకి బాగా కలిసొచ్చాయి. వాజ్‌పేయి చరిష్మా కూడా తోడై ఎన్డీఏకు 298 స్థానాలు దక్కాయి. 1984 తర్వాత ఏ పార్టీకైనా, సంకీర్ణానికైనా లోక్‌సభలో మెజారిటీ దక్కడం అదే తొలిసారి. బీజేపీకి 182 సీట్లొస్తే కాంగ్రెస్ 114తో పరిమితమైంది. సీపీఎం 33, టీడీపీ 29, సమాజ్‌వాదీ 26, జేడీయూ 21 సీట్లు గెలుచుకున్నాయి. సీపీఐకి కేవలం నాలుగు సీట్లే రావడంతో జాతీయ పార్టీ హోదా కోల్పోయింది! ఫలితాల అనంతరం డీఎంకే వంటి మరిన్ని పార్టీలు చేరడంతో ఎన్డీఏ కూటమి మరింత బలపడింది. అక్టోబర్ 13న ప్రధానిగా వాజ్‌పేయి మూడోసారి ప్రమాణం చేశారు. మొత్తమ్మీద 1996 నుంచి 1999 మధ్య మూడేళ్లలో లోక్‌సభకు ఏకంగా మూడుసార్లు ఎన్నికలు జరగడం విశేషం!

13వ లోక్‌సభలో పార్టీల బలాబలాలు

(మొత్తం స్థానాలు 543)

పార్టీ	స్థానాలు
బీజేపీ	182
కాంగ్రెస్	114
సీపీఎం	33
టీడీపీ	29
సమాజ్‌వాదీ	26
జేడీ(యూ)	21
శివసేన	15
బీఎస్పీ	14
ఇతరులు	109

కాంగ్రెస్‌లో సంక్షోభం

కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సోనియాగాంధీ బాధ్యతలు స్వీకరించిన ఏడాదికే పార్టీలో ముసలం మొదలైంది. జన్మతః విదేశీయురాలైన సోనియాను ప్రధాని అభ్యర్థిగా అంగీకరించేందుకు సీనియర్ నేతలు శరద్ పవార్, పీఏ సంగ్మా, తారిఖ్ అన్వర్ తీవ్రంగా వ్యతిరేకించారు. కలత చెందిన సోనియా రాజీనామా చేశారు. కాంగ్రెస్ ఆమెకు మద్దతుగా నిలిచింది. కార్యకర్తలు నిరసనలు, నిరాహార దీక్షలతో హోరెత్తించారు. చివరికి 1999 మే 20న పవార్, సంగ్మా, అన్వర్‌పై కాంగ్రెస్ బహిష్కరణ వేటు వేసింది. దాంతో సోనియా రాజీనామాను వెనక్కు తీసుకుని పార్టీ సారథిగా కొనసాగారు. ఈ పరిణామం ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రతికూలంగా మారింది. బీజేపీ 'స్వదేశీ వాజ్‌పేయి - విదేశీ సోనియా' నినాదాన్ని ఎత్తుకుంది. సోనియా అధ్యక్షతన కాంగ్రెస్‌కు అవే తొలి ఎన్నికలు.

పవార్ సొంత పార్టీ

సోనియాగాంధీ విదేశీయతను ప్రశ్నించి కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చిన శరద్‌పవార్, పీఏ సంగ్మా, తారిఖ్ అన్వర్ జూన్ 10న నేషనలిస్ట్ కాంగ్రెస్ పేరిట సొంత పార్టీ పెట్టుకున్నారు. తొలి ఎన్నికల్లోనే 2.27 శాతం ఓట్లతో 8 స్థానాలను కైవసం చేసుకున్నారు.

గుజరాత్ అల్లర్లు

నరేంద్ర మోదీ పాలనలోని గుజరాత్‌లో 2002 ఫిబ్రవరిలో చెలరేగిన మత ఘర్షణలతో వాజ్‌పేయి సర్కారు బాగా అప్రతిష్ట పాలైంది. సబర్మతి ఎక్స్‌ప్రెస్‌కు అల్లరి మూకలు నిప్పంటించడంతో అయోధ్య నుంచి తిరిగొస్తున్న 59 మంది హిందూ భక్తులు మరణించారు. తర్వాత నెల పాటు చెలరేగిన హింసలో వెయ్యి మందికి పైనే చనిపోయారు. ఈ హింసాకాండను వాజ్‌పేయి ఖండించినా దాన్ని అరికట్టలేదన్న అపవాదు మూటగట్టుకున్నారు.

విశేషాలు...

- ప్రధానిగా వాజ్‌పేయి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. స్వర్ణ చతుర్భుజి పేరిట హైవేలను విస్తరించారు. ప్రధాని గ్రామీణ్ సడక్ యోజనతో రూరల్ రోడ్లకు అక్షరాలా మహర్దశ పట్టింది.
- టెలికం సేవల విస్తరణకు కీలక అడుగులు పడ్డాయి. లైసెన్స్ ఫీజుల స్థానంలో ఆదాయ పంపిణీ విధానం ప్రవేశపెట్టారు. 2000 సెప్టెంబర్ 15న బీఎస్ఎన్ఎల్‌ను ఏర్పాటు చేశారు.
- ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ విభాగం ఏర్పాటైంది. బాల్కో, హిందుస్తాన్ జింక్, ఐపీసీఎల్, వీఎస్ఎన్ఎల్ వంటి అగ్రగామి కంపెనీలను ప్రైవేటీకరించారు.
- పెట్రోలియం ధరలపై నియంత్రణ ఎత్తేయడానికి వాజ్‌పేయి సర్కారే బీజం వేసింది.

ఫ్యామిలీ ప్యాకేజీ

దేవెగౌడ కుటుంబం నుంచి లోక్‌సభ బరిలో ముగ్గురు

గత ఎన్నికల్లోనూ అంతే

మొత్తం తొమ్మిది మంది రాజకీయాల్లో



కర్నాటక జనాలకు జేడీఎస్ అధినేత, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ 'కుటుంబ కథాచిత్రమ్' చూపిస్తున్నారు! ఆ కుటుంబం నుంచి ఈసారి కూడా ముగ్గురు లోక్‌సభ ఎన్నికల బరిలో ఉండటం విశేషం. తమ వొక్కళిగ సామాజికవర్గ ప్రాబల్యం అధికంగా ఉన్న పాత మైసూరు ప్రాంతంలో వారు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. దాంతో ప్రత్యర్థులు జేడీ(ఎస్)ను 'ప్రైవేట్ లిమిటెడ్ పార్టీ ఆఫ్ ఫ్యామిలీ' అంటూ జోరుగా ఎద్దేవా చేస్తున్నారు. ఇటీవలి కాలం దాకా ఇవే విమర్శలు చేసిన బీజేపీ ఈసారి జేడీ(ఎస్)తో పొత్తు పెట్టుకోవడం విశేషం!

- సాక్షి, నేషనల్ డెస్క్


- కుమారస్వామి


- ప్రజ్వల్ రేవణ్ణ


- సి.ఎన్.మంజునాథ్

కర్నాటకలో 28 లోక్‌సభ స్థానాల్లో బీజేపీతో పొత్తులో భాగంగా జేడీ(ఎస్)కు మూడు దక్కాయి. వాటిలో జేడీ(ఎస్) కంచుకోట అయిన మండ్య నుంచి దేవెగౌడ కుమారుడు హెచ్‌డీ కుమారస్వామి, హసన్ నుంచి మనవడు ప్రజ్వల్ రేవణ్ణ పోటీ చేస్తున్నారు. దేవెగౌడ అల్లుడు సి.ఎన్.మంజునాథ్ బీజేపీ టికెట్‌పై బెంగళూరు రూరల్ నుంచి బరిలో ఉండటం విశేషం! చన్నపట్న అసెంబ్లీ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కుమారస్వామికి ఇవి ఆరో లోక్‌సభ ఎన్నికలు.

వరుసగా రెండోసారి...

ఇలా దేవెగౌడ కుటుంబంనుంచి ముగ్గురు లోక్‌సభ ఎన్నికల బరిలో ఉండటం ఇది వరుసగా రెండోసారి. దక్షిణ కర్నాటకగా భావించే పాత మైసూర్ ప్రాంతంలో జేడీ(ఎస్)కు బాగా పట్టుంది. ఇక్కడ దేవెగౌడకు చెందిన వొక్కళిగ సామాజిక వర్గం ప్రాబల్యం ఎక్కువ. 2019లో కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా జేడీ (ఎస్)కు 9 సీట్లు దక్కాయి. తుముకూరు నుంచి దేవెగౌడ, హసన్ నుంచి ప్రజ్వల్, మండ్య నుంచి కుమారస్వామి కొడుకు నిఖిల్ పోటీ చేశారు. ప్రజ్వల్ ఒక్కరే గెలిచారు.

ఏ ఎన్నికల్లో చూసినా...

దేవెగౌడకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. కుమారుల్లో రేవణ్ణ, కుమారస్వామి రాజకీయాల్లో ఉన్నారు. రేవణ్ణ హోలెనర్సిపుర ఎమ్మెల్యే. ఆయన భార్య భవాని జిల్లా పరిషత్ సభ్యురాలిగా చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆమెకు టికెట్ ఇప్పించుకునేందుకు రేవణ్ణ విఫల యత్నం చేశారు. వారి ఇద్దరు కుమారుల్లో ప్రజ్వల్ హాసన్ ఎంపీ కాగా సూరజ్ ఎమ్మెల్సీ. రెండుసార్లు సీఎంగా చేసిన కుమారస్వామి తన కొడుకు నిఖిల్‌ను రాజకీయాల్లో నిలబెట్టేందుకు 2019 నుంచీ ప్రయత్నిస్తూనే ఉన్నారు. జేడీ(ఎస్) యువజన విభాగం నేతగా ఉన్న నిఖిల్ 2019 లోక్‌సభ ఎన్నికల్లో మండ్య నుంచి, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో రామనగర నుంచి పోటీ చేసినా ఓటమి పాలే అయ్యారు. ఈసారి మండ్యలో కుమారస్వామి గెలిస్తే ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న చన్నపట్న అసెంబ్లీ స్థానం ఖాళీ అవుతుంది. అక్కడి నుంచి ఉప ఎన్నికలో నిఖిల్ పోటీ చేస్తారని ఊహాగానాలు మొదలయ్యాయి. కుమారస్వామి భార్య అనిత రామనగర ఎమ్మెల్యేగా చేశారు. దేవెగౌడ మరో కుమారుడు రమేశ్ భార్య సౌమ్య కూడా గత ఎన్నికల్లో పోటీకి విఫలయత్నం చేశారు. ఆమె తండ్రి డీసీ తమ్మన్న మద్దూరు జేడీ(ఎస్) ఎమ్మెల్యే. ఇదంతా పార్టీ ప్రయోజనాల కోసమేనని కుమారస్వామి సమర్థించుకుంటున్నారు!

జన ప్రభంజనం మధ్య జైత్రయాత్రలా సాగిన సీఎం జగన్ 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర

22 రోజుల్లో 23 జిల్లాలు..
86 నియోజకవర్గాలు 2,188 కి.మీ.లు
9 భారీ రోడ్ షోలు
6 ప్రత్యేక సమావేశాలు
16 బహిరంగ సభలు

- మండుటెండైనా, అర్ధరాత్రయినా పిల్లలు, పెద్దలు ఆత్మీయ స్వాగతం
- మంచి చేసిన మిమ్మల్ని మళ్లీ సీఎంగా చేసుకుంటామని భరోసా
- విజయవాడలో టీడీపీ మూక హత్యాయత్నం.. వెరవక యాత్ర కొనసాగింపు
- టీడీపీ నేతల దాష్టీకంపై వెల్లువెత్తిన ప్రజాగ్రహం..
- జాగ్రత్తగా ఉండండి అన్నా.. అంటూ బాసటగా నిలిచిన ప్రజలు
- యాత్ర రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేసిందంటోన్న పరిశీలకులు
- పోటీ ఏకపక్షమే.. వైఎస్సార్‌సీపీ విజయం లాంఛనమేనంటూ విశ్లేషణలు
- తీవ్ర నిరాశ, నిస్పృహల్లో బాబు, పవన్



వార్ వన్ సైడే



నిన్ను చూడటానికే వచ్చానన్నా..

బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెం అడ్డరోడ్డు వద్ద ఏప్రిల్ 10న మధ్యాహ్నం 1.30 గంటలకు 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలో సీఎం జగన్‌ను చూసేందుకు వేల్పూరు పంచాయతీ పరిధిలోని రామిరెడ్డిపాలెంకు చెందిన వెంకాయమ్మ పరుగెత్తుకొస్తోంది. మధ్యలో చెప్పులు తెగిపోయినా లెక్క చేయకుండా తారు రోడ్డుపై ఉత్త కాళ్లతోనే పరుగులు తీస్తున్న ఆమెను చూసిన సీఎం జగన్.. బస్సు ఆపించారు. ఆమెను దగ్గరికి పిలిచారు. 'ఏం తల్లీ బాగున్నావా? ఏమైనా సమస్య ఉందా..' అంటూ ఆత్మీయంగా పలకరించారు. 'జగనన్నా.. నీ పాలనలో నాకు ఎలాంటి సమస్య లేదు. నిన్ను దగ్గరి నుంచి చూద్దామని, పలకరిద్దామనే వచ్చా' అని చెబుతూ మురిసిపోయింది.

కృష్ణా జిల్లా నందివాడ మండలం పుట్టగుంటకు ఒక కిలోమీటరు దూరంలో ఏప్రిల్ 15వ తేదీ మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో మండుతున్న ఎండలో సీఎం జగన్‌ను చూసేందుకు పొలాల వెంట 20–25 మంది మహిళలు పరుగులు పెడుతూ వస్తున్నారు. ఇది గమనించిన సీఎం జగన్ బస్సు నుంచి కిందకు దిగారు. మహిళలంతా సీఎం జగన్ చుట్టూ చేరారు. 'విజయవాడలో మీపై రాయితో దాడి చేశారని తెలిసి తల్లడిల్లిపోయాం. మంచి చేసిన మిమ్మల్ని ప్రజలంతా గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారనే అక్కసుతో టీడీపీ వాళ్లు మీపై దాడి చేయించారు.. జాగ్రత్తగా ఉండు జగనన్నా.. మీరు బాగుంటేనే మేం బాగుంటాం' అంటూ తోడబుట్టిన అన్నగా భావిస్తూ పరామర్శించారు.

కాకినాడ జిల్లా సామర్లకోట ముఖ ద్వారం వద్ద ఏప్రిల్ 19న మధ్యాహ్నం ఒంటి గంటకు మండే ఎండలో వేలాది మంది మహిళలు రోడ్డుపై నిలబడ్డారు. సీఎం జగన్ బస్సు అక్కడకు రాగానే మహిళలు హర్షధ్వానాలు చేశారు. బస్సు దిగిన సీఎం జగన్.. వారితో ముచ్చటించారు. 'జగనన్నా.. మీరు మాకు మంచి చేశారు. మేం మళ్లీ మిమ్మల్ని గెలిపించుకుని సీఎంగా చేసుకుంటాం' అంటూ భరోసా ఇచ్చారు. గుమ్మడికాయలతో దిష్టి తీసి.. హారతులు ఇచ్చి దీవించారు.

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో ఆత్మీయత, అనుబంధాలకు అద్దం పట్టే ఇలాంటి దృశ్యాలు అడుగడుగునా కన్పించాయి. ఇలాంటి దృశ్యాలు రాజకీయాల్లో అత్యంత అరుదుగా కన్పిస్తుంటాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మాటపై నిలబడి.. నిబద్ధత, నిజాయితీతో పనిచేసే నాయకుడిని ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారనడానికి సీఎం జగన్ బస్సు యాత్రే నిదర్శనమని స్పష్టం చేస్తున్నారు. బస్సు యాత్ర సాగినంత దూరం.. మండుటెండైనా అర్ధరాత్రయినా లెక్క చేయకుండా స్కూలు పిల్లల నుంచి అవ్వాతాతల వరకు మానవ హారంగా ఏర్పడి సీఎం జగన్‌కు నీరాజనాలు పలకడం దేశ రాజకీయ చరిత్రలో అరుదైన ఘట్టంగా నిలిచిపోతుందని చెబుతున్నారు. 'ఫలానా పనులు చేస్తాం.. మాకు ఓటేయండి' అని రాజకీయ నాయకులు ఎన్నికలప్పుడు అడగడం సాధారణమని, కానీ.. 'జగనన్నా.. మీరు మంచి చేశారు.. మిమ్మల్ని మళ్లీ గెలిపించి సీఎంగా చేసుకుంటాం' అని ప్రజలు అడుగడుగునా భరోసా ఇస్తుండటం చరిత్రలో తామెన్నడూ చూడలేదని రాజకీయ పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు.

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 22 రోజుల పాటు సాగిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో సీఎం జగన్‌ను చూసేందుకు ఆద్యంతం జనం ప్రభంజనంలా తరలివచ్చారు. సార్వత్రిక ఎన్నికల తొలి విడత ప్రచారంలో భాగంగా గత నెల 27న సీఎం జగన్ వైఎస్సార్ జిల్లాలోని ఇడుపులపాయలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఘాట్ వద్ద నివాళులు అర్పించి బస్సు యాత్రను ఆరంభించారు. బుధవారం శ్రీకాకుళం జిల్లాలో టెక్కలి సమీపంలో అక్కవరం బహిరంగ సభతో పాదయాత్రను ముగించారు. 23 జిల్లాల్లో 86 నియోజకవర్గాల్లో 2,188 కి.మీల దూరం బస్సు యాత్ర సాగింది. యాత్రలో 16 భారీ బహిరంగ సభల్లో సీఎం జగన్ పాల్గొని ప్రసంగించారు. వివిధ వర్గాల ప్రజలతో ఆరు ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. విజయవాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నం తదితర తొమ్మిది ప్రాంతాల్లో భారీ రోడ్ షోలు నిర్వహించారు. బస్సు యాత్ర ప్రారంభమైన ఇడుపులపాయ నుంచి ఈనెల 13న విజయవాడలో జరిగిన రోడ్ షో వరకూ యాత్ర సాగినంత దూరం కెరటాల్లా జనం పోటెత్తారు. విజయవాడలో లక్షలాది మంది ప్రజలు రోడ్ షోలో సీఎం జగన్‌కు నీరాజనం పలుకుతుండడం చూసి ఓర్వలేక టీడీపీ నేతలు దాడులకు తెగబడ్డారు. సీఎం జగన్‌ను లక్ష్యంగా చేసుకుని పదునైన రాయితో గురి పెట్టి కొట్టి హత్యాయత్నానికి పాల్పడ్డారు.

విజయవాడ నుంచి సునామీలా పోటెత్తిన జనం

విజయవాడలో తనపై హత్యాయత్నం జరిగిన తర్వాత.. వైద్యుల సలహా మేరకు ఈనెల 14న విశ్రాంతి తీసుకున్న సీఎం జగన్ ఈ నెల 15 నుంచి యాత్రను కొనసాగించారు. సీఎం జగన్‌పై టీడీపీ నేతలు హత్యాయత్నానికి తెగబడటంపై ప్రజాగ్రహం వెల్లువెత్తింది. ఈనెల 15 నుంచి సీఎం జగన్ బస్సు యాత్రకు సునామీలా జనం పోటెత్తి సంఘీభావం తెలిపారు. ఎన్టీఆర్, కృష్ణా, గోదావరి జిల్లాల్లో దారి పొడవునా జనం బారులు తీరి సీఎం జగన్‌కు మద్దతు తెలిపారు. రాజమహేంద్రవరంలో నిర్వహించిన రోడ్ షోకు లక్షలాది మంది ప్రజలు కదలిరావడం కూటమి వెన్నులో వణుకు పుట్టించింది. ఇక విశాఖపట్నంలో నిర్వహించిన రోడ్ షోకు లక్షలాది మంది జనం పోటెత్తడంతో కూటమి వణికిపోయింది. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోనూ బస్సు యాత్రకు అడుగడుగునా జనం నీరాజనాలు పలికారు.

ఘోర పరాజయం భయంతో వణికిపోతున్న టీడీపీ

సార్వత్రిక ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులను సన్నద్ధం చేయడానికి భీమిలి(ఉత్తరాంధ్ర), దెందులూరు(ఉత్తర కోస్తా), రాప్తాడు(రాయలసీమ), మేదరమెట్ల(దక్షిణ కోస్తా)లో సీఎం జగన్ నిర్వహించిన సిద్ధం సభలకు లక్షలాది మంది పోటెత్తడంతో గ్రాండ్ సక్సెస్ అయ్యాయి. ఉమ్మడి రాష్ట్ర.. తెలుగు రాష్ట్రాల చరిత్రలో రాప్తాడు, మేదరమెట్ల సభలు అతి పెద్ద ప్రజాసభలుగా నిలిచిపోయాయి. టీడీపీ–జనసేన జత కలిశాక తాడేపల్లిగూడెంలో నిర్వహించిన జెండా సభ, బీజేపీతో టీడీపీ–జనసేన పొత్తు కుదిరాక చిలకలూరిపేటకు ప్రధానిని రప్పించి నిర్వహించిన సభకు జనం మొహం చాటేయడంతో కూటమి ఆందోళన చెందింది. ఎన్నికల తొలి విడత ప్రచారంలో భాగంగా సీఎం జగన్ నిర్వహించిన బస్సు యాత్రకు.. రాయలసీమ, దక్షిణ కోస్తా, ఉత్తర కోస్తా, ఉత్తరాంధ్ర.. ప్రాంతం ఏదైనా జనం నీరాజనాలు పలికారు. బస్సు యాత్రలో భాగంగా నిర్వహించిన 16 సభలకు లక్షలాది మంది ప్రజలు పోటెత్తారు. ఉమ్మడి రాష్ట్ర.. తెలుగు రాష్ట్రాల చరిత్రలో విజయవాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నంలలో సీఎం జగన్ నిర్వహించిన రోడ్ షోలు అతి పెద్ద మానవహారంగా నిలిచిపోతాయని రాజకీయ పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు. ఇదే సమయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ సంయుక్తంగా నిర్వహించిన సభలకు.. బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరితో కలిసి వారిద్దరూ నిర్వహించిన సభలకు జనం రాకపోవడంతో ఘోర పరాజయం తప్పదనే నిర్ణయానికి ఆ నేతలు వచ్చేశారు. తీవ్రమైన నిరాశ నిస్పృహల్లో కూరుకుపోయిన చంద్రబాబు, పవన్ కల్యాణ్.. సీఎం జగన్‌పై దూషణలకు దిగుతూ, వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు తెగబడాలని ఆ పార్టీల కార్యకర్తలను రెచ్చగొడుతుండటమే అందుకు తార్కాణం.

సీఎం జగన్ బస్సు యాత్ర రాష్ట్ర రాజకీయ ముఖ చిత్రాన్ని సమూలంగా మార్చేసిందని, ఎన్నికల్లో పోటీ ఏకపక్షమేనని.. వైఎస్సార్‌సీపీ విజయం లాంఛనమేనని తేల్చి రాజకీయ పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు. బస్సు యాత్ర జైత్రయాత్రలా సాగడంతో టీడీపీ–జనసేన–బీజేపీ నేతల్లో ప్రకంపనలు రేపుతోంది. 2019 ఎన్నికల్లో ఆ పార్టీల తరఫున పోటీ చేసిన అభ్యర్థులతోపాటు మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు భారీ ఎత్తున వైఎస్సార్‌సీపీలో చేరడం.. వేలాది మంది క్రియాశీలక కార్యకర్తలు వారి బాటనే అనుసరించడంతో ఆ పార్టీ నేతల్లో నైతిక స్థైర్యం దెబ్బతింది. ఘోర పరాభవం తప్పదనే నిర్ణయానికి వచ్చిన టీడీపీ, జనసేన అధ్యక్షుడు చంద్రబాబు, పవన్ కల్యాణ్.. తీవ్ర నిరాశ, నిస్పృహలతో సీఎం జగన్‌పై దూషణలకు దిగుతున్నారని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

గుసగుస

'పీకే'దేం లేక!



మురికిగుంటలో పొర్లాడే వారితో కలిస్తే.. కంపు తప్ప.. ఇంపు మచ్చుకైనా కానరాదు. ఏపీ రాజకీయాల్లో చంద్రబాబు తీరు దానికి భిన్నమేం కాదు. బాబుతో అంటకాగిన ప్రతి ఒక్కరూ వెర్రివెంగళప్పలవక తప్పదు. దేశవ్యాప్తంగా రాజకీయ వ్యూహకర్తగా పేరొందిన ప్రశాంత్ కిశోర్ (పీకే)కి కూడా అదే గతి పట్టిందట. ఏ ముహూర్తాన టీడీపీతో ఆయన టీం జట్టు కట్టిందో.. అప్పటి నుంచే పీకే బతుకు బస్టాండయిందట. టీడీపీతో పనిచేస్తున్నట్లు బయటికి చెప్పుకోకపోయినా.. తీసుకున్న రూ.వెయ్యి కోట్ల ఫీజు కోసం అడపాదడపా జోస్యం చెప్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇపుడు మరింత ముందుకెళ్లి టీడీపీ అసంతృప్త నేతల్ని బుజ్జగించే బాధ్యతల్ని నెత్తికెత్తుకున్నారట.

అజ్ఞానవాసి



పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగినంత మాత్రాన లోకానికి చీకటా..? జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తీరు ఎన్నికల అఫిడవిట్‌తో తేటతెల్లమైంది. ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియంపై నానాయాగీ చేసిన ఆయన అప్పుడెప్పుడో భూమి పుట్టక ముందే పదో తరగతి.. సారీ.. ఎస్ఎస్ఎల్‌సీ ఇంగ్లిష్ మీడియంలో చదివేశారు! ఆయన పిల్లలూ ఇంగ్లిష్ మీడియమే. పిఠాపురంలో పవన్ నామినేషన్ తర్వాత సోషల్ మీడియాలో ఆయన చదివిన డిగ్రీలపై గట్టిగానే ట్రోల్ అవుతోంది. 1953లోనే ఎస్ఎస్ఎల్‌సీ రద్దయి, ఆ స్థానంలో ఎస్ఎస్‌సీ వచ్చింది. ఇంత గొప్ప చదువులు చదివిన తమ అభిమాన హీరో, ఎదుటివారి చదువులపై అంత ధైర్యంగా ఎలా మాట్లాడగలుగుతున్నారబ్బా.. అని తెగ హా..శ్చర్యపోతున్నారు.

బొర్రా.. బేరం



పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గంలో జనసేన అసంతృప్త నేత బొర్రా వెంకటప్పారావు గట్టిగానే గిట్టుబాటు చేసుకుంటున్నారట. పొత్తులో భాగంగా ఈ సీటు టీడీపీ ఖాతాలోకి వెళ్లింది. ఆగ్రహించిన బొర్రా స్వతంత్ర అభ్యర్థిగా మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించి, నామినేషన్ వేశారు. దీంతో ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణలకు ఒంటేలొచ్చినంత పనయిందట. ఇప్పటికే ఓటమి భయంతో వణుకుతున్న వీరు బొర్రాను బుజ్జగించే పనిలో పడ్డారు. రూ.4 కోట్లు ఇచ్చేందుకు ముందుకొచ్చారట. బొర్రా మాత్రం రూ.8 కోట్లు ఇస్తే తప్ప వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారట. మధ్యే మార్గంగా రూ.6 కోట్లకు బేరం కుదిరేలా ఉందని గుసగుసలు.

పార్టీలే వేరు

ఏపీలో పొత్తు రాజకీయాలు చాలా విచిత్రంగా మారాయి. గత ఎన్నికల్లో పోటీచేసిన రెండు స్థానాల్లోనూ నెత్తిన కండువా వేసుకున్న పవన్ కల్యాణ్ పరిస్థితి సరే..సరి..! కేంద్రంలో రెండోసారి అధికారాన్ని వెలగబెడుతున్న బీజేపీ కూడా చంద్రబాబు కుట్రలకు బలైపోయింది. తమకు కేటాయించిన సీట్లలో కూడా టీడీపీ నేతలనే బరిలో దింపడంతో జనసేన, బీజేపీ క్షేత్రస్థాయి నాయకుల్లో తీవ్ర అయోమయం నెలకొందట. ఇన్నాళ్లూ ఎవరిని కాదని సీటు కోసం తన్నులాడామో.. వారినే తమ పార్టీ తరఫున అభ్యర్థులుగా నిలపాల్సిన దౌర్భాగ్యమేంటని ప్రశ్నిస్తున్నారట. టికెట్ ఆశావహులు సెటిల్‌మెంట్లకు లొంగి, సిగ్గువీడి అభ్యర్థుల తరఫున ప్రచారం చేసినా, తాము మాత్రం మద్దతిచ్చేది లేదని బాహాటంగానే చెప్తున్నారట.



నాడు-నేడుకు దేశం ఫిదా

వెల్లువెత్తుతున్న ప్రశంసలు | **వీడియోలు పోస్టు చేస్తున్న ఉత్తరాది సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు**

- రాష్ట్ర విభజన అనంతరం ఏపీకి సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు విద్యాసంస్థలను పట్టించుకోలేదు.
- విద్య, మధ్యాహ్న భోజన విషయంలో సైతం సర్కారీ బడులపై బాబు చిన్నచూపు చూశారు.
- 2014–19 మధ్య దాదాపు 1,785 పాఠశాలలను మూసివేసిన ఘనత ఒక్క చంద్రబాబుకే దక్కుతుంది.
- 2019లో జరిగిన ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక మెజార్టీ సీట్లతో గెలిచి సీఎంగా బాధ్యతలు చేపట్టారు. 58 నెలల్లో దాదాపు రూ.73 వేల కోట్లతో 45 వేల ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చేశారు.
- 3వ తరగతి నుంచే సబ్జెక్టు టీచర్ల ద్వారా విద్యాబోధన అందిస్తున్నారు. ఏ ఒక్క పిల్లవాడు చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో..సీఎం జగన్ అమ్మఒడి కింద ఏటా రూ.15 వేలు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నారు.

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ విద్యా వ్యవస్థలో సీఎం జగన్ ప్రవేశపెట్టిన నాడు–నేడుతో పాఠశాలల రూపురేఖలు మారిపోతున్నాయి. ఆ అంశం యావత్ దేశాన్ని ఆకర్షిస్తోంది. నాడు–నేడు ద్వారా బడుగు, బలహీన వర్గాల పిల్లలకు పెద్దపీట వేయడాన్ని ఉత్తరాది రాష్ట్రాలు కొనియాడుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో పాఠశాలల పరిస్థితులు, ప్రస్తుతం సీఎం జగన్ హయాంలో పాఠశాలల స్థితిగతులపై సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌లు కళ్లకు కట్టినట్లు వీడియోలు రూపొందించి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో.. నాడు–నేడు షార్ట్ వీడియోలు ట్రెండీగా మారాయి. ఏపీలోని నాడు–నేడుపై దేశవ్యాప్తంగా సోషల్ మీడియాలో సందేశాలు వెల్లువెత్తుతున్నాయి.

సోషల్ మీడియాలో పలువురి కామెంట్లు ఇలా..

- ఇది కేవలం విజనరీ సీఎం జగన్ వల్లే సాధ్యం
- నాకు ఆంధ్రప్రదేశ్ స్కూల్స్ అంటే ఇష్టం.. మంచి విద్య, అద్భుతమైన ఆట స్థలాలు
- అవును ఫిజికల్ ఎడ్యుకేషన్ కూడా విద్యార్థులకు అవసరమే
- దేశంలో ప్రతి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌ని స్ఫూర్తిగా తీసుకోవాలి
- ఏపీ సీఎం జగన్ కింగ్



ట్రెండింగ్‌లో కావ్య వీడియో

సీఎం జగన్ విద్యా వ్యవస్థలో నాడు–నేడు ద్వారా తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులను గుర్తిస్తూ ఢిల్లీకి చెందిన సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ 'కావ్య' ఓ వీడియోను రూపొందించారు.

- విద్యా వ్యవస్థలో దేశంలోనే ఏపీ సరికొత్త అడుగులు వేసిందని, గతంలో ఉన్న అధ్వాన పరిస్థితిని సమూలంగా మార్చివేసిందంటూ ప్రశంసలు కురిపించారు.
- అత్యాధునిక ఫర్నిచర్, ఫ్యాన్లు, మరుగుదొడ్లు వంటివి ఏర్పాటు చేశారని.. ఆ రోజుల్లో మనకు ఇటువంటి సౌకర్యాలు లేవే అంటూ.. సీఎం జగన్ చేసిన మంచి పనిని మెచ్చుకుంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
- ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి, ఐబీ సిలబస్‌ను పరిచయం చేయడం అభినందనీయమని, ఈ ఐదేళ్ల కాలంలో ఏపీలో నిరక్షరాస్యత తగ్గిందని, బడుగు, బలహీన వర్గాల వారికి చదువుపై ఆసక్తి పెరిగిందంటూ వీడియో చేశారు.
- ఆ వీడియోను యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడంతో పదిలక్షలకు పైగా నెటిజన్లు వీడియో చూసి, వేల సంఖ్యలో షేర్ చేస్తూ 'సూపర్ ఏపీ స్కూల్స్' అంటూ కితాబు ఇస్తున్నారు.
- మరికొంతమంది నాడు–నేడుపై షార్ట్ వీడియోస్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో.. ఉత్తరాది జనం ఫిదా అవుతున్నారు.
- యూపీ, హరియాణా, రాజస్తాన్, బిహార్ వంటి రాష్ట్రాల్లో ఈ తరహా విద్య ఉంటే బాగుంటుందంటూ కామెంట్ల రూపంలో వారి అభిప్రాయాల్ని పంచుకుంటున్నారు.
- దేశవ్యాప్తంగా ఉన్న నెటిజన్లు ఈ వీడియోపై స్పందిస్తూ ఇదే తరహా నాణ్యమైన విద్య దేశం మొత్తం తీసుకురావాలని, సీఎం జగన్‌ను కొనియాడుతూ లైకులు, కామెంట్లు, షేర్ చేస్తున్నారు.

పవన్ ఆస్తులు మాయ.. పెళ్లాల లెక్కలూ మాయే..

- పవన్ ఎన్నికల అఫిడవిట్‌లో అడుగుకో అబద్ధం
- సినిమాల్లోకంటే జనసేన పెట్టాకే పవన్ ఆస్తులు ఎలా పెరిగాయి?
- పవన్ అఫిడవిట్‌లో వివరాలపై విచారణ చేయించాలి
- కరోనా సమయంలోనూ రూ.30 కోట్ల ఆస్తులెలా కొన్నారు?
- వైఎస్సార్‌సీపీ నేత పోతిన మహేశ్



సాక్షి, అమరావతి: జనసేన పార్టీ అధినేత ఆస్తులు మాయ అని, ఆయన పెళ్లాల లెక్కలూ మాయే అని వైఎస్సార్‌సీపీ నాయకుడు పోతిన మహేశ్ ధ్వజమెత్తారు. ఎన్నికల అఫిడవిట్‌లో ఆదాయం, ఆస్తులపై మాయ చేస్తున్నట్లు పెళ్లాలు, గ్లోళ్ల విషయంలోనూ మాయచేసున్నావే అని దెప్పిపొడిచారు. పవన్ ఏ భార్యతో ఎంతకాలం ఉన్నారు, ఒక భార్యతో సంసారం చేస్తూ మరొకరితో పిల్లలను కన్న విషయం, ఇప్పుడు ఎవరితో ఉంటునారు, వీటన్నింటిపై స్పష్టత ఇస్తే బాగుంటుందని అన్నారు. మహేశ్ బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. పవన్ ఎన్నికల అఫిడవిట్‌లో అడుగుకో అబద్ధం చెప్పాడని, అందులో వివరాలపై విచారణ చేయించాలని అన్నారు. 'ఐదేళ్ల ఆయన సంపాదన రూ.114.76 కోట్లు అని చెప్పారు. అందులో రూ. 73 కోట్లు పన్నులు, పార్టీ డొనేషన్ రూ. 20 కోట్లు అని చెప్పారు. ఇవన్నీ పోను ఇంకా రూ.90 కోట్ల ఆస్తులు ఎలా కొన్నాడు' అని నిలదీశారు. 'పవన్ ప్రకటించిన ఆస్తులన్నీ జనసేన పార్టీ పెట్టిన తర్వాత కొన్నవే. రూ.90 కోట్ల ఆస్తులు 2018 – 2024 మధ్యలో కొన్నారు. ఇది రిజిస్టర్ విలువే. వాటి మార్కెట్ విలువ రూ.350 కోట్ల నుంచి రూ.400 కోట్లు ఉంటుంది. ఇదే సమయంలో ఆయన చేసిన సినిమాలు నాలుగే. వాటిలో యావరేజ్‌గా ఆడినవి రెండు. మిగతావి డిజాస్టర్ అయ్యాయి. అయినా రూ.90 కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయి? సినిమా రంగం నుంచి వచ్చాయా లేక జనసేన పార్టీని బాబుకు తాకట్టు పెడితే వచ్చాయా? కరోనా సమయంలో 2021లో ప్రపంచమంతా అతలాకుతలం అవుతుంటే.. అప్పుడు కూడా ఆయన రూ.33 కోట్ల ఆస్తులు కొన్నారు. ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది? అయనకు పసుపు కరోనా ఏమైనా కాటేసిందా' అని ధ్వజమెత్తారు. ఈ మధ్య ముగ్గురు నలుగురు పెళ్లాలు అంటేనే పవన్ గింజుకుంటున్నారని, మరి వలంటీర్లను ఆయన హ్యూమన్ ట్రాఫికర్స్ అంటే వారికి కోపం రాదా అని ప్రశ్నించారు. 'అన్న చిరంజీవిని పదే పదే అవమానిస్తున్నది పవనే. కానిస్టేబుల్ కొడుకునంటారు గానీ, చిరంజీవి సినిమా భిక్ష పెట్టడం వల్లే పవర్ స్టార్ అయ్యానని ఎక్కడా చెప్పరు. తల్లిని అవమానించిన లోకేశ్, బాబుతో జట్టు కట్టిన పవన్ ఈరోజు తల్లిని కూడా అవమానించారు' అని అన్నారు.

ఓటమి భయంతో ఇష్టానుసారం పేలుతున్న పవన్

ఓటమి భయంతోనే పవన్ సీఎం జగన్‌పై ఇష్టానుసారం పేలుతున్నారన్నారు. కాపుల్ని, కార్యకర్తలను కూడా కించపరుస్తున్నారని చెప్పారు. పోటీ చేసిన రెండుచోట్లా ప్రజలు కాళ్ళు, కీళ్ళు విరగ్గొట్టినా పవన్‌కు బుద్ధి రాలేదన్నారు. తనని ఒక్కడినైనా గెలిపించాలని, ప్లీజ్ అంటూ అడుక్కునే పవన్ ఒక పార్టీకి అధ్యక్షుడేనా అని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్ ప్రజల్ని నమ్ముకున్నారని, ప్రజలు కూడా సీఎం జగన్‌ని నమ్మారని తెలిపారు. అందుకే సీఎం జగన్ ఒంటరిగా పోటీ చేస్తున్నారని చెప్పారు. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూ రాష్ట్రాభివృద్ధికి పాటు పడుతున్నందునే సీఎం జగన్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. ఈ ఎన్నికల్లో సీఎం జగన్ గెలిచి రెండోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు.

కూటమి కాదది.. కుమ్మక్కు రాజకీయం

టీడీపీ, జనసేన, బీజేపీలది కూటమి కాదని, కుమ్మక్కు రాజకీయమని మహేశ్ ధ్వజమెత్తారు. పోటీ చేసేదంతా చంద్రబాబు మనుషులేనని, పార్టీలే మారతాయని చెప్పారు. జనసేన, బీజేపీ అభ్యర్థులు చంద్రబాబు గుంపులో నుంచి వచ్చిన వారేనన్నారు. ఈ గుంపును హైనాలు, గుంటనక్కలు, తోడేళ్లు అనక ఇంకేమనాలని ప్రశ్నించారు. వాళ్లు ప్రజల కోసం కూటమి కట్టలేదని, ప్రజల ఆస్తులను దోచుకునేందుకు, పేదల నోట్లో మట్టికొట్టేందుకు, భూములు కొట్టేసి రూ.లక్షల కోట్లు సంపాదించేందుకేనని అన్నారు. జనసేన అధ్యక్షుడు పవనే సీఎం అభ్యర్థి అని చాలా కాలం సోషల్ మీడియాలో రాగం తీశారని, తీరా చూస్తే 24 సీట్లల్లో పోటీ చేస్తున్నానని చెప్పారని, ఆ తర్వాత 21 సీట్లతో సరిపెట్టారని, వీటిలోనూ నిజమైన జనసేన కార్యకర్తలకు దక్కింది 11 సీట్లేనని చెప్పారు. చంద్రబాబు కుట్ర రాజకీయాలు ఇలాగే ఉంటాయని అన్నారు.

బాలినేనికి మద్దతుగా దిల్‌రాజు వీడియో



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఒంగోలు నుంచి పోటీచేస్తున్న బాలినేని శ్రీనివాస్‌రెడ్డికి సినీ నిర్మాత దిల్‌రాజు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ వీడియోను విడుదల చేశారు. ఆ వీడియోలో బాలినేని ఒంగోలు నుంచి 5 సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారని ఆయన గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాటి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మంత్రిగా పనిచేశారని, ఆయన ప్రాతినిధ్యం వహించిన శాఖ ద్వారా ఎన్నో అభివృద్ధి పనులు చేశారని కొనియాడారు. అదే విధంగా విభజిత ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆధ్వర్యంలో కూడా మంత్రిగా తన శాఖను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. ఇప్పుడు మళ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా 6వ సారి ఒంగోలు ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారని, నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసిన బాలినేనిని మరోసారి గెలిపించాలని ఓటర్లను ప్రార్థిస్తున్నానన్నారు.

–సాక్షి, సిటీబ్యూరో

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి



టి20 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీ ప్రచారకర్తగా బోల్ట్

దుబాయ్: అథ్లెటిక్స్ దిగ్గజం, ఆల్‌టైమ్ గ్రేట్ ఉసేన్ బోల్ట్ ఇప్పుడు కొత్తగా క్రికెట్‌కు ప్రచారం కల్పించేందుకు సిద్ధమయ్యాడు. జమైకాకు చెందిన బోల్ట్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) త్వరలో జరిగే టి20 ప్రపంచకప్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించింది. జూన్ 1 నుంచి జరిగే ఈ టోర్నీ వెస్టిండీస్, అమెరికాలలో జరగనున్న నేపథ్యంలో విండీస్ జట్టులో భాగమైన జమైకా దేశ ప్లేయర్ బోల్ట్‌ను ఎంచుకుంది. కొన్నేళ్ల క్రితమే ఆటకు వీడ్కోలు పలికిన ఫాస్టెస్ట్ స్ప్రింటర్ బోల్ట్ పేరిటే ప్రస్తుతం 100 మీటర్లు, 200 మీటర్లు ప్రపంచ రికార్డులు నమోదై ఉన్నాయి. 'ఈ కొత్త పాత్ర పట్ల చాలా సంతోషంగా ఉంది. అంబాసిడర్ హోదాలో ప్రపంచకప్ కోసం చాలా ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా. క్రికెట్‌ను ఎంతో ప్రేమించే కరీబియన్ దేశం నుంచి వచ్చిన నా మదిలో క్రికెట్‌కు ప్రత్యేక స్థానం ఉంది. వరల్డ్ కప్ అమెరికాలో జరగడం క్రికెట్ మార్కెట్‌ను మరింత విస్తరించేలా చేస్తుంది. అయితే టోర్నీలో మాత్రం నేను వెస్టిండీస్ జట్టుకు మద్దతు పలుకుతా' అని బోల్ట్ వెల్లడించాడు. జూన్ 1 నుంచి 29 వరకు జరిగే ఈ టోర్నీలో మొత్తం 20 జట్లు పోటీపడనున్నాయి.

ప్రచండ పంత్...

- ఢిల్లీ క్యాపిటల్స్‌కు కీలక విజయం
- రాణించిన అక్షర్ పటేల్, కుల్దీప్
- 4 పరుగులతో ఓడిన గుజరాత్
- సుదర్శన్, మిల్లర్ మెరుపులు వృథా

ఐపీఎల్‌లో మరో మ్యాచ్‌లో పరుగుల వరద పారింది. ఢిల్లీ క్యాపిటల్స్ నిర్దేశించిన 225 పరుగుల లక్ష్యాన్ని కూడా గుజరాత్ టైటాన్స్ ఛేదించేలా కనిపించింది. అయితే చివరకు క్యాపిటల్స్‌దే పైచేయి కాగా... టోర్నీలో మ్యాచ్ మ్యాచ్‌కూ పదునెక్కుతున్న బ్యాటింగ్‌తో రిషభ్ పంత్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడటం ఈ పోరులో హైలైట్‌గా నిలిచింది.


పంత్

న్యూఢిల్లీ: చివరి వరకు ఉత్కంఠగా సాగిన సమరంలో ఎట్టకేలకు ఢిల్లీ క్యాపిటల్స్ విజయాన్ని అందుకొని ఊపిరి పీల్చుకుంది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఢిల్లీ 4 పరుగుల తేడాతో గుజరాత్ టైటాన్స్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 224 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రిషభ్ పంత్ (43 బంతుల్లో 88 నాటౌట్; 5 ఫోర్లు, 8 సిక్స్‌లు), అక్షర్ పటేల్ (43 బంతుల్లో 66; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 68 బంతుల్లో 113 పరుగులు జోడించడం విశేషం. అనంతరం గుజరాత్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 220 పరుగులు చేసి ఓడిపోయింది. సాయి సుదర్శన్ (39 బంతుల్లో 65; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), డేవిడ్ మిల్లర్ (23 బంతుల్లో 55; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు.

భారీ భాగస్వామ్యం...

జేక్ ఫ్రేజర్ (14 బంతుల్లో 23; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మరోసారి దూకుడైన ఆటతో ఢిల్లీకి శుభారంభం అందించాడు. అయితే 9 పరుగుల వ్యవధిలో ఫ్రేజర్‌తో పాటు పృథ్వీ షా (11), షై హోప్ (5) వెనుదిరిగారు. మూడో స్థానానికి ప్రమోట్ అయిన అక్షర్ దూకుడైన షాట్లతో ఆకట్టుకోగా, ఆ తర్వాత పంత్ తన జోరు ప్రదర్శించాడు. 37 బంతుల్లో అక్షర్ అర్ధసెంచరీ పూర్తయింది. నూర్ అహ్మద్ ఓవర్లో వరుసగా రెండు సిక్సర్లు బాదిన అక్షర్ తర్వాతి బంతిని అదే తరహాలో ఆడే ప్రయత్నంలో వెనుదిరగడంతో భారీ భాగస్వామ్యానికి తెర పడింది. అనంతరం మోహిత్ శర్మ బౌలింగ్‌లో సిక్స్‌తో 34 బంతుల్లో పంత్ హాఫ్ సెంచరీ మార్క్‌ను చేరుకున్నాడు. సాయికిశోర్ వేసిన 19వ ఓవర్లో స్టబ్స్ వరుసగా 4, 6, 4, 6 బాదడంతో చెలరేగడంతో మొత్తం 22 పరుగులు వచ్చాయి.

సుదర్శన్ అర్ధసెంచరీ...

భారీ ఛేదనలో ఆరంభంలోనే గుజరాత్ కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (6) వెనుదిరిగినా... సాహా, సాయి సుదర్శన్ కలిసి దూకుడుగా ఆడారు. వీరిద్దరు 49 బంతుల్లోనే 82 పరుగులు జత చేశారు. అయితే ఈ భాగస్వామ్యాన్ని కుల్దీప్ యాదవ్ విడదీసిన తర్వాత టైటాన్స్ తక్కువ వ్యవధిలో వరుసగా వికెట్లు కోల్పోయింది. ఈ దశలో మిల్లర్ కొన్ని మెరుపు షాట్లు ఆడటంతో పరిస్థితి ఆసక్తికరంగా మారింది. నోర్జే ఓవర్లో అతను 3 సిక్స్‌లు, 1 ఫోర్‌తో 24 పరుగులు రాబట్టాడు. అయితే అతను వెనుదిరిగాక గుజరాత్ గెలుపు ఆశలు సన్నగిల్లాయి. చివరి ఓవర్లో గుజరాత్ విజయానికి 19 పరుగులు అవసరంకాగా... ముకేశ్ వేసిన ఈ ఓవర్లో రషీద్ ఖాన్ 16 పరుగులే సాధించడంతో టైటాన్స్ ఓటమి ఖరారైంది.


అక్షర్ పటేల్


మిల్లర్

ఒకే ఓవర్లో 31 పరుగులు

ఢిల్లీ ఇన్నింగ్స్‌లో 19 ఓవర్లు ముగిసేసరికే దూకుడు పెంచిన పంత్ చివరి ఓవర్లో మరింత చెలరేగిపోయాడు. మోహిత్ శర్మ వేసిన ఈ ఓవర్లో తొలి బంతికి 2 పరుగులు రాగా, తర్వాతి బంతి వైడ్ అయింది. అయితే ఆ తర్వాత పంత్ వరుసగా 6, 4, 6, 6, 6తో తన సత్తా చూపాడు. దాంతో ఈ ఓవర్లో ఏకంగా 31 పరుగులు వచ్చాయి. ఈ దెబ్బకు మోహిత్ శర్మ ఐపీఎల్ మ్యాచ్‌లో అత్యధిక పరుగులు (4 ఓవర్లలో 73) ఇచ్చిన బౌలర్‌గా నిలిచాడు. గతంలో బాసిల్ థంపి (70) పేరిట ఉన్న రికార్డును సవరించాడు. మోహిత్ 7 సిక్స్‌లు ఇవ్వగా అన్నీ పంత్ కొట్టినవే!

ఐపీఎల్‌లో నేడు

హైదరాబాద్ X బెంగళూరు
వేదిక: హైదరాబాద్
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	8	7	1	14	0.698
కోల్‌కతా	7	5	2	10	1.206
హైదరాబాద్	7	5	2	10	0.914
లక్నో	8	5	3	10	0.148
చెన్నై	8	4	4	8	0.415
ఢిల్లీ	9	4	5	8	-0.386
గుజరాత్	9	4	5	8	-0.974
ముంబై	8	3	5	6	-0.227
పంజాబ్	8	2	6	4	-0.292
బెంగళూరు	8	1	7	2	-1.046

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: పృథ్వీ షా (సి) నూర్ (బి) సందీప్ 11; జేక్ ఫ్రేజర్ (సి) నూర్ (బి) సందీప్ 23; అక్షర్ (సి) సాయికిశోర్ (బి) నూర్ 66; హోప్ (సి) రషీద్ (బి) సందీప్ 5; పంత్ (నాటౌట్) 88; స్టబ్స్ (నాటౌట్) 26; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 224. వికెట్ల పతనం:** 1-35, 2-36, 3-44, 4-157. **బౌలింగ్:** అజ్మతుల్లా 4-0-33-0, సందీప్ వారియర్ 3-0-15-3, రషీద్ ఖాన్ 4-0-35-0, నూర్ అహ్మద్ 3-0-36-1, మోహిత్ శర్మ 4-0-73-0, షారుఖ్ ఖాన్ 1-0-8-0, సాయికిశోర్ 1-0-22-0.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (సి) అక్షర్ (బి) కుల్దీప్ 39; గిల్ (సి) అక్షర్ (బి) నోర్జే 6; సుదర్శన్ (సి) అక్షర్ (బి) సలామ్ 65; అజ్మతుల్లా (సి) ఫ్రేజర్ (బి) అక్షర్ 1; మిల్లర్ (సి) సలామ్ (బి) ముకేశ్ 55; షారుఖ్ (సి) పంత్ (బి) సలామ్ 8; తెవాటియా (సి) పంత్ (బి) కుల్దీప్ 4; రషీద్ (నాటౌట్) 21; సాయికిశోర్ (బి) సలామ్ 13; మోహిత్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 220. వికెట్ల పతనం:** 1-13, 2-95, 3-98, 4-121, 5-139, 6-152, 7-181, 8-206. **బౌలింగ్:** ఖలీల్ 2-0-26-0, నోర్జే 3-0-48-1, సలామ్ 4-0-44-3, ముకేశ్ 4-0-41-1, అక్షర్ 3-0-28-1, కుల్దీప్ 4-0-29-2.

రెండు స్వర్ణాలపై భారత్ గురి

కాంపౌండ్ టీమ్ విభాగాల్లో ఫైనల్‌కు భారత మహిళల, పురుషుల జట్లు


జ్యోతి సురేఖ, పర్ణీత్ కౌర్, అదితి



ప్రథమేశ్, అభిషేక్ వర్మ, ప్రియాంశు

షాంఘై (చైనా): ఆర్చరీ సీజన్ తొలి ప్రపంచకప్ టోర్నమెంట్ కాంపౌండ్ విభాగంలో భారత క్రీడాకారుల గురి అదిరింది. మహిళల, పురుషుల టీమ్ విభాగాల్లో భారత జట్లు ఫైనల్లోకి దూసుకెళ్లి రెండు స్వర్ణ పతకాల రేసులో నిలిచాయి. బుధవారం జరిగిన టీమ్ విభాగాల నాకౌట్ మ్యాచ్‌ల్లో భారత జట్లు నిలకడగా రాణించాయి. ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ, ప్రపంచ చాంపియన్ అదితి, పర్ణీత్ కౌర్‌లతో కూడిన భారత మహిళల జట్టు క్వార్టర్ ఫైనల్లో 235-230 పాయింట్ల తేడాతో టర్కీ జట్టును ఓడించింది. అనంతరం సెమీ ఫైనల్లో సురేఖ బృందం 235-230 పాయింట్ల తేడాతోనే ఎస్టోనియా జట్టుపై గెలిచింది. శనివారం జరిగే ఫైనల్లో ఇటలీతో భారత మహిళల జట్టు తలపడుతుంది. క్వాలిఫయింగ్ రౌండ్‌లో అగ్రస్థానంలో నిలిచిన సురేఖ జట్టుకు నేరుగా క్వార్టర్ ఫైనల్‌కు 'బై' లభించింది. మరోవైపు అభిషేక్ వర్మ, ప్రథమేశ్, ప్రియాంశ్‌లతో కూడిన భారత పురుషుల జట్టు తొలి రౌండ్‌లో 233-227తో ఫిలిప్పీన్స్ జట్టుపై, క్వార్టర్ ఫైనల్లో 237-234తో డెన్మార్క్ జట్టుపై, సెమీఫైనల్లో 235-233తో టాప్ సీడ్ దక్షిణ కొరియా జట్టుపై విజయం సాధించి స్వర్ణ పతక పోరుకు అర్హత సాధించింది. శనివారం జరిగే ఫైనల్లో నెదర్లాండ్స్‌తో టీమిండియా పోటీపడుతుంది.

మూడో స్థానంలో ధీరజ్



పురుషుల రికర్వ్ వ్యక్తిగత క్వాలిఫయింగ్ రౌండ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్, పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన ధీరజ్ బొమ్మదేవర 693 పాయింట్లతో మూడో స్థానాన్ని పొందాడు. 684 పాయింట్లతో తరుణ్‌దీప్ రాయ్ ఏడో స్థానంలో, 672 పాయింట్లతో ప్రవీణ్ జాధవ్ 25వ స్థానంలో నిలిచారు. మహిళల రికర్వ్ వ్యక్తిగత క్వాలిఫయింగ్ రౌండ్‌లో భారత క్రీడాకారిణులు అంకిత (664 పాయింట్లు), భజన్ కౌర్ (657 పాయింట్లు), దీపిక కుమారి (656 పాయింట్లు) వరుసగా 15వ, 29వ, 30వ స్థానాల్లో నిలిచారు.

దీపాంశుకు స్వర్ణం



దుబాయ్: ఆసియా అండర్-20 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తొలి రోజు భారత్‌కు ఒక స్వర్ణం, మూడు రజతాలతో కలిపి మొత్తం నాలుగు పతకాలు లభించాయి. పురుషుల జావెలిన్ త్రోలో దీపాంశు శర్మ పసిడి పతకం సాధించాడు. దీపాంశు జావెలిన్‌ను 70.29 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. భారత్‌కే చెందిన రోహన్ యాదవ్ 70.03 మీటర్లతో రజత పతకాన్ని దక్కించుకున్నాడు. పురుషుల 1500 మీటర్ల విభాగంలో ప్రియాంశు రజత పతకం నెగ్గాడు. ప్రియాంశు 3 నిమిషాల 50.85 సెకన్లలో గమ్యానికి చేరి రెండో స్థానంలో నిలిచాడు. పురుషుల డిస్కస్ త్రోలో రితిక్ (53.01 మీటర్లు) రజత పతకం గెలిచాడు.

సినిమా

ముంబైలో కుబేర


నాగార్జున
ధనుష్

ధనుష్, నాగార్జున లీడ్ రోల్స్‌లో నటిస్తున్న భారీ మల్టీస్టారర్ చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రష్మికా మందన్న హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇటీవల బ్యాంకాక్‌లో ఈ సినిమా చిత్రీకరణ జరిగింది. కాగా ఈ సినిమా కొత్త షెడ్యూల్ షూటింగ్ ముంబైలో ప్రారంభం అయింది. దాదాపు రెండు వారాల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో ధనుష్, నాగార్జున, రష్మిక మందన్నలపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తారట శేఖర్ కమ్ముల. సోనాలి నారంగ్ సమర్పణలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్న 'కుబేర' సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

ప్రీతి ఈజ్ బ్యాక్


ప్రీతీ జింటా

ఆరేళ్ల తర్వాత సినిమా సెట్స్‌లోకి అడుగుపెట్టారు బాలీవుడ్ నటి ప్రీతీ జింటా. సన్నీడియోల్ హీరోగా రాజ్‌కుమార్ సంతోషి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'లాహోర్ 1947'. హీరో ఆమిర్‌ఖాన్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం మహారాష్ట్ర సరిహద్దులోని లొకేషన్స్‌లో ఈ సినిమా నైట్ షూట్ జరుగుతోందని సమాచారం. తాజాగా ఈ సినిమాలో తాను ఓ కీలక పాత్రలో నటిస్తున్నట్లు వెల్లడించి, చిత్రీకరణలో పాల్గొన్నట్లు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు ప్రీతీ జింటా. ఈ సంగతి ఇలా ఉంచితే... 2018లో రిలీజైన హిందీ చిత్రం 'భయ్యాజీ సూపర్‌హిట్' మూవీలో సన్నీడియోల్, ప్రీతీ జింటా జోడీగా నటించారు. ఆ సినిమా తర్వాత మరో మూవీలో నటించలేదు ప్రీతీజింటా. మళ్లీ ఇప్పుడు 'లాహోర్ 1947'కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారామె. ఇక ప్రీతీ జింటా తిరిగి సినిమాలు చేస్తుండటంతో ఆమె అభిమానులు 'ప్రీతి ఈజ్ బ్యాక్', 'ప్రీతి రిటర్న్స్' అంటూ పోస్టులు షేర్ చేస్తున్నారు.

పుష్ప.. పుష్ప.. పుష్పరాజ్


అల్లు అర్జున్

అల్లు అర్జున్ హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం 'పుష్ప-2 ది రూల్'. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రం నుంచి కొత్త అప్‌డేట్ వచ్చింది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ మూవీ నుంచి 'పుష్ప.. పుష్ప.. పుష్పరాజ్...' అంటూ సాగే టైటిల్ సాంగ్ తొలి లిరికల్ వీడియో ప్రోమోను విడుదల చేశారు మేకర్స్. పూర్తి పాటని మే 1న రిలీజ్ చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. అల్లు అర్జున్, రష్మిక మందన్న జంటగా సుకుమార్ తెరకెక్కించిన 'పుష్ప: ది రైజ్' (2021) పాన్ ఇండియా స్థాయిలో బ్లాక్‌బస్టర్ అయిన సంగతి తెలిసిందే. ఈ చిత్రానికిగానూ ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డు అందుకున్నారు అల్లు అర్జున్. ఈ మూవీకి సీక్వెల్‌గా రూపొందుతోన్న 'పుష్ప-2 ది రూల్'పై ఇటు ఇండస్ట్రీ, అటు ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. ఈ నెల 8న అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఈ మూవీ టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమాని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. సునీల్, ఫహాద్ ఫాజిల్, ధనుంజయ, అనసూయ భరద్వాజ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మిరోస్లా క్యూబా బ్రోజెక్, సీఈఓ: చెర్రీ.

కూతురి కోసం ఓ తల్లి పోరాటం

- వరలక్ష్మీ శరత్‌కుమార్



''భర్త నుంచి విడిపోయిన ఓ సాధారణ ఒంటరి మహిళ తన కుమార్తెను పెంచుతుంటుంది. ఆ సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురయ్యాయి? కూతుర్ని కాపాడుకోవడం కోసం తల్లి ఏం చేసింది? అనేది 'శబరి' మూవీ కథ'' అని నటి వరలక్ష్మీ శరత్‌కుమార్ అన్నారు. ఆమె ప్రధాన పాత్రలో అనిల్ కాట్జ్ దర్శకత్వం వహించిన సినిమా 'శబరి'. మహర్షి కూండ్ల సమర్పణలో మహేంద్రనాథ్ కూండ్ల నిర్మించిన ఈ మూవీ తెలుగు, తమిళ, మలయాళ, హిందీ, కన్నడ భాషల్లో మే 3న విడుదలవుతోంది. ఈ సందర్భంగా వరలక్ష్మీ శరత్‌కుమార్ హైదరాబాద్‌లో మాట్లాడుతూ- ''సైకలాజికల్ థ్రిల్లర్‌గా 'శబరి' రూపొందింది. స్క్రీన్ ప్లే, డిఫరెంట్ యాక్షన్, నేచురల్ ఫైట్ సీక్వెన్సులు ఉంటాయి. ఇందులో టిపికల్ రెగ్యులర్ నెగిటివ్ షేడ్ రోల్ కాకుండా కొత్త పాత్ర చేశా. ఈ మూవీ తప్పకుండా ప్రేక్షకులకు కొత్త థ్రిల్ ఇస్తుంది. 'శబరి' దర్శక-నిర్మాతలు కొత్తవారే కావచ్చు.. కానీ, ఈ సినిమాని అద్భుతంగా తీశారు. ఇక హిట్, ఫ్లాపులు ఎవరి చేతుల్లోనూ లేవు. నా సినిమా చూసి థియేటర్ నుంచి బయటకు వచ్చే ప్రేక్షకులు నా నటన బాలేదని అనుకోకూడదు.. అది దృష్టిలో పెట్టుకుని నటిస్తాను. నేనెప్పుడూ ఇమేజ్‌ని పట్టించుకోను. నాకు నచ్చిన పాత్రలు చేస్తాను. నికోలయ్‌తో నా పెళ్లి ఈ ఏడాదే ఉంటుంది'' అన్నారు.

బేబీజాన్ పూర్తి


వరుణ్ ధావన్

వరుణ్ ధావన్ హీరోగా నటించిన హిందీ చిత్రం 'బేబీ జాన్'. తమిళ దర్శకుడు కాలీస్ తెరకెక్కించిన ఈ మూవీలో కీర్తి సురేష్, వామికా గబ్బి హీరోయిన్లుగా నటించారు. కాగా ఓ సాంగ్ షూట్‌తో 'బేబీజాన్' సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు బాలీవుడ్ సమాచారం. అలాగే బుధవారం (ఏప్రిల్ 24) వరుణ్ ధావన్ బర్త్ డే. ఈ సందర్భంగా 'బేబీ జాన్' నుంచి ఓ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. అట్లీ సమర్పణలో మురాద్ ఖేతనీ, ప్రియా అట్లీ, జ్యోతిదేశ్ పాండే నిర్మించిన ఈ చిత్రం మే 31న థియేటర్స్‌లో విడుదల కావాల్సింది. అయితే కొన్ని కారణాల వల్ల ఈ సినిమా కాస్త ఆలస్యంగా రిలీజ్ కానుందని బాలీవుడ్ టాక్.

ది ఢిల్లీ ఫైల్స్


అభిషేక్ అగర్వాల్

'ది కశ్మీర్ ఫైల్స్' (2022) సినిమాతో బాలీవుడ్‌లోకి ప్రవేశించారు తెలుగు నిర్మాత అభిషేక్ అగర్వాల్. వివేక్ రంజన్ అగ్నిహోత్రి దర్శకత్వంలో అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్‌పై రూపొందిన ఈ మూవీ హిట్‌గా నిలిచింది. తాజాగా వివేక్ రంజన్ అగ్నిహోత్రి డైరెక్షన్‌లోనే 'ది ఢిల్లీ ఫైల్స్' సినిమా చేయనున్నట్లు అభిషేక్ అగర్వాల్ చెప్పారు. తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్- ఐ యామ్ బుద్ధ ప్రొడక్షన్స్‌పై అభిషేక్ అగర్వాల్, అర్చన అగర్వాల్, వివేక్ రంజన్ అగ్నిహోత్రి, పల్లవి జోషి నిర్మించనున్నారు. ''షెడ్యూల్ ప్రకారం 'ది ఢిల్లీ ఫైల్స్' షూటింగ్ ఈ ఏడాది ప్రారంభం అవుతుంది.. వచ్చే ఏడాది విడుదలవుతుంది. ఇందులో బిగ్ స్టార్లు లేరు.. బిగ్ కంటెంట్ మాత్రమే ఉంది'' అని వివేక్ అగ్నిహోత్రి అన్నారు.

ఓ ఆత్మ ప్రేమకథ


ఆశిష్, వైష్ణవీ చైతన్య

ఆశిష్ హీరోగా, 'బేబీ' మూవీ ఫేమ్ వైష్ణవీ చైతన్య హీరోయిన్‌గా నటించిన లవ్ అండ్ హారర్ థ్రిల్లర్ 'లవ్ మీ'. 'ఇఫ్ యు డేర్' అనేది ఉపశీర్షిక. అరుణ్ భీమవరపు దర్శకత్వం వహించారు. శిరీష్ సమర్పణలో 'దిల్' రాజు ప్రొడక్షన్స్ బ్యానర్‌పై హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించిన చిత్రం ఇది. ఈ మూవీని తొలుత ఈ నెల 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. అయితే తాజాగా కొత్త రిలీజ్ డేట్ ఫిక్స్ చేసింది చిత్రయూనిట్. మే 25న సినిమాని రిలీజ్ చేయనున్నట్లు వెల్లడించింది. ఓ ఆత్మ ప్రేమకథ నేపథ్యంలో ఈ సినిమా కథ ఉంటుందని యూనిట్ చెబుతోంది. ఈ సినిమాకు సంగీతం: ఎమ్ఎమ్ కీరవాణి, కెమెరా: పీసీ శ్రీరాం.

కన్నడలో ఎంట్రీ


ఐశ్వర్యా రాజేష్

తెలుగు, తమిళ, మలయాళ చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేకంగా గుర్తింపు తెచ్చుకున్నారు హీరోయిన్ ఐశ్వర్యా రాజేష్. టాలీవుడ్‌లో 'కౌసల్య కృష్ణమూర్తి, మిస్ మ్యాచ్, వరల్డ్ ఫేమస్ లవర్, టక్ జగదీష్, రిపబ్లిక్' వంటి సినిమాలు చేశారామె. తమిళంలో వరుస చిత్రాలతో దూసుకెళుతున్న ఐశ్వర్యా రాజేష్ తాజాగా కన్నడ చిత్ర పరిశ్రమలోకి అడుగు పెడుతున్నారు. శివ రాజ్‌కుమార్, డాలి ధనుంజయ హీరోలుగా రోహిత్ పడకి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఉత్తరాఖాండ'. ఈ మూవీలో ధనుంజయకు జోడీగా దుర్గి అనే పాత్రలో కనిపించనున్నారు ఐశ్వర్యా రాజేష్. కన్నడలో ఆమెకు ఇదే తొలి సినిమా. కేఆర్‌జీ స్టూడియోస్ సమర్పణలో కార్తీక్, యోగి జి రాజ్ ఈ మూవీ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ బీజాపూర్ ప్రాంతాల్లో జరుగుతోంది.

భయం ...భయం!


రస్సెల్ క్రోవ్

'గ్లాడియేటర్' ఫేమ్, ఆస్కార్ అవార్డు గ్రహీత రస్సెల్ క్రోవ్ నటించిన తాజా చిత్రం 'ది ఎక్సోర్సిజమ్'. జే. జాన్ మిల్లర్ దర్శకత్వం వహించిన సూపర్ నేచురల్ హారర్ థ్రిల్లర్ మూవీ ఇది. ఆంథోనీ మిల్లర్ అనే ఓ యాక్టర్ పాత్రలో నటించారు రస్సెల్ క్రోవ్. కెవిన్ విలియమ్ సన్, బెన్‌ఫాస్ట్, బిల్‌బ్లాక్ ఈ సినిమాను నిర్మించారు. తాజాగా ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసి, జూన్ 7న చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఓ హారర్ ఫిల్మ్‌కు సైన్ చేసిన తర్వాత ఆంథోనీ మిల్లర్ జీవితంలో ఊహించని ఘటనలు జరుగుతాయి. షూటింగ్‌లోనూ కొన్ని భయానక సంఘటనలు చోటుచేసుకుంటాయట. అతని గత జీవితానికి, ఈ సినిమాకు ఉన్న సంబంధం ఏంటి? అనే అంశాలతో ఈ చిత్ర కథ ఉంటుందని హాలీవుడ్ టాక్.

సాక్షి బిజినెస్

గురువారం
25-4-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 114	నిఫ్టీ ▲ 34
73,853	22,402

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	15,750	▲	54
డోజోన్స్	38,517	▲	13
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,040	▽	4
డాక్స్	18,089	▽	49
షాంఘై	3,045	▲	23
నికాయ్	38,460	▲	908

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	71,826 ▲	228
బంగారం (99.5 స్వచ్ఛత)	71,538 ▲	227
వెండి (కిలో)	80,687 ▲	680

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		83.17	84.19
£	బ్రిటన్ పౌండ్		102.67	105.22
€	యూరో		87.86	90.22
¥	జపాన్ ఎన్ (100)		47.00	62.00
AUS	ఆస్ట్రేలియా డాలర్		52.57	54.49
S$	సింగపూర్ డాలర్		59.20	63.40
SAR	సౌదీ రియాల్		21.37	22.91
UAE D	యూఏఈ దిర్హామ్		21.84	23.61
¥	చైనా యువాన్		10.39	12.39

కోటక్ బ్యాంక్‌కు ఆర్‌బీఐ షాక్..

- ఆన్‌లైన్‌లో కస్టమర్లను చేర్చుకోవద్దని ఆదేశం
- కొత్త క్రెడిట్ కార్డులు జారీ చేయొద్దని ఆంక్షలు



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ కోటక్ మహీంద్రా బ్యాంక్‌కు రిజర్వ్ బ్యాంక్ షాకిచ్చింది. ఆన్‌లైన్, మొబైల్ బ్యాంకింగ్ మాధ్యమాల ద్వారా కొత్త కస్టమర్లను చేర్చుకోవద్దని ఆదేశించింది. అలాగే కొత్త క్రెడిట్ కార్డులను జారీ చేయకుండా ఆంక్షలు విధించింది. ఈ ఆదేశాలు తక్షణం అమల్లోకి వస్తాయి. బ్యాంకు ఐటీ రిస్క్ మేనేజ్‌మెంట్‌లో 'తీవ్రమైన లోపాలు' బయటపడటం ఇందుకు కారణమని ఆర్‌బీఐ పేర్కొంది. అయితే, క్రెడిట్ కార్డు కస్టమర్లు సహా ప్రస్తుతమున్న ఖాతాదారులందరికీ బ్యాంకు యథాప్రకారం సేవలు అందించడాన్ని కొనసాగించవచ్చని తెలిపింది. మే 4న కోటక్ మహీంద్రా బ్యాంకు ఆర్థిక ఫలితాలను వెల్లడించనున్న నేపథ్యంలో తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. బ్యాంకు ఎక్స్‌టర్నల్ ఆడిట్‌ను నిర్వహించి, అందులో బయటపడే సమస్యలను, తాము గుర్తించిన లోపాలను పరిష్కరిస్తే ఆంక్షలను సమీక్షిస్తామని ఆర్‌బీఐ పేర్కొంది.

పదే పదే సాంకేతిక అంతరాయాలు తలెత్తుతున్న కారణంగా 2020 డిసెంబర్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుపై కూడా ఆర్‌బీఐ దాదాపు ఇదే తరహా ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే.

ఐటీ సంబంధ తనిఖీలో కీలకాంశాలు

2022, 2023 సంవత్సరాల్లో నిర్వహించిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సంబంధ తనిఖీల్లో తీవ్ర ఆందోళనకరమైన అంశాలను గుర్తించినట్లు రిజర్వ్ బ్యాంక్ పేర్కొంది. 'ఐటీ ఇన్వెంటరీ నిర్వహణ, యూజర్ యాక్సెస్ మేనేజ్‌మెంట్, వెండార్ రిస్క్ మేనేజ్‌మెంట్, డేటా సెక్యూరిటీ వంటి అంశాల్లో తీవ్రమైన లోపాలు, నిబంధనలను పాటించకపోవడం మొదలైన వాటిని గుర్తించాం' అని వివరించింది. వాటిని సమగ్రంగా, సకాలంలో పరిష్కరించడంలో బ్యాంకు నిరంతరం వైఫల్యం చెందుతున్న కారణంగా తాజా చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని ఆర్‌బీఐ తెలిపింది.

పటిష్టమైన ఐటీ మౌలిక సదుపాయాలు, రిస్క్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ లేకపోవడం వల్ల కోర్ బ్యాంకింగ్ సిస్టం (సీబీఎస్), ఆన్‌లైన్ .. డిజిటల్ బ్యాంకింగ్ మాధ్యమాలు గత రెండేళ్లుగా తరచూ మొరాయిస్తూ, కస్టమర్లను తీవ్ర అసౌకర్యానికి గురి చేస్తున్నాయని వివరించింది. ఈ ఏడాది ఏప్రిల్ 15న కూడా ఇదే తరహా ఘటన చోటు చేసుకున్నట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలోనే కస్టమర్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బ్యాంకుకు సంబంధించిన నిర్దిష్ట వ్యాపార విభాగాలపై ఆంక్షలు విధించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.

స్పీడ్ తగ్గిన హెచ్‌యూఎల్

- లాభం రూ. 2,561 కోట్లు
- రూ. 24 తుది డివిడెండ్



న్యూఢిల్లీ: నాలుగో త్రైమాసికంలో హిందుస్తాన్ యూనిలీవర్ (హెచ్‌యూఎల్) నికర లాభం స్వల్పంగా తగ్గి (1.53%) రూ. 2,561 కోట్లుగా నమోదైంది. తాజా సమీక్షాకాలంలో ఆదాయం రూ. 15,375 కోట్ల నుంచి స్వల్ప వృద్ధితో రూ. 15,441 కోట్లకు పెరిగింది. వ్యయాలు రూ. 11,962 కోట్ల నుంచి రూ. 12,100 కోట్లకు చేరాయి. పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను ఆదాయం రూ. 61,092 కోట్ల నుంచి రూ. 62,707 కోట్లకు చేరింది. లాభం రూ. 10,143 కోట్లుగా నమోదైంది. బుధవారం సమావేశమైన కంపెనీ బోర్డు.. రూ.1 ముఖ విలువ చేసే షేరు ఒక్కొంటికి రూ. 24 చొప్పున తుది డివిడెండ్ ఇవ్వాలని ప్రతిపాదించింది. తాత్కాలిక డివిడెండ్ రూ. 18 కూడా కలిపితే పూర్తి సంవత్సరానికి మొత్తం మీద ఒక్కో షేరుకి రూ. 42 డివిడెండ్ ఇచ్చినట్లవుతుందని సంస్థ తెలిపింది.

బుధవారం బీఎస్ఈలో కంపెనీ షేరు స్వల్పంగా తగ్గి రూ. 2,259.15 వద్ద క్లోజయ్యింది.

ఎల్‌టీఐ మైండ్‌ట్రీ లాభం రూ.1,101 కోట్లు



న్యూఢిల్లీ: ఐటీ కంపెనీ ఎల్‌టీఐమైండ్‌ట్రీ మార్చి త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 1.2 శాతం క్షీణించి రూ.1,101 కోట్లు నమోదు చేసింది. టర్నోవర్ 2.32 శాతం ఎగసి రూ.8,893 కోట్లను తాకింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో నికరలాభం 4 శాతం అధికమై రూ.4,584 కోట్లు సాధించింది. టర్నోవర్ 7 శాతం దూసుకెళ్లి రూ.35,517 కోట్లకు చేరింది. ఆర్డర్ బుక్ 15.7 శాతం పెరిగి 5.6 బిలియన్ డాలర్లుగా ఉందని కంపెనీ తెలిపింది.

హైరింగ్ ప్రణాళికల్లో క్రిటికల్‌రివర్



సీఈవో అంజి మారం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెక్నాలజీ సొల్యూషన్స్ సంస్థ క్రిటికల్‌రివర్ తమ కార్యకలాపాల విస్తరణలో భాగంగా దేశీయంగా నియామకాలు చేపట్టే యోచనలో ఉంది. కంపెనీకి అంతర్జాతీయంగా 1,000 మంది సిబ్బంది ఉండగా వీరిలో దేశీయంగా సగం మంది ఉన్నారు. దీన్ని మరో 30–40% మేర పెంచుకునే అవకాశం ఉందని సంస్థ సీఈవో అంజి మారం తెలిపారు.

యాక్సిస్ లాభం రూ. 7,129 కోట్లు

- క్యూ4లో ఆదాయం రూ. 35,990 కోట్లు
- రూ. 1 డివిడెండు



ముంబై: ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం యాక్సిస్ బ్యాంక్ గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రూ. 7,129 కోట్ల నికర లాభం ప్రకటించింది. 2022–23 క్యూ4లో బ్యాంకు రూ. 5,728 కోట్ల నికర నష్టం నమోదు చేసింది. ఇక తాజాగా ఆదాయం రూ. 28,758 కోట్ల నుంచి రూ. 35,990 కోట్లకు ఎగిసింది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 11 శాతం పెరిగి రూ. 13,089 కోట్లుగా నమోదైంది. మరోవైపు, 2023–24 పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను బ్యాంకు నికర లాభం 160 శాతం పెరిగి రూ. 24,861 కోట్లకు చేరింది. వ్యాపార పరిమాణం 12% వృద్ధి చెంది రూ. 14,77,209 కోట్లకు ఎగిసింది. గత ఆర్థిక సంవత్సరానికి రూ. 2 ముఖ విలువ గల షేరుపై రూ. 1 చొప్పున డివిడెండ్ ఇవ్వాలని బ్యాంకు బోర్డు నిర్ణయించింది. సిటీ బ్యాంకు వ్యాపార కార్యకలాపాలను అనుసంధానం చేసే ప్రక్రియ వచ్చే ఆరు నెలల్లో పూర్తి కావచ్చని బ్యాంకు సీఈవో అమితాబ్ చౌదరి తెలిపారు. భారత్‌లో సిటీబ్యాంక్ కన్జూమర్ వ్యాపారాన్ని యాక్సిస్ బ్యాంక్ కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే.

మరిన్ని విశేషాలు..

- స్థూల మొండి బాకీలు 2.02% నుంచి 1.43 శాతానికి తగ్గాయి.
- పూర్తి ఆర్థిక సంవత్సరంలో 475, నాలుగో క్వార్టర్లో 125 శాఖలను తెరవడంతో దేశీయంగా మొత్తం బ్రాంచీల నెట్‌వర్క్ 5,377కి చేరింది.
- మార్చి క్వార్టర్‌లో 12.4 లక్షల క్రెడిట్ కార్డులను కొత్తగా జారీ చేయడం ద్వారా గత తొమ్మిది క్వార్టర్లలో దేశీయంగా అత్యధిక సంఖ్యలో క్రెడిట్ కార్డులను జారీ చేసిన బ్యాంకుల్లో ఒకటిగా బ్యాంక్ నిల్చింది.

బుధవారం బ్యాంకు షేరు బీఎస్ఈలో 0.69% పెరిగి రూ. 1,063.70 వద్ద క్లోజయ్యింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

25-4-2024 ఫామ్ ధర...

విశాఖ	400–00
చిత్తూరు	453–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	380–00
విజయవాడ	380–00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	350–00
వరంగల్	352–00
రిటైల్ ధర	4.10

ఎస్‌బీఐ కొత్త ఎండీగా రాణా అశుతోశ్ కుమార్ సింగ్!



న్యూఢిల్లీ: ఎస్‌బీఐ కొత్త ఎండీగా రాణా అశుతోశ్ కుమార్ సింగ్ పేరును ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూషన్స్ బ్యూరో (ఎఫ్ఎస్ఐబీ) ప్రతిపాదించింది. ప్రస్తుతం ఆయన ఎస్‌బీఐ డిప్యూటీ ఎండీగా ఉన్నారు. ఎస్‌బీఐలో ప్రస్తుతం ఒక చైర్మన్, నలుగురు ఎండీలు ఉన్నారు. ఎస్‌బీఐ కొత్త ఎండీ నియామకం కోసం 16 మందిని ఇంటర్వ్యూ చేశారు. కాగా ఇండియన్ బ్యాంక్ నూతన ఎండీగా ఆశీష్ పాండే పేరును బ్యూరో ప్రతిపాదించింది.

నాలుగో రోజూ లాభాలే

రాణించిన మెటల్, ఫైనాన్స్ షేర్లు ● 22,400 స్థాయిపైకి నిఫ్టీ

ముంబై: ఫైనాన్స్, మెటల్ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు నాలుగో రోజూ లాభపడ్డాయి. సెన్సెక్స్ 114 పాయింట్లు పెరిగి 73,853 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 34 పాయింట్లు బలపడి 22,402 వద్ద నిలిచింది. దేశీయ వ్యాపార కార్యకలాపాలు ఏప్రిల్‌లో 14 ఏళ్ల గరిష్టానికి చేరుకోవడం, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూలతలు కలిసొచ్చాయి. ఇన్వెస్టర్లు కార్పొరేట్ క్యూ4 ఫలితాలపై దృష్టి సారిస్తూ ట్రేడింగ్‌లో కొనుగోళ్లకు ఆసక్తి చూపారు. ఒక దశలో సెన్సెక్స్ 383 పాయింట్లు పెరిగి 74,121 వద్ద, నిఫ్టీ 108 పాయింట్లు ఎగసి 22,476 వద్ద ఇంట్రాడే గరిష్టాలను నమోదు చేశాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.79%, 0.92 శాతం చొప్పున పెరిగాయి. అయితే ట్రేడింగ్ చివర్లో ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఐటీ, టెలికం, మీడియా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో సూచీల లాభాలు కొంతమేర తగ్గాయి.



- నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ 'నిఫ్టీ నెక్ట్స్ 50' సూచీలో కొత్తగా ప్రవేశపెట్టిన డెరివేటివ్ కాంట్రాక్టుల ట్రేడింగ్‌కు సానుకూల స్పందన లభించింది. దేశవ్యాప్తంగా 375 మందికి పైగా సభ్యులు ఇండెక్స్ డెరివేటివ్స్ ట్రేడింగ్‌లో పాల్గొన్నారు. తొలిరోజు ఫ్యూచర్స్‌లో 1,233 కాంట్రాక్టులు ట్రేడయ్యాయి.
- నాలుగు రోజుల్లో సెన్సెక్స్ 1,364 పాయింట్లు(2%) ర్యాలీతో బీఎస్ఈలో 8.48 లక్షల కోట్లు సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.401 లక్షల కోట్లకు చేరింది.
- అంతర్జాతీయంగా కమోడిటీ ధరలు పెరగడంతో మెటల్ షేర్లకు డిమాండ్ నెలకొంది. సెయిల్ 7%, ఎన్ఎండీసీ 6%, హిందాల్కో, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 4%, టాటా స్టీల్, జిందాల్ స్టీల్ 3% పెరిగాయి. నాల్కో, వెల్‌స్పాన్ కార్ప్, హిందూస్థాన్ కాపర్, వేదాంత, హిందూస్థాన్ జింక్ షేర్లు 2% లాభపడ్డాయి.

మోసపూరిత ప్రకటనలతో జాగ్రత్త: ఎల్ఐసీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: తమ సంస్థ పేరుతో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న మోసపూరిత ప్రకటనల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) హెచ్చరించింది. 'కంపెనీ సమ్మతి లేకుండా మా సీనియర్ అధికారి, మాజీ అధికారుల ఫొటోలు, లోగో, బ్రాండ్ పేరును దుర్వినియోగం చేయడం ద్వారా నిర్దిష్ట వ్యక్తులు/సంస్థలు వివిధ సామాజిక మాధ్యమాల్లో మోసపూరిత ప్రకటనల్లో అనధికార పద్ధతిలో నిమగ్నమై ఉన్నాయని మా దృష్టికి వచ్చింది. పాలసీదారులు, ప్రజలు జాగ్రత్తగా వ్యవహరించాలి. అటువంటి మోసపూరిత ప్రకటనల యూఆర్ఎల్ లింక్‌లను ఎల్ఐసీ అధికారిక సోషల్ మీడియా ఖాతాలలో నివేదించండి' అని ఎల్ఐసీ కోరింది.

మోదీ పనితీరు అద్భుతం



జేపీ మోర్గాన్ సీఈవో ప్రశంసలు

న్యూఢిల్లీ: భారత ప్రధాని నరేంద్ర మోదీ అద్భుతమైన పనితీరు ప్రదర్శిస్తున్నారంటూ జేపీ మోర్గాన్ సీఈవో జేమీ డిమోన్ ప్రశంసించారు. ఎకనామిక్ క్లబ్ ఆఫ్ న్యూయార్క్ సంస్థ మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మోదీ సంస్కరణలను డిమోన్ కొనియాడారు. "సమ్మిళిత ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి భారత్‌లో ప్రధాని మోదీ 40 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశారు. అక్కడ పలు రాష్ట్రాల్లోని పన్ను వ్యవస్థల సంక్లిష్టతలను ఛేదించి సంస్కరించారు. సానుకూల మార్పు దిశగా కఠిన నిర్ణయాలు తీసుకున్నారు'' అంటూ మోదీని పొగిడారు.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఐఎస్‌టీ, తిరువనంతపురంలో పీహెచ్‌డీ ప్రవేశాలు

తిరువనంతపురంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఐఐఎస్‌టీ), జూలై 2024 విద్యా సంవత్సరానికి సంబంధించి పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» విభాగాలు: ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఏవియోనిక్స్, కెమిస్ట్రీ, ఎర్త్ అండ్ స్పేస్ సైన్సెస్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్.
» అర్హత: కనీసం 60 శాతం మార్కులతో ఇంజనీరింగ్/టెక్నాలజీలో మాస్టర్స్ డిగ్రీ లేదా కనీసం 75శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ(ఇంజనీరింగ్/టెక్నాలజీ) ఉత్తీర్ణతతో పాటు వ్యాలిడ్ గేట్ స్కోరు సాధించి ఉండాలి లేదా సంబంధిత విభాగంలో ఎంఎస్సీ ఉత్తీర్ణతతో పాటు యూజీసీ–సీఎస్ఐఆర్ నెట్–జేఆర్ఎఫ్/లెక్చర్‌షిప్, ఎన్‌బీహెచ్ఎం/జెస్ట్/గేట్ స్కోరు సాధించి ఉండాలి.
» వయసు: 07.05.2024 నాటికి 35 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:07.05.2024
» ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష తేది: 29.05.2024.
» పరీక్ష ఫలితాల వెల్లడి: 05.06.2024.
» ఇంటర్వ్యూ తేదీలు: 19.06.2024 నుంచి 21.06.2024 వరకు
» ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల: 01.07.2024.
» వెబ్‌సైట్: https://www.iist.ac.in

ఐఐఎం అహ్మదాబాద్‌లో ఆన్‌లైన్ ఎంబీఏ ప్రవేశాలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అహ్మదాబాద్(ఐఐఎం).. 2024–26 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండేళ్ల ఆన్‌లైన్ ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» అర్హత: 50 శాతం మార్కులతో ఏదైనా విభాగంలో డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హతతో పాటు కనీసం మూడేళ్ల పని అనుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: ఆన్‌లైన్ ఐఐఎంఏ అడ్మిషన్ టెస్ట్(ఐటీఏ),క్యాట్,జీమ్యాట్ /జీఆర్ఈ స్కోరు, షార్ట్‌లిస్ట్,ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» దరఖాస్తులకు చివరితేది: 10.05.2024.
» ఐఏటీ అడ్మిట్ కార్డ్ వెలువడే తేది:14.05.2024
» ఐఏటీ పరీక్ష: 19.05.2024, 26.05.2024.
» వెబ్‌సైట్: https://www.iima.ac.in

నిఫ్టెమ్‌లో ఎంటెక్, ఎంబీఏ ప్రవేశాలు

కుండ్లి(హర్యానా)లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్(నిఫ్టెమ్).. 2024–25 అడ్మిషన్ సెషన్‌కు సంబంధించి ఎంటెక్, ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

» మాస్టర్ ఆఫ్ టెక్నాలజీ(ఎంటెక్): 100 సీట్లు: విభాగాలు: ఫుడ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, ఫుడ్ సేఫ్టీ క్వాలిటీ మేనేజ్‌మెంట్,ఫుడ్ ప్లాంట్ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఫుడ్ సప్లై చైన్ మేనేజ్‌మెంట్.
» మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ): 60 సీట్లు.
» అర్హత: ఎంబీఏకు బ్యాచిలర్ డిగ్రీ, ఎంటెక్‌కు బీఈ/బీటెక్,బీఎస్సీ,ఎంఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 15.05.2024
» పూర్తి వివరాలకు వెబ్‌సైట్: http://niftem.ac.in

ఐఎంయూ, చెన్నైలో యూజీ-పీజీ ప్రవేశాలు

చెన్నైలోని ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ (ఐఎంయూ).. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీ, యూజీ, డీఎన్ఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు ఐఎంయూ సెట్ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తోంది. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» విభాగాలు: మెరైన్ ఇంజనీరింగ్, నావల్ ఆర్కిటెక్చర్ అండ్ ఓషియన్ ఇంజనీరింగ్, నావల్ ఆర్కిటెక్చర్ అండ్ షిప్ బిల్డింగ్, నాటికల్ సైన్స్, అప్లైడ్ న్యూట్రికల్ సైన్స్, నావల్ ఆర్కిటెక్చర్ అండ్ ఓషియన్ ఇంజనీరింగ్, డ్రెడ్జింగ్ హార్బర్ ఇంజనీరింగ్, మెరైన్ టెక్నాలజీ, ఇంటర్నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ అండ్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్, పోర్ట్ అండ్ షిప్పింగ్ మేనేజ్‌మెంట్.
» అర్హత: ఇంటర్మీడియట్, డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి లేదా తత్సమాన విద్యార్హతతో పాటు గేట్/సీయూఈటీ/పీజీ సెట్/క్యాట్/మ్యాట్/సీమ్యాట్ స్కోరు ఉండాలి.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:05.05.2024
» ఐఎంయూ సెట్ పరీక్ష తేది: 08.06.2024.
» వెబ్‌సైట్: https://www.imu.edu.in

అవుతారా.. న్యూట్రిషనిస్ట్!

» బీఎస్సీ ఫుడ్, న్యూట్రిషన్ కోర్సుతో అవకాశాలు
» బైపీసీ విద్యార్థులకు ఉన్నత విద్య, ఉద్యోగాలకు మార్గం
» ఎమ్మెస్సీలో ఫుడ్ సైన్స్, న్యూట్రిషన్ స్పెషలైజేషన్స్
» వీటిని పూర్తి చేసుకుంటే కార్పొరేట్ కొలువులు

బైపీసీ ఉత్తీర్ణులకు సంప్రదాయ బీఎస్సీ బీజెడ్‌సీతోపాటు పలు వినూత్న కాంబినేషన్లతో కోర్సులు అందుబాటులోకి వస్తున్నాయి. వాటిని పూర్తి చేసుకుంటే.. జాబ్ మార్కెట్ అవకాశాలు విస్తృతం అవుతాయి. అలాంటి కోవకు చెందిన కోర్సు.. బీఎస్సీ ఫుడ్ అండ్ న్యూట్రిషన్! ఇటీవల కాలంలో ప్రజల్లో ఆరోగ్య శ్రద్ధ పెరగడంతో ఫుడ్, న్యూట్రిషన్ నిపుణులకు డిమాండ్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో.. ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సైన్స్ కోర్సులు, కెరీర్ అవకాశాలపై ప్రత్యేక కథనం..



ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో సరైన ఆహార అలవాట్లు లేక ఎంతోమంది రోగాల బారిన పడుతున్నారు. అలాంటి వారికి తీసుకోవాల్సిన ఆహారం, పోషక పదార్థాల గురించి మార్గనిర్దేశం చేసే నిపుణులే.. న్యూట్రిషన్ స్పెషలిస్టులు.

డిగ్రీ, పీజీ కోర్సులు

ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సైన్స్‌కు సంబంధించి ప్రస్తుతం డిగ్రీ, పీజీ స్థాయిలో కోర్సులు అందుబాటులో ఉన్నాయి. బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలో న్యూట్రిషన్, బయాలజీ, కెమిస్ట్రీ కాంబినేషన్‌తో..అదే విధంగా ఫుడ్ సైన్స్, న్యూట్రిషన్ అండ్ డైటిటిక్స్ కాంబినేషన్లతో కోర్సులు అందిస్తున్నారు. దీంతో పాటు హోంసైన్స్ విభాగంలో గుర్తింపు పొందిన హైదరాబాద్(ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ)లోని కాలేజ్ ఆఫ్ హోంసైన్స్‌లోనూ బీఎస్సీలో ఫుడ్, న్యూట్రిషన్, డైటిటిక్స్ అంశాలను బోధిస్తారు. ఇదే కాలేజ్‌లో పీజీ స్థాయిలో న్యూట్రిషన్ అండ్ డైటిటిక్స్ స్పెషలైజేషన్‌తో కోర్సు అందుబాటులో ఉంది. జాతీయ స్థాయిలో పలు సెంట్రల్ యూనివర్సిటీల్లోనూ బీఎస్సీ, ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీలో ఫుడ్, న్యూట్రిషన్ కోర్సులను అందిస్తున్నారు. సీయూఈటీ–యూజీ స్కోర్ ఆధారంగా వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎన్ఐఎన్‌లో ఎమ్మెస్సీ

హైదరాబాద్‌లోని ఐసీఎంఆర్–నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్).. ఎమ్మెస్సీ అప్లయిడ్ న్యూట్రిషన్, ఎమ్మెస్సీ స్పోర్ట్స్ న్యూట్రిషన్ కోర్సులను అందిస్తోంది. వీటికి ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీలో అప్లయిడ్ న్యూట్రిషన్, హోంసైన్స్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్, నర్సింగ్, న్యూట్రిషన్ అండ్ డైటిటిక్స్ తదితర స్పెషలైజేషన్లు పూర్తి చేసుకున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష ద్వారా అడ్మిషన్ కల్పిస్తారు. ప్రస్తుతం దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. జూన్ 23న ఎంట్రెన్స్ టెస్ట్ ఉంటుంది. దరఖాస్తులకు చివరి తేదీ 2024, మే 20. పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://icmrnin.aptonline.in/ICMRNIN/Views/Application/Home

సెంట్రల్ వర్సిటీల్లో పీజీ

ప్రముఖ యూనివర్సిటీల్లో పీజీ స్థాయిలో ఫుడ్ సైన్స్, న్యూట్రిషన్ స్పెషలైజేషన్స్ అందుబాటులో ఉన్నాయి. బీహెచ్‌యూ–వారణాసి, జాదవ్‌పూర్ యూనివర్సిటీ, ఇగ్నోతోపాటు పలు ప్రముఖ సెంట్రల్ యూనివర్సిటీల్లో లైఫ్ సైన్సెస్ విభాగాల పరిధిలో ఫుడ్, న్యూట్రిషన్ స్పెషలైజేషన్స్‌తో పీజీ కోర్సులు అందిస్తున్నారు. వీటిలో ప్రవేశానికి సీయూఈటీ–పీజీ ఎంట్రన్స్‌లో స్కోర్ ఆధారంగా దరఖాస్తు చేసుకోవాలి.

పీహెచ్‌డీ కూడా

ఫుడ్ అండ్ న్యూట్రిషన్‌లో పీహెచ్‌డీ చేసే అవకాశం కూడా ఉంది. యూనివర్సిటీ ఆఫ్ కోల్‌కతా, యూనివర్సిటీ ఆఫ్ మైసూర్, పంజాబ్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ, పాండిచ్చేరి యూనివర్సిటీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ వంటి ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌లో పీహెచ్‌డీలో చేరొచ్చు. ఇందుకోసం యూజీసీ–నెట్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో ఆంధ్రా యూనివర్సిటీలో, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్ ఉన్నాయి. అదే విధంగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఫుడ్ అండ్ న్యూట్రిషనల్ సైన్స్‌లో పీహెచ్‌డీ చేసే వీలుంది. తెలంగాణలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీలో చేరే అవకాశముంది.

కోర్సులో బోధించేవి

ఫుడ్ న్యూట్రిషన్ సైన్స్ కోర్సుల్లో భాగంగా న్యూట్రిషనల్ బయోకెమిస్ట్రీ, శానిటైజేషన్, హైజీన్, డైట్ థెరపీ, పబ్లిక్ హెల్త్, కమ్యూనిటీ న్యూట్రిషన్ వంటి అంశాలను బోధిస్తారు. కరిక్యులంలో భాగంగా ఫీల్డ్ స్టడీ కూడా చేయాల్సి ఉంటుంది. దీంతో అకడమిక్ స్థాయిలోనే విద్యార్థులకు వాస్తవ పరిస్థితులపై అవగాహన వస్తుంది. ఫలితంగా కోర్సు పూర్తయ్యే నాటికి నైపుణ్యాలు సొంతం చేసుకుని జాబ్ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా రూపొందే అవకాశం ఉంటుంది.

ఉపాధి వేదికలు

ఫుడ్, న్యూట్రిషన్ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి హాస్పిటల్స్, స్వచ్ఛంద సంస్థలు, పాఠశాలలు ప్రధాన ఉపాధి వేదికలుగా నిలుస్తున్నాయి. రోగులకు.. ఆహార నియమాలను వివరించడానికి కార్పొరేట్ హాస్పిటల్స్ ప్రత్యేకంగా డైటీషియన్స్‌ను నియమించుకుంటున్నాయి. ఇందుకోసం ఈ విభాగంలో డిగ్రీ, పీజీ చేసిన వారికి అవకాశం కల్పిస్తున్నాయి. అదే విధంగా స్పోర్ట్స్ క్లబ్స్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్, ఐసీడీఎస్ విభాగాల్లోనూ న్యూట్రిషన్, డైటిషియన్ నిపుణుల అవసరం నెలకొంది.

కార్పొరేట్ సంస్థలు

ఫుడ్, న్యూట్రిషన్ స్పెషలిస్ట్‌లకు కార్పొరేట్ కంపెనీల్లోనూ ఉపాధి లభిస్తోంది. ముఖ్యంగా ఆహార పదార్థాల తయారీ సంస్థలు..ఫుడ్, న్యూట్రిషన్ స్పెషలిస్ట్‌లకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఆయా ఆహార పదార్థాల తయారీలో పొందుపర్చాల్సిన పోషకాల శాతం, వాటి నిల్వకు తీసుకోవాల్సిన చర్యలను సూచించేందుకు వీరిని నియమించుకుంటున్నాయి. దీంతో ఫుడ్ ప్రాసెసింగ్ విభాగంలో న్యూట్రిషిన్ నిపుణులకు ప్రాధాన్యం పెరుగుతోంది. నెస్లె, బ్రిటానియా, క్వాలిటీ, హాట్సన్, డాబర్, క్యాడ్‌బరీ, ఐటీసీ వంటి సంస్థలు టాప్ రిక్రూటర్స్‌గా నిలుస్తున్నాయి.

జాబ్ ప్రొఫైల్స్ ఇవే

ఫుడ్, న్యూట్రిషన్ స్పెషలైజేషన్‌లో బ్యాచిలర్, పీజీ డిగ్రీ పూర్తి చేసుకున్న వారికి విభిన్న జాబ్ ప్రొఫైల్స్ లభిస్తున్నాయి. ముఖ్యంగా వీరు న్యూట్రిషనిస్ట్, డైటిషియన్, ఫుడ్ రీసెర్చ్ అనలిస్ట్ వంటి కొలువులు సొంతం చేసుకోవచ్చు. వీరికి ప్రారంభంలో రూ.రెండు లక్షల నుంచి రూ.నాలుగు లక్షల వరకు వార్షిక అందుతోంది.

న్యూట్రిషనిస్ట్

హెల్త్‌కేర్ రంగంలో, ముఖ్యంగా హాస్పిటల్స్‌లో న్యూట్రిషనిస్ట్ ఉద్యోగాలు లభిస్తాయి. రోగుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి.. వారు పాటించాల్సిన ఆహార నియమాలపై సూచనలు ఇవ్వాల్సి ఉంటుంది. అదే విధంగా డయాబెటిస్, ఒబెసిటీ, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఆహార నియామాలను సూచించాల్సి ఉంటుంది.

డైటిషియన్

వ్యక్తులు ఆరోగ్యవంతంగా జీవించడానికి అవసరమైన ఆహారపు అలవాట్లను డైటిషియన్‌లు సూచిస్తారు. పోషకాహారం అంటే ఏమిటి.. ఆయా వ్యక్తుల అవసరాలకు తగ్గట్టు తీసుకోవాల్సిన ఆహారం, పాటించాల్సిన నిబంధనలు తదితరాలను వీరు వివరిస్తారు.

ఫుడ్ రీసెర్చ్ అనలిస్ట్

ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించడం, అదే విధంగా వీటికి సంబంధించి పరిశోధనలు చేయడం వంటి విధులు ఉంటాయి. ఆహార పదార్థాలను కెమికల్‌గా, బయలాజికల్‌గా పరీక్షించి.. నాణ్యమైన ఉత్పత్తిని రూపొందించేలా సూచనలు చేయాల్సి ఉంటుంది. ఈ ఉద్యోగాలు ఆహార పదార్థాల తయారీ సంస్థల్లో లభిస్తాయి.

ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్/ఎగ్జిక్యూటివ్

ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి, వాటిలో లోటుపాట్లను గుర్తించడం.. నాణ్యమైన ఆహారం తయారీకి తీసుకోవాల్సిన చర్యలను చేపట్టడం వంటి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేట్ రెండు రంగాల్లోనూ ఈ కొలువులు లభిస్తున్నాయి.

హెల్త్ ఎడ్యుకేటర్

ప్రభుత్వ విభాగంలో లభించే ఉద్యోగాల్లో ముఖ్యమైనది.. హెల్త్ ఎడ్యుకేటర్. ఆయా ప్రాంతంలోని ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడం ,అందుకోసం పాటించాల్సిన ఆహార నియమాలను సూచించడం వంటి విధులు వీరు నిర్వర్తించాల్సి ఉంటుంది. మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలోని ఐసీడీఎస్ విభాగంలో ఈ కొలువులు లభిస్తాయి.

కవిత అరెస్టు అక్రమం కాదు

మేనల్లుడు మేకా శరణ్ ఇండోస్పిరిట్స్‌లో ఉద్యోగి

- ప్రత్యేక కోర్టుకు స్పష్టం చేసిన ఈడీ
- బెయిల్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు
- మే 6న తీర్పు వెలువరిస్తామన్న న్యాయమూర్తి



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టు అక్రమం కాదని ఈడీ పునరుద్ఘాటించింది. పీఎంఎల్ఏ సెక్షన్ 19 ప్రకారమే ఆమెను అరెస్టు చేశామంది. ఆమెకు బెయిల్ ఇస్తే సాక్ష్యాలు, ఆధారాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని తెలిపింది. ఈడీ కేసులో కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై బుధవారం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కావేరి బవేజా విచారించారు. ఈడీ తరఫు న్యాయవాది జొహెబ్ హొస్సేన్ తన వాదనలు కొనసాగించారు. 'మద్యం విధానం మొత్తం తమకు అనుకూలంగా, లబ్ధి చేకూరేలా మార్చుకోవడంలో కవిత కీలక పాత్ర పోషించారు. ఈ వ్యవహారంలో క్విడ్‌ప్రోకో జరిగింది. కమీషన్ 12 శాతానికి పెంచడం వల్ల హోల్‌సేల్ వ్యాపారులు రూ.581 కోట్లు సంపాదించగా, ఇండో స్పిరిట్స్‌కు సుమారు రూ.180 కోట్లు వచ్చింది. ఇండో స్పిరిట్స్‌లో ప్రాక్సీ ద్వారా కవిత వాటాదారుగా ఉన్నారు. మద్యం విధానంలో మార్పుల వల్ల ప్రజలు, ప్రభుత్వానికి నష్టం వాటిల్లింది. పాత పాలసీని పక్కన పెట్టడంతోపాటు మహాదేవ్ డిస్ట్రిబ్యూటర్‌ను బలవంతంగా తప్పించారు. కొత్త పాలసీని ముందుకు తీసుకెళ్లడంలో కేజ్రీవాల్ అనుచరుడు విజయ్‌నాయర్, నాటి మంత్రి మనీశ్ సిసోడియా, కవిత బినామీ అరుణ్ పిళ్లై కీలకపాత్ర పోషించారు. పాలసీలో మార్పులు చేసినందుకు ఆమ్ ఆద్మీ పార్టీకి రూ.100 కోట్లు లంచం అందింది. ఢిల్లీ మద్యం వ్యాపారంలో ఎల్1 లైసెన్సు కోసం కవిత తీవ్రంగా యత్నించగా, చివరకు నిందితుడు సమీర్ మహేంద్రు, మాగుంట రాఘవ, కవితలకు చెరో 33 శాతం వాటా దక్కింది. బుచ్చిబాబు, మాగుంట రాఘవల వాట్సాప్ చాట్‌లలో ఈ సమాచారం లభ్యమైంది'.. అని జొహెబ్ హొస్సేన్ చెప్పారు.

'కేజ్రీవాల్, సిసోడియా, కవిత మధ్య రాజకీయ అవగాహన ఉందని బుచ్చిబాబు చెప్పారు. ఆప్‌తో కవిత సంబంధాలపై మాగుంట శ్రీనివాసులురెడ్డి కీలక వాంగ్మూలం ఇచ్చారు. కేవలం మద్యం వ్యాపారం గురించి మాట్లాడటానికే సచివాలయంలో కేజ్రీవాల్‌తో మాగుంట శ్రీనివాసులు రెడ్డి భేటీ అయ్యారు. దీనిపై కవితను కలవాలని, ఆమే మొత్తం చెప్తారని కేజ్రీవాల్ తనకు చెప్పినట్లు శ్రీనివాసులురెడ్డి వాంగ్మూలం ఇచ్చారు. కవితతో మాగుంట శ్రీనివాసులు రెడ్డి భేటీ అయినపుడు పాలసీ తమకు అనుకూలంగా మారుతుందని, అయితే ఆమ్ ఆద్మీ పార్టీకి రూ.100 కోట్లు ఇవ్వాల్సి ఉంటుందని కవిత చెప్పారు. ఈ క్రమంలో సొమ్ములు ఇవ్వడం ఆలస్యమైనపుడు మాజీ ఆడిటర్ బుచ్చిబాబు ద్వారా బెదిరింపులకు దిగారు. దీంతో మాగుంట రాఘవ ద్వారా రూ.10 కోట్లు బుచ్చిబాబుకు, రూ.15 కోట్లు అభిషేక్ బోయినపల్లికి అందజేశారు'అని జొహెబ్ హొస్సేన్ చెప్పారు. కవిత ఒత్తిడితోనే ఆరు నెలల తర్వాత వాంగ్మూలం మార్చుకుంటానని పిళ్లై అన్నారన్నారు. కవిత చెప్పిన మార్పులు, చేర్పులతోనే నూతన మద్యం పాలసీ బయటకు వచ్చిందని జొహెబ్ తెలిపారు.

ఉద్యోగానికి రాకుండానే రూ.లక్ష జీతం

కవిత మేనల్లుడు మేకా శరణ్‌ను ఇండో స్పిరిట్స్‌లో ఉద్యోగిగా చూపారని జొహెబ్ హొస్సేన్ తెలిపారు. రూ.లక్ష జీతగాడు అయిన శరణ్ ఒక్క రోజు కూడా విధులకు హాజరు కాలేదన్నారు. ఢిల్లీ విచారణకు రావాలని పలుసార్లు కోరినప్పటికీ శరణ్ రాలేదని తెలిపారు. విచారణ సమయంలో కవిత ఇచ్చిన ఫోన్ల డాటా డిలీట్ అయిందన్నారు. ఇంటో పనిచేసే వారికి ఫోన్లు ఇచ్చామని చెబుతున్నారని, అయితే తాము నోటీసులు ఇచ్చిన తర్వాత రోజుల్లో డాటా డిలీట్ అయినట్లు ఫోరెన్సిక్‌లో తేలిందన్నారు. వాదనలు ముగియడంతో తీర్పు రిజర్వు చేస్తున్నామని, మే 6న తీర్పు వెలువరిస్తామని న్యాయమూర్తి చెప్పారు.

కాళేశ్వరంపై న్యాయ విచారణ షురూ

- హైదరాబాద్‌కు చేరుకున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్
- నీటిపారుదల శాఖ అధికారులతో సమావేశం
- 26, 27 తేదీల్లో బ్యారేజీల సందర్శన?



జస్టిస్ చంద్రఘోష్‌కు స్వాగతం పలుకుతున్న నీటిపారుదల శాఖ అధికారులు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంపై సుప్రీం కోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్రఘోష్ న్యాయ విచారణ ప్రక్రియను ప్రారంభించారు. బుధవారం హైదరాబాద్‌కు చేరుకున్న ఆయన బీఆర్‌కేఆర్ భవన్‌లో తనకు కేటాయించిన కార్యాలయంలో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. నీటిపారుదల శాఖపై ఇటీవల శాసనసభలో ప్రవేశపెట్టిన శ్వేతపత్రం, మేడిగడ్డ బ్యారేజీపై విజిలెన్స్ నిర్వహించిన దర్యాప్తు నివేదిక, కాళేశ్వరం ప్రాజెక్టుపై కాగ్ సమర్పించిన ఆడిట్ నివేదికలతో పాటు బ్యారేజీల నిర్మాణానికి సంబంధించిన కీలక ఫైళ్లను జస్టిస్ చంద్రఘోష్‌కు ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ అధికారులు అందజేసినట్టు తెలిసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ప్లానింగ్, డిజైనింగ్, నిర్మాణంలో నిర్లక్ష్యం, అక్రమాలు, లోపాలపై న్యాయ విచారణ కోసం ఆయన్ను రాష్ట్ర ప్రభుత్వం నియమించడం తెలిసిందే. కాగా, 26 లేదా 27 తేదీల్లో బ్యారేజీల సందర్శనకు ఆయన వెళ్లే అవకాశముందని అధికారవర్గాలు వెల్లడించాయి.

నేడు అధికారులతో మళ్లీ భేటీ

గురువారం ఉదయం 10 గంటలకు నీటిపారుదల శాఖ అధికారులతో మరోసారి జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై వివిధ సందర్భాల్లో మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై ప్రత్యేక నివేదికను ప్రభుత్వం ఆయనకు అందజేయనున్నట్టు తెలిసింది. కాగా, ప్రాజెక్టు నిర్మాణంలో భాగస్వామ్యమైన ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇంజనీర్లకు నోటీసుల జారీపై గురువారం నాటి సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది.

కుతకుత..!

- రాష్ట్రంలో ఆరు రోజులుగా అధిక ఉష్ణోగ్రతల నమోదు
- గత పదేళ్లలో ఇదే రికార్డు అంటున్న వాతావరణశాఖ
- రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో పలుచోట్ల వడగాడ్పులు
- సాధారణం కంటే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం

బుధవారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు(సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
భద్రాచలం	42.8	27.5
ఖమ్మం	42.7	25.6
నల్లగొండ	42.5	24.4
విజయవాడ	42.0	27.0
నిజామాబాద్	41.4	26.7
రామగుండం	41.4	25.0
హనుమకొండ	41.0	24.0
మెదక్	40.6	23.0
మహబూబ్‌నగర్	40.5	27.6
హైదరాబాద్	39.9	26.6
ఆదిలాబాద్	38.8	22.7
విశాఖపట్నం	38.8	26.8

సాక్షి, హైదరాబాద్: వేసవి అయినా అధిక ఉష్ణోగ్రతల నమోదులో అంతరం ఉంటుందని వాతావరణశాఖ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గరిష్టంగా నాలుగు లేదా ఐదురోజుల తర్వాత ఉష్ణోగ్రతలు కాస్త తగ్గి, తిరిగి పెరుగుతాయి. కానీ ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నట్టు విశ్లేషిస్తున్నారు. హైదరాబాద్‌తోపాటు పలు ప్రాంతాల్లో గత ఆరురోజులుగా సగటున 40 డిగ్రీల నుంచి 43 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదు కావడం గత పదేళ్లలో ఇది రెండోసారి. గడిచిన పది సంవత్సరాల్లో 2015, 2016, 2019 సంవత్సరం ఏప్రిల్ నెలలో వరుసగా ఐదు రోజుల పాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదు కాగా... ఈసారి ఆరో రోజు కూడా అధిక ఉష్ణోగ్రత నమోదైంది.

రానున్న రెండురోజులు...

రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు కూడా వడగాడ్పులు వీచే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ సూచించింది. బుధవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే 1 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉష్ణోగ్రతలు నమోదైనట్టు తెలిపింది. వచ్చే రెండ్రోజులు కూడా ఇలాగే ఉంటుందని అంచనా వేసింది. అత్యధికంగా నల్లగొండ జిల్లా బుగ్గబావిగూడెం 44.9 డిగ్రీల సెల్సియస్, ఆ తర్వాత కరీంనగర్ జిల్లా వీణవంకలో 44.8 డిగ్రీల సెల్సియస్ మేర గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో అక్కడక్కడా తేలికపాటి వానలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ తెలిపింది.

నగరాభివృద్ధిలో రిటైల్ రంగానిది ప్రముఖ పాత్ర

సాంకేతిక వినియోగంతో కస్టమర్లకు మరింత చేరువ

- రిటైలర్స్ సదస్సులో పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్



సాక్షి, హైదరాబాద్: డిజిటలైజేషన్ పెరిగిన తర్వాత వినియోగదారులకు వస్తువుల కొనుగోలు అవకాశాలు పెరిగాయని, అదే స్థాయిలో రిటైలర్లు సైతం సాంకేతికత వినియోగిస్తే వినియోగదారులకు మరింత చేరువకాగలరని రాష్ట్ర పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్ అభిప్రాయపడ్డారు. రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఆర్ఏఐ) హైదరాబాద్ రిటైల్ సమ్మిట్ మూడో ఎడిషన్‌ను బుధవారం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జయేశ్ రంజన్ మాట్లాడుతూ, హైదరాబాద్ నగరం ప్రపంచ అత్యుత్తమ నగరంగా నిలవడంలో రిటైల్ రంగానిది కీలక పాత్ర అని పేర్కొన్నారు. రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఆర్ఏఐ) సీఈఓ కుమార్ రాజగోపాలన్ మాట్లాడుతూ, ఆధునికీకరణ, ఆన్‌లైన్ సేవలతో తెలంగాణ రిటైల్ రంగం అత్యంత వేగంగా విస్తరిస్తోందన్నారు. ఆర్ఏఐ తెలంగాణ చాప్టర్ చైర్మన్, నీరస్ ఎన్సెంబుల్స్ మేనేజింగ్ డైరెక్టర్ అవినిష్, అపోలో ఫార్మసీ సీఈఓ పి జయకుమార్ తదితరులు మాట్లాడారు. హైదరాబాద్ రిటైల్ రంగంలో ఐకాన్‌గా నిలిచిన పలువురిని సన్మానించారు. సన్మానం పొందిన వారిలో శరత్ సిటీమాల్ నుంచి సయ్యద్ అస్లామ్, హాలీవుడ్ ఫుట్‌వేర్ నుంచి ఇస్మాయిల్ అజానీ, జీఎంఆర్ నుంచి మనీశ్, ఆర్ఎస్ బ్రదర్స్ నుంచి టి ప్రసాదరావు, నీలోఫర్ నుంచి బాబురావు, చర్మాస్ నుంచి పెస్తోంజీ ఉన్నారు. కార్యక్రమంలో ప్యారడైజ్ ఫుడ్‌కోర్టు ఎండీ, సీఈఓ గౌతమ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి కరీంనగర్

రామయ్య రథోత్సవం ప్రారంభం

ఇల్లందకుంట: ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో ప్రధానఘట్టమైన చంద్రరథోత్సవం బుధవారం రాత్రి వైభవంగా ప్రారంభమైంది. ప్రధాన అర్చకులు శేషం రామాచార్యులు, వంశీధర్ ఆచార్యుల వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ చంద్రరథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. గురువారం సాయంత్రం వరకు రథంపై స్వామివారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. భక్తులు అధికసంఖ్యలో రానున్ననేపథ్యంలో ఏర్పాట్లు చేసినట్లు ఈవో కందుల సుధాకర్ తెలిపారు.





ఇవాళ 'బండి' నామినేషన్

- హాజరుకానున్న గుజరాత్ సీఎం భూపేంద్ర, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ గురువారం ఉదయం 11.30 గంటలకు కరీంనగర్ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయనున్నారు. కార్యక్రమానికి గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర రజనీకాంత్ భాయ్‌పటేల్, కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యకర్తలు కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాల నుంచి రాజీవ్‌చౌక్, టవర్ సర్కిల్ మీదుగా కట్టరాంపూర్, బస్టాండ్, గీతాభవన్ వరకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం గుజరాత్ సీఎం, కిషన్‌రెడ్డితో కలిసి జిల్లా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లి నామినేషన్ దాఖలు చేయనున్నారు. అంతకుముందు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీజేపీ చేరనున్నారు.

భళా.. బాలిక

- ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన బాలికలు
- సెకండియర్ కన్నా తక్కువగా ఫస్టియర్ రిజల్ట్స్
- అగ్రభాగంలో కరీంనగర్, ఆఖరున పెద్దపల్లి
- ఒకేషనల్‌లో అగ్రభాగంలో నిలిచిన పెద్దపల్లి

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

ఇంటర్ ఫలితాల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలికలు సత్తాచాటారు. బుధవారం ప్రకటించిన మొదటి,రెండో విద్యా సంవత్సరం ఇంటర్ ఫలితాల్లో కరీంనగర్ రాష్ట్రంలోనే 5వ, 4వ స్థానంలో నిలిచి సత్తా చాటింది. సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల పరిధిలో తక్కువ ఫలితాలు నమోదవడం గమనార్హం. మొదటి సంవత్సరం విద్యార్థుల కన్నా రెండో సంవత్సరం విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. మొత్తంగా ఇంటర్ రెండు విద్యా సంవత్సరాల్లో కరీంనగర్ అగ్రభాగం దక్కించుకోగా, ఆఖరుస్థానంలో పెద్దపల్లి, రెండు, మూడు స్థానాల్లో సిరిసిల్ల, జగిత్యాల నిలిచాయి. రెగ్యులర్ ఇంటర్‌లో ముందంజలో ఉన్న కరీంనగర్ ఒకేషనల్‌లో వెనకబడగా, పెద్దపల్లి అగ్రభాగాన నిలిచింది.

బాలికలదే పైచేయి..

ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో కరీంనగర్ 5వ స్థానంలో, రాజన్నసిరిసిల్ల 13వ, జగిత్యాల జిల్లా 25వ, పెద్దపల్లి 31వ స్థానంలో నిలిచాయి. ఇంటర్ సెకండియర్ ఫలితాల్లో కరీంనగర్ నాలుగోస్థానం, రాజన్నసిరిసిల్ల 15వ, జగిత్యాల 21వ, పెద్దపల్లి 31వ స్థానం దక్కించుకున్నాయి. ఈ ఫలితాల్లోనూ బాలికలే హవా చాటారు. బాలురకన్నా పైచేయి సాధించారు. కరీంనగర్ జిల్లా పరిధిలో బాలురు 56.13శాతం, బాలికలు 63.41 శాతం, సిరిసిల్లలో బాలురు 45శాతం, బాలికలు 57.79శాతం, జగిత్యాలలో బాలురు 36శాతం, బాలికలు 51.69శాతం, పెద్దపల్లిలో బాలురు 31.45, బాలికలు 46.31శాతం మేర ఫలితాలు సాధించారు.



ఒకేషనల్‌లో ఇలా

ఉమ్మడి జిల్లాలో ఒకేషనల్ మొదటి సంవత్సరంలో పెద్దపల్లి 50.92శాతం, సిరిసిల్ల 47.73శాతంతో తొలి, రెండోస్థానాలు దక్కించుకోగా, జగిత్యాల 44.15శాతం, కరీంనగర్ 42.64 శాతంతో మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి. ఒకేషనల్ రెండో సంవత్సరంలో పెద్దపల్లి 63.55శాతం, రాజన్నసిరిసిల్ల 63.01శాతం, కరీంనగర్ 57.62శాతం, జగిత్యాల 55.89శాతం ఫలితాలు సాధించాయి.

- మైనార్టీ కళాశాలల్లో పెద్దపల్లి 74.63శాతం, కరీంనగర్ 72.46శాతం, జగిత్యాల 71.21శాతం. సిరిసిల్ల 53.66శాతం ఫలితాలు సాధించాయి.
- మోడల్ స్కూళ్లలో పెద్దపల్లి 49.83శాతం, కరీంనగర్ 47.61శాతం, జగిత్యాల 58.96శాతం, సిరిసిల్ల 59.29శాతం ఫలితాలు నమోదు చేశాయి.
- ఇక ప్రభుత్వ జూనియర్ కళాశాలల విషయానికి వస్తే పెద్దపల్లి 35.57శాతం, కరీంనగర్ 36.14 శాతం, జగిత్యాల 38.59 శాతం, సిరిసిల్ల 46.86 శాతం ఉత్తీర్ణతను సాధించాయి.

ప్రథమ సంవత్సరం విద్యార్థుల హాజరు.. ఫలితాలు

జిల్లా	హాజరు	ఉత్తీర్ణత	శాతం
కరీంనగర్	15,058	9,548	63.41
రాజన్నసిరిసిల్ల	3,542	2,047	57.79
జగిత్యాల	5,717	2,955	51.69
పెద్దపల్లి	4,120	1,908	46.31

ద్వితీయ సంవత్సరం

జిల్లా	హాజరు	ఉత్తీర్ణత	శాతం
కరీంనగర్	13,407	9,974	74.39
రాజన్నసిరిసిల్ల	3,180	2,083	65.05
జగిత్యాల	5,741	3,691	64.29
పెద్దపల్లి	4,007	2,377	59.32

వీణవంక ఫస్ట్.. చిగురుమామిడి లాస్ట్

కరీంనగర్: ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. జిల్లావ్యాప్తంగా 11జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ప్రథమ సంవత్సరంలో ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ కరీంనగర్ కళాశాలలో 224 మందికి 87మంది ఉత్తీర్ణత సాధించారు. సైన్స్ కళాశాలలో 285 మందికి 79 మంది, బాలికల జూనియర్ కళాశాలలో 513మందికి 273 మంది, మానకొండూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 127మందికి 39 మంది, గంగాధర కళాశాలలో 67మందికి 15 మంది, హుజూరాబాద్ కళాశాలలో 146 మందికి 16మంది, సైదాపూర్ జూనియర్ కళాశాలలో 57 మందికి 19మంది, జమ్మికుంటలో 178మందికి 64మంది, వీణవంకలో 66 మందికి 54మంది, చిగురుమామిడిలో 67మందికి ముగ్గురు, చొప్పదండిలో 77 మందికి నలుగురు ఉత్తీర్ణత సాధించారు. వీణవంక ప్రభుత్వ జూనియర్ కళాశాల 81.82శాతం నమోదు చేసుకుని మొదటి స్థానంలో నిలవగా.. 4.48శాతంతో చిగురుమామిడి చివరిస్థానంలో నిలిచింది.

ద్వితీయ సంవత్సరంలో...

ద్వితీయ సంవత్సరంలో కరీంనగర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలలో 269మందికి 118 మంది, సైన్స్ కళాశాలలో 331 మందికి 143మంది, బాలికల జూనియర్ కళాశాలలో 590 మందికి 356 మంది, మానకొండూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 158 మందికి 30మంది, గంగాధరలో 86మందికి 19 మంది, హుజూరాబాద్‌లో 73 మందికి 57 మంది, సైదాపూర్‌లో 55 మందికి 32మంది, జమ్మికుంటలో 257 మందికి 117మంది, వీణవంకలో 89 మందికి 73మంది, చిగురుమామిడిలో 75 మందికి 11 మంది, చొప్పదండిలో 68 మందికి 11మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో వీణవంక ప్రభుత్వ జూనియర్ కళాశాల 82.02 శాతం ఉత్తీర్ణత సాధించి మొదటి స్థానంలో నిలిచింది. చివరి స్థానంలో చిగురుమామిడి జూనియర్ కళాశాల కేవలం 14.67 ఉత్తీర్ణత శాతం నమోదు చేసుకుంది. మహాత్మాజ్యోతిబాపూలే కళాశాలల నుంచి 126 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 106 మంది ఉత్తీర్ణత సాధించారు.

నామినేషన్లకు నేడే ఆఖరు



బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ తరఫున రెండోసెట్ నామినేషన్ దాఖలు చేస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ విజయ, స్వరూపారాణి, తదితరులు

- మధ్యాహ్నం 3 గంటల వరకు అవకాశం
- ఇప్పటి వరకు 40 మంది 60 సెట్లు దాఖలు
- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్‌రావు ఖరారు
- ఇండిపెండెంట్‌గా ప్రవీణ్‌రెడ్డి నామినేషన్

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

కరీంనగర్ పార్లమెంటు ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ల పర్వం చివరిదశకు చేరింది. గురువారం నామినేషన్ల సమర్పణకు ఆఖరు రోజు. ఈనెల 18వ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. 25వ తేదీన ప్రక్రియ ముగియనుంది. మధ్యాహ్నం 3గంటల వరకు దరఖాస్తు చేసుకునే వీలుంది. 26వ తేదీన నామినేషన్లను పరిశీలిస్తారు. ఉపసంహరణకు 29వ తేదీ వరకు గడువు ఉంది. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇప్పటి వరకు గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర పార్టీలు, గుర్తింపులేని పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులుగా పలువురు నామినేషన్లు వేశారు. మొత్తంగా 40 మంది 60 సెట్లు దాఖలు చేశారు.

బుధవారం 23 నామినేషన్లు

బుధవారం 23నామినేషన్లు దాఖలు అయ్యాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. 13 మంది అభ్యర్థుల తరఫున 23 నామినేషన్ పత్రాలు అందించారు. కాంగ్రెస్ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్‌రావు తరఫున ఆయన సతీమణి రేఖ రెండుసెట్లు దాఖలు చేశారు. అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి తరఫున మంగ రామచంద్రం ఒక సెట్ నామినేషన్ వేశారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ తరఫున కరీంనగర్, సిరిసిల్ల జెడ్పీ చైర్ పర్సన్లు కనుమల్ల విజయ న్యాలకొండ అరుణ, కరీంనగర్ డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపారాణి, కొత్తపల్లి ఎంపీపీ పిల్లి శ్రీలత, అక్కన్నపేట జెడ్పీటీసీ భూక్యా మంగ రెండోసెట్ దాఖలు చేశారు. వినోద్‌కుమార్ తరఫున సుధగోని శ్రీనాథ్ మూడోసెట్‌ను దాఖలు చేశారు.

కాంగ్రెస్‌లో ఉలుకులుకలు

కరీంనగర్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్‌రావు పేరును అధిష్ఠానం ఖరారు చేసింది. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఆదేశాలు జారీ చేసింది. నామినేషన్లు ముగిసేందుకు మరో 24గంటల సమయం మాత్రమే మిగిలి ఉన్న సమయంలో వెల్లడైన ఈ ఆదేశాలు ఇంతకాలం పార్టీలో కొనసాగుతున్న ఉత్కంఠకు తెరదించాయి. ఇదే సమయంలో మొదటి నుంచి ఎంపీ అభ్యర్థిగా అప్పట్లో హామీ పొందిన మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి తరఫున ఆయన అనుచరులు బుధవారం నామినేషన్ వేశారు. ప్రవీణ్‌రెడ్డికి ఎంపీ టికెట్ ఇస్తామని ఆశపెట్టి, ఆఖరు నిమిషంలో తన టికెట్ మార్చడంపై ఆయన, ఆయన వర్గీయులు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో హుస్నాబాద్ సీటును పార్టీ పెద్దలు చెప్పారని త్యాగం చేస్తే.. తమ త్యాగానికి అర్థం లేకుండా పోయిందని వాపోతున్నారు.

బరిలో ఉంటారా?

ఈ నేపథ్యంలో ప్రవీణ్‌రెడ్డి బరిలో ఉంటారా? లేక అధిష్ఠానం బుజ్జగింపులతో దిగి వస్తారా? అన్న కొత్త చర్చ పార్టీలో మొదలైంది. ఇటీవల ఆయన్ను హైదరాబాద్ పిలిచిన అధిష్ఠానం ఆయనకు సరైన హామీ ఇవ్వలేదని సమాచారం. దీంతో తన అనుచరుల రాజకీయ భవిష్యత్తు కోసం బరిలో నిలవాలని నిర్ణయించారు. వెంటనే కాంగ్రెస్ పార్టీ పెద్దలు ఆయన్ను బుజ్జగించేందుకు రంగంలోకి దిగినట్లు తెలిసింది. కానీ, ప్రవీణ్‌రెడ్డి వారి మాట వింటారా? గత అసెంబ్లీ ఎన్నికల్లో చేసిన వాగ్దానం అమలుకాని నేపథ్యంలో కొత్తగా ఏం హామీ ఇస్తారు? ఎలా దారికి తెచ్చుకుంటారు? అన్న విషయం ఆసక్తికరంగా మారింది.

పేరు: వెలిచాల రాజేందర్‌రావు



విద్యార్హత: ఎంబీఏ, ఉస్మానియా యూనివర్సిటీ
వృత్తి: పోచంపాడ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ప్రై.లిమిటెడ్
రాజకీయ జీవితం: 2004లో చొప్పదండి నుంచి ఇండిపెండెంట్ ఎమ్మెల్యేగా పోటీ, 2007–09 ప్రజారాజ్యం జిల్లా అధ్యక్షుడు 2009లో ఎంపీ అభ్యర్థిగా కరీంనగర్ నుంచి పోటీచేసి మూడోస్థానంలో నిలిచారు.

న్యూస్‌రీల్

'రైతుగోస పట్టని కాంగ్రెస్ ప్రభుత్వం'



మాట్లాడుతున్న సర్దార్ రవీందర్‌సింగ్

కరీంనగర్: అబద్ధాల పునాదుల మీద అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రైతుల నడ్డివిరుస్తోందని, ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతుగోస పట్టడం లేదని మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ ఆరోపించారు. బుధవారం నగరంలో మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతాంగంతో ప్రభుత్వం దోబూచులాడుతోందని, కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం తేమశాతం తక్కువగా ఉందన్న సాకులు చెబుతూ కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల వద్ద జరుగుతున్న జాప్యంతో రైతులు ధాన్యాన్ని వ్యాపారులకు అమ్ముకుంటున్నారని, చాలా ప్రాంతాల్లో క్వింటాకు రూ.1800 చొప్పున విక్రయిస్తున్నారని అన్నారు. రైతులకు కావాల్సిన సంచులు, టార్పాలిన్లు, కేంద్రాల వద్ద కనీస వసతులు కల్పించకుండా ప్రభుత్వం చేతులేత్తేసిందని దుయ్యబట్టారు. ఉమ్మడి జిల్లాలో 1300పైగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించి 420సెంటర్లు మాత్రమే ప్రారంభించడం రైతులపై కపట ప్రేమ చూపడమేనని ఆరోపించారు. ఉమ్మడి జిల్లాలో 15లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేసిన అధికారులు ఇప్పటి వరకు లక్ష టన్నుల ధాన్యం కూడా కొనుగోలు చేయలేకపోవడం విచారకరమని అన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే జిల్లాలో ఎన్ని కొనుగోలు కేంద్రాలు ఓపెన్ చేశారో.. ఎంత ధాన్యం కొన్నారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, కెమసారం తిరుపతి, మేకల చంద్రశేఖర్ యాదవ్, విద్యార్థి నాయకుడు చైతన్య, తూల భాస్కర్ రావు, జయంత్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అబ్జర్వర్‌ను కలిసిన కలెక్టర్



పోలీస్ అబ్జర్వర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: కరీంనగర్ పార్లమెంటరీ నియోజకవర్గ పోలీస్ అబ్జర్వర్‌గా వచ్చిన మనీష్ చౌదరిని బుధవారం రాత్రి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియను వివరించారు. పోలింగ్ ప్రశాంతంగా సాగేలా పకడ్బందీ చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో కె.మహేశ్వర్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు ఉన్నారు.

సెల్యూట్.. సీపీ సర్



సీపీ అభిషేక్ మహంతి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని రేకుర్తిలో పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి చిత్రపటానికి బుధవారం స్థానిక మహిళలు క్షీరాభిషేకం చేశారు. తమ ఇళ్లను కూల్చివేసిన నిందితులను అరెస్టు చేయడాన్ని హర్షిస్తూ..ఏదాది తర్వాత సీపీ భరోసాతో న్యాయం జరిగిందంటూ అభిషేక్ మహంతి చిత్రపటం వద్ద సెల్యూట్ చేస్తూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. తాము ఇండ్లు నిర్మించుకునే పరిస్థితులు కూడా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నకిలీ డాక్యుమెంట్లతో నిరుపేదలమైన తమ ఇండ్లను కూల్చి రోడ్డున పడేసిన వారిని చట్టప్రకారం శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రుక్కయ్య, సఫియా, షాహీన్‌బేగం, ఖమర్, ఫయాజ్, ఫజల్ తదితరులు పాల్గొన్నారు. – కొత్తపల్లి(కరీంనగర్)

తండ్రీకొడుకును మింగిన 'మానేరు'

- ఎల్‌ఎండీ బ్యాక్ వాటర్‌లో ఈతకు వెళ్లి మృత్యువాత
- త్రుటితో తప్పించుకున్న పెద్ద కొడుకు
- గన్నేరువరం మండలం గుండ్లపల్లిలో విషాదం



మృతదేహాల వద్ద రోదిస్తున్న రజిత, కుటుంబసభ్యులు





చాద రంగారెడ్డి, జయ చైతన్యానంద(ఫైల్)

గన్నేరువరం/తిమ్మాపూర్: వేసవి సెలవులు ప్రారంభమైన తొలిరోజే ఈత సరదా ఇద్దరి ప్రాణాలు తీసింది. కరీంనగర్ లోయర్ మానేరు డ్యాం బ్యాక్ వాటర్ తండ్రీకొడుకులను మింగింది. ఇద్దరు కొడుకులను తీసుకుని ఈతకు వెళ్లిన తండ్రి.. చిన్న కొడుకు నీటమునిగి మృత్యువాత పడగా.. పెద్ద కొడుకు త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన చాద రంగారెడ్డి(45) స్థానికంగా ప్రయివేటు పాఠశాల నిర్వహిస్తున్నాడు. బుధవారం నుంచి వేసవి సెలవుల నేపథ్యంలో తన ఇద్దరు కొడుకులు జయ కౌశిక్‌రెడ్డి, జయ చైతన్యానంద(9)ను తీసుకుని సమీపంలోని తిమ్మాపూర్ మండలం వచ్చునూర్ శివారులో ఉన్న లోయర్ మానేరు డ్యాం బ్యాక్ వాటర్ వద్దకు ఈతకు వెళ్లారు. పెద్దకొడుకు ఇప్పుడిప్పుడే ఈత నేర్చుకుంటుండగా.. చిన్నకొడుకుకు ఈత రాదు. ముగ్గురూ కలిసి నీటిలో దిగారు. ఈత నేర్పిస్తున్న క్రమంలో లోతు ఎక్కువగా ఉండడంతో కుమారులతో పాటు రంగారెడ్డి నీటిలో మునిగిపోయారు. పెద్దకొడుకు కౌశిక్‌రెడ్డికి గట్టిదరి లభ్యం కావడంతో దాన్ని పట్టుకుని ఒడ్డుకు చేరుకున్నాడు. బయటకు వచ్చి తండ్రి, తమ్ముడి కోసం చూడగా కనిపించలేదు. దీంతో కేకలు వేశాడు. కొంత దూరంలో ఉన్న జాలర్లు వచ్చి కాపాడే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే నీటిలో మునిగిపోవడంతో ఇద్దరూ మృతిచెందారు. మృతదేహాలను బయటకు తీసి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై చేరాలు అక్కడికి చేరుకుని పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను ఇంటికి తరలించారు. ఇటు భర్త, అటు కొడుకు మృతదేహాలను చూసిన రంగారెడ్డి భార్య రజిత గుండెలు బాదుకుంటూ రోదించింది. పెద్ద కుమారుడు అంత్యక్రియలు నిర్వహించాడు. సౌమ్యుడిగా పేరున్న రంగారెడ్డి చివరిచూపుల కోసం పెద్ద ఎత్తున గ్రామస్తులు, బంధువులు, స్నేహితులు గుండ్లపల్లికి తరలివచ్చారు.

మట్టి తరలింపు గుంతలతోనే..

కరీంనగర్ మానేరు రివర్ ఫ్రంట్ పనుల కోసం గతేడాది వేలాది లారీల మట్టిని డ్యాంనుంచి తరలించారు. ఇందుకోసం మానేరులో భారీ ప్రొక్లెయిన్లతో పెద్దపెద్ద గుంతలు తవ్వారు. ప్రస్తుతం జలాశయంలో నీరు అడుగంటింది. గుంతల్లో మాత్రమే నీరు ఉంది. ఈ గుంతల లోతు తెలియకపోవడంతోనే రంగారెడ్డి, ఆయన కొడుకు మృతిచెందారని గ్రామస్తులు, స్థానికులు చర్చించుకుంటున్నారు.

నకిలీ పత్రాలతో భూ కబ్జాకు యత్నం

- కొత్త జైపాల్‌రెడ్డి సహా 11 మందిపై కేసు
- నలుగురి అరెస్ట్

కరీంనగర్‌క్రైం: నకిలీ పత్రాలు సృష్టించి ఇంటి స్థలాన్ని కాజేసేందుకు యత్నించిన 12 మందిపై బుధవారం కరీంనగర్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. నలుగురిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్ బ్యాంకు కాలనీకి చెందిన యుగేందర్ 2020లో రేకుర్తిలో భూమి కొనుగోలు చేసి షెడ్డు నిర్మించుకున్నాడు. ఇంటి నిర్మాణం కోసం మున్సిపల్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. అయితే 12 మంది కలిసి అదేస్థలానికి సంబంధించి నకిలీ పత్రాలు సృష్టించి జాగా తమదేనని యజమానిని వేధించారు. దీంతో యుగేందర్ కొత్తపల్లి పోలీసులను ఆశ్రయించాడు. విచారణ చేపట్టిన పోలీసులు బీఆర్‌ఎస్ లీడర్ కొత్తజైపాల్‌రెడ్డితో పాటు మున్సిపల్ ఆర్ఐ జంకె శ్రీకాంత్, ఎండీ ఫిరోజ్ ఖాన్, కాంపెల్లి రామాంజనేయులు, కొత్తపల్లి రాజు, రేవోజు లక్ష్మీరాజం, సుధగోని కృష్ణగౌడ్, సుధగోని మాధవి, గుడి రమణారెడ్డి, గుర్రం రాజిరెడ్డి, రేవోజు పరిపూర్ణాచారి, రేవోజు రాఘవచారిపై కేసు నమోదు చేశారు. మున్సిపల్ ఆర్ఐ జంకె శ్రీకాంత్, ఎండీ ఫిరోజ్ ఖాన్, కాంపెల్లి రామాంజనేయులు, కొత్తపల్లి రాజును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ప్రదీప్‌కుమార్ వివరించారు.

ప్రశాంత పోలింగ్‌కు ప్రత్యేక చర్యలు

- వీసీలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



వీసీలో కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. బుధవారం ఉన్నతాధికారులతో కలిసి నామినేషన్ల స్క్రూటినీ, బ్యాలెట్ పేపర్ ముద్రణ, హోం ఓటింగ్, ఓటర్ స్లిప్పుల పంపిణీ తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించి ఏప్రిల్ 26 నాటికి ఓటరు తుది జాబితా రూపొందించాలని సూచించారు. ఇంటి వద్ద ఓట్ల స్వీకరణకు అవసరమైన మేర బృందాలను ఏర్పాటు చేయాలని, ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ వద్ద పోస్టల్ బ్యాలెట్ ఓట్ల నమోదుకు ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. మే 13న పకడ్బందీగా పోలింగ్ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. పోలింగ్ ప్రక్రియలో ఈవీఎం యంత్రాలు సక్రమంగా పనిచేయకపోతే వెంటనే రిజర్వ్ ఈవీఎం యంత్రాలను సెక్టోరియల్ అధికారులు మార్చే విధంగా చూడాలని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌లను పోలింగ్ పూర్తయిన అనంతరం అభ్యర్థుల ముందు క్లోజ్ చేయాలని పేర్కొన్నారు. నామినేషన్ల పరిశీలన, నామినేషన్ల ఉపసంహరణ సందర్భంగా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని తెలిపారు. కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మి కిరణ్, డీఆర్‌వో పవన్ కుమార్, ఆర్డీవో కే.మహేశ్వర్, సీపీవో కొమురయ్య, జెడ్పీ సీఈవో శ్రీనివాస్, పరిశ్రమల శాఖ జీఎం నవీన్ కుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పత్తి క్వింటాల్ రూ. 7,400

జమ్మికుంట:స్థానిక పత్తి మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర గరిష్టంగా రూ.7,400 పలికింది. మార్కెట్‌కు 17వాహనాల్లో 196 క్వింటాళ్లను రైతులు అమ్మకానికి తెచ్చారు. ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి పెద్దరథం సందర్భంగా గురువారం మార్కెట్‌కు సెలవు ఉంటుందని, శుక్రవారం యథావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాయని కార్యదర్శి తెలిపారు.

క్లుప్తంగా

చెట్టును ఢీకొని యువకుడి మృతి


శివ (ఫైల్)

ఇల్లందకుంట(హుజూరాబాద్): ద్విచక్ర వాహనం చెట్టును ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలం గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన కంది శివ(23) కమలాపూర్ మండలంలోని అంబాలలో బుధవారం జరిగిన తన స్నేహితుడి పెళ్లికి బైక్‌పై వెళ్లాడు. తిరిగి వస్తుండగా ఇల్లందకుంట మండలంలోని రాచపల్లి సమీపంలో వాహనం అదుపుతప్పి, చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివ అక్కడికక్కడే మృతిచెందాడు. ఏకైక కుమారుడు మృతి చెందడంతో అతని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

గృహిణి ఆత్మహత్య

కరీంనగర్‌రూరల్: బంధువుల వివాహానికి హాజరయ్యే విషయంలో దంపతుల మధ్య నెలకొన్న చిన్న వివాదం భార్య మృతికి కారణమైంది. భర్తతో జరిగిన గొడవతో తీవ్ర మనస్తాపానికి గురైన భార్య ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన తీగలగుట్టపల్లిలో చోటు చేసుకుంది. కరీంనగర్‌రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ కథనం మేరకు.. వనపర్తి జిల్లా కొత్తకోటకు చెందిన పాపయ్యగారి మధుసూధన్‌రెడ్డి- సుధారాణి(45) దంపతులు తీగలగుట్టపల్లిలో నివాసముంటున్నారు. పెద్ద కూతురు అలేఖ్య ప్రతిమా మెడికల్ కళాశాలలో హౌస్‌సర్జన్ చేస్తుండగా చిన్న కూతురు రాణి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తోంది. ఈ నెల 26న కొత్తకోటలో బంధువుల వివాహముండటంతో వెళ్దామని భార్య సుధారాణి చెప్పగా భర్త మధుసూధన్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇరువురి నడుమ వాగ్వాదమేర్పడింది. మనస్తాపానికి గురైన సుధారాణి జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి 9గంటలకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. జీవితంపై విరక్తి చెంది తల్లి ఆత్మహత్య చేసుకుందని బుధవారం కూతురు అలేఖ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బొమ్మకల్ మాజీ సర్పంచ్ పురుమల్ల శ్రీనివాస్‌పై కేసు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్ మాజీ సర్పంచ్ పురుమల్ల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి వజీర్ అహ్మద్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు. 2016లో సర్పంచ్ శ్రీనివాస్, అప్పటి కార్యదర్శి వజీర్ అహ్మద్ ఎలాంటి పత్రాలు లేకుండా అక్రమంగా మూడు ఇంటి నెంబర్లు కేటాయించారనే ఫిర్యాదు మేరకు విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టి కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. కలెక్టర్ పమేల సత్పతి ఆదేశాల మేరకు సరైన పత్రాలు లేకపోయినా.. ఇంటినెంబర్లు కేటాయించారంటూ డీఎల్‌పీవో రాంబాబు చేసిన ఫిర్యాదు మేరకు మాజీ సర్పంచ్, కార్యదర్శిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

అదృశ్యం కేసు నమోదు


రామస్వామి

జమ్మికుంట: ఇల్లందకుంట మండలం సీతంపేట గ్రామానికి చెందిన మైస రామస్వామి అనే వృద్ధుడు అదృశ్యమయ్యాడని టౌన్ సీఐ రవి బుధవారం తెలిపారు. రామస్వామి పాపక్కపల్లి గ్రామానికి చెందిన తన కూతురు పుష్పలత వద్ద ఉంటున్నాడు. ఈ నెల 19వ తేదీన పుష్పలత పనులకు వెళ్లింది. తిరిగివచ్చేసరికి రామస్వామి ఇంటివద్ద లేదు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మెరిసిన 'సర్కారు' విద్యార్థులు

- ఇంటర్ ఫస్ట్, సెకండియర్ ఫలితాల్లో ప్రతిభ
- పలువురికి రాష్ట్రస్థాయి మార్కులు
- వెల్లువెత్తిన అభినందనలు


అభినయ్ | అలేఖ్య | అపరాధ అనుష్క | వెంకటసాయి కుమార్ | అందె అక్షిత | శరత్‌కుమార్

వీణవంక/చిగురుమామిడి/సైదాపూర్/శంకరపట్నం/మానకొండూర్/హుజూరాబాద్ రూరల్/చొప్పదండి/జమ్మికుంట: ఇంటర్ ఫలితాల్లో సర్కారు కళాశాలల విద్యార్థులు సత్తాచాటారు. అత్యధిక మార్కులు సాధించిన ప్రతిభ చూపారు. ప్రయివేటు కళాశాలల్లో చదివితేనే ర్యాంకులు వస్తాయన్న ప్రచారానికి తెరదించారు. పలువురు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించగా.. ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు అభినందించారు. జిల్లా వ్యాప్తంగా 11జూనియర్ కళాశాలలు ఉండగా.. వీణవంక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫస్టియర్, సెకండియర్ ఫలితాల్లో ప్రథమస్థానంలో నిలిచింది.

- వీణవంక మండలం ఘన్ముక్కుల మోడల్ స్కూల్ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చారు. ఫస్ట్ ఇయర్‌లో 82మందికి 72మంది పాసయ్యారు. సెకండియర్‌లో 56మందికి 52 మంది ఉత్తీర్ణత సాధించారు. ఫస్ట్ ఇయర్‌లో ఎంపీసీలో అలేఖ్య 443 మార్కులతో మొదటి స్థానంలో నిలిచింది. బైపీసీలో 429 మార్కులతో అక్షయ ద్వితీయస్థానంలో నిలిచింది. సెంకండ్ ఇయర్‌లో ఎంపీసీలో అభినయ్ 970, బైపీసీలో లక్ష్మిప్రసన్న 908 మార్కులు సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రెడ్డి అభినందించారు.
- చిగురుమామిడి మండలంలోని చిన్నములనూర్ ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ఫలితాల్లో అమ్మాయిలదే హవా కొనసాగింది. సెకండియర్ ఎంపీసీలో అందె అక్షిత 1000కి 954మార్కులు సాధించింది. బైపీసీలో ఏ.స్పందన 1000కి 861 మార్కులు, సీఈసీలో శివరాత్రి రాధిక 1000కి 764 మార్కులు సాధించారు. ఎంపీసీ ఫస్టియర్‌లో తాళ్లపల్లి హర్షిణి 470కు 453 మార్కులు సాధించింది. బైపీసీలో పూదరి అంజలి 440కి 392మార్కులు సాధించింది. సీఈసీలో బుర్ర మణిషా 500కు 444 మార్కులు సాధించింది.
- చిగురుమామిడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెకండియర్ బైపీసీలో పూదరి వెంకటసాయికుమార్ 1000కి 936, ఎంపీసీ ఫస్టియర్‌లో నాగపురి రోహిత 470కి 417 మార్కులు సాధించినట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఇల్లందుల సంపత్‌కుమార్ తెలిపారు.
- సైదాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో సీఈసీలో 432మార్కులతో గుంటి వైష్ణవి మండల టాపర్‌గా నిలిచింది. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో 860మార్కులతో ఆదర్శ పాఠశాల విద్యార్థిని రేవంతి మండల టాపర్‌గా నిలిచింది.
- శంకరపట్నం మోడల్‌స్కూల్‌లో ప్రథమసంవత్సరం ఎంపీసీలో నభ464 మార్కులు సాధించింది. కస్తూరిబాలో ద్వితీయ సంవత్సరంలో వేములకావ్య ఎంపీసీలో 936మార్కులు, బైపీసీలో మల్యాల అక్షయ 935మార్కులు, సీఈసీలో చల్లూరు పల్లవి 937మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు.
- మానకొండూర్ ప్రభుత్వ కళాశాలలో ఫస్టియర్ ఎంపీసీలో టేకు సరిత 470కి 401మార్కులు సాధించింది. హుజూరాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో సిరిచందన 386, బైపీసీలో జరా 357, హెచ్‌ఈసీలో అశోక్ 425, రామ్‌చరణ్ 423, సీఈసీలో శృతి350, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో అపరాధ అనుష్క 931, బైపీసీలో మేకల సిరి 841, సీఈసీలో మేకల భవానీ 806, ఒకేషనల్ ప్రథమ సంవత్సరంలో బి.రమేశ్386, అభిలాష్ 400, ద్వితీయ సంవత్సరంలో అచ్యుత్ 755, శేషిప్రితం 840, పి.సుజిత 775 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ నిర్మల తెలిపారు.
- చొప్పదండి మండలంలోని రుక్మాపూర్ మోడల్ స్కూల్‌లో ఎలిగేటి పావని రెండో సంవత్సరంలో ఎంపీసీ 956 మార్కులు సాధించింది. బైపీసీ రెండో సంవత్సరంలో పీ అక్షయ 945 మార్కులు సాధించింది.
- జమ్మికుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెకండియర్ ఎంపీసీలో శరత్‌కుమార్ 943, ఎండ్ల రుచిత 928, బైపీసీలో అంకిత 892, సీఈసీలో శివమణి 799, హెచ్‌ఈసీలో శైలజ 875మార్కులతో సత్తాచాటారని ప్రిన్సిపాల్ గంగాధర్ తెలిపారు.

వాగేశ్వరిలో ఉద్భవ్- 24



నృత్యం చేస్తున్న విద్యార్థులు

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఉద్భవ్-24 పేరుతో సీఎస్ఈ(ఏఐఅండ్ఎంఎల్) విద్యార్థులు ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల సెక్రటరీ జి.శ్రీనివాస్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. విద్యార్థులు క్రమశిక్షణతో పాటు కమ్యూనికేషన్ పెంపొందించుకోవాలని , పట్టుదల, ఆత్మవిశ్వాసంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల సంయుక్త కార్యదర్శి డి.శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు విశ్వనాథ్, వినోద్, ప్రకాశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సీహెచ్.శ్రీనివాస్, హెచ్‌వోడీ శ్రీకాంత్ రెడ్డి అకడమిక్ ఇన్చార్జి సంధ్య పాల్గొన్నారు.

డ్యాంలో దూకి బ్యాంకు ఉద్యోగిని ఆత్మహత్య


రోదిస్తున్న కుటుంబ సభ్యులు


అనూష(ఫైల్)

కరీంనగర్ క్రైం: ఓ బ్యాంక్ ఉద్యోగిని బుధవారం మానేరు డ్యాంలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. టూటౌన్ సీఐ విజయ్ కుమార్ కథనం ప్రకారం.. చిగురుమామిడి మండలం ఇందుర్తికి చెందిన పూల్లూరి అనూష (33)కు కరీంనగర్‌కు చెందిన సకినం వంశీకృష్ణతో 2015లో వివాహం జరిగింది. వీరికి మూడేళ్ల బాబు ఉన్నాడు. ప్రస్తుతం వీరు స్థానిక జ్యోతినగర్‌లో అద్దెకు ఉంటున్నారు. అనూష యూనియన్ బ్యాంక్‌లో టెక్నికల్ ఆఫీసర్‌గా పనిచేస్తోంది. గత కొద్దిరోజులుగా ఆమె మానసికంగా ఇబ్బంది పడుతోంది. తరచూ చనిపోవాలనిపిస్తోందని భర్తతో చెప్పేది. దీంతో ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చూపించారు. మంగళవారం ఉదయం బ్యాంక్‌కు వెళ్లిన అనూష సాయంత్రం అయినా రాలేదు. సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికారు. దీంతో తన భార్య కనిపించడంలేదని భర్త కరీంనగర్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం ఉదయం మానేరు డ్యాంగేట్ల వద్ద జాలర్లు మృతదేహం గుర్తించి పోలీసుకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు విచారణ చేపట్టి మృతురాలు అనూషగా నిర్ధారించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విజయ్‌కుమార్ వివరించారు.

జాతీయ రహదారిపై కారు బీభత్సం

- తొలుత బైక్‌ను, తర్వాత చెట్టును ఢీకొట్టిన వైనం
- నలుగురికి గాయాలు
- బాధితుల్లో ఒకరి పరిస్థితి విషమం

బుగ్గారం(ధర్మపురి): జాతీయ రహదారిపై ఓ కారు బీభత్సం సృష్టించింది. తొలుత బైక్‌ను, ఓ వ్యక్తిని, తర్వాత చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లాకు చెందిన కందుల గంగారాం తన బంధువులు నలుగురితో కలిసి బుధవారం కారులో కొండగట్టు నుంచి ధర్మపురి వైపు వెళ్తున్నాడు. బుగ్గారం మండలంలోని చిన్నాపూర్ శివారు 63వ జాతీయ రహదారిపై వాహనం అదుపుతప్పి, బైక్‌పై వెళ్తున్న గ్రామానికే చెందిన సల్లూరి కిశోర్‌గౌడ్, రోడ్డు పక్కనున్న గోనె రాజయ్యలను ఢీకొట్టింది. ఈ ఘటనలో కిశోర్‌గౌడ్ దూరంగా ఎగిరిపడ్డాడు. ఇతనితోపాటు రాజయ్య తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం కారు రోడ్డుకు పక్కనున్న చెట్టును బలంగా ఢీకొట్టింది. వాహనం నడుపుతున్న గంగారాం, లోపల ఉన్న మిగలాబాయిలకు స్వల్ప గాయాలయ్యాయి. కిశోర్‌గౌడ్ పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు అతన్ని కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి, రాజయ్యను జగిత్యాలకు తరలించారు. ఈ ఘటనపై ఇంకా కేసు నమోదు చేయలేదని బుగ్గారం పోలీసులు తెలిపారు. కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

గాయపడ్డ పెళ్లికూతురు మృతి

మానకొండూర్: మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లి వద్ద ఈ నెల 22న జరిగిన కారు ప్రమాదంలో గాయపడిన స్వాతి కరీంనగర్‌లోని ఆపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. సీఐ రాజ్‌కుమార్ వివరాల ప్రకారం.. హన్మకొండకు చెందిన దామెర తిలక్‌తో స్వాతికి ఈ నెల 21న వివాహమైంది. 22న వేములవాడకు దైవదర్శనం కోసం తిలక్, స్వాతి, తిలక్ తండ్రి సురేందర్, తల్లీ కౌసల్య, పెళ్లి కూతురు చెల్లెలు విద్య కారులో వెళ్లారు. తిరిగి హన్మకొండ వెళ్తుండగా మానకొండూర్ మండలం గట్టుదుద్దెనపల్లి వద్ద కారు టైరు పగలడంతో కారు అదుపుతప్పి కల్వర్టులోకి దూసుకెళ్లింది. ఐదుగురికి గాయాలు అయ్యాయి. తీవ్రంగా గాయపడిన స్వాతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయింది.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసంచేసిన వ్యక్తి అరెస్ట్

తిమ్మాపూర్: మండలంలోని పొరండ్ల గ్రామానికి చెందిన మామిడిపల్లి అనిల్ అదే గ్రామానికి చెందిన కోండ్ర అనిల్‌కు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేశాడు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో తాను మంత్రి గంగుల కమలాకర్ వద్ద పనిచేస్తున్నానని నమ్మించాడు. దళిత బంధు కూడా మంజూరు చేయిస్తానని, సదరం సర్టిఫికెట్ ఇప్పిస్తానని చెప్పాడు. ఇందుకోసం రూ.3.30 లక్షలు వసూలు చేశాడు. ఉద్యోగం ఇప్పించకపోగా, తీసుకున్న డబ్బులు ఇవ్వకపోవడంతో బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎల్ఎండీ ఎస్సై చేరాలు తెలిపారు. అతడిని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

మల్లాపూర్(కోరుట్ల): పాముకాటులో ఓ మహిళ మృతిచెందింది. స్థానికుల వివరాల ప్రకారం.. మల్లాపూర్ మండలంలోని ఓబులాపూర్ తండాకు చెందిన భూక్య సునీత(33) వ్యక్తిగత కారణాలతో కొంతకాలంగా నడికుడలోని తన అక్క గుగ్లావత్ కవిత ఇంట్లో ఉంటోంది. మంగళవారం రాత్రి భోజనం చేసి, ఇంటి ఎదుట నేలపై నిద్రించింది. బుధవారం తెల్లవారుజామున ఆమె చేతిపై పాము కాటు వేయడంతో కేకలు వేసింది. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది.

'ఎస్వీజేసీ' విజయదుందుబి



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్వీజేసీ యాజమాన్యం, అధ్యాపకులు

కరీంనగర్: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ ఫలితాలలో ఎస్వీజేసీ విద్యార్థులు విజయదుందుభి మోగించారు. ఫస్టియర్‌లో బైపీసీ ఈ.దిలీప్(438), ఎంపీసీ టి.లిఖిత్‌గౌడ్(467), ఎంఈసీ వినయ్(488), సీఈసీ ఎం.వైష్ణవి(481), టి.కల్యాణి (466), పి.లిఖిత(466), ఎం.స్ఫూర్తి(465), ఎస్.లావణ్య(465), సీహెచ్.తేజరామ్(465), కె.అక్షర(463), కె.కార్తీక్(463), ఎస్.రక్షిత(463), ఎస్.వర్షిత(463), పి.అనన్య(463), బైపీసీలో ఈ.దిలీప్(438), ఈ.హర్షిత(436), స్ఫూర్తి(435), కె.రోహిణి(433), జె.పద్మశ్రీ(433), ఎస్.రిషిత(433), ద్వితీయ సంవత్సరం విద్యార్థులు జి.గణేశ్ (989),జె.సంతోష్(989), బి.రాహుల్(989), జి.సాయి భువన(988), జె.హర్షిత(987), ఏ.అంజుశ్రీ(986), ఎం.శ్రీరామ్(986)మార్కులు సాధించారు. వీరిని డైరెక్టర్లు మహిపాల్, వరప్రసాద్, రాంరెడ్డి, హరికృష్ణ, సంతోశ్‌రెడ్డి, అధ్యాపక బృందం అభినందించారు.

'సాన్వీ' జయకేతనం


విద్యార్థులను అభినందిస్తున్న సాన్వీ కరస్పాండెంట్లు మునీందర్, ప్రసాద్

కొత్తపల్లి(కరీంనగర్): రేకుర్తి సాన్వీ డిఫెన్ అకాడమీ, జూనియర్ కాలేజీ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో జయకేతనం ఎగురవేసినట్లు కళాశాల యజమానులు ఎర్రంశెట్టి మునీందర్, సిరిపురం ప్రసాద్ తెలిపారు. సెకండియర్‌లో పాగాకు విశాల్ 985, సాయిచరణ్ 979, విజ్ఞాన్ రెడ్డి 978, నస్పూరి ప్రసిదేర్ 976, లాడే అభిలాష్ 968, ఈశ్వర్ 959 మార్కులు సాధించగా, ఫస్టియర్‌లో రాచకొండ రాజు, శివరాం గౌడ్, రాజకుమార్, మనిచరణ్ తేజలు 464,458,457 మార్కులు సాధించారన్నారు.

ఇంటర్‌లో సత్తా చాటిన 'అల్ఫోర్స్' విద్యార్థులు



అత్యధిక మార్కులు సాధించిన ఇంటర్ సెకండియర్ విద్యార్థులతో అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): ఇంటర్ ఫలితాల్లో కరీంనగర్, మహారాష్ట్రలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో మెరిశారు. కరీంనగర్‌లోని అల్ఫోర్స్ టైనీటాట్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి టాపర్లను అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి సన్మానించి అభినందించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 470మార్కులకు గాను టి.శృతి, సి.హెచ్.శ్రీహిత, వి.ప్రణవి, ఏ.శశిప్రీతమ్, కె.వర్షిత్, కె.రుత్విక్, ఎస్.కార్తికేయ, కె.సృజల్, టి.వర్షిత, యమ్.శ్రీవర్ష, పి.జి.ప్రియామృత, కె.వర్షిణి, ఇ.ప్రసన్న, యమ్.రుత్విక, జి.లక్ష్మీప్రసన్న, కె.అభిలాష్‌లు 468 మార్కులు సాధించి సత్తాచాటారు. 65 మంది విద్యార్థులు 467మార్కులు, 117 మంది 466 మార్కులతో సత్తాచాటారు. జూనియర్ ఇంటర్ బైపీసీలో 440మార్కులకుగాను బి.నీలిమ 438 మార్కులతో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమస్థానంలో నిలవగా 8మంది 437 మార్కులు, 25 మంది 436మార్కులతో అత్యున్నత స్థానంలో నిలిచారు. జూనియర్ ఇంటర్ ఎంఈసీలో 500 మార్కులకుగాను టి.అఖిల్ 494మార్కులతో రాష్ట్రస్థాయిలో ప్రథమర్యాంకులో నిలవగా.. ఎం.సహస్రరెడ్డి 493, వి.అక్షయ్‌వర్ధన్ 493, సీఈసీలో 500 మార్కులకుగాను ఎస్.సృష్టిత 492, బి.గ్రీష్మ 491 మార్కులు సాధించినట్లు నరేందర్‌రెడ్డి తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో 1000మార్కులకు గానూ కె. కార్తీక్‌బాబు, టి.సాహిత్యలుత 993మార్కులతో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం నిలవగా, ఎల్.హర్షి త, బి.నిహారిక 992, ఎం.పల్లవి, డి.శివాంజలి, పి. విశ్వాణి, కె.మిత్రా, ఎల్.అస్మిత, మారియామావిస్, జి.ఉమాకాంత్ 991 మార్కులతో సత్తాచాటడం సంతోషంగా ఉందన్నారు. బైపీసీలో 1000 మార్కులకుగాను నిఖిల్, బి.అమిత 990, ఏ.శ్రీనిధి మార్కులు సాధించారు. సీఈసీలో ఎం.వినమ్రత, జి.మహేష్‌కుమార్‌లు 974 మార్కులు, నిమ్రా అజ్మీ 978, నజీర్ 972 మార్కులు సాధించినట్లు తెలిపారు.

'ట్రినిటి' విద్యార్థుల ప్రభంజనం



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ట్రినిటి అధినేతలు దాసరి మనోహర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి


విద్యార్థినులను అభినందిస్తున్న కాలేజీ సిబ్బంది

కరీంనగర్: ఇంటర్ ఫలితాల్లో 'ట్రినిటి' విద్యాసంస్థలు ప్రభంజనం సృష్టించాయి. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 470 మార్కులకు గాను ఎ.యశ్వంత్, సీహెచ్ మణిదీప్, బి.వైశాలి, అస్పియా నూరిన్, జి.అజయ్, ఏ.సాత్విక్, టి.రవళి 468 రాష్ట్రస్థాయి అత్యుత్తమ మార్కులు సాధించారు. షిఫా షకీల్, బి.సాహితి, బి.శ్రావ్య, ఎస్.వైష్ణవి, ఎస్.సంజన, కె.ప్రణతి, పి.శ్రావ్య, బి.హితేష్, డి.మహేశ్, బి.డేవిడ్ రాజు, ఆర్. నవదీప్, ఎస్.మేఘన, ఓ.శ్రీచందన, ఏరం నాజ్, 15 మంది 467 మార్కులు, 23 మంది 466 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం బైపీసీ విభాగంలో 449 మార్కులకు బి.సింధు 438 మార్కులు, జె.అంజనీ, సుమయ్య ఫాతిమా, ఇఫ్ఫాత్, టి.ప్రసన్న, ఆర్.సృజనకుమార్, 5 మంది 437 మార్కులు, 9 మంది విద్యార్థులు 436 మార్కులు సాధించారు. సీఈసీ విభాగంలో 500 మార్కులకు గాను జి.రమ్య 487 మార్కులు, మేఘనాథ్ 485 మార్కులు సాధించారు. ఎంఈసీ విభాగంలో రిషిక 488 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సర ఫలితాలలో ఎంపీసీ విభాగంలో బి.ప్రశాంత్ 992 మార్కులు, ఎస్.అభినయ 991 మార్కులు లహరి, పి.శ్రీవిద్య, వి.శ్రీతేజ, టి.ప్రవళిక, జి.మహాలక్ష్మి, ఐదుగురు 990 మార్కులు సాధించారు. బైపీసీలో నిదా హర్మిన్, కె.రాణి, మెం జబీన్ 990 మార్కులు సాధించారు. 989 మార్కులు ఆరుగురు, 988మార్కులు నలుగురు సాధించారు. సీఈసీ విభాగంలో డి.సంజన 976 మార్కులు సాధించారు. కళాశాలల చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ పటిష్టమైన ప్రణాళికతో నిష్ణాతులైన అధ్యాపకుల పర్యవేక్షణలో ఇలాంటి ఫలితాలు సాధించడం సాధ్యమైందన్నారు. చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థి సాయికిరణ్ యూపీఎస్సీ పరీక్షలో ఆల్ ఇండియా 27వ ర్యాంకు సాధించారని తెలిపారు.

'ఎస్ఆర్' సంచలనం



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో జోనల్ ఇన్‌చార్జి తిరుపతి, అధ్యాపకుల బృందం

తిమ్మాపూర్: ఇంటర్ ఫలితాల్లో కరీంనగర్ ఎస్ఆర్ జూనియర్ కళాశాలల విద్యార్థులు సంచలనం సృష్టించారు. జిల్లాలోని ఆరు బ్రాంచ్‌లకు చెందిన ఫస్ట్, సెకండియర్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాలల జోనల్ ఇన్‌చార్జి నేదురు తిరుపతి తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో 1000 మార్కులకు గుజ్జుల సాయిమణిదీప్‌రెడ్డి 992 మార్కులు సాధించి రాష్ట్రంలో రెండో ర్యాంకు పొందగా, జిల్లాలో అగ్రస్థానంలో నిలిచాడు. కన్న మణిదీప్, సీహెచ్ హన్సిక 991మార్కులు, ఎన్.వైష్ణవి, నామసాని వినూత్న, టి.ప్రభాస్ 990మార్కులు సాధించారు. ఎంపీసీ మొదటి సంవత్సరం ఫలితాల్లో 470మార్కులకు పోగుల ఆశ్రిత్ 468మార్కులు సాధించి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచాడు. బండ అక్షయ, సామర్ల దీక్షిత్, టి.సంధ్య, సీహెచ్.కావ్య, ఈ పావని, కె.వినీల, యూ.శ్రీమై 467మార్కులు సాధించారు. మరో 29మంది 466 మార్కులు సాధించారు. 460పైన సుమారు 100మంది విద్యార్థులకుపైగా ఉన్నట్లు తిరుపతి తెలిపారు. బైపీసీ మొదటి సంవత్సరంలో కళాశాలలకు చెందిన కె.జాహ్నవి, ఎస్.పూజిత, పి.శ్రీహాసిని 436 మార్కులు సాధించి రాష్ట్రర్యాంకులు పొందారు. డి.ప్రత్యూష 435 మార్కులు సాధించారు. వీరిని ప్రిన్సిపాళ్లు నాగార్జునరెడ్డి, ప్రవీణ్, శ్రీనివాస్‌రెడ్డి, మారుతి, డీన్ రవీందర్‌రెడ్డి, అశోక్, అధ్యాపకులు సన్మానించారు.

సత్తాచాటిన శ్రీ చైతన్య


విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య కళాశాలల అధినేత ముద్దసాని రమేశ్‌రెడ్డి, తదితరులు

కరీంనగర్: ఇంటర్ ఫలితాల్లో శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో భూక్య హారిక 988, జి.మహాలక్ష్మి 988, బైపీసీలో ఎం.వివేక్ 987, ఎంఈసీ లో టి.హారిక 965, సీఈసీలో జె.ప్రశాంత్ 972 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో ఆర్.వైష్ణవి 468 మార్కులు, జి.శ్రీనిత్య, బి.వర్షిత్, బి.అక్షర, ఎస్. విష్ణువర్ధన్‌లు 467మార్కులు, 14 మందికి 466 మార్కులు సాధించారు. బైపీసీలో ఎస్.భార్గవి, ఎస్.మేఘన శ్రీ, ఎ.అభ్యుదయ 436 మార్కులు, జి.మధుహసిని 435 మార్కులు, ఎంఈసీలో ఆర్.హన్సిక 473, సీఈసీలో ఎ.మధుమిత 484 మార్కులు సాధించారు. బుధవారం విద్యాసంస్థల అధినేత ముద్దసాని రమేశ్‌రెడ్డి సత్కరించారు. డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, డీన్ జగన్ మోహన్‌రెడ్డి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, రాధాకృష్ణ, ఏజీఎం శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

దశాబ్దాల కల.. నెరవేరిన వేళ..


కొత్తపల్లి-వెలిచాల బైపాస్ రోడ్డులో మునిగిన లోలెవల్ వంతెన(నాడు)


నూతనంగా నిర్మించిన హైలెవల్ వంతెన(నేడు)

- కొత్తపల్లి-వెలిచాల హైలెవల్ వంతెన పూర్తి
- రూ.4.40కోట్ల ఎఫ్‌డీఆర్ నిధులతో నిర్మాణం
- కొనసాగుతున్న వాహనాల రాకపోకలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు

కొత్తపల్లి: కొత్తపల్లి శివారులోని కరీంనగర్–జగిత్యాల బైపాస్‌పై గల లోలెవల్ వంతెనపై తరచూ చోటుచేసుకుంటున్న ఇబ్బందులకు ఇక చెక్ పడింది. హైలెవల్ వంతెన నిర్మాణంతో దశాబ్దాల కల నెరవేరింది. కాజ్‌వేతో కష్టాలు.. వానలు పడితే చాలు.. వరదలతో లోలెవల్ బ్రిడ్జి మునుగుతుండటంపై ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పలుమార్లు సాక్షి వెలుగులోకి తేవడంతో.. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఫ్లడ్ డ్యామేజ్ రోడ్స్(ఎఫ్‌డీఆర్) కింద రూ.4.40కోట్లు మంజూరు చేసింది. రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో ఎట్టకేలకు హైలెవల్ వంతెన పూర్తి కావడంతో వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. ఈ వంతెన నిర్మాణంతో ప్రయాణానికి వరద అడ్డంకులు తొలగిపోయాయి.

మార్గం సుగమం..

భారీ వర్షాలతో ఎగువ నుంచి వస్తున్న వరదతో లోలెవల్ వంతెనపై నుంచి నీరు ప్రవహిస్తుండటంతో ప్రయాణానికి తరచూ ఆటంకం కలిగేది. వంతెన మునగడంతో ఈ మార్గం గుండా రాకపోకలు చాలా రోజులు నిలిచిపోయాయి. భారీ వరదలకు ఈ వంతెనపై నుంచి వెళ్తున్న వాహనాలు కొట్టుకుపోయిన సందర్భాలు కూడా లేకపోలేదు. వర్షాలు కురిసినప్పుడల్లా ఈ రహదారిపై ప్రయాణం కష్టసాధ్యంగా మారేది. ప్రస్తుతం ఆ కష్టాలకు ఫుల్‌స్టాప్ పడింది. ఈ బైపాస్ గుండా జగిత్యాల వైపు నుంచి వరంగల్, పెద్దపల్లి, రామగుండం, గోదావరిఖని, సిద్దిపేట, హైదరాబాద్, హుజురాబాద్ వైపు.. అటువైపు నుంచి జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ఖానాపూర్, నిర్మల్, ఆర్మూర్, నిజామాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలకు అంతరాయం ఏర్పడుతుండేది. అంతేగాకుండా ముఖ్యంగా వెలిచాల గ్రామానికి వెళ్లేవారికి తీవ్ర ఇబ్బంది ఏర్పడేది. వెలిచాల గ్రామస్తులు కరీంనగర్‌కు, మండల కేంద్రమైన రామడుగు తదితర గ్రామాలకు వెళ్లాలంటే కష్టసాధ్యంగా ఉండేది. ప్రస్తుతం నిర్మాణం పూర్తవడంతో వెలిచాల, గట్టుభూత్కూర్ తదితర గ్రామాలకు వెళ్లే ప్రయాణికులకు మార్గం సుగమమైంది.

సంతోషంగా ఉంది



కొత్తపల్లి బైపాస్ నుంచి వెలిచాల వెళ్లే మార్గంలో గల లోలెవల్ వంతెనతో వరదలు వచ్చినప్పుడల్లా ఇబ్బందులు పడ్డాం. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని హైలెవల్ వంతెన నిర్మాణానికి రూ.4.40కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ వంతెన నిర్మాణం పూర్తయి వాహనాల రాకపోకలు కొనసాగుతుండటంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి నిధులు మంజూరు చేసిన అప్పటి ప్రభుత్వానికి కృతజ్ఞతలు.
– వీర్ల వెంకటేశ్వర్‌రావు, చైర్మన్, సింగిల్‌విండో, రామడుగు

క్లుప్తంగా

పార్క్ పనులపై విజిలెన్స్ విచారణ జరిపించాలి

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని మల్టీపర్పస్ పార్క్ పనులపై విజిలెన్స్ ద్వారా విచారణ జరిపించాలని మాజీ మేయర్, స్థానిక కార్పొరేటర్ సర్దార్ రవీందర్‌సింగ్ ఫిర్యాదు చేశారు. నగరపాలకసంస్థ కమిషనర్ శ్రీనివాస్, కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులకు ఆయన చేసిన ఫిర్యాదు ఆలస్యంగా వెలుగు చూసింది. స్మార్ట్ సిటీ కింద చేపట్టిన మల్టీపర్పస్ పార్క్ పనులు మొదటి నుంచి వివాదాస్పదంగానే ఉన్నాయి. పార్క్ అభివృద్ధి పనులను బిట్‌లుగా మార్చి వేర్వేరు కాంట్రాక్టర్లకు పనులు అప్పగించడం, పనుల్లో విపరీతమైన జాప్యం,నాణ్యత లోపించడం తదితర వ్యవహారాలతో ఈ పార్క్ నిత్యం వివాదాల్లో నానుతోంది. ఈ క్రమంలోనే పార్క్ పనుల్లో నాణ్యత లోపించిందని, కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారంటూ సర్దార్ రవీందర్ సింగ్ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో మల్టీపర్పస్ పార్క్ వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా పూర్ణచందర్


నియామక పత్రం అందుకుంటున్న పూర్ణచందర్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్: బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా కాల్వ పూర్ణచందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి బుధవారం నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా పూర్ణచందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో జిల్లా అధికార ప్రతినిధిగా అవకాశం కల్పించిన జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. పూర్ణచందర్‌రెడ్డిని ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రేకుర్తిలో సన్మానించారు. నాయకులు నాగుల వెంకటేశ్‌గౌడ్, పీచర విష్ణుప్రసాద్‌రావు, రావుల భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శిగా ముజాహిద్


ముజాహిద్‌కు నియామక పత్రం అందజేస్తున్న తాజొద్దీన్

కరీంనగర్ కార్పొరేషన్: కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శిగా కొత్తపల్లి పట్టణానికి చెందిన మొహమ్మద్ ముజాహిద్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ తాజొద్దీన్ నియామక ఉత్తర్వులను అందజేశారు.

బీజేపీలో చేరికలు


బీజేపీలో చేరుతున్న నాయకులు

మానకొండూర్: కొండపల్కల గ్రామానికి చెందిన బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి రంగు సంపత్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ నల్లగొండ కొంరయ్య, మాజీ వార్డు సభ్యుడు సైండ్ల పురుషోత్తం, అరకాల సంజీవరెడ్డి, ఏగోలపు వెంకన్నగౌడ్, వాసాల భానుచందర్, గట్టు రాజు, ఏరుకొండ లక్ష్మయ్య, భూసారపు రాజయ్య, రంగు శ్రావణ్ కుమార్, తోట రవీందర్, స్వామి, 40 మంది బీజేపీ ఎంపీటీసీ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రాల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కార్యకర్తలను కోరారు.

నేటి నుంచి 'ఓపెన్' పరీక్షలు

కరీంనగర్: రాష్ట్ర ఓపెన్ స్కూల్ ఆధ్వర్యంలో గురువారం నుంచి మే2వ తేదీ వరకు ఓపెన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండు సెషన్స్‌లో పరీక్షలు నిర్వహించనున్నారు. 20 కేంద్రాల్లో మొత్తంగా 4663 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు మే3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఓపెన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్ పరీక్షల నిర్వహణకు ప్రతి జిల్లాకు ఒక రాష్ట్ర పరిశీలకుడు, రెండు ఫ్లెయింగ్ స్క్వాడ్ బృందాలను, ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక సిట్టింగ్ స్క్వాడ్‌ను, పోలీసు బందోబస్తు, వైద్య బృందాలు ఉండేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. ఓపెన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సల్వాజి నాగేశ్వర్‌రావు వెల్లడించారు.



ఘనంగా నాగవెల్లి

కరీంనగర్‌రూరల్: చెర్లభూత్కూర్‌లో శ్రీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నాగవెల్లి ఉత్సవాన్ని నిర్వహించారు. ఈనెల 19న శ్రీభూనీల చెన్నకేశవస్వామి కల్యాణాన్ని నిర్వహించగా.. చివరి రోజున ఆలయ పూజారులు సుధాకర్‌శర్మ, కమలాకర్‌శర్మ, శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో నాగవెల్లి కార్యక్రమాన్ని ఘనంగా జరిపారు. అనంతరం స్వామివార్లకు ఏకాంత సేవ, పుష్పయాగం కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలను ముగించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

బీజేపీలో చేరిన కాంగ్రెస్ నాయకులు


బండి సంజయ్‌తో నాయకులు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ద్వితీయ శ్రేణి కాంగ్రెస్ నేతలు బీజేపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. తాజాగా మానకొండూరు నియోజకవర్గంలోని కేశవపట్నం మండలం లింగాపూర్ ఎంపీటీసీ అంతం లతా రాజిరెడ్డి, మెట్‌పల్లి ఎంపీటీసీ కొయ్యాడ శోభారాణి ఆధ్వరంలోని పలువురు నేతలు బుధవారం కరీంనగర్ ఎంపీ కార్యాలయానికి విచ్చేసి బండి సంజయ్ కుమార్ సమక్షంలో బీజేపీలో చేరారు. బండి సంజయ్ వారందరికీ కాషాయ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండు కొమురయ్య, మండల ప్రధాన కార్యదర్శి దాసారపు నరేందర్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు బిజిలి సారయ్య, రాష్ట్ర నాయకుడు సొల్లు అజయ్‌వర్మ, కొయ్యడ కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సీఈఆర్‌టీ సైన్స్ సెమినార్‌కు ఎంపిక


సాహును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కరీంనగర్: నగరంలోని పారమిత ఉన్నత పాఠశాలకు చెందిన గణితశాస్త్ర ఉపాధ్యాయుడు లలిత్ మోహన్ సాహు ఎస్.సి.ఇ.ఆర్.టి. తెలంగాణ ఆధ్వర్యంలో ఈనెల 25, 26ల్లో జరిగే రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌లో సెమినార్ పేపర్‌ను సమర్పించడానికి ఆహ్వానించబడ్డారు. పారమిత విద్యాసంస్థల్లో ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసం, డిజైన్ ఆలోచన, ఆవిష్కరణ పాఠ్యాంశాలను అమలు చేయడంలో కీలక పాత్ర పోషించారు. సాహును తెలంగాణ ప్రభుత్వం విద్యాశాఖ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో కూడా సత్కరించింది. గ్లోబల్ అచీవ్‌మెంట్ అవార్డు, మైక్రో ఇన్నోవేషన్ అవార్డ్, గ్లోబల్ టీచర్ అవార్డు, గురుబ్రహ్మ అవార్డు, మెంటర్ ఎక్సలెన్స్ అవార్డు, సావిత్రిబాయి పూలే జాతీయ అవార్డును విద్యారంగంలో ఆయన చేసిన విలువైన సేవలకు గాను అందుకున్నారు. రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపికైన లలిత్ మోహన్ సాహును పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా.ఇ.ప్రసాదరావు , పాఠశాల డైరెక్టర్లు రశ్మిత, ప్రసూన, అనుకర్‌రావు, ప్రసాద్, రాకేశ్, వినోద్‌రావు, ప్రిన్సిపాల్ రితేష్ మెహతా, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యావంతుడు వినోద్‌నే ఎంపీగా గెలిపించాలి


వినోద్‌కుమార్ తరఫున నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తున్న విద్యార్థి ఉద్యమ నాయకులు

కరీంనగర్: విద్యావంతుడు.. ప్రజా సమస్యలపై కొట్లాడే దమ్మున్న నాయకుడు.. ఆపదలో అండగా కొండంత ధైర్యం చెప్పే మనసున్న నాయకుడు బోయినపల్లి వినోదన్నను కరీంనగర్ ఎంపీగా గెలిపించాలని బీఆర్ఎస్ విద్యార్థి ఉద్యమ నాయకులు ఏనుగు రవీందర్‌రెడ్డి, జక్కుల నాగరాజుయాదవ్, భూక్య తిరుపతినాయక్, కేంసారం తిరుపతి, సుదగోని శ్రీనాథ్‌గౌడ్ అన్నారు. కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ తరఫున జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతికి నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బండి సంజయ్ కేవలం మత రాజకీయాలు చేస్తుంటారని, అభివృద్ధిపై బండి సంజయ్‌కి అసలు సోయి లేదన్నారు. విద్యార్థులు, యువత మేల్కొని వినోదన్ననే భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

సబ్ స్టేషన్లలో ఉష్ణోగ్రతల తనిఖీ


ఉష్ణోగ్రతను పరిశీలిస్తున్న అశోక్‌కుమార్

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్‌లోని 33/11 వావిలాలపల్లి, ఎస్ఆర్ఆర్ సబ్ స్టేషన్లలో బుధవారం టీఎస్ఎన్‌పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్, డైరెక్టర్(హెచ్ఆర్డీ) బి.అశోక్ కుమార్ తనిఖీ చేశారు. వేసవిలో రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల తీవ్రతను థర్మల్ కెమెరాతో పరీక్షించారు. ఎండ తీవ్రతతో సబ్ స్టేషన్లలో ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహణ పనులు చేపడుతూ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా సబ్ స్టేషన్ల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఆదేశించారు. ఎమ్మార్టీ డీఈ కాళిదాసు, టౌన్ ఏడీలు, ఎమ్మార్టీ ఏడీ, ఆపరేషన్ ఏఈలు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ భాషపై వర్క్‌షాప్


ప్రసన్నలతకు సన్మానం

కరీంనగర్‌రూరల్: నగునూరులోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో బుధవారం డిజిటల్ యుగంలో ఇంగ్లిష్ భాష ప్రాముఖ్యంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య వక్తలుగా అంబేడ్కర్ దూర విద్యాకేంద్రం రిటైర్డు లెక్చరర్ గందె పర్శరాములు, జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ కె.ప్రసన్నలత హాజరయ్యారు. ఆధునిక యుగంలో ఇంగ్లిష్ భాషపై విద్యార్థులు పట్టు పెంచుకోవాలని సూచించారు. ఇంగ్లిష్ ప్రాధాన్యం వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమత, లెక్చరర్లు అరుంధతి, పరిమళ, సుమన, ప్రేమజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఏ రంగంలోనైనా నైపుణ్యాలు తప్పనిసరి


ప్లేస్‌మెంట్ పత్రాలు అందుకున్న విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

కరీంనగర్: ఏ రంగంలోనైనా ముందుకు సాగాలంటే విలువలతో కూడిన నైపుణ్యాలు కలిగి ఉండాలని శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగప్రసాద్ అన్నారు. బుధవారం కిమ్స్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో జరిగిన వీడ్కోలు సమావేశంలో ఆయన విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. కిమ్స్ విద్యాసంస్థల చైర్మన్ పేర్యాల రవీందర్‌రావు మాట్లాడుతూ కమ్యూనికేషన్ మెలకువలు, వ్యక్తుల మధ్య నైపుణ్యాలు ఉండాలన్నారు. అనంతరం 79 మందికి ప్లేస్‌మెంట్స్ పత్రాలు అందించారు. వైస్ చైర్మన్ సాకేత్ రామారావు, ప్రిన్సిపాల్ అన్నురెడ్డి, యశ్వంత్, హరీశ్, మనోజ్, సృజన, అనూష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్ట్‌కు రాష్ట్రస్థాయి తృతీయ పురస్కారం

కరీంనగర్ సిటీ: కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాల హిందీ విభాగం విద్యార్థులు 'సోషల్ మీడియాలో హిందీ భాష– ఒక అధ్యయనం' అనే అంశంపై చేసిన స్టూడెంట్ స్టడీ ప్రాజెక్ట్‌కు జిజ్ఞాస రాష్ట్రస్థాయి తృతీయ పురస్కారం లభించింది. హిందీ విభాగం అసో సియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వరప్రసాద్ వాసాల పర్యవేక్షణలో జరిగిన ఈ స్టడీ ప్రాజెక్ట్‌ను మొహమ్మద్ ముజ్తబా, మొహమ్మద్ ఆసిఫ్, షేక్ షర్ఫీల్, సయ్యద్ ఖాజా మొయినుద్దీన్, సర్దార్ మన్‌ప్రీత్ సింగ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమర్థవంతంగా వివరించారు. వీరు త్వరలో హైదరాబాద్‌లో జరిగే అభినందన సమావేశంలో 10,000నగదు, సర్టిఫికెట్లను అందుకోనున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ టి.ప్రమోద్ కుమార్, స్టాఫ్ సెక్రటరీ ఎ.శ్రీనివాస్, కళాశాల జిజ్ఞాస సమన్వయకులు డా. కె.భాస్కర్, కళా శాల పాలనాధికారి కామరాజ్ తదితరులు అసోసియేట్ హిందీ ప్రొఫెసర్ డాక్టర్ వరప్రసా ద్ వాసాలను, విద్యార్థులను అభినందించారు.

నిర్మించారు.. నిర్వహణ మరిచారు



నిరుపయోగంగా ఉన్న దుబ్బపల్లి వైకుంఠధామం


విద్యుత్ కనెక్షన్ లేని బోరు

- సౌకర్యాల కల్పనలో అధికారుల నిర్లక్ష్యం
- నిరుపయోగంగా వైకుంఠధామాలు
- కరీంనగర్ మండలంలో పరిస్థితి

కరీంనగర్‌రూరల్: గ్రామాల్లో అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం వైకుంఠధామాలను నిర్మించింది. అయితే, ప్రజల్లో అవగాహనాలోపం, అధికారుల నిర్లక్ష్యంతో అవి నిరుపయోగంగా మారాయన్న ఆరోపణలున్నాయి. కరీంనగర్ మండలంలో 17 గ్రామ పంచాయతీలుండగా చెర్లభూత్కూర్, నగునూరు, బొమ్మకల్ గ్రామాల్లో గతంలో శ్మశానవాటికలున్నాయి. 2020లో మిగతా 14 గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులు రూ.12.60 లక్షల చొప్పున వెచ్చించి, నిర్మించారు. అయితే, ఆయా గ్రామాల్లోని వైకుంఠధామాల్లో విద్యుత్, నీరు వంటి కనీస సౌకర్యాల కల్పనను అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు అంటున్నారు. దుబ్బపల్లి, నల్లగుంటపల్లి, మందులపల్లి, ఎలబోతారం తదితర పల్లెల్లోని వైకుంఠధామాలు అలంకారప్రాయంగా కనిపిస్తున్నాయి. తుమ్మచెట్లు మొలిచి, అటవీప్రాంతాన్ని తలపిస్తున్నాయి. స్నానాల గదులు శిథిలావస్థకు చేరాయి. వాటి తలుపులు, కిటికీలు విరిగిపోయాయి.

సొంత భూమి, చెరువు శిఖంలో అంత్యక్రియలు..

ఆయా పంచాయతీల్లో మృతిచెందిన వాళ్లకు వ్యవసాయభూమి ఉన్నట్లయితే కుటుంబసభ్యులు అందులోనే అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. కొందరు సంప్రదాయం పేరిట చెరువు శిఖం స్థలాలు, వాగులు, ప్రభుత్వ భూముల్లో ఖననం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు గ్రామాలవారీగా సమావేశాలు నిర్వహించి, వైకుంఠధామాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తే ప్రభుత్వ ఉద్దేశం సఫలీకృతం అవుతుందని పలువురు అంటున్నారు.

ఉపయోగించుకోవడం లేదు

వైకుంఠధామాల్లో విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాం. గ్రామీణులు ఉపయోగించుకోవడం లేదు. కొన్ని గ్రామాల్లో మృతుల సంఖ్య తక్కువగా ఉండటంతో సొంత స్థలాల్లోనే అంత్యక్రియలు చేస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో సంప్రదాయం పేరిట వైకుంఠధామాల్లో అంత్యక్రియలు నిర్వహించేందుకు ప్రజలు ముందుకు రావడం లేదు.
– జగన్మోహన్‌రెడ్డి, ఎంపీవో, కరీంనగర్ మండలం

గుర్తుతెలియని వాహనం ఢీకొని దంపతులకు తీవ్ర గాయాలు


గాయపడ్డ మహిళ

కొత్తపల్లి(కరీంనగర్): బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని దంపతులు తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రామడుగు మండలం మోతె గ్రామానికి చెందిన శ్రీనివాస్, జయశ్రీ దంపతులు ద్విచక్ర వాహనంపై కొక్కెరకుంట గ్రామంలో విందుకు హాజరై కరీంనగర్‌కు వస్తున్న క్రమంలో.. కొత్తపల్లి-కరీంనగర్ ప్రధాన రహదారిపై వైద్య కళాశాల ఎదుట గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు కాగా, జయశ్రీ రెండు కాళ్లు నుజ్జు నుజ్జయ్యాయి. గమనించిన ప్రయాణికులు 108 అంబులెన్స్ సహాయంతో కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై, కొత్తపల్లి బ్లూకోల్ట్ పోలీసులను సంప్రదించగా.. స్పందించలేదు.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
గురువారం ॥ 25-4-2024

స్కూల్లో మ్యాథ్స్ అవర్... సైన్స్ అవర్ అంటుంటాం.
చట్టసభలో జీరో అవర్ అనే మాట వింటుంటాం.
స్టోరీ అవర్... ఈ గంట ఎక్కడ నుంచి వచ్చింది?
నీలిమ పెనుమర్తి ఆలోచన నుంచి వచ్చింది.
రోజుకో గంట కథలు వినమని చెప్తున్నారీమె.
యూకేలో ఆచరణలో పెట్టి... ఇండియాకి తెచ్చారు.
విశ్వవ్యాప్తం చేయడానికి కంకణం కట్టుకున్నారు.
ఆడియో బుక్స్‌తో స్వచ్ఛమైన భాష నేర్పిస్తున్నారు.

కథలకో గంట 1/24


నీలిమ చెప్పే కథ చదవండి!


నీలిమ

హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన నీలిమ ఉన్నత విద్య కోసం యూకేకి వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. పిల్లల పెంపకంలో కథలు కూడా ఒక భాగం అయి తీరాలని నమ్ముతారామె. మనదేశంలో స్కూల్ కరికులమ్‌లో పిల్లలకు కథలు లేకపోవడం విచారకరం అంటారామె. కథ ప్రాధాన్యం తెలిసిన అభివృద్ధి చెందిన దేశాలు పిల్లల రోజు వారీ క్రమంలో ఓ గంట కథల కోసం కేటాయిస్తున్నాయని, మన దగ్గర అది లోపించడంతో ఎంత పెద్ద చదువులు చదివినప్పటికీ ఒక విషయాన్ని చక్కగా కళ్లకు కట్టినట్లు వివరించగలిగిన నైపుణ్యం కొరవడుతోందన్నారు నీలిమ. భాష ఏదైనా ఆ భాషలో పదాలను స్పష్టంగా ఉచ్చరించడం అలవాటు చేయాలంటే ఇంట్లో తల్లిదండ్రులు అంత స్వచ్ఛంగా మాట్లాడే నేపథ్యం ఉండాలి. ఆ వెసులుబాటు లేని పిల్లలకు తన ప్రయత్నం మంచి భాషను, చక్కటి భావ వ్యక్తీకరణను నేర్పిస్తుందన్నారు నీలిమ. ఏడేళ్ల కిందట 'స్టోరీ అవర్' ఆలోచనకు బీజం పడిన సందర్భాన్ని 'సాక్షి'తో పంచుకున్నా రామె.

ఓ గంట నిడివిలోనే కథ

''నాకు లండన్ ఇంపీరియల్ కాలేజీలో కెమిస్ట్రీలో ఎంఎస్ చేయడానికి స్కాలర్‌షిప్ వచ్చింది. మా వారు కూడా స్కాలర్‌షిప్ మీద లండన్‌లోనే వచ్చారు. అలా 30 ఏళ్ల కిందట యూకేకి వెళ్లడం, చదువు, ఉద్యోగం, ఇద్దరు పిల్లలతో అక్కడే సెటిలయ్యాం. రెండవసారి గర్భిణిగా ఉన్నప్పుడు పీహెచ్‌డీలో విరామం తీసుకున్నాను. ఆ విరామం నా ఆలోచనలను కథల మీదకు మళ్లించింది. పెద్ద బాబుకి కథలు చెప్పడం మొదలుపెట్టాను. అమరచిత్ర కథ చదవడం అలవాటు చేశాను. అదే చిన్నబాబుకి కూడా అలవడింది. మా అబ్బాయిలిద్దరూ గ్రీక్ పౌరాణిక గ్రంథాలను కూడా చదివారు. వాళ్లిద్దరి మాటల్లో ఆ పాత్రల గురించిన చర్చ వస్తుండేది. అప్పుడు మన రామాయణాన్ని పరిచయం చేశాను. అదే సమయంలో మా పెద్ద బ్బాయి స్కూల్ వాళ్లిచ్చిన ప్రాజెక్ట్ కోసం ఒక స్టోరీ బోర్డ్ చేయాల్సి వచ్చినప్పుడు రామాయణం ఇతివృత్తంగా చేశాడు. ఆ తర్వాత పిల్లలకు సెలవుల్లో రామాయణం మీద వాళ్ల వెర్షన్ రాయమని చెప్పాను. ఆ టాస్క్‌లో మరో చాలెంజ్... కథనం గంటకు మించరాదు. తమకు తోచినట్లు ఎడిట్ చేసుకుంటూ సీతారామలక్ష్మణులు యుద్ధం తర్వాత విజేతలై అయోధ్యకు రావడం దీపావళి వేడుక చేసుకోవడంతో ముగింపు ఇవ్వాలన్నమాట. ఆ సాధన ఆడియో బుక్ ఆలోచనకు రూపమిచ్చింది.



సమయం లేని తల్లిదండ్రుల కోసం...

ఇప్పుడు ఉద్యోగాలు దాదాపుగా అందరి జీవితాలనూ సంక్షిప్తంగా మార్చేస్తున్నాయి. ఇలాంటప్పుడు పిల్లలకు కథ చెప్పాలని ఉన్నప్పటికీ కొంతమందికి అందుకోసం ఓ గంట సమయం కేటాయించలేని పరిస్థితి ఉంటోంది. వాళ్లకు ఉపయోగపడేటట్లు కథలకు ఆడియో బుక్ రూపమిచ్చాను. దానిని ఇంగ్లిష్, హిందీ, తెలుగులో తెచ్చాను. మా పిల్లలు శ్రేయాస్, ఆయుర్ ఇద్దరూ హిస్టరీ చదివారు. అక్కడ హిస్టరీ అంటే రష్యన్ విప్లవం, ఫ్రెంచ్ విప్లవం, ప్రపంచ యుద్ధాలు ప్రధానంగా ఉంటాయి. మా పిల్లలు అలాగే యూకేలో ఉన్న భారతీయమూలాలున్న పిల్లలకు మన చరిత్ర తెలియచేయాలనే ఉద్దేశంతో 'ఏ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ ఇండియన్ ఇండిపెండెన్స్ ఫ్రమ్ ద మొఘల్స్ టు ద మహాత్మా' పేరుతో మరో ఆడియో బుక్ చేశాను. ఆ స్టోరీ ఈస్ట్ ఇండియా కంపెనీ మనదేశంలో అడుగు పెట్టడం నుంచి మహాత్మాగాంధీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సముపార్జన వరకు సాగింది. అలాగే మన సామెతలను పరిచయం చేయడానికి చేసిన ప్రయత్నమే 'తాతమ్మ కథలు'. మా అమ్మ, నాన్న, అత్త, మామగారితో ఒక్కో సామెతకు ఒక్కో కథ రాయించి వాటిని ఐదు నిమిషాలకు మించకుండా ఎడిట్ చేసి రికార్డ్ చేశాను. మొత్తం పన్నెండు కథలు, గంట ఆడియో. ఈ కథలకు నాకు మాల్గుడి డేస్ స్ఫూర్తి. యూకేలోని తెలుగు కుటుంబాల పిల్లలు ఈ కథలను వినడం మొదలు పెట్టిన తర్వాత తొలి రోజుకి పన్నెండవ రోజుకీ వారి ఉచ్చారణ మారిపోయింది. కథకు అంతటి శక్తి ఉంటుందనే నా నమ్మకం నిజమేనని నిరూపితమైంది. తోలుబొమ్మలతో చేసిన ప్రయోగానికి చాలా ఖర్చయింది. కానీ అది కూడా సంతృప్తినిచ్చింది. ఆరు పాత్రలతో కథను అల్లుకుంటూ రాసుకున్నాం. ఆడియో బుక్ అనువాదాలకు హైదరాబాద్‌లోని కేంద్రీయ విద్యాలయ (ఉప్పల్) విద్యార్థులు, బేగంపేటలోని దేవనార్ (అంధ విద్యార్థుల పాఠశాల) స్కూల్ విద్యార్థులు గళమిచ్చారు.

– నీలిమ పెనుమర్తి, స్టోరీ అవర్ రూపకర్త


ఆడియో బుక్‌కి గళం ఇస్తున్న దేవనార్ స్కూల్ విద్యార్థులు ఆదిత్య, అనిల్, రంజిత్ (ఫైల్ ఫొటో)

పిల్లలే పాట రాశారు!

మాల్గుడి డేస్ వీడియోలకు సిగ్నేచర్ ట్యూన్ ఉన్నట్లే మా ఆడియో బుక్స్‌కి కూడా ట్యూన్ ఉండాలని పాట కోసం ప్రయత్నించాను. పిల్లలకు ఇస్తే ఎలా రాస్తారో చూద్దామని యూకేలో శచి అనే అమ్మాయికిచ్చాను. తాను రామాయణం కథను ఒక్క వాక్యంలో 'వారధి నిర్మాణం సీత మీద రాముడికి ఉన్న ప్రేమకు ప్రతిబింబం' అనే భావంతో రాసింది. అలాగే భారతీయ మూలాలు ఏ మాత్రం లేని 'ఎవీ సిమన్స్' అనే అమ్మాయి 'లైట్ ద ల్యాంప్స్' పేరుతో సీతారాములు విజేతలుగా అయోధ్యకు వచ్చి దీపావళి వేడుక చేసుకోవడాన్ని రాసింది. మంథర విషపూరిత వచనాలు ఎంతటి ప్రభావాన్ని చూపిస్తాయో వివరించింది.

క్రియేటివ్‌గా సైన్స్ పాఠాలు

బాల్యంలో మేము బాలానందం వినేవాళ్లం. సరళంగా సాగే కథనాలు పిల్లల్ని అలరించేవి. నా ఆడియోబుక్స్ కూడా సులువుగా ఉంటాయి. ఇవన్నీ 'స్టోరీ అవర్ డాట్ కో డాట్ యూకే' వెబ్‌సైట్‌లో ఉచితంగా ఉన్నాయి. భాష శుద్ధంగా ఉంటే ఆలోచనలు కూడా అంతే శుద్ధంగా ఉంటాయని నా అభిప్రాయం. మంచి భాష మాట్లాడితే వ్యక్తి గౌరవం పెరుగుతుంది. ఉద్యోగం, వ్యాపారాల కోసం ప్రపంచంలో ఎక్కడికెళ్లినా సరే... మంచి భాష ద్వారా చక్కటి అవకాశాలను అందిపుచ్చుకోగలుగుతారు. మంచి ఉచ్చారణ వ్యక్తి గౌరవాన్ని పెంచుతుంది. అందుకే సైన్స్ సబ్జెక్ట్‌ని కూడా ఈ క్రియేటివ్ మీడియం ద్వారా వివరించాలనేది నా ఆకాంక్ష'' అని తన ప్రయత్నం వెనుక ఉన్న పరమార్థాన్ని వివరించారు నీలిమ పెనుమర్తి.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు: అనిల్ కుమార్ మోర్ల

వందేళ్ల చరిత్ర ఉన్న అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ
ఎప్పుడూ ఒక మహిళను వైస్ చాన్స్‌లర్‌గా చూడలేదు.
కాని మొదటిసారి ప్రొఫెసర్ నైమా ఖాతూన్‌ను
రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వి.సి.గా నియమించారు.
దీంతో నైమా ఖాతూన్ చరిత్ర సృష్టించారు.
ఆమె మైనారిటీ వర్గ మహిళలకు గొప్ప స్ఫూర్తి కాగలదంటూ
శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. నైమా ఖాతూన్ పరిచయం.

న్యూస్‌మేకర్


ప్రొఫెసర్ నైమా ఖాతూన్

వందేళ్లకు ఆమె వచ్చింది

నైమా ఖాతూన్‌కు ముస్లిం మహిళల చదువు గురించి చాలా పట్టింపు ఉంది.

'ఉత్తరాదిలో నేను ప్రిన్సిపాల్‌గా పని చేసిన అలీగఢ్ విమెన్స్ కాలేజ్ చాలా ముందంజలో ఉంది. అక్కడ మూడు వేల మంది ముస్లిం ఆడపిల్లలు చదువుకుంటున్నారు. కాని ఇదొక్కటే సరిపోదు. ఉత్తరప్రదేశ్, బిహార్‌లలో ముస్లిం బాలికల విద్య చాలా వెనుకబడి ఉంది. దక్షణాదిలో ముస్లిం సమూహాలు విద్యా రంగంలో ముస్లిం బాలబాలికలను ప్రోత్సహిస్తున్నాయి. ఉత్తరాదిలో ఆ పని జరగడం లేదు. రాజకీయ, ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనాన్ని జయించాలంటే విద్యార్జనకు మించిన వేరే మార్గమేదీ లేదు' అంటుందామె.

విద్యారంగంలో బాలికల విద్య కోసమే కాదు ఉన్నతవిద్యలో ముస్లింల ప్రాతినిధ్యం పెరగాలని కోరుకునే నైమా ఖాతూన్‌ను భారత ప్రభుత్వం గుర్తించి రెండు రోజుల క్రితం అత్యంత ప్రతిష్టాత్మకమైన అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయానికి వైస్ చాన్స్‌లర్‌ను చేసింది. దాదాపు 100 ఏళ్లకు మించిన ఘన చరిత్ర ఉన్న ఈ విశ్వవిద్యాలయానికి ఇలా ఒక మహిళ వి.సి. పదవిలో కూచోవడం ఇదే మొదటిసారి.

గమనించాల్సిన విషయం ఏమంటే ఇన్నాళ్లు పురుషులు మాత్రమే వి.సి.లుగా ఉన్న జె.ఎన్.యుకు శాంతిశ్రీ పండిట్ మొదటి మహిళా వి.సి. కావడం, అలాగే జామియా మిలియా ఇస్లామియాకు నజ్మా అక్తర్ తొలి వి.సి. కావడం (ఆమె పదవీకాలం ముగిసింది) పాతమూసలను బద్దలు చేయడమే. ఆ వరుసలో ఇప్పుడు నైమా ఖాతూన్ చేరారు.

రాజకీయ ప్రాతినిధ్యం

భారతదేశంలో మహిళలకు రాజకీయ ప్రాధాన్యం లభించడం లేదని నైమా ఖాతూన్ అంటారు. ముఖ్యంగా అణగారిన వర్గాల స్త్రీలు పార్లమెంట్ వరకూ చేరుకోవడానికి చాలా అడ్డంకులు ఉన్నాయని, రాజకీయ అధికారం లేకుండా కీలకమైన విధానమార్పు తేలేమని అభిప్రాయపడతారు. 'ఆర్థిక శక్తిని, రాజకీయ శక్తిని పొందడటంలో అణగారిన వర్గాల స్త్రీలు నిస్సహాయంగా ఉన్నారు' అంటారామె.

సైకాలజీ ప్రొఫెసర్

ఒడిశాకు చెందిన నైమా ఖాతూన్ ఉన్నత విద్య అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీలోనే జరిగింది. అక్కడే ఆమె బి.ఎ. సైకాలజీ చదివింది. ఆ తర్వాత పి.హెచ్‌డి. వరకూ అక్కడే కొనసాగి 1988లో అదే యూనివర్సిటీలో లెక్చరర్‌గా తన ప్రయాణం మొదలెట్టింది. ఆ తర్వాత అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ప్రొఫెసర్‌గా పదోన్నతి పొంది సైకాలజీ డిపార్ట్‌మెంట్ చైర్‌పర్సన్ అయ్యింది. పొలిటికల్ సైకాలజీ అధ్యయనంలో భాగంగా 'హిందూ ముస్లిం యువతపై రాజకీయ భావోద్వేగాల ప్రభావం' అనే అంశం మీద ఆమె చేసిన పి.హెచ్‌డి. కీలకమైనది. అలీగఢ్ విమెన్స్ కాలేజ్‌కు ప్రిన్సిపాల్‌గా పని చేస్తూ ఉండగా ఆమెను వి.సి.గా పని చేసే అవకాశం వరించింది. ఇప్పుడు ఎలక్షన్ కోడ్ అమలులో ఉంది కనుక ఇ.సి. అనుమతి తీసుకోని ఆమె నియామకం చేసింది ప్రభుత్వం. నైమా ఖాతూన్ తరచూ అమెరికాలోని విశ్వవిద్యాలయాల్లో తన పరిశోధనా పత్రాలను సమర్పిస్తుంటారు.

బ్యూటిప్



- చేతులు, పాదాలపై నల్లటి మచ్చలుంటే వాడేసిన నిమ్మతొక్కతో రుద్దితే పోతాయి.
- సమ్మర్‌లో బయటకు వెళ్లేటప్పుడు పాదాలకు సాక్స్ వేసుకుంటే పగుళ్లు రాకుండా ఉంటాయి.
- రాత్రి పడుకునే ముందు పాదాలను శుభ్రంగా కడిగి ఆరిన తర్వాత మసాజ్ క్రీమ్ లేదా ఆయిల్‌తో ఐదు నిమిషాల పాటు మర్దన చేయాలి.
- పదిహేను రోజులకు ఒకసారి పెడిక్యూర్ చేసుకోవాలి.
- స్నానం పూర్తయిన తర్వాత పమిస్ స్టోన్‌తో పాదాలను మెల్లగా రుద్దాలి. ఇలా చేస్తే మృతకణాలు తొలగిపోయి పాదాలు నునుపుగా ఉంటాయి.

కొత్త దారి

బాధ పడి ఆ బాధను కాలగమనంలో మరచిపోయేవారు కొందరు.

బాధ పడి ఆ బాధలో నుంచి కొత్త అడుగు వేసేవారు కొందరు.

కల్లైయారసి రెండో కోవకు చెందిన మహిళ.

నేతకార్మికుల బంగారు కాలాన్ని కళ్లతో చూసిన కల్లైయారసి అవే కళ్లతో వారి కష్టాలను చూసింది. ఆ బాధలో నుంచి 'రాట్టై' స్టార్టప్‌కు శ్రీకారం చుట్టింది.

సంప్రదాయ నేతకళకు డిఐవై(డూ ఇట్ యువర్ సెల్ఫ్) కిట్స్ ద్వారా కొత్త వెలుగు తెస్తోంది తమిళనాడుకు చెందిన కల్లైయారసి రామచంద్రన్. పిల్లలు, పెద్దలు ఉపయోగించేలా ఈ కిట్‌ను డిజైన్ చేశారు. సంప్రదాయ కళకు విస్తృత ప్రాచుర్యం కల్పిస్తున్న కల్లైయారసి గురించి....


కల్లైయారసి

నేతకళ నేస్తం

సాఫ్ట్‌వేర్ టు వీవింగ్

కొన్ని సంవత్సరాల క్రితం...

'చదువుకోవాలని ఉంది' అని తన మనసులోని మాటను భర్తకు చెప్పింది కల్లైయారసి. పెళ్లికి ముందు పై చదువులు చదువుకోడానికి ఆర్థిక ఇబ్బందులు అడ్డుగోడలుగా నిలిచాయి. ఆర్థిక ఇబ్బందుల వల్ల పై చదువులకు తల్లిదండ్రులు ససేమిరా అన్నారు. కల్లైయారసి మనసులో మాట విన్న భర్త 'తప్పకుండా' అని ప్రోత్సహించాడు. అలా కల్లైయారసి ఎంసీఏ పూర్తి చేసింది. ఆ తరువాత ఒక ఐటీ కంపెనీలో డెవలపర్‌గా పని చేసింది.

ఈరోడ్(తమిళనాడు) జిల్లాలోని సాలంగపాలయం గ్రామానికి చెందిన కల్లైయారసి నేతకార్మికుల కుటుంబం నుంచి వచ్చింది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసినా నేతకళపై ఆమెకు ఉన్న ప్రత్యేకాభిమానం మాత్రం దూరం కాలేదు. సెలవుల్లో సొంత ఊరుకు వచ్చిన కల్లైయారసి అక్కడ నేతకార్మికుల కష్టాలను ప్రత్యక్షంగా చూసింది. ఊళ్లో చేనేత మగ్గాల సంఖ్య 7,500 నుంచి 2,500కు పడిపోయింది.

కష్టాలలో ఉన్న నేతకార్మికులకు ఆసరాగా నిలవడానికి తన వంతుగా ఏదైనా చేయాలనుకుంది కల్లైయారసి. నేతకళ గురించి మరిన్ని వివరాలు తెలుసుకొని 'రాట్టై హ్యాండ్లూమ్' పేరుతో స్వగ్రామంలో ఎకో–ఫ్రెండ్లీ హ్యాండ్లూమ్ స్టార్టప్‌కు శ్రీకారం చుట్టింది. పర్యావరణహిత కోణంలో ఆలోచించి ఆర్గానిక్ క్లాత్ వీవింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టింది.

'నేతపని ద్వారా ఉపాధి పొంది సంతోషంగా ఉన్న కార్మికుల ఆర్థికపరిస్థితి ఆ తరువాత దిగజారిపోయింది.

చాలామంది ఉపాధి వెదుక్కుంటూ పట్టణాల బాట పట్టారు. డబుల్ షిఫ్టులలో పనిచేసేవాళ్లు. కొందరు వాచ్‌మెన్‌గా పని చేశారు. తల్లిదండ్రులు ఊళ్లో లేకపోవడంతో పిల్లల చదువు గాడి తప్పింది. తమిళనాడులో ఎన్నో గ్రామాలకు వెళ్లి నేతకార్మికులతో మాట్లాడి వారి కష్టాలు తెలుసుకున్నాను. ఈ పరిస్థితి నాకు బాధాకరంగా అనిపించింది' అంటున్న కల్లైయారసి తాను చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి నేతకళను స్వయంగా నేర్చుకుంది. సహజరంగులతో పాటు అరటి పీచు, జనపనార, ఇతర పదార్థాలతో తయారుచేసిన సేంద్రియ నూలును 'రాట్టై' ఉపయోగిస్తోంది. ప్రస్తుతం 28 కుటుంబాల వరకు 'రాట్టై హ్యాండ్లూమ్' కోసం పనిచేస్తున్నాయి.

సంప్రదాయ చేనేత వస్త్రాలకు ఊతం ఇచ్చేందుకు పోర్టబుల్ డిఐవై హ్యాండ్లూమ్ కిట్‌ల ఆలోచనకు శ్రీకారం చుట్టింది కల్లైయారసి.

ఎక్కడికంటే అక్కడికి చేతితో తీసుకెళ్లగలిగే ఈ మగ్గాలకు యూజర్ మాన్యువల్, క్యూ ఆర్ కోడ్ ఉంటుంది. దీని ద్వారా యూట్యూబ్ వీడియోల సహాయంతో పరికరాన్ని ఎలా ఉపయోగించాలో తెలుసుకోవచ్చు. తమిళనాడులోని ఎన్నో స్కూల్స్‌లో పిల్లల దగ్గర పోర్టబుల్ లూమ్స్ కనిపిస్తున్నాయి. స్కూల్స్‌లో వీవింగ్ క్లబ్స్ ఏర్పాటు కావడం మరో విశేషం. మూడు ఆప్షన్‌లలో, మూడు స్థాయుల్లో అందుబాటులో ఉన్న వీటిని పెద్దలు, పిల్లలు ఉపయోగించవచ్చు.

'రాట్టై' స్టార్టప్ 'రైజింగ్ స్టార్ ఆఫ్ ది ఇయర్' అవార్డ్ గెలుచుకుంది. టాన్‌సీడ్ (తమిళనాడు స్టార్టప్ అండ్ ఇనోవేషన్ మిషన్) ద్వారా పది లక్షల గ్రాంట్ వచ్చింది.

'నేతకార్మికులకు ఉపాధి కల్పించడమే కాదు ఈ తరానికి ఆ కళపై ఆసక్తి కలిగేలా, నేర్చుకునేలా చేయాలనేది నా లక్ష్యం' అంటుంది కల్లైయారసి.

పిల్లల కోసం వర్క్‌షాప్



'రాట్టై' ద్వారా నేత కార్మికులకు అండగా నిలిస్తూనే మరో వైపు నేతకళపై పిల్లలకు అవగాహన, ఆసక్తి కలిగించడానికి వర్క్‌షాప్‌లు నిర్వహిస్తోంది కల్లైయారసి. పెద్దలకు 'నేతపనిని స్ట్రెస్–బస్టింగ్ ఎక్సర్‌సైజ్‌గా పరిచయం చేస్తోంది. 'వీలైనన్ని ఎక్కువ స్కూల్స్‌కు వెళ్లి పిల్లలకు నేతకళ గురించి చెప్పాలనుకుంటున్నాను. ఒక ఆర్ట్‌గా మన విద్యావిధానంలో నేతకళ భాగం కావాలని ఆశిస్తున్నాను' అంటుంది కల్లైయారసి.

ఈ భూగోళం మీద ప్లాస్టిక్ తొడుగు ఉంది. అది నీటిలో నానదు. మట్టిలో కలవదు.
నిప్పులో కాల్చితే విషంగా మారుతుంది. అలాంటి ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి. లేదా రీసైకిల్ చేయాలి.
అందుకే అసోంలోని ఆ స్కూల్ 2016లో వృథా ప్లాస్టిక్కే స్కూల్ ఫీజ్‌గా ప్రారంభమైంది.
ఏడేళ్లు గడిచినా దిగ్విజయంగా నడిచి పర్యావరణ హితమైన స్కూల్‌గా ప్రశంసలు అందుకుంటోంది.

● వినూత్నం

ఆ స్కూల్ ప్లాస్టిక్‌పై గెలిచింది

ఫీజుకు బదులు ప్లాస్టిక్ వేస్ట్‌ను ఎవరైనా తీసుకుంటారా? ఆ స్కూల్‌లో తీసుకుంటారు. ఎంత వేస్ట్ తెస్తే అంత మెచ్చుకుంటారు కూడా. పర్మితా శర్మ, మజిన్ ముక్తార్ అనే పర్యావరణ ప్రేమికుల, బాలల హితుల వినూత్న ఆలోచన ఇది. అసోంలోని పమోహీలో 'అక్షర్' పేరుతో వీరిద్దరూ ఒక పాఠశాల స్థాపించారు 2016లో. దీనిని భిన్నంగా నడపాలని నిశ్చయించుకున్నారు. చదువు, స్కిల్స్, పర్యావరణ స్పృహ సిలబస్‌గా ఉండాలనుకున్నారు. అందుకే ఫీజు కట్టాలంటే నోట్లు తేవద్దు వేస్ట్ ప్లాస్టిక్ తెండి అని చెప్పసాగారు. వీలైనన్ని ప్లాస్టిక్ వ్యర్థాలు తీసుకెళ్తే ఫీజు కట్టినట్లు రసీదు ఇస్తారు. మరో విషయం ఏమిటంటే ఇక్కడ విద్యార్థులను వారి వయసును బట్టి కాకుండా అవగాహన స్థాయిని బట్టి తరగతుల్లో వేస్తారు. ఎనిమిదేళ్లు వచ్చిన వారు 3వ క్లాస్‌లో ఉండాలని రూల్ లేదు. నాలుగులో ఉండొచ్చు లేదా రెండులోనూ ఉండొచ్చు.


స్కూల్ ఫీజుగా ప్లాస్టిక్‌ను ఇస్తున్న విద్యార్థులు


ప్లాస్టిక్‌ను రీసైకిల్ చేస్తున్న విద్యార్థులు

ప్లాస్టిక్ భూతం నుంచి కాపాడాలని

మనుషులు బాగా చలి పుడితే దేనితోనైనా చలిమంట వేసుకోవడానికి వెనుకాడరు. అసోంలో చలి ఎక్కువ. కాని కట్టెలు ఖర్చు. అందుకే చలిమంటల కోసం ప్రజలు ప్లాస్టిక్ బాటిళ్లను, కవర్లను తెచ్చి మంటల్లో వేయసాగారు. ప్లాస్టిక్ వ్యర్థాలను బహిరంగంగా తగులబెట్టడం పర్యావరణానికి తీవ్రమైన హాని. దీనిపై అక్కడి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఎంత ప్రయత్నించినా ఫలితం రాలేదు. దానికి తోడు ప్లాస్టిక్ తగులపెట్టడం వల్ల వెలువడే విషవాయువులు పీల్చి పిల్లలు జబ్బు పడసాగారు. దీంతో సామాజిక కార్యకర్త అయిన పర్మితా శర్మకు ఓ ఆలోచన తట్టింది. తన మిత్రుడు, అమెరికాలో బాలల విద్యారంగంలో పని చేస్తున్న నిపుణులు మజిన్‌తో తన ఆలోచనను పంచుకుంది. అసోం భౌగోళిక పరిస్థితుల గురించి, అక్కడ నెలకొన్న సవాళ్ల గురించి మజిన్‌కు వివరించింది. అలా వారిద్దరి ఆలోచనలో నుంచి పుట్టుకొచ్చిందే 'అక్షర్' విద్యాలయం.

ఎవరు చేరుతారు?

స్కూలంటే డబ్బు తీసుకుని చదువు చెప్పాలి. ప్లాస్టిక్ తెండి స్కూల్‌లో చేరండి అంటే ఎవరు చేరతారు. పైగా సంప్రదాయ విద్యకు, వృత్తి విద్యకు మధ్య వారధిగా ప్రారంభించిన ఈ పాఠశాలకు విద్యార్థులను రప్పించడం మొదట్లో సవాలుగానే మారింది. ఇక అక్కడి పేద పిల్లలు దగ్గర్లోనే ఉన్న రాళ్ల క్వారీలలో పనిచేస్తారు. వారిని బడికి పంపిస్తే ఆదాయం కోల్పోతామని తల్లిదండ్రులు పిల్లల్ని స్కూలుకు పంపేందుకు ససేమిరా అన్నారు. దీంతో తల్లిదండ్రుల అవసరాలకు తగిన విధంగా స్కూల్ సమయాన్ని, బోధనను 'అక్షర్' లో రూపకల్పన చేశారు.

ప్లాస్టిక్ ఇటుకలు

'అక్షర్'లో నెదర్లాండ్స్ నుంచి తెప్పించిన మెషినరీ ద్వారా ప్లాస్టిక్ రీసైక్లింగ్ చేస్తారు. పాత ప్లాస్టిక్‌తో ఇటుకలు తయారు చేస్తారు. వీటిని నిర్మాణాల్లో వాడొచ్చు. పిల్లలు స్కూల్ అయ్యాక ఈ ఇటుకల తయారీ నేర్చుకుంటున్నారు. అలాగే పూలకుండీలు, బౌల్స్ వంటివి ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారు చేస్తున్నారు. ఇప్పటి వరకూ దాదాపు రెండున్నర వేల ప్లాస్టిక్ బాటిళ్లు, ఏడు లక్షల ప్లాస్టిక్ కవర్లు ఇక్కడ రీసైకిల్ అయ్యాయి. అసోంను ప్లాస్టిక్ పీడ నుంచి విముక్తం చేయాలంటే తమ స్కూల్ మోడల్‌ని ఫాలో కావాలని పర్మిత, మజిన్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికి 5 స్కూళ్లు ఈ విధానాన్ని అవలంబిస్తున్నాయి. అంటే ఫీజుగా ప్లాస్టిక్‌ను తీసుకుంటున్నాయి. మరో వంద స్కూళ్లు ఇలా చేస్తే బాగుంటుందని పర్మిత, మజిన్ భావిస్తున్నారు. అసోంలో మాత్రమే కాదు దేశమంతా ఈ మోడల్‌ను ఉపయోగిస్తే ప్లాస్టిక్ వ్యర్థాలను కచ్చితంగా తరిమికొట్టడం వీలవుతుంది.